# స్వాతివాన కోసం

నవల

_ పెబ్బిలి హైమావతి




శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 236

కౌముది మాసపత్రికలో

జనవరి 2021 సంచిక నుంచి నవంబర్ 2022 సంచిక వరకూ వచ్చిన

సీరియల్ నవల

# (ప్రారంభం)

**"వేర్ ద మైండ్** ఈజ్ వితౌట్ ఫియర్. వేర్ ద మైండ్ ఈజ్ వితౌట్. వితౌట్ ఫియర్ వేర్ ద మైండ్ విత్ ఫియర్" అంటూ భాస్కర్ చదువుతున్నది వినడంతోనే పనిచేసుకుంటున్న జానకి ఒక్క క్షణం ఆగింది వినేందుకు.

ఇది గీతాంజలిలో పోయం కదూ. ఏమిటి బాచీ ఇంత అధ్వానంగా చదువుతున్నాడు రాముని తోక పివరుండిట్లనియె అన్నట్లు ఉంది. చేస్తున్న పని పక్కన పెట్టి "బాచీ ఏం చదువుతున్నావు?" అంటూ దగ్గరకు వెళ్ళింది జానకి.

"వేర్ ద మైండ్ ఈజ్ వితౌట్ ఫియర్ అనే పోయం చదువుతున్నాను వదినా. ఎంత బట్టీ పట్టినా వచ్చినట్లే ఉంటుంది కానీ రావడంలేదు. ఏం చేయాలో అర్ధంకావడంలేదు. రేపు క్లాసులో మా సార్ అప్పచెప్పించుకుంటానన్నారు. లేకపోతే బెంచి మీద నించోబెడతారట. అలా నుంచుంటే ఎంత షేమ్" అన్నాడు భాస్కర్ బాధగా.

"అవును, షేమ్‌గానే ఉంటుంది. నీవు ఈ గీతాన్ని అర్ధం చేసుకోకుండా చదువుతున్నావు కనుక నీకు పట్టుబడడం లేదు. అదే అర్ధం చేసుకుని చదివావనుకో, అయిదు నిముషాల్లో వచ్చేస్తుంది. ఏదీ ఒక్కో లైనూ చదువు అర్ధం చెబుతాను" అంది జానకి.

"సరే వదినా" అంటూ చదవడం మొదలు పెట్టాడు భాస్కర్.

"Where the mind is without fear and the head is held high"

ఎక్కడ మనస్సు నిర్భయంగా ఉంటుందో, ఎక్కడ మనుషులు శిరస్సు వంచకుండా తలెత్తుకుని తిరుగుతారో.

Where Knowledge is free;

ఎక్కడ విజ్ఞానం స్వేచ్ఛగా ప్రవహిస్తుందో

Where the world has not been broken up into fragments by narrow domestic walls;

ఎక్కడ ప్రపంచం సంకుచితమైన స్థానిక గోడలతో..

కులమత వర్గ బేధాలతో విభజింపబడకుండా ఉంటుందో

Where words come out from the depth of truth,

ఎక్కడ హృదయపు లోతుల నుండి నిజం నిర్భయంగా వస్తుందో

Where tireless striving stretches its arms towards perfection;

ఎక్కడ అలుపెరుగని కృషి పరిపూర్ణత వైపుకు తన హస్తాలను చాచుతుందో

Where the clear stream of reason has not lost its way into the dreary desert sand of dead habbit;

ఎక్కడ మృతప్రాయమైన అలవాటు అనే ఆచారపుటెడారిలోనికి స్వచ్ఛమైన బుద్ధిలేదా ఆలోచనా ప్రవాహం ఇంకిపోకుండా ఉంటుందో.

Where the mind is lead forward by thee into ever widening thought and action;

ఎక్కడ మేధస్సు నిరంతరం విశాలమవుతున్న ఆలోచనలోనికి, ఆచరణ వైపు నీచే నడపబడుతుందో..

Into that heaven of freedom, My Father, Let my Country Awake!

అటువంటి స్వేచ్ఛా స్వర్గం వైపు పయనించేలా, నా దేశాన్ని జాగృతం చేయి తండ్రీ" అంటూ ముగించింది జానకి.

ఆమె చెప్పిందంతా వింటూ కళ్ళార్పకుండా ఆరాధనగా ఆమెనే చూస్తూ ఉండిపోయాడు భాస్కర్.

తాను చెప్పడం పూర్తయినా ఇంకా అలాగే తన వంక చూస్తున్న భాస్కర్‌ని చూసి "ఏమిటి బాచీ అలా చూస్తున్నావు నేను చెప్పింది అర్థంకాలేదా?" అనడిగింది జానకి.

ఆ మాటల్ వింటూనే ట్రాన్స్‌లో నుండి బయటపడినట్లుగా జానకి వంక మరింత ఇష్టంగా చూస్తూ "ఎంత బాగా చెప్పావు వదినా. మా సార్ కూడా ఎప్పుడూ ఇంత బాగా విడమరచి చెప్పలేదు. నువ్వు చెప్పింది విన్నాక ఎలాగైనా కష్టపడి గీతాంజలి అంతా చదవాలనిపిస్తోంది నాకు" అన్నాడు భాస్కర్ ఉద్వేగంగా.

"అది నేను చెప్పడం వల్ల కాదు బాచీ రవీంద్రుని గీతాంజలిలో ఉన్న గొప్పదనం అది. అందుకే విశ్వకవి అంటారాయనను. మన దేశం నుండి మొదటిసారి నోబుల్ ప్రైజ్ అందుకున్నది ఆ మహానుభావుడే రవీంద్రనాథ్ ఠాగూర్ గారు 1912లో వ్రాశారు ఇది. మన దేశ సంస్కృతిని నాశనం చేసి హిందూ ముస్లింల ఐక్యతను కూలదోసి ప్రాంతాలుగా, మతాలుగా, కులాలుగా భారతీయ సమాజాన్ని విడదీసి, ప్రజలను బానిసలను చేసి పీల్చి పిప్పి చేసిన తెల్లదొరల అమానుషత్వాన్ని అహంకారాన్ని భరించలేని పరిస్థితిలో ఆ బాధలోంచి, వేదనలోంచి పుట్టినదే ఈ కవిత. మనుష్యులందరూ తెలుసుకుని ఆచరించవలసినంత గొప్ప సందేశం ఉంది ఇందులో. ఇది వ్రాసి ఇన్నేళ్ళు గడిచిపోయినా ఆనాటి సామాజిక పరిస్థితుల్లో ఇప్పటికీ పెద్ద మార్పేమీ లేకపోగా కులాల పేరుతోనూ, మతాల పేరుతోనూ ఆరని మారణకాండ ఈనాడు మనదేశంలో నిత్యకృత్యమైపోయింది. కనుక ఇప్పటికే కాదు, ఎప్పటికీ గీతాంజలి ప్రతి మనిషికీ అనుసరణీయమూ, ఆచరణీయమూ అని నేను అనుకుంటున్నాను" అంది జానకి.

"నీకు చాలా తెలుసు వదినా. ఇంత తెలిసిన నువ్వు ఆ లోయర్ క్లాసు వాళ్ళకు పాఠాలు చెబుతూ ఎలిమెంటరీ స్కూలు టీచరుగా మిగిలిపోవడం నాకేమీ బాగోలేదు. చక్కగా ఎం.ఏ చేసి ఏ కాలేజీ లెక్చరర్‌వో అయితే ఎంతో బాగుండేది" అన్నాడు భాస్కర్.

"నాకు కాలేజి లెక్చరర్ అవుదామని లేదు బాచీ అయినా మనం చేసే పని చిన్నదయినా, పెద్దదయినా ఇష్టంగా శ్రద్ధగా చేయాలి అంటారు మీ అన్నయ్య. నాకు కూడా ఆ చిన్నపిల్లలతో గడుపుతూ ఉంటే ఎంతో బాగుంది ఐ ఎంజాయ్ మై జాబ్. ఇక నువ్వన్నట్లు ఎం.ఏ చేస్తే బాగానే ఉంటుంది నాకు చిన్నప్పటినుండీ సాహిత్యమంటే ప్రాణం, తెలుగులో కృష్ణశాస్త్రిని ఎంత ఇష్టపడతానో పేరడైజ్ లాస్ట్ రాసిన 'జాన్ మిల్టన్‌ని' అంతే ఇష్టపడతాను. నీలాగే టెంత్‌లో ఉండగా గీతాంజలిలోని ఈ గీతాన్ని చదువుకున్నాను. అప్పటినుండే గీతాంజలి నా ఫేవరెట్ బుక్ అయిపోయింది. ఇప్పటికి ఎన్నిసార్లు చదివానో లెక్కలేదు. దాంతోపాటు నాకు నచ్చిన పుస్తకాలన్నీ సేకరించి మళ్ళీ మళ్ళీ చదువుతూ ఉంటాను. అసలు బి.ఏ అయ్యాక ఎం.ఏ లిటరేచర్ చేద్దామనుకున్నను. కానీ మీ అన్నయ్య బి.యిడి చేయమన్నారు. సరే అదయినా చేద్దామనుకున్నాను కానీ" అంటున్న జానకి మాటలను మధ్యలోనే కట్ చేస్తూ "నావలన అదికూడా ఆగిపోయింది కదా నీకు" అన్నాడు బాధగా.

"ఏయ్ బాచీ, నా చదువేదో ఆగిపోయిందని నేనేం ఫీల్ అవడంలేదులే. అనవసరంగా వర్రీ అయి నీ మూడ్ పాడు చేసుకోకు" అంటూ భాస్కర్ భుజం తట్టింది ఆప్యాయంగా.

"పోనీ ఒక పని చేయకూడదా వదినా ఈ ఉద్యోగం మానేసి చక్కగా ప్రైవేటుగా ఎం.ఏ చేయకూడదు?" అన్నాడు భాస్కర్ ఆరాటంగా.

తనమూలంగా వదిన చదువు ఆగిపోయిందనే బాధ భాస్కర్‌ని వదలడంలేదు. ఆ మాటలంటున్నప్పు అతడి కళ్ళు తడికావడం గమనించింది జానకి.

"అరే బాచీ ఏంటిది? తప్పుకదూ ఇప్పుడేమైందని అలా బాధపడుతున్నావు? అయినా భలే ఎడ్వయిజ్ ఇచ్చావు ఈవాళ నాకు. ఇన్నాళ్ళూ ఈ ఆలోచన తట్టలేదు సుమా నాకు. మీ అన్నయ్య వచ్చాక మాట్లాడతానులే. తను ఎలా చేద్దామంటే అలా చేస్తాను సరేనా?" అంది జానకి లాలనగా.

జానకి మాటలు వినడంతోనే భాస్కర్ మనసు తేలికపడినట్లయింది. సంతోషంగా చదువుకోవడం మొదలుపెట్టాడు.

ఆలోచిస్తూ లేచిందక్కడినుండి జానకి. భాస్కర్ అన్నట్లు ఎం.ఏ చేస్తే బాగుంటుంది అనుకుంటూ.

నెలరోజుల క్రితం చదువు విషయమై తండ్రితో ఘర్షణ పడిన విషయం గుర్తుకు వచ్చింది జానకికి.

"నన్నడగకుండా ఇలా పెళ్ళికి ముహూర్తాలు పెట్టించుకురావడం సరైనదే అనుకుంటున్నారా నాన్నా మీరు?" అనడిగింది జానకి సూటిగా తండ్రి వంక చూస్తూ.

కూతురు అలా నిలదీసినట్లుగా ప్రశ్నించేసరికి ఆదిశేషుకి నోటమాట రాలేదు ఒక్క క్షణం.

అంతలోనే తెప్పరిల్లి "ఇందులో నిన్ను అడగడానికి ఏముందమ్మా? ఈ పెళ్ళి ఎప్పటినుండో అనుకుంటున్నదే కదా" అన్నాడు ఆదిశేషు సౌమ్యంగా ముఖం పెట్టి.

"కావచ్చు, అయిన పెళ్ళి నాకే గనుక ముహూర్తాలు పెట్టేముందు నన్నొకమాట అడగాలి కదా నాన్నా?" అంది జానకి.

ఆ గొంతు మెత్తగనే ఉన్నా మాటల్లో తీవ్రత ఆదిశేషుకు మండుకొచ్చేలా చేసింది.

"సరే, ఇప్పుడు అడుగుతున్నాను కదా చెప్పు, ఈ పెళ్ళి నీకు ఇష్టమేనా?" అన్నాడు విసురుగా.

ఆ అడగడంలో కూతురు అభిప్రాయం తెలుసుకోవాలనే ఆలోచన కంటే తన నిర్ణయాన్ని ప్రశ్నించిందనే కోపమే ఎక్కువగా ఉంది.

"నాకిప్పుడప్పుడే పెళ్ళి చేసుకోవాలని లేదు నాన్నా" అంది జానకి స్థిరంగా.

"ఇప్పుడే చేసుకోవా అసలు పెళ్ళే చేసుకోవా? లేక రామాన్ని చేసుకోవడం ఇష్టంలేదా?" అనడిగాడు ఆదిశేషు కోపంగా కూతురు వంక చూస్తు.

"చేసుకుంటాను. నా బి.యిడి అయ్యాక" అంది జానకి తండ్రి కోపానికి ఏమాత్రం బెదరకుండా. "అయ్య వచ్చేదాకా అమావాస్య ఆగాలన్నట్లుగా నీ చదువు అయ్యేదాకా వాళ్ళు వేచి ఉండాలంటావా?" అన్నాడు ఆదిశేషు మండిపడుతున్నట్లుగా.

"ఆగలేకపోతే  వేరే అమ్మాయిని చేసుకోమను. నాకేం అభ్యంతరం లేదు. నేను మీకు చెప్పే సీటు కోసం అప్లయ్ చేశాను. తీరా ఇప్పుడు సీటు వచ్చాక నేను అక్కడికి వెళ్ళడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాక మీరిలా అడ్డుకొట్టడం ఏమీ బాగోలేదు నాన్నా" అంది జానకి బాధగా.

"అప్పటి పరిస్థితి వేరు. ఇప్పటి పరిస్థితి వేరు. మావయ్య చెయ్యిపోగొట్టుకుని ఉద్యోగం పోగొట్టుకుని బాధలో ఉన్నాడు. ఇంట్లో ఆడదిక్కులేదు. ఇలాంటి స్థితిలో నువ్వు ఇలా మడతపేచీలు పెట్టడం ఏమీ బాగోలేదు" అన్నాడు ఆదిశేషు ఎలాగోలా కూతుర్ని ఒప్పించాలి అనే ఉద్దేశ్యంతో.

"పరిస్థితి బాగుండని మాట వాస్తవమే కాదనను. దానికి ఏదో ఒక ఆల్టర్నేటివ్ చూసుకోవాలి. అంతేగానీ ఇలా హడావుడిగా ముహూర్తాలు పెట్టించుకు రావడం సరైంది కాదు. మీ పాటికి మీరు నిర్ణయాలు తీసుకుంటే మేము కిమ్మనకుండా అమలు చేయాలా? ఏం న్యాయంం నాన్నా మీకిది?" అంది జానకి ఆవేశంగా.

''ఇందులో చెప్పడానికేముంది? ఎప్పటినుండో అనుకుంటున్నదేగా. ఇదేదో పెద్ద సమస్యలా రాద్ధాంతం చేస్తావెందుకు?'' అన్నాడు ఆదిశేషు తీవ్రంగా చూస్తూ.

''ఎంత తేలిగ్గా అనేశారు నాన్నా. బజారుకు వెళ్ళి బట్టలో, కూరగాయలో కొనుక్కొచ్చినట్లు చేశారు. మీరు ముహూర్తాలు పెట్టుకుని వచ్చి. కానీ పెళ్ళనేది జీవితానికి సంబంధించిన అతి ముఖ్యమైన విషయం అనేదాన్ని ఎలా విస్మరించారు నాన్నా మీరు? ఏమన్నారు పెద్ద విషయంలా రాద్ధాంతం చేస్తున్నానా? మీకిది పెద్ద విషయం అవునోకాదో నాకు తెలియదు. నాకు మాత్రం పెద్ద విషయమే. ఇందులో నా అభిప్రాయానికి తావులేనప్పుడు మీ నిర్ణయాన్ని అమలు చేయవలసిన బాధ్యత కూడా నాకు లేదు'' అంటూ విసురుగా లోపలికి వెళ్ళిపోయింది జానకి.

కూతురు వెళ్ళినవైపు ఆశ్చర్యంగా చూస్తూ ''ఏమిటి పంకజం, ఎప్పుడూ లేనిది జానకి ఈరోజు ఇలా మాట్లాడుతోంది. కాస్త నువ్వయినా దానికి నచ్చచెప్పు. అవతల మా బావగారికి మాటిచ్చివచ్చాను. ఇప్పుడు ఇలా ఇది కాదంటే నా పరువేం కావాలి?'' అన్నాడు ఆదిశేషు బాధగా.

''నే చెపితే మాత్రం అది వింటుందంటారా? పెళ్ళి చేసుకునేది అదే కనుక దానితో ఓ మాట చెప్పి చేస్తే బాగుండేది'' అంది పంకజం నిష్ఠూరంగా అతడి వంక చూస్తూ.

''నువ్వూ నన్నే అంటున్నావా? ఇంతకాలం ఈ ఇంట్లో ఎవరికి ఏది కావాలో అడగకుండానే అన్నీ అమర్చిపెట్టాను. అన్నీ హాయిగా అందిపుచ్చుకున్నారు మీరంతా. ఈ రోజు మాత్రం నేనేదో తప్పుచేసినట్లు నిలదీస్తున్నారే?'' అన్నాడు ఆదిశేషు కోపంగా.

''అది వేరు. ఇది వేరు. పిల్లల మంచి చెడ్డలు చూడవలసిన బాధ్యత తల్లిదండ్రులుగా మనమీద ఉంది. దానికీ పెళ్ళికీ ముడిపెడితే ఎలా? అయినా అదేం పెళ్ళి చేసుకోను అనడంలేదు కదా దాని బి.యిడి అయ్యాక చేసుకుంటాను అంటోంది అర్థం చేసుకోండి'' అంది పంకజం నచ్చచెపుతున్నట్లుగా.

''అందర్నీ నేనే అర్థం చేసుకోవాలి. నా బాధ అర్థం చేసుకునేవాళ్ళు ఎవరు? పిల్లలకు ఏది మంచో, ఏది చెడో నాకు తెలియదనా నీ ఉద్దేశ్యం. అయినా ఇంతదూరం వచ్చాక వెనక్కి తగ్గితే నాకు అంర్యాద ఏమైనా మిగులుతుందా అక్కడ? లేక నా మానమర్యాదలు మంట కలిసినా పర్వాలేదు అనుకుంటున్నారా మీరంతా?'' అన్నాడు ఆదిశేషు కోపంగా భార్యవంక చూస్తూ.

ఆ మాటలు వింటూనే లోపలినుండి దూసుకు వచ్చింది జానకి.

''నామీద కోపం అమ్మ మీద చూపిస్తున్నారేమిటి నాన్నా? ఎంతసేపూ మీ మాటా, మీ పరువూ అనే ఆలోచిస్తున్నారు గానీ, నా ఫీలింగ్స్ గూర్చి ఆలోచించే, పనిలేదా మీకు. నేనేం చిన్నపిల్లను కాను నాన్నా. నాకూ కొన్ని ఆలోచనలూ, అభిప్రాయాలూ ఉంటాయని గ్రహించరెందుకు మీరు? సరే మీరేమైన అనుకోండి నేను బి.యిడి చేసి నా కాళ్ళమీద నేను నిలబడేవరకూ పెళ్ళి చేసుకోను'' అంది జానకి నిష్కర్షగా.

''మరీ మూర్ఖంగా మాట్లాడకు. అవతల పరిస్థితులు అర్థం చేసుకోకుండా'' అంటూ భార్య వైపు తిరిగి ''ఏమిటి పంకజం, ఇదింత మొండిగా తయారైంది. నాకేం అర్థంకావడంలేదు'' అన్నాడు ఆదిశేషు.

''అవును, నాది మూర్ఖత్వమే. ఈ మూర్ఖత్వమూ, మొండితనమూ రావడానికి కారణం ఎవరో తెలుసా? మీరూ, మీ ప్రవర్తనే. ఏ విషయమైనా ఏకపక్ష నిర్ణయమే కానీ, సమిష్టిగా ఎప్పుడైనా ఆలోచించారా? చివరికి ఈరోజు నా పెళ్ళికూడా నిర్ణయించేశారు. నాకు

చెప్పలేదు సరే, కనీసం అమ్మకయినా ఈ విషయం చెప్పారా మీరు? లేదు, ఇదేకాదు ఏ విషయమూ అమ్మకి చెప్పరు మీరు. మీ ఫ్రెండ్స్, మీ కొలీగ్స్ అందరూ ఇలాగే చేస్తున్నారా? ఏమన్నా అంటే వాళ్ళంతా చదువుకుని, ఉద్యోగాలు చేస్తున్నారు అంటారు.

నాకు తెలియక అడుగుతాను నాన్నా చదువూ, ఉద్యోగం లేనంత మాత్రాన అమ్మ అస్థిత్వానికి ఇంకేమీ విలువ లేనట్లేనా? ప్రతీదానికీ మీ నీడలా అనుసరించడానికి తప్ప అమ్మకి కూడా స్వంత అభిప్రాయాలూ, ఆలోచనలూ ఉంటాయని ఒక్క క్షణమైనా ఎందుకు ఆలోచించరు? అన్ని విషయాల్లోనూ ఎంతో బాగా ఉండే మీరు అమ్మ విషయానికి వచ్చేసరికి ఎందుకు నాన్నా ఇంత ఉపేక్షాభావం వహిస్తారు.

అలా అని అమ్మని మీరు బాగా చూడలేదని నేను అనడంలేదు. అమ్మ తెలివితేటలు మీ స్థాయికి తగవనే అలసత్వం కనిపిస్తుంది నాకు మీలో. అదే అమ్మ చదువుకుని ఉద్యోగం చేసి ఉంటే ఇలా ఉండేది కాదేమో పరిస్థితి. ఇదంతా ఇంతకాలం అమ్మ ఎలా భరించిందో నాకు తెలియదు. లేక తనకి స్వాలంబన లేక మీకు తలవంచిందేమో? ఆడది అంటే వండి, వార్చి పెట్టి మగవాడి అవసరాలు తీరుస్తూ అతడు తిట్టినా, కొట్టినా పడివుండే కాలం పోయింది నాన్నా. నేను ఈ కాలం యువతిని. వ్యక్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని వదులుకుని తలవంచి బ్రతకలేను. ఇదంతా చెప్పి మిమ్మల్ని నొప్పించాలని కాదు నాన్నా. అన్ని విషయాల్లో ఎంతో ఉన్నతంగా ఆలోచించే మీరు అమ్మ విషయానికి వచ్చేసరికి ఎందుకిలా ప్రధాన్యత లేనట్లు ప్రవర్తిస్తున్నారు అనేదే నా బాధ. అందరితోనూ ఎంతో మర్యాదగా, మన్ననగా మాట్లాడతారు. అమ్మతో మటుకూ తీసి పడేసినట్లుగా, అదిలించినట్లుగా మాట్లాడతారెందుకని? అత్తయ్యకూడా అమ్మలాగానే పెద్దగా చదువుకోలేదు. కానీ మావయ్య అత్తయ్యని ఎంత ప్రేమగా చూసేవారు. మరి మీరెందుకు నాన్నా అలా ఉండలేకపోయారు?

మొన్న ఏదో మాగజైన్‌లో ఓ కొటేషన్ చూశాను. 'ఏ హేపీ మేరేజ్ ఈజ్ ది యూనియన్ ఆఫ్ టూ గుడ్ ఫర్‌గివర్స్' అని.

ఒకరికొకరు అనే భావన ఇచ్చే తృప్తీ, సంతోషం ఇలా భయపడుతూ, బాధపడుతూ ఉండడంలో ఉంటుందా నాన్నా? నాకంటే వయసులో, అనుభవంలో ఎంతో పెద్దవారు మీరు. మిమ్మల్ని ఎత్తి చూపాలని కాదు నాన్నా నా ఉద్దేశ్యం. ప్రతి మనిషికీ స్వంత అభిప్రాయాలు కొన్ని ఉంటాయి. దాన్ని మీరు గుర్తించలేదనే నా బాధ.

ఏమో? రామం బావ మావయ్యలా కాకుండా మీలా ఉంటే నా పరిస్థితి ఏంటి? అందుకే నేనీ నిర్ణయం తీసుకున్నాను. ఇందులో ఎలాంటి మార్పూ ఉండదు. నేను అమ్మలా రాజీపడి బ్రతకలేను" అంటూ లోపలి గదిలోకి వెళ్ళబోయిన జానకి అప్పుడే హాల్లోకి అడుగుబెడుతున్న రామచంద్రని చూసి తడబాటుగా ఆగిపోయింది అక్కడే

తన మాటలన్నీ అతడు విన్నాడేమోననే కలవరం జానకి ముఖంలో కొట్టొచ్చినట్లు కనపడింది.

మేనల్లుడు అంత హఠాత్తుగా అలా వస్తాడని ఏమాత్రం ఊహించని ఆదిశేషు కూతురులాగే తడబడ్డాడు. "ఏరా నువ్విక్కడికి వస్తానంటే నేను కూడా ఆగేవాడిని కదా చక్కగా ఇద్దరం కలిసి వచ్చేవాళ్ళం" అన్నాడు ముఖానికి నవ్వు కలుపుకుంటూ.

జానకి వంక ఒకమారు చూసి ఆదిశేషు వంక తిరిగి "వచ్చేటట్లు చేసింది నువ్వేకదా మావయ్యా ఉదయం హడావిడిగా పంతులుగార్ని పిలిపించి అప్పటికప్పుడు ముహూర్తాలు పెట్టిస్తున్నప్పుడు నేనేమని అడిగాను? జానకి అభిప్రాయం కనుక్కున్నావా, లేదా అని దానికి జవాబుగా కనుక్కోకుండా ఎలా ఉంటానురా అని నవ్వుతూ తేల్చేశావు. తీరా ఇక్కడికి వచ్చి చూస్తే ఇదీ పరిస్థితి. ఎందుకు మావయ్యా ఇలా చేశావు?" అన్నాడు రామచంద్రా బాధగా.

"నేనేం కావాలని చేయలేదురా. మీ నాన్న బాధ చూడలేక అప్పటికప్పుడు ఆ నిర్ణయం తీసుకోవలసి వచ్చింది అంతే" అన్నాడు ఆదిశేషు సంజాయిషీ ఇస్తున్నట్లుగా.

"కానీ నువ్వు కల్పించిన ఈ పరిస్థితి జానకికీ, నాకూ ఎంత ఇబ్బందిగా తయారయిందో చూశావా?" అన్నాడు రామచంద్ర నిష్ఠూరంగా.

వెంటనే "సారీ బావా నిన్ను హర్ట్ చేయాలని కాదు నా ఉద్దేశ్యం" అంది జానకి సంజాయిషీగా.

"సారీ ఎందుకు జానకీ నువ్వు ఆవేశపడడంలో తప్పు ఎంతమాత్రంలేదు. అసలు తప్పు నాదే పరిస్థితి ఇదీ అని నేను ముందే నీకు వివరంగా చెప్పి ఉండవలసింది. నువ్వు ఎం.ఏ లిటరేచర్ చేస్తానంటే నిన్ను బి.యిడి చేయమని ఎంకరేజ్ చేసింది నేనేకదా, మనిద్దరం టీచింగ్ ప్రొఫెషన్‌లో ఉంటే బాగుంటుందనే ఉద్దేశ్యంతో.

కానీ అనుకోకుండా నాన్నగారికి ఇలా ఏక్సిడెంటు అయి చెయ్యితోపాటు ఉద్యోగం పోగొట్టుకుని ఇంట్లో కూర్చోవలసి రావడం వలన పరిస్థితి అంతా తారుమారు అయింది. అమ్మ ఉండి ఉంటే ఆ దారి వేరుగా ఉండేది. అమ్మపోయినా, మా కోసమని నాన్నగారు గుండె దిటవు చేసుకుని బ్రతికారు. కానీ ఇప్పుడు వచ్చిన పరిస్థితికి నాన్నగారు అసలు ఎంతమాత్రం తట్టుకోలేకపోతున్నారు. ఆయన చాలా డిప్రెషన్‌లో ఉన్నారు. నేను జాబ్‌లో జాయిన్ అయింది మొన్నమొన్ననే కనుక శెలవు పెట్టి నాన్నగారికి సపోర్టుగా ఇంట్లో ఉండే పరిస్థితి కాదు. బాచీ ఈ ఏడే టెంత్‌కి వచ్చాడు కదా. వాడిని ఇంట్లో అట్టిపెట్టలేను. అందుకే నిన్నిలా ఇబ్బంది పెట్టవలసి వచ్చింది.

కానీ ఇక్కడికి వచ్చాక నీ వెర్షన్ అంతా విన్నాక, నీ కోర్కె న్యాయమైందే అనిపిస్తోంది. ముందు నువ్వు బి.యిడిలో జాయిన్ అవ్వు జానకీ. తర్వాత సంగతి తర్వాత చూద్దాం" అన్నాడు రామచంద్ర నిబ్బరంగా.

"ఏమిట్రా చూసేది బాచీని స్కూల్ మాన్పించి, ఇంట్లో కూర్చోపెట్టడమేగా? ఈ వయసులో వాడి చదువుకు ఇలా బ్రేక్ ఇస్తే తర్వాత వాడు ఎందుకయినాపనికి వస్తాడంటావా? దానికి ఈ పెళ్ళి ఇష్టం లేదంటే వేరె ఎవరినైనా చూసి నీ పెళ్ళి చేసేస్తాం.. అంతే" అన్నాడు ఆదిశేషు విసురుగా.

తండ్రి మాటలు వినడంతోనే జానకి చివాలున తలెత్తి తండ్రి వంక చూసింది. ఆ తరువాత నీ అభిప్రాయం కూడా ఇదేనా అన్నట్లు రామచంద్ర వంక చూసింది.

భాస్కర్ చదువు ఆగిపోతుందంటే ఆమెకీ బాధగానే ఉంది.

పంకజం కూడా ఆందోళనగా చూసింది అందరివైపూ.

జానకి మనోభావాన్ని గ్రహించినట్లుగా చిన్నగా నవ్వుతూ "ఎందుకు మావయ్య అంత ఆవేశపడతావు? పెళ్ళి అనేది ఇద్దరి మధ్యా మధురమైన భావనలను కలిగించాలే గానీ ఏదో శత్రువుల మధ్య ఒప్పందంలా ఉండకూడదు కదా! ఈ పెళ్ళి మా ఇద్దరికీ ఆనందం చేకూర్చేదిగా ఉండాలిగానీ, ఒకరికి బాధనీ, మరొకరికి సంతోషాన్నీ కలిగిస్తే ఆ బంధానికి అర్థం ఏమైనా ఉంటుందా? మా అవసరాల కోసం, మా ఇబ్బందులు తీర్చుకునేందుకు జానకి ఆశలనూ, కోరికలనూ తుంచలేను మావయ్యా.

జానకి బాధపడుతూ మా ఇంట్లో అడుగుపెట్టడం నాకిష్టం లేదు. తను నిండు మనసుతో నా ఇంటికి రావాలి. బాచీ ఈ ఏడు కాకపోతే వచ్చే ఏడు టెంత్ రాస్తాడు. వాడి ఫ్యూచర్ దెబ్బతినకుండా చూసే పూచీనాది" అన్నాడు రామచంద్ర స్థిరమైన కంఠంతో.

అతడంత భరోసాగా మాట్లాడినప్పటికీ జానకి మనసు కుదటపడలేదు. నామూలంగా బాచీ చదువు ఆగిపోతే అతడి మనసులో నా పట్ల ప్రేమానురాగాలు ఏమైనా మిగిలి ఉంటాయా? ఇదే నా తమ్ముడు హరి చదువు ఇలా ఆగిపోతే నేను భరించగలనా అనుకుంది జానకి ఆలోచనగా.

అంతవరకూ తండ్రికి ఎదురు నిలిచి ఎంతో ధృఢంగా పెళ్ళి వద్దంటే వద్దని వాదించిన జానకి భాస్కర్ భవిష్యత్ కళ్ళ ముందు మెదలడంతో తన నిర్ణయాన్ని మార్చుకుంది. ఆపైన రామచంద్ర తన నిర్ణయాన్ని గౌరవించిన తీరు అతడిపైన అంతవరకూ ఉన్న అనురాగాన్నీ, గౌరవాన్నీ రెట్టింపు చేసింది.

"అందుకే బావా.. నాన్నగారు అన్నట్లు పరిస్థితులను అర్థం చేసుకోకుండా నేను కొంచెం మూర్ఖంగానే ప్రవర్తించాను. ఐ యాం సారీ. అనవసరంగా నేను మీ అందర్నీ బాధపెట్టాను. నేను బి.యిడిలో జాయిన్ అవడంలేదు. మీరు పెళ్ళి ఏర్పాట్లు కానివ్వండి" అంది ప్రశాంతంగా అందరి వంకా చూస్తూ.

**ఆ మాటలు** వినడంతోనే ఆదిశేషూ, రామచంద్రా జానకి వంక ఆశ్చర్యంగా చూశారు.

జరుగుతున్నదంతా బయాందోళనలతో చూస్తున్న పంకజానికి కూతురు మాటలు వినడంతోనే గుండెలమీదనుండి పెద్ద భ్రమం దింపినట్లయింది. ఆనందంగా కూతురివంక చూస్తూ "ఎంత చల్లనిమాట అన్నావమ్మా" అంటూ జానకి బుగ్గలు పుణికి ముద్దు పెట్టుకుంది.

ఆశ్చర్యం నుండి తేరుకున్న రామచంద్ర "జానకీ, తొందరపడి నిర్ణయం తీసుకోకు. ఒక్క సంవత్సరంలో ప్రపంచమేమీ తల్లకిందులయిపోదు" అన్నాడు వారిస్తున్నట్లుగా.

"లేదు బావా నేను బాగా ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నాను. బాచీకి ఇది క్రూషియల్ టైమ్. వాడి భవిష్యత్తుని నా సంతోషం కోసం బలిపెట్టలేను. నాకు మా తమ్ముడు హరిప్రసాద్ ఎంతో, వాడూ అంతే. ఇంకేం ఆలోచించకు. నేను మనస్ఫూర్తిగానే చెబుతున్నాను ఈ మాట" అంది జానకి.

వంటగదిలోకి వెళ్ళి పంచదార డబ్బా చేత్తో పట్టుకుని పంకజం "ఇంకేం ఆలోచించకుండా అందరూ నోరు తీపి చేసుకోండి" అంటూ అందరి చేతిలోనూ పంచదార వేసింది.

తనతో భర్త మాట మాత్రమైనా చెప్పకుండా ఇలా పెళ్ళి ఖాయంం చేసుకొచ్చాడనే బాధ మచ్చుకైనా లేదు ఆమెలో. ఇంతలో హరిప్రసాద్ వచ్చాడు ఇంటికి. అందరూ పంచదార నోట్లో వేసుకోవడం చూసి "ఏమిటమ్మా విశేషం. అందరూ ఇంత హుషారుగా ఉన్నారు?" అనడిగాడు.

"మీ అక్క పెళ్ళిరా. వచ్చే నెల పదో తేదీన. ఏదీ నోరు పట్టు" అంటూ కొడుకు నోట్లో పంచదార వేసింది పంకజం.

"ఉత్తి పంచదారేనా, ఇంత మంచి కబురు చెప్పి. ఏం బావా, నాకు పార్టీ గట్రా ఏం లేదా?" అనడిగాడు సంతోషంగా అందరివంకా చూస్తూ.

"ఎందుకు లేదు? సాయంత్రం మీ అక్కా నువ్వూ కలిసి జగదాంబాకి రండి. అందరం కలిసి సినిమా చూద్దాం" అన్నాడు రామచంద్ర.

"ఓ సినిమాకా? ఫెంటాస్టిక్. మరి బాచీ వస్తాడా?" అనడిగాడు హరిప్రసాద్ ఉత్సాహంగా.

"వాడూ నువ్వూ లేకుండా పార్టీ ఎలా జరుగుతుంది? వస్తాడులే" అన్నాడు రామచంద్ర.

"అయితే ఓ.కే" అన్నాడు హరిప్రసాద్ ఆనందంగా.

అందరితో చెప్పి రామచంద్ర వెళ్ళిపోయాడు. వెళ్తూ, వెళ్తూ అతడు జానకివైపు ఎంతో అభిమానంగా చూస్తూ కళ్ళతోనే వీడ్కోలు తీసుకున్నాడు. మెరిసే కళ్ళతో అతడి వంక అలా చూస్తూ ఉండిపోయింది జానకి.

అందరూ ఎవరిమానాన వాళ్ళు వెళ్ళిపోయాక ఆదిశేషు మనసులో మథన మొదలైంది. కూతురు అన్నట్లు తను ఇంతకాలంగా భార్యకు సరైన ప్రాధాన్యత ఇవ్వలేదేమో అనిపించింది అతడికి మొదటిసారిగా అలా ఆలోచిస్తూ అక్కడే కూర్చుండిపోయాడు.

"ఏమిటండీ అలా ఉన్నారు. అంతా ఆనందంగా ముగిశాక?" అంది పంకజం వెలిగిపోతున్న ముఖంతో అక్కడికి వచ్చి అతడి పక్కన కూర్చుంటూ.

"ఏం లేదు పంకజం, నేను అనేక సందర్భాలలో నిన్ను చాలా బాధపెట్టాను. కానీ ఇందాక జానకి అన్నదగ్గరనుండి నా మనసు అదోలా అయిపోయింది. ఇన్నాళ్ళూ నేను నిన్ను ఇంత బాధపెట్టానా? కానీ పంకజం, నేను ఏదీ కావాలని చేయలేదు. నాకు తెలియకుండానే అలా జరిగిపోయింది. జానకి అన్నట్లు నా చదువూ, వివేకం నీ విషయంలో ఏమయ్యాయో అర్థంకాలేదు. కానీ ఈరోజు జానకి పెళ్ళి నిశ్చయం మాత్రం అనుకోకుండా జరిగిపోయింది. మీ అన్నయ్య శంకరం బాధ చూడలేక అప్పటికప్పుడు అలా చేశానేకానీ నిన్ను కించపరచాలని కాదు. ఏది ఏమైన నీతో చెప్పకుండా ఇలా చెయ్యడం తప్పే. మరోసారి ఇలా జరగనివ్వను" అంటూ భార్య చెయ్యిపట్టుకున్నాడు ఆదిశేషు.

"ఛ, మనలో మనకి మన్నింపులేమిటి? ఆ మాత్రం నేను అర్థం చేసుకోగలను లెండి. మీరు అమ్మాయి మాటలు మనసులో పెట్టుకుని బాధపడకండి. మనం తలపెట్టింది శుభకార్యం. లేనిపోని ఆలోచనలతో మనసు పాడుచేసుకోవద్దు" అంది పంకజం ఓదార్పుగా.

"లేదు పంకజం. అమ్మాయి ఈ రోజు అలా అనేవరకూ నాకు తోచనేలేదు. నేను నిన్ను సరిగ్గా పట్టించుకోలేదన్న విషయం. ఇన్నాళ్ళూ నాకు తోచినట్లు చేసుకుంటూ పోయానేగానీ ఏనాడూ ఏ మంచి చెడులు నీతో చర్చించలేదు. ఇది సరైంది కాదని కూడా నాకు అనిపించలేదు ఇంతవరకూ. కానీ ఇక మీదట ఏది చేసినా మనిద్దరం కలిసే చేద్దాం" అన్నాడు ఆదిశేషు ప్రేమగా భార్యవంక చూస్తూ.

ఇంతలో "నాన్నా" అంటూ వచ్చింది జానకి అక్కడికి.

"ఏంటమ్మా?" అన్నాడు ఆదిశేషు కూతురువంక చూస్తూ.

"సారీ నాన్నా! ఈ రోజు మీ మనసు చాలా నొప్పించాను. చదువుకోవాలనే ఆశ చంపుకోలేక ఏదేదో అనేశాను" అంది జానకి తలవంచుకుని.

"సారీ ఎందుకమ్మా? నువ్వన్నది ఉన్నమాటే కదా! ఆ క్షణంలో నువ్వలా అన్నందుకు నాకు చాలా కోపం వచ్చింది. కానీ ఆలోచించాక నువ్వన్న ప్రతి అక్షరం యదార్థమే అనిపించింది. ఒక విధంగా నువ్వు నాకు చాలా ఉపకారం చేశావు. పాపం ఇన్నాళ్ళూ మీ అమ్మని నేను చాలా నొప్పించాను" అన్నాడు ఆదిశేషు డగ్గుకత్తితో.

"అయినా సరే నేనలా అని ఉండవలసింది కాదు. అయాం వెరీసారీ నాన్నా" అంటూ ఆదిశేషు పాదాలు అందుకోబోయింది జానకి కన్నీళ్ళు జాలువారుతుండగా.

"అరే ఏంటమ్మా ఇది? నువ్వలా అన్నందుకు నాకు ఏ బాధాలేదు. నా చిట్టితల్లికి మంచేదో, చెడేదో తెలుసుకోగలిగిన వివేకం ఉందని చాలా గర్విస్తున్నాను. ఆడదిక్కులేని ఆ ఇంటికి వెళ్తున్న నువ్వు ఇంత చిన్న వయసులో ఆ బరువు బాధ్యతలను ఎలా

నిభాయించుకోగలవా అని ఇన్నాళ్ళూ మధనపడ్డాను. కానీ ఇవాల్టితో ఆ బెంగ తీరిపోయింది. మన హరినీ, బాచీని ఒక్కలాగే భావించిన నీ వివేకాన్ని చూశాక నాకింక ఏ చింతా మిగలలేదు'' అంటూ కూతుర్ని దగ్గరకు లాక్కుని పక్కన కూర్చోపెట్టుకుని తల నిమిరాడు ఆదిశేషు.

తమ్ముడ్ని తీసుకుని సినిమాహాలు దగ్గరకు వెళ్ళింది జానకి.

వాళ్ళకోసమే ఎదురుచూస్తున్న రామచంద్ర, భాస్కర్ వాళ్ళని చూడడంతోనే ఉత్సాహంగా దగ్గరకు వచ్చారు.

భాస్కర్ కళ్ళు మెరుస్తూండగా అభిమానంగా జానకి దగ్గరకు వచ్చి ''థాంక్స్ వదినా'' అన్నాడు.

''థాంక్స్ ఎందుకు బాచీ సినిమాకి రావడం కూడా గొప్పేనా?'' అంది జానకి తేలిగ్గా నవ్వేస్తూ.

''కాదు. నాకోసం నువ్వు చదువు మానేశావు కదా అందుకు'' అన్నాడు భాస్కర్ మరింత అభిమానంగా చూస్తూ.

''ఎవరు చెప్పారు నీకలా మీ అన్నయ్యేనా?'' అంది జానకి చిరుకోపంగా రామచంద్ర వంక చూస్తు.

''అమ్మో, నేనేంకాదు'' అంటూ నమస్కారం పెట్టేశాడు రామచంద్ర.

''అన్నయ్యనేం అనకు వదినా నాకిదంతా నాన్నగారే చెప్పారు. నాకోసం నీ ఫ్యూచర్ త్యాగం చేశావు కనుక. దాన్ని నిలబెట్టుకునేందుకు నేను బాగా చదవాలని చెప్పారు'' అన్నాడు భాస్కర్.

''పిచ్చి బాచీ. అదేం లేదు కానీ, అర్ధలేని ఆలోచనలతో మనసు పాడుచేసుకోకుండా హ్యాపీగా ఉండు'' అంటూ భాస్కర్ తల నిమిరింది జానకి.

తల్లిలేని భాస్కర్ అంటే ఆమెకు మొదటినుండీ ఎంతో వాత్సల్యం. వయసులో వాళ్ళిద్దరికీ పెద్ద తేడా లేకపోయినా తన తమ్ముడు హరిప్రసాద్‌లాగే అతడిని ఎంతో అభిమానంగా చూస్తుంది.

అక్కచెల్లెళ్ళెవరూ లేని భాస్కర్ జానకిలోనే తల్లినీ, తోడునూ చూసుకుంటాడు.

టికెట్స్ ముందుగానే తీసివుంచడం వలన నలుగురూ హాల్లోకి నడిచారు.

ఇంటర్వెల్‌లో భాస్కర్, హరిప్రసాద్ స్నాక్స్ తెచ్చేందుకు బయటకు వెళ్ళాక అంది జానకి.

''సారీ బావా, నిన్నీ రోజు చాలా నొప్పించాను. మా నోట్లోనుంచి మాట రాకుండానే తమ్ముడికీ, నాకూ అన్నీ అమర్చిపెట్టే నాన్నగారు ఒకోసారి చాలా రిజిడ్‌గా బిహేవ్ చేస్తారు. తనమాటే శాసనంలా చెలామణీ కావాలంటారు. ఎదుటివాళ్ళ ఫీలింగ్స్‌కి ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వరు. ఈ రోజు జరిగిందదే దాంతో చిరాకు వచ్చేసింది నాకు. అందుకే అలా''

అంటున్న జానకి మాటలను మధ్యలోనే కట్ చేశాడు రామచంద్ర.

''ఇట్స్. ఓ.కె ఇందులో ఎవర్నీ తప్పుపట్టే పనిలేదు. చిన్న కమ్యూనికేషన్ గేప్ అంతే. అయినా నీ మనసేమిటో నాకు తెలియదా?'' అంటూ ఆమె చేతిని మృదువుగా నొక్కి వదిలాడు.

''థేంక్స్ బావా. నీలా అర్థం చేసుకునే వ్యక్తి నా జీవన సహచరుడిగా రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. నేను చాలా కుటుంబాలలోని జంటలను చూశాను. తమ లైఫ్ పార్టనర్‌కి ఉండడానికో ఇల్లు, కట్టుకునేందుకు, పెట్టుకునేందుకు చీరలు, నగలు కొనిచ్చేస్తే బాధ్యత తీరిపోతుందనుకుంటారే తప్ప ఆడదాని మనసులో ఏముందో తొంగిచూసే ప్రయత్నం చేయరు. అంతకంటే ఇంకేమీ అక్కరలేదనే అనుకుంటారు.

కానీ ఒకరికోసం ఒకరు అనే భావన ఎంత భరోసాని, తృప్తిని ఇస్తుందో గమనించరు. అలాంటి నమ్మకాన్ని, భరోసాని మగవాడు ఆడదానికి కల్పిస్తే ఆ సంసారం స్వర్గతుల్యం కాదా? కానీ ఇవన్నీ సినిమాల్లోనూ, నవలల్లోనూ చూసేందుకు, చదివేందుకు బాగుంటాయని అంటాడు మా విశాల పిన్ని భర్త.

అదే మనిషి సినిమాల్లో అలాంటి సన్నివేశాలను చూసి చాలా ఎంజాయ్ చేస్తాడు. చాలా భావుకత్వంతో మాట్లాడతాడు. మనుష్యుల మధ్య రిలేషన్స్ అంటే అలా ఉండాలి అంటూ కానీ, వాస్తవ జీవితంలో తన దగ్గరకు వచ్చేసరికి దాన్ని ఏమాత్రం ఆ చరణలో పెట్టడు.

బావా! నాకు ఏ సిరిసంపదల మీదా ఆశలు లేవు. నేను కోరుకునేది నిండైన నీ ప్రేమానురాగాలను. నువ్వు అలాంటి తృప్తినీ, భరోసాను నాకివ్వగలవా?'' అంది జానకి అతడి చేతిని గట్టిగా పట్టుకుని.

''ష్యూర్ జానకీ! నీ నమ్మకాన్ని నేను ఏనాడూ వమ్ము చెయ్యను. ఎందుకంటే అందులో ఆనందాన్ని పొందేది నీవొక్కదానివే కాదు, నేను కూడా అందులో భాగస్వామినే కదా! ఈనాటి ఈ ఆనందానుభూతులే మనకి ముసలితనంలో మధురస్మృతులుగా మిగులుతాయి. అవి మన శేషజీవితానికి టానిక్‌లా పనిచేసి ఆరోగ్యంగా ఆనందంగా మిగతా జీవితాన్ని గడిపేలా చేస్తాయి'' అన్నాడు రామచంద్ర మెల్లగా.

''థాంక్యూ'' అంటూ అతడి చేతిని అందుకుని పెదవులకు ఆనించుకుంది జానకి.

ఆయాచితంగా దొరికిన ఆ చిన్నముద్దుతో అతడి మనసు ఆనందతరంగితమైంది.

''థాంక్స్ నేనే చెప్పాలి. కోరకుండానే ఇంత మధురమైన బహుమతి ఇచ్చావు కదా. మరి తిరిగి బాకీ తీర్చవద్దా?'' అంటూ ఆమె వైపుకు వంగాడు రామచంద్ర.

''ఛ, ఛో'' అని జానకి అంటూండగా చేతిలో చిప్స్ పాకెట్స్‌తోనూ, డ్రింక్ బాటిల్స్‌తోనూ భాస్కర్ హరిప్రసాద్ వచ్చారక్కడికి.

వాళ్ళను చూడడంతోనే ఇద్దరూ బుద్ధిమంతుల్లా సర్దుకుని కూర్చున్నారు.

జానకీ రామచంద్రల పెళ్ళి నిరాడంబరంగా జరిగిపోయింది.

పంకజం కూతుర్ని అత్తవారింట్లో దిగవిడిచి వస్తూ, ''జానకీ అన్నీ తెలిసినదానివి. నీకు ప్రత్యేకించి ఏదీ చెప్పవలసిన అవసరం లేదనే అనుకుంటున్నాను. అయితే ఒక్కటి మావయ్యను మీ నాన్నలాగానూ, బాచీని నీ తమ్ముడు హరిలాగానూ చూసుకో, చాలు. అలాగే నీ కాళ్ళమీద నీవు నిలబడే ప్రయత్నం చేయి. ఎట్టి పరిస్థితుల్లోనూ నీ వ్యక్తిత్వాన్ని నీవు వదులుకోకు. ఈ విషయంలో ఒకసారి రాజీపడితే, జీవితాంతం రాజీపడవలసి వస్తుంది.

అమ్మ ఏమిటి ఇలా చెప్తోంది అని ఆశ్చర్యపోతున్నావా? నేను ఎదుర్కొన్న ఇబ్బందులేవీ నీ జీవితంలో పునరావృతం కాకూడదనే చెప్తున్నాను'' అంది.

అంతవరకూ తల్లికి స్వంత అభిప్రాయం అంటూ ఏదీ లేదనుకున్న జానకి ఆ మాటలు విని ఆశ్చర్యంగా చూసింది.

''ఏమిటే అలా చూస్తావు. అమ్మేంటి ఇలా మాట్లాడుతోంది అనుకుంటున్నావా? ఏ తల్లయినా తాను ఎన్ని ఇబ్బందులు పడినా, భరిస్తుంది. పిల్లలు సుఖంగా ఉండాలని కోరుకుంటుంది. నేనూ అంతే. మంచి పేరుకోసమో, నలుగురూ ఏమైనా అనుకుంటారనో, త్యాగమనుకునో, మంచితనం అనుకునో చిన్న చిన్న సరదాలను కూడా వాయిదా వేస్తూ నా జీవితంలో చాలా కోల్పోయాను. అలాంటి

పరిస్థితి నీకు రాకూడదనే నా నా ఉద్దేశ్యం. వస్తాను, నాన్నగారు బయట వెయిట్ చేస్తున్నారు'' అంటూ పంకజం వీధివాకిలి వైపు నడిచింది.

తల్లిదండ్రులను గుమ్మం వరకూ వెళ్ళి సాగనంపి కనుమరుగయ్యేవరకూ అలా చూస్తూండిపోయింది జానకి.

కోడలు అలా గుమ్మంలోనో ఉండిపోవడం చూసి ''అమ్మా జానకీ'' అంటూ పిలిచాడు శంకర్రావు.

ఆ పిలుపుతో ఉలిక్కిపడిన జానకి, ''ఏమిటి మావయ్యా'' అంటూ అతడి దగ్గరకు వెళ్ళింది.

''ఏంలేదమ్మా అమ్మా నాన్నా వెళ్ళిపోయారని దిగులుపడుతున్నావా?'' అన్నాడు లాలనగా.

''అబ్బే అదేంలేదు మావయ్యా ఊరికే అలా నుంచున్నాను'' అంది సిగ్గుపడుతున్నట్లుగా.

''నాకు తెలుసమ్మా. కొత్తగా పెళ్ళయిన ఏ ఆడపిల్లయినా అత్తవారింటికి వచ్చిన కొత్తలో ఈ పరిస్థితిని ఎదుర్కోవలసిందే అయినా ఇదేమైనా నీకు పరాయి ఇల్లా? చిన్నప్పటి నుండీ ఆడిపాడిన ఇల్లేకదా'' అన్నాడు శంకర్రావు అభిమానంగా చూస్తూ.

''దిగులని కాదుగానీ, వాళ్ళు వెళ్ళిపోయాక ఏదో వెల్తిగా అనిపించింది అంతే. సరే మావయ్యా కొంచెం కాఫీగానీ, టీగానీ తెమ్మంటారా?'' అనడిగింది జానకి.

''వద్దమ్మా. నేను ఉదయం ఒకసారి కాఫీ, సాయంత్రం ఒకసారి టీ తాగుతాను అంతే. ఎక్కువసార్లు అలవాటు లేదు'' అన్నాడు నవ్వేస్తూ.

''సరే మావయ్యా వెళ్తాను'' అంటూ కదిలిందక్కడనుండి జానకి.

''వెళ్దువులే కూర్చోమ్మా. మాట్లాడాలి నీతో. ఏంలేదు ఉద్యోగం చేయాలని ఉందని రామంతో చెప్పావట. ఇంట్లో ఉన్న పని చాలకనా? ఇంకా ఉద్యోగం చేయాలనుకుంటున్నావు?'' అనడిగాడు శంకర్రావు.

''ఇదికూడా పెద్దపనేనా మావయ్యా. ఉదయమే బావకూ, బాచీకి బాక్సులు కట్టడంతో వంటపని అయిపోతోంది. ఆ పైన ఉదయం నుండి సాయంత్రందాకా ఇక పనేముంటుంది. ఖాళీయే కదా. అందుకనే ఏదైనా చేద్దామనుకుంటున్నాను'' అంది జానకి మెల్లగా.

''అలా ఇంటా బయటా శ్రమపడితే ఎంత కష్టమమ్మా. అంతగా టైమ్ పాస్ కావాలంటే మీ అత్తయ్యలాగా, అమ్మలాగా, ఏ కుట్లో అల్లికలో చేసుకోవచ్చుకదా'' అన్నాడు.

''కుట్లూ, అల్లికల పట్ల నాకంత ఆసక్తి లేదు మావయ్యా. మొదటినుండీ నా కాళ్ళమీద నేను నిలబడాలనే యాంబిషన్‌తో ఉన్నాను. ఇప్పుడిలా కేవలం ఇంటిపనికే పరిమితమై బ్రతకాలంటే నావల్లకాదు'' అంది జానకి తన అభిప్రాయాన్ని స్పష్టం చేస్తూ.

''నీ అభిప్రాయంతో నేను ఏకీభవించలేనమ్మా. ఉద్యోగం చేసి సంపాదిస్తేనే, సంపాదించినట్లా? హౌస్ వైఫ్‌గా ఉన్నవాళ్ళకి ఏ సంపాదనా లేనట్లేనా? వాళ్ళు చేసే శ్రమకు ఖరీదు కడితే మొగవాడు సంపాదించి తెచ్చి ఆమెకిచ్చేది ఏమూలకూ సరిపోదని నా ఉద్దేశ్యం. ఇంట్లో ఉండే స్త్రీని వంటింటికుందేలని చాలా తేలిగ్గా అనేస్తూ ఉంటారు. నాకైతే ఆమెలోమంచి అడ్మినిస్ట్రేటర్ కనిపిస్తుంది. ఇల్లు నడపడంలో స్త్రీకున్న తెలివితేటలూ, ప్రణాళికాబద్దవైఖరీ మగవాడికి ఎక్కడిది? భర్తా పిల్లలకూ కమ్మగా వండిపెట్టడమే కాదు. పిల్లలకు తొలిగురువై మంచిచెడుల విచక్షణా జ్ఞానాన్ని నేర్పుతుంది. గృహాన్ని స్వర్గసీమగా మార్చే బహుముఖ ప్రజ్ఞాశాలి స్త్రీ.

అందుకు ఉదాహరణలు మీ అమ్మా, అత్తయ్యలే. మనవి మధ్య తరగతి కుటుంబాలు. మీ నాన్నా, నేనూ సంపాదించి తెస్తే ఆ కాస్త సొమ్మునీ ఎంతో సమర్ధవంతంగా ఖర్చుచేసి ఎవరికీ ఏ లోటూ రాకుండా చూసుకుంటూ వచ్చారు. ఉండడానికి చిన్నదో పెద్దదో ఇల్లు

అమర్చుకున్నాం. ఇప్పుడు మనం హాయిగానే ఉన్నాం కదా! ఇంకెందుకు అనవసరంగా కష్టపడటం?'' అన్నాడు శంకర్రావు నచ్చచెపుతున్నట్లుగా.

''మీరన్నది నేనేదీ కాదనలేను మామయ్యా. అమ్మకీ, అత్తయ్యకీ ఉద్యోగం చేసే అవకాశం లేదు కనుక ఉన్నదానిలోనే పొదుపుగా గడుపుకున్నారు. అయినా మా చిన్ననాటి జీవనప్రమాణాలు, అవసరాలూ చాలా పరిమితంగా ఉండేవి కనుక అప్పుడు ఎంత తక్కువ ఆదాయం వచ్చినా సరిపోయేది కాదు, సర్దుకుపోయేవారు, కానీ ఇప్పుడలా కాదు. అవసరాలు పెరిగాయి. రోజురోజుకీ చుక్కలంటుతున్న ధరలతో ఆదాయాలు పోటీపడలేక మధ్యతరగతి జీవితాలు కొట్టుమిట్టాడుతున్నాయి ఇలాగే ఉంటే మాకు మీరందించిన కనీస సౌకర్యాలను కూడా మా తరువాత జనరేషన్‌కి మేము అందించలేము మావయ్యా. అందుకే నేనేదైనా చేయాలనుకుంటున్నాను.''

తాను చెప్పినదంతా శ్రద్ధగా విని కోడలు తన మాటలను కాదనకుండానే పరిస్థితులను వివరించిన తీరు తనను కన్విన్స్ చేసిన విధానం అతడికెంతో నచ్చింది.

అందుకే నవ్వుతూ ''సరేనమ్మా. నీకెలా నచ్చితే అలా చెయ్యి. కాకపోతే నా బాధంతా ఒకటే చిన్నపిల్లవు ఇంటా బయటా చాకిరీ చేసి అలిసిపోతావని. కొత్తగా పెళ్ళి చేసుకున్న మీరు ఏ సరదాలూ లేకుండా ఇలా కష్టప్డటం ఏమిటనే నా ఉద్దేశ్యం'' అన్నాడు శంకర్రావు.

''మీరలాంటి ఆలోచనలేమీ మనసులో పెట్టుకోకండి మావయ్యా. నేను చేయగలిగితేనే చేస్తాను. శక్తికి మించి ఏమీ చేయను. సరేనా?'' అంది జానకి హామీ ఇస్తున్నట్లుగా.

శంకర్రావు సరేనన్నట్లుగా తలాడించాడు.

ఆ రాత్రి రామచంద్రను అడిగింది జానకి. ''ఏం బావా, నేను ఉద్యోగం చేయాలనుకుంటున్నానని మావయ్యతో చెప్పావా నువ్వు. ఆయన పెద్ద క్లాసు పీకారు నాకు''

''నువ్వు మాత్రం ఏం తక్కువ తిన్నావట. ఆయనకు ఎదురు క్లాసు పీకావట కదా'' అన్నాడు రామచంద్ర మందహాసంతో.

''ఈ మాట ఆయన నీకు ఎప్పుడు చెప్పారు బావా?'' అంది జానకి ఆశ్చర్యంగా చూస్తూ.

''ఎప్పుడు చెప్తేనేంలే. ఆయన నిన్నెంత మెచ్చుకున్నారో తెలుసా? నా కోడలు ఎంత తెలివైందిరా. నేను చెప్పినదానికి గంగిరెద్దులా తల ఊపకుండా ఎంత తార్కికంగా మాట్లాడిందనుకున్నావు అంటూ ఒకటే పొగిడేశారు నిన్ను'' అన్నాడు రామచంద్ర.

''అవును కదా మరి నాకేదైనా ఉద్యోగం చూడొచ్చుకదా నువ్వు'' అంది జానకి గారంగా అతడి భుజం మీద తలవాల్చి.

''బాగుంది. ఉద్యోగాలు రెడీమేడ్‌గా ఎప్పుడంటే అప్పుడు దొరుకుతాయా? ప్రయత్నం చేద్దాంలే. ఏదో ఒకటి దొరక్కపోదు'' అన్నాడు రామచంద్ర అనునయంగా.

ఆ కాస్త భరోసాకే ఎంతో పొంగిపోయింది జానకి.

అయితే అనుకున్నంత తేలిగ్గా జానకికి ఉద్యోగమేదీ దొరకలేదు.

చివరికి వి.టి కాలేజీలో ఫిఫ్త్‌క్లాస్‌కి ఇంగ్లీష్ టీచర్‌గా ఉద్యోగం దొరికింది. జీతం వెయ్యిరూపాయలు. ఉదయం ఎనిమిది గంటలకు వెళ్ళి సాయంత్రం అయిదుగంటలకు ఇంటికి వచ్చేది. ఎంతో ఉత్సాహంగా ఆ ఉద్యోగంలో చేరిపోయింది జానకి.

అయితే జానకి అనుకున్నంత సులువుగా అయిపోలేదు. ఇంటిపనులన్నీ తెముల్చుకుని ఉరుకులు, పరుగులు మీద స్కూలుకు వెళ్ళిరావడం తిరిగి ఇంటికి వచ్చాక ఇంటిపనులు చక్కబెట్టుకోవడం చాలా కష్టంగానే అనిపించేది.

ఆ పైన పిల్లలు రాసిన ఎసైన్‌మెంట్స్, స్లిప్ టెస్టులు దిద్దేసరికి రాత్రి పదిగంటలు దాటేది. అలసిపోయిన జానకి తెలియకుండానే నిద్రలోకి జారుకునేది. భార్య కష్టం కళ్ళారా చూస్తున్నా ఏమాత్రం సహాయం చేయలేని అసహాయపరిస్థితి రామచంద్రది.

అతడు భార్య లంచ్ బాక్స్ కట్టిచ్చినా, మానినా టంచన్‌గా ఉదయం ఏడుగంటలకు ఇంటినుండి బయలుదేరవలసి వచ్చేది. ఎందుకంటే అతడు రోజు చిట్టివలస వెళ్ళిరావాలి. ప్రయాణానికే అతడికి రోజూ రానూపోనూ రెండు గంటల టైము పడుతుంది. ఆపైన బస్సుల కోసం పడిగాపులు తప్పనిసరి. రామచంద్ర ముందుగా బయలుదేరితే తప్ప ఇన్‌టైములో స్కూలుకి చేరుకోలేకపోయేవాడు. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చాక టెంత్ క్లాసు చదువుతున్న భాస్కర్‌ని దగ్గర కూర్చోబెట్టుకుని అర్థంకానివి చెప్పేవాడు. స్కూలు నుండి తెచ్చుకున్న పిల్లల స్లిప్ టెస్టులు వగైరాలు దిద్దడంతో అతడికీ ఊపిరాడని పరిస్థితే.

అలా ఆ కొత్త జంట ముద్దుమురిపాలకు కొంత అవరోధం కలిగింది.

కొడుకూ, కోడలూ పడుతున్న కష్టం చూసి శంకర్రావు మనసు బాధతో మూలిగేది. కానీ ఏమీ చేయలేని నిస్సహాయత అతడిది.

నెలరోజుల క్రితం చదువుకోసం హోరాహోరీగా పోట్లాడిన జానకి, పెళ్ళయ్యాక చదువు మాటను పూర్తిగా పక్కన పెట్టింది. ఇంటి బాధ్యతల్లో పూర్తిగా మునిగిపోయింది. తిరిగి ఈరోజు భాస్కర్ మాటలు చదువుకోవాలనే ఆసక్తి రేకెత్తించాయి ఆమెలో. ఆలోచిస్తూనే పనులు చేసుకోసాగింది.

బయటకు వెళ్ళిన రామచంద్ర ఇంటికి వచ్చాడు.

వస్తూనే "పనిమీద అటుగా వెళ్ళాను కదా. దారేకదా అని మీ ఇంటికి కూడా వెళ్ళాను జానకీ. ఇదిగో ఈ వడియాలు, అప్పడాలు నీకిమ్మని అత్తయ్య ఇచ్చింది. మనం అటు రావడం మానేశామని చాలా నిష్ఠూరమాడారు ఇద్దరూ" అంటూ జానకి చేతికి తన చేతిలోని పాకెట్ ఇచ్చాడు.

"అవునా! నువ్వు వెళతానంటే నేనుకూడా వచ్చేదాన్ని కదా. పోన్లే అమ్మా నాన్నా బాగున్నారా? హరి ఇంట్లో ఉన్నాడా?" అనడిగింది జానకి.

"చెప్పానుకదా, అనుకోకుండా వెళ్ళానని. అంతా బానే వున్నారు. మీ తమ్ముడయితే నీ గురించి ఒకటే అడగడం. శెలవేకదా, రావచ్చుకదోయ్ అటు అంటే 'వస్తాలెండి' అంటేడేగానీ కదలడే" అన్నాడు రామచంద్ర నవ్వుతూ.

"వాడికి నువ్వంటే కొంచెం బెరుకులే బావా, అందుకే రాడు. పోన్లే బావున్నారు కదా. అన్నం పెడతాను రా" అంది జానకి కంచాలు కడిగిపెడుతూ.

"నాన్నగారూ, బాచీ తినేశారా?" అనడిగాడు రామచంద్ర కంచం ముందు కూర్చుంటూ.

"ఆ ఇప్పుడే తిని లేచారు" అంది జానకి అన్నం వడ్డిస్తూ.

అన్నం తింటుండగా "భాస్కర్ ఈ ఉద్యోగం మానేసి నన్ను ఎం.ఏకి కట్టమంటున్నాడు" అంది జానకి.

"మంచి ఆలోచనే. ఎదుగూ బొదుగూలేని ఆ జీతం కోసం రోజూ అంత కష్టపడే బదులు రెండేళ్ళు శ్రమపడి నీ క్వాలిఫికేషన్ పెంచుకుంటే ఏ కాలేజీలోనైనా ట్యూటర్‌గా చేరవచ్చు. మంచి జీతం కూడా వస్తుంది" అన్నాడు రామచంద్ర ఉత్సాహంగా.

"అవును, నాకు కూడా అదే మంచిదనిపించింది. ఎలాగైనా మన బాచీ చాలా తెలివైనవాడు. ఉన్నట్లుండి ఎంత మంచి సలహా ఇచ్చాడో చూడు" అంది జానకి అభిమానంగా.

"లేదులే తనమూలంగా నీ చదువు ఆగిపోయిందని వాడు చాలా గిల్టీగా ఫీలవుతున్నాడు. నువ్వలా చేస్తే వాడికి చాలా హ్యాపీగా ఉంటుంది" అన్నాడు రామచంద్ర.

శంకర్రావు కూడా జానకి నిర్ణయం విని చాలా సంతోషించాడు. జానకి పనిచేస్తున్న స్కూలువాళ్ళు మిడిల్ ఇయర్‌లో మానేస్తే పిల్లలు ఇబ్బంది పడతారని రిక్వెస్టు చేయడంతో జానకి సరేనంది. ఇలా సంవత్సరం మధ్యలో హరీబరీగా చదువు ప్రారంభించడం కంటే వచ్చే సంవత్సరం చదువుతేనే బాగుంటుంది అని రామచంద్ర సలహా ఇచ్చాడు.

**ఊళ్ళోనే ఉన్నా** శెలవు రోజుల్లో కూడా తమ ఇంటికి రాని కూతుర్నీ, అల్లుడ్నీ చూసేందుకు ఒక ఆదివారం పంకజం, ఆదిశేషు బయలుదేరారు. హరిప్రసాద్‌కి స్పెషల్ క్లాసు ఉండడంతో అక్కని చూసేందుకు వెళ్ళలేకపోతున్నందుకు చాలా బాధపడిపోయాడు.

"ఎందుకురా అంత బాధపడతావు. క్లాసు అయ్యాక, సైకిలుంది కదా అటునుండి అటు రావడానికి. ఎంతసేపు పడుతుంది. వచ్చెయ్యి. నువ్వు వచ్చేదాకా మేము అక్కడే ఉంటాం" అన్నాడు ఆదిశేషు సలహా ఇస్తున్నట్లుగా.

"అవున్రా, బాచీ కూడా వస్తాడు కదా క్లాసుకి ఇద్దరూ కలిసి వచ్చేయండి" అంది పంకజం.

ఆ మాటలు వింటూనే ఉత్సాహంగా తలూపాడు హరిప్రసాద్.

వాళ్ళు వెళ్ళేసరికి బట్టలు ఉతుకుతోంది జానకి.

చిక్కిపోయి కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకున్నట్లున్న కూతుర్ని చూసి ఆదిశేషు, పంకజం నివ్వెరపోయారు.

తల్లిదండ్రులను చూడడంతోనే చేస్తున్న పని వదిలి సంబరంగా ఎదురువెళ్ళింది జానకి.

"ఏమిటమ్మా బొత్తిగా ఇలా అయిపోయావు?" అంది పంకజం ఆర్తిగా కూతురి భుజం చుట్టూ చేయి వేసి దగ్గరగా పొదుపుకుంటూ.

తల్లి మాటలు ఎవరైనా విన్నారేమోనని కంగారుగా చుట్టూ చూస్తూ "నాకేం బాగానే ఉన్నాను. ఉండండి, కాఫీ తెస్తాను" అంటూ వంటింట్లోకి నడిచింది జానకి.

శంకర్రావు కూడా ఎంతో ఉత్సాహంగా పలకరించాడు వాళ్ళను.

కూతురి వెనుకే వంటింట్లోకి వెళ్ళిన పంకజం "ఏమిటే ఇలా అయిపోయావ్?" అంది బాధగా.

"అబ్బా, ఊరుకో అమ్మా నాకేం కాలేదు. నేను బాగానే ఉన్నాను. నువ్విలా అడగడం మామయ్య వింటే చాలా బాధపడతారు" అంది జానకి విసుగ్గా తల్లివంక చూస్తూ.

మామగారి మనసు నొచ్చుకోకూడదని ఆలోచిస్తున్న కూతురి తీరు చూశాక ఇంకేం అనలేకపోయింది పంకజం.

జానకి అందరికీ కాఫీలు కలిపి గ్లాసుల్లో పోసి ట్రేలో పెట్టుకుని తీసుకువచ్చింది.

శంకర్రావు కాఫీగ్లాసు అందుకుంటూ, "జానకి కాఫీ చాలా అద్భుతంగా చేస్తుంది బావా తనమూలంగా నేను కాఫీ ఉదయంపూట రెండోసారి తాగడం అలవాటు చేసుకున్నాను తెలుసా!" అన్నాడు.

"అవును. జానకి చేతుల్తో ఏది చేసినా కమ్మగానే ఉంటుంది" అన్నాడు ఆదిశేషు మురిపెంగా చూస్తూ.

"అవును కదా, అయితే ఈ పూట మీరిక్కడే ఉండంది నాన్నా. చిటికెలో వంట చేసేస్తాను. అందరం కలిసి భోజనం చేసి చాలారోజులైంది" అంది జానకి మారాం చేస్తున్నట్లుగా.

"బావుందే నువ్వు రావలసింది పోయి మేమే వచ్చామిక్కడికి. నీకు ఉన్నపని చాలక ఇదో అదనపు భారమా? అయినా నేను వంట చేసే వచ్చాను" అంది పంకజం వారిస్తున్నట్లుగా.

వెంటనే ఆదిశేషు అన్నాడు "మీ అమ్మ పెద్దగా వంటేం చేయలేదమ్మా. నీకిష్టమని బొబ్బట్లూ, పులిహోర చేసి ఆ కేరేజిలో పెట్టుకొచ్చింది. కొంచెం ఇంట్లో ఉంచిందంతే"

"ఇంకేం హాయిగా అందరం కలిసి తినేద్దాం" అంది జానకి ఉత్సాహంగా.

పంకజానికి మొహమాటంగా అనిపించడంతో కోపంగా ఆదిశేషు వంక చూసింది. ఈయనకేమీ తెలియదు అన్నట్లు. అది గమనించిన శంకర్రావు తేలిగ్గా నవ్వేస్తూ "ఇంతకాలమైనా నీలో ఏ మార్పూ లేదమ్మా. పార్వతి ఉన్నప్పుడు ఇలాగే చేసేదానివి. ఇప్పుడు జానకి దగ్గరకూడా ఇదే తంతు నీది. మనమేమైనా పరాయివాళ్ళమా ఇలా మొహమాట పడేందుకు. జానకి అన్నట్లు అందరం కలిసి తింటే ఎంత బాగుంటుందని?" అన్నాడు.

ఆ మాటలతో ఇంకేం అనలేక కూతురు వెనకే వంటింట్లోకి నడిచింది పంకజం.

తల్లి తెచ్చిన కేరేజి విప్పి వాసన చూస్తూ "అబ్బ, ఎంత కమ్మటి వాసన వస్తోందో. బాచీకి బొబ్బట్లంటే చాలా ఇష్టమమ్మా. కానీ చేయడానికి నాకే కుదరడంలేదు" అంది సంబరంగా.

"బాగుందే నేను నీకోసం ఆలోచిస్తే నువ్వు బాచీకోసం చూస్తున్నావా? అప్పుడే ఎంత ఆరిందాతనం వచ్చిందే నీకు" అంది పంకజం కూతురివంక మురిపెంగా చూస్తూ.

"పోమ్మా నువ్వెప్పుడూ ఇంతే" అంటూ ముద్దుగా విసుక్కుంటూ తిరిగి కేరేజి సర్దేసింది జానకి.

"సరే, నువ్వెళ్ళి ఆ బట్టలపని చూడు. నేనీ వంట సంగతి చూస్తాను" అంది పంకజం

"సరేనమ్మా" అంటూ ఏమేం చేయాలో తల్లికి చెప్పి వెళ్ళిపోయింది జానకి బట్టలు ఉతికేందుకు.

భోజనాల టైముకి స్పెషల్ క్లాసుకి వెళ్ళిన హరీ, భాస్కర్‌లు ఇంటికి వచ్చేశారు.

చేసిన వంటకాలన్నీ మధ్యలో పెట్టుకుని అందరూ గుండ్రంగా కూర్చుని భోజనాలకు ఉపక్రమించారు.

శంకర్రావుకి చిన్న చిన్న గిన్నెల్లో కూర, సాంబారు, పెరుగూ అన్నాలు విడివిడిగా కలిపి స్పూన్ వేసింది. మరో చిన్నగిన్నెలో బొబ్బట్లు చిన్న చిన్న ముక్కలుగా తుంచి నెయ్యి వేసి, ఫోర్క్ వేసింది. పులిహోర కూడా మరో చిన్నగిన్నెలో వేసి అన్నీ కలిపి ఒక పళ్ళెంలో పెట్టి అతడి ముందుంచింది జానకి.

కోడలు చేసిన ఏర్పాట్లు చూసి ప్రశంసగా చూశాడు శంకర్రావు ఆదిశేషు కూడా మెచ్చుకుంటున్నట్లుగా కూతురివంక చూశాడు.

ఏ పని చేసినా పద్ధతి ప్రకారం ఎంతో నేర్పుగా చేసే భార్య అంటే రామచంద్రకు ఎప్పుడూ అపురూపంగానే ఉంటుంది.

సరదాగా కబుర్లు చెప్పుకుంటూ వంటకాల రుచిని మెచ్చుకుంటూ అందరూ తృప్తిగా భోజనం చేశారు. సాయంత్రం వరకూ ఉండి ఆదిశేషూ, పంకజం, హరిప్రసాద్ వెళ్ళిపోయారు.

వెళ్ళేముందు జానకి చేతులు పట్టుకుని "అక్కా వచ్చే ఆదివారం ఇంటికి రావా? నువ్వు లేక నాకసలేం బాగుండడంలేదు. చాలా దిగులుగా ఉంటోంది" అన్నాడు హరిప్రసాద్ బ్రతిమాలుతున్నట్లుగా.

''పోనీ నువ్వు కూడా ఇక్కడికి వచ్చేయకూడదా హరీ. చక్కగా ఇద్దరం కలిసి చదువుకుందాం'' అన్నాడు భాస్కర్ ఉత్సాహంగా.

''అవును ఇదేదో చాలా బాగుంది. బాచీ అన్నట్లు ఇద్దరూ కలిసి చదువుకోవచ్చు. తెలియనివి ఏమైనా ఉంటే రామంగానీ, జానకిగానీ చెప్తారు'' అన్నాడు శంకర్రావు చిన్నకొడుకు మాట బలపరుస్తూ.

''బాగుందన్నయ్యా మీరంటున్నది పిల్లలిద్దరూ లేకుండా మేమెలా ఉండాలి అక్కడ?'' అంది పంకజం బేలగా చూస్తూ.

తల్లి బాధను అర్థం చేసుకున్న జానకి, ''ఇప్పటి నుండే అయితే అమ్మ బెంగ పెట్టేసుకుంటుంది మామయ్యా ఉన్న ఊరేకదా, వస్తూపోతూ ఉంటే సరిపోతుంది. పరీక్షల టైము దగ్గరపడ్డాక వాడు రానన్నా, బలవంతానా లాక్కొచ్చి రెండు మూడు నెలలు ఇక్కడే ఉంచుదాం'' అంది.

''అయితే అక్కా, వచ్చే ఆదివారం నువ్వు తప్పకుండా వస్తావుగా ఇంటికి?'' అన్నాడు హరిప్రసాద్ ఆశగా జానకి వంక చూస్తూ.

''ఏరా, మీ అక్కేగానీ, నేను రావద్దా?'' అన్నాడు రామచంద్ర ఆటపట్టిస్తున్నట్లుగా.

ఆ మాట వింటూనే మతాబులా వెలిగిపోయింది హరిప్రసాద్ ముఖం. ''రండి బావా, మీరంతా వస్తే మహదానందం నాకు'' అన్నాడు సంబరంగా.

''అవును, హరి చెప్పినట్లు మీరు నలుగురూ కలిసి వచ్చేవారి యం.వి.పి వచ్చేయండి'' అన్నాడు ఆదిశేషు.

''నేనెందుకులే బావా. పిల్లలు వస్తారులే'' అన్నాడు శంకర్రావు మొహమాటంగా.

''అదేం మాటన్నయ్యా అందరం కలిసి ఉంటే సరదాగా ఉంటుందని నువ్వే అన్నావు కదా ఏం మాట్లాడకుండా కలిసి రండి'' అంది పంకజం నవ్వుతూ.

''వస్తాములే అత్తయ్యా కాకపోతే నాకు బిర్యానీ చేసిపెట్టాలి'' అన్నాడు భాస్కర్ డిమాండ్ చేస్తున్నట్లుగా.

''హోరి భడవా'' అంటూ మేనల్లుడి భుజం తట్టాడు ఆదిశేషు.

అన్నట్లుగానే మరుసటి ఆదివారం అంతా కలిసి ఆదిశేషు ఇంటికి వెళ్ళారు.

వాళ్ళు వెళ్ళేసరికే వంటంతా ముగించేసింది పంకజం.

పెద్దవాళ్ళు ముగ్గురూ ముచ్చట్లలో పడితే జానకీ, రామచంద్రా, హరీ, భాస్కర్‌లు కేరమ్స్ ఆడుకుంటూ గడిపేశారు.

అందరూ కలిసి సరదాగా కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేశారు.

మర్నాడు రాఖీపూర్ణిమ కావడంతో జానకిని అక్కడే ఉండిపొమ్మని పట్టుపట్టాడు హరిప్రసాద్.

''నేనిక్కడ ఉండిపోతే ఎలారా? అక్కడ వాళ్ళకి చాలా ఇబ్బందికదూ?'' అంది జానకి ఇబ్బందిగా చూస్తూ.

జానకి సందిగ్ధాన్ని గమనించిన రామచంద్ర ''ఫర్వాలేదు ఉండు జానకీ. వాడు నీకోసం బాగా బెంగపెట్టేసుకున్నాడు. రేపు ఎలాగూ శెలవే కదా నేను మేనేజ్ చేస్తాలే'' అన్నాడు.

''పర్లేదు ఉండమ్మా. వాళ్ళకి కూడా ఏవో ఆశలు ఉంటాయి కదా నీమీద'' అన్నాడు శంకర్రావు చిరునవ్వుతో.

అయిష్టంగానే ఉండిపోయింది జానకి అక్కడ.

వాళ్ళు వెళ్ళాక హరిప్రసాద్ రెండు చేతులతో జానకిని చుట్టేస్తూ ''అక్కా, నువ్విక్కడి నుండి వెళ్ళిపోయి ఎన్నో యుగాలయినట్లుంది నాకు'' అంటూ జానకిని లాక్కెళ్ళి ఉయ్యాల్లో కూర్చోబెట్టి ఆమె ఒడిలో తలదాచుకున్నాడు చెమరిస్తున్న కళ్ళను దాచుకునేందుకు.

"అరే ఏమిట్రా ఇది, ఆడపిల్లలా" అంటూ అతడి కళ్ళు తుడిచి తల నిమురుతూ ఉండిపోయింది జానకి.

ఆ రాత్రంతా అక్కాతమ్ముళ్ళిద్దరూ ఎడతెగకుండా కబుర్లు చెప్పుకుంటూనే ఉన్నారు. మధ్య మధ్యలో పంకజం "పడుకోండ్రా ఇక" అంటూ మందలిస్తున్నా పట్టించుకోలేదు ఇద్దరూ.

పెళ్ళయ్యాక రామచంద్రా, జానకీ మొదటిసారి విడిగా ఉన్నది ఆ రోజే. తమ్ముడితో కబుర్లలో పడి జానకి అంతగా బాధపడలేదుగానీ, రామచంద్ర మాత్రం జానకినే తలచుకుంటూ ఆ రాత్రి నిద్రకు దూరమయ్యాడు.

మరునాడు సాయంత్రం కూతుర్ని ఆదిశేషు దిగబెట్టి వచ్చేశాడు డాబాగార్డెన్స్‌లోని వాళ్ళింటి దగ్గర.

తిరిగి రొటీన్‌లో పడిపోయారు అంతా.

రోజులు నిమిషాల్లా గడిచిపోతున్నాయి.

హరిప్రసాద్, భాస్కర్ టెంత్ మంచి మార్కులతో పాసయ్యారు. ఇద్దరూ క్రిష్ణా కాలేజిలో ఇంటర్‌లో జాయిన్ అయ్యారు, సి.ఈ.సి గ్రూప్ తీసుకుని.

ఎక్కడికి వెళ్ళినా ఇద్దరూ కలిసి వెళుతూండటంతో వాళ్ళిద్దరికీ "జంటకవులు" అని నిక్‌నేమ్ పెట్టి పిలవసాగారు అంతా.

జానకి స్కూల్లో ఉద్యోగం మానేసి ఎం.ఏకి సీరియస్‌గా ప్రిపేర్ అవసాగింది.

ఫస్ట్ ఇయర్ పరీక్షలు రాసి మంచి మార్కులతో పాసయింది. సెకండ్ ఇయర్ పరిక్షలకు ప్రిపేర్ అవుతూండగా అనుకోని అవాంతరం వచ్చిపడింది జానకి చదువుకి.

జానకి నెల తప్పి వేవిళ్ళతో చిక్కి సగమయింది. చదువు మాట దేముడెరుగు. ఇంట్లో పనీపాటలు చేసుకునేందుకు కూడా బొత్తిగా ఓపికలేని పరిస్థితి కావడంతో తప్పనిసరై చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టవలసి వచ్చింది.

ఆదిశేషు, పంకజం వచ్చి జానకిని తమతో తీసుకుని వెళ్ళిపోయారు. అదే సమయంలో రామచంద్రకి చిట్టివలస నుండి నక్కవానిపాలెంలో ఉన్న ఎలిమెంటరీ స్కూల్‌కి ట్రాన్స్‌ఫర్ కావడంతో కొంతలో కొంత ఊరటగా అనిపించింది అందరికీ.

చిట్టవలస వెళ్ళి వచ్చే ట్రావెలింగ్ టైమ్ కలిసిరావడం వలన జానకి పుట్టింటికి వెళ్ళినా ఏ ఇబ్బందీ లేకుండా ఇంటిపనులు భాస్కర్ సాయంతో మేనేజ్ చేసుకోసాగాడు రామచంద్ర.

భాస్కర్ రెండు మూడురోజులకు ఒకసారైనా హరితోపాటు యం.వి.పి వెళ్ళి వదినగారిని చూసి వచ్చేవాడు. అలా వచ్చిననాడు ఇంట్లో ఆ విశేషాలన్నీ ఏకరువు పెట్టేవాడు.

ప్రతీ ఆదివారం తండ్రినీ, తమ్ముడినీ తీసుకుని రామచంద్ర యం.వి.పి వెళ్ళి అక్కడే భోజనం చేసి ఆ రోజంతా గడిపి వచ్చేవాడు.

మొదట్లో అలా అక్కడికి వెళ్ళేందుకు శంకర్రావు మొహమాటపడినా ఆదిశేషు, పంకజం పట్టుబట్టి అలా వచ్చేలా చేయగలిగారు.

రోజులు ఆనందంగా గడిచిపోతున్నాయి అందరికీ.

ఇంటర్ పరీక్షా ఫలితాలు వెలువడ్డాయి. భాస్కర్, హరిప్రసాద్‌లు ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యారు. ఆ రెండు కుటుంబాల్లోనూ ఆనందం వెల్లివిరిసింది.

జానకి నెలలు నిండి పండంటి బాబును ప్రసవించింది. బాబును చూసుకుని పడిన శ్రమంతా మరిచిపోయింది జానకి. రామచంద్ర ఆనందానికి పట్టపగ్గాలు లేవు.

చక్కని రూపు రేఖలతో ముమ్మూర్తులా జానకిలా ఉన్న బాబుని చూసి మురిసిపోయారు ఆదిశేషు, పంకజాలు.

"తల్లి పోలికలు మగపిల్లలకు వస్తే అదృష్టమని నాన్నగారు అన్నారు. మరి వీడెంత గొప్పవాడవుతాడో చూడాలి" అన్నాడు రామచంద్ర పసివాడి బుగ్గలు సున్నితంగా తాకి.

ఆ మాటలు విని జానకి మురిపెంగా నవ్వేసింది.

"వీడు కడుపున పడ్డాక చాలా విసుక్కున్నాను. నా చదువు ఆగిపోయిందని. కానీ వీడిని చూశాక చిత్రంగా ఆ బాధ కొంచెం కూడా లేదు" అంది జానకి పసివాడిని గుండెలకు హత్తుకుంటూ.

"అదేనమ్మా మాతృత్వంలోని కమ్మదనం" అంది పంకజం.

సుఖప్రసవం కావడంతోనే మూడోరోజునే జానకిని హాస్పటల్ నుండి డిశ్చార్జ్ చేశారు.

శెలవలే కావడంతో హరిప్రసాద్, భాస్కర్‌లు జానకి మంచం చుట్టూనే తిరగసాగారు.

పసివాడు ఏ కొంచెం ఏడ్చినా ఇద్దరూ కలిసి జానకిని కంగారు పెట్టసాగారు.

వాళ్ళ కేకలు విని చేస్తున్న పని పక్కన పెట్టి ఏం జరిగిందోనని కంగారుగా జానకి దగ్గరకు వచ్చేది పంకజం. తీరా వచ్చాక "ఈ కాస్తదానికే ఇంత హంగామా చేస్తున్నారా?" అంటూ ఇద్దర్నీ తరుముకుంటూ బయటకు తీసుకువచ్చేది పంకజం.

ఆమె అటు వెళ్ళగానే వాళ్ళిద్దరూ తిరిగి బాబు దగ్గరకు చేరేవాళ్ళు.

చాలా సంవత్సరాల తర్వాత రెండు కుటుంబాల మధ్యన వెలసిన ఆ పసివాడు అందరి మనసులనూ కొల్లగొట్టేశాడు.

ఎప్పుడూ రాననే శంకర్రావు కూడా వీలైనప్పుడల్లా కొడుకుతో కలిసి వచ్చి కోడలినీ, మనవడినీ చూసి వెళ్తున్నాడు. వెళ్ళేటప్పుడు బాబుని జాగ్రత్తగా చూచుకొమ్మని అందరికీ జాగ్రత్తలు చెపుతూ ఉంటాడు.

"అసలు కంటే వడ్డీ ముద్దని అంటారు బావా. చూడు నీ మనవడు నిన్నెలా లాక్కొస్తున్నాడో ఇక్కడికి" అంటూ హాస్యం ఆడేవాడు ఆదిశేషు, శంకర్రావుని.

పదకొండో రోజున బాలసారె జరిపి బాబుకి "రవికిరణ్" అని పేరు పెట్టారు.

మూడో నెల రాగానే జానకిని తీసుకెళ్ళిపోయాడు రామచంద్రం.

ఓ పదిరోజులపాటు పంకజం, జానకి దగ్గర ఉండి, తీసుకోవలసిన జాగ్రత్తలన్నీ చెప్పి ఇంటికి వెళ్ళిపోయింది.

బాబు ఆలనాపాలనతోనూ, ఇంటిపనులతోనూ పూర్తిగా బిజీ అయిపోయిన జానకి ఎం.ఏ పూర్తిచేసే పనిని పూర్తిగా పక్కన పెట్టేసింది.

రవికిరణ్‌తో ఇంట్లో అందరికీ కాలక్షేపం అయిపోతోంది. ఆదిశేషూ, పంకజాలు మనవడికోసం జానకి ఇంటికి వస్తూనే ఉన్నారు. హరిప్రసాద్ మకాం ఇంచుమించు అక్కగారి ఇంట్లోనే అయిపోయింది.

రామచంద్ర ఇంట్లో ఉన్నంతసేపూ ఎంతో బుద్ధిమంతుడిలా మసలే హరిప్రసాద్ అతడు గుమ్మం దాటగానే భాస్కర్‌ని కలుపుకుని ఇల్లు పీకి పందిరేసేవాడు. పసివాడ్ని భుజాల మీదకు ఎత్తుకుని పోటీలు పడి మోస్తూ ఇల్లంతా తిప్పేవారు ఇద్దరూ కలిసి.

శంకర్రావు ముచ్చటగా ఇదంతా చూసి మురిసేవాడేకానీ, ఎందుకలా అల్లరి చేస్తారని వాళ్ళని మందలించేవాడు కాదు. పని తెమలక జానకే ఎప్పుడైనా వాళ్ళని విసుక్కునేది.

"అమ్మ తిట్లు కూడా దీవెనలతో సమానమట. కనుక నీ తిట్లు కూడా మాకు పొగడ్తల్లాగే ఉన్నాయి" అని అంటున్న వాళ్ళ మాటలు విని అంత చిరాకునీ మర్చిపోయి నవ్వేసేది జానకి.

అలా ఆడుతూ, పాడుతూ భాస్కర్, హరిప్రసాద్‌లు బి.కాం డిగ్రీ పూర్తిచేశారు.

స్టేట్ బ్యాంక్‌లో ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ పడడంతో హరిప్రసాద్ అప్లయ్ చేశాడు.

"అన్నయ్యా, నేను కూడా హరితోపాటు బాంక్ టెస్టులు రాస్తాను" అన్నాడు భాస్కర్.

"ఏరా, డిగ్రీతోనే చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టేస్తావా? నాన్నా, నేనూ నిన్ను మెడిసిన్‌గానీ, ఇంజనీరింగ్ కానీ చదివించాలనుకున్నాము. అవేవీ వద్దని ఆ హరిగాడితో ముడిపెట్టుకుని బి.కాం చేశావు. పోనీ పి.జి అయినా చేసి మంచి పొజిషన్‌కి వెళ్తావనుకుంటే చదువుంతటితో సరిపెట్టేస్తానంటున్నావు. ఏరా నువ్విప్పుడు ఉద్యోగం చేసి గడిస్తేగానీ ఇల్లు గడవని పరిస్థితి ఏమైనా వచ్చిందా మనకు?" అన్నాడు రామచంద్ర మందలిస్తున్నట్లుగా.

"అదేంటన్నయ్యా అలా అంటున్నావు. ఉద్యోగాలు దొరకడం కష్టంగా ఉన్న ఈ రోజుల్లో వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలి కదన్నయ్యా. ఏం? బ్యాంకులో జాబ్ రావడం అనేది ఏమైనా చిన్న విషయం అనుకుంటున్నావా నువ్వు? ఏమో, అదృష్టం బాగుండి మాకు జాబ్ గానీ వస్తే ఇందులో మాత్రం పైకి ఎదిగే ఛాన్సులు లేవంటావా? అదీగాక హరికీ, నాకూ కంపేటబులిటీ బాగా కుదిరింది. ఇద్దరం కలిసి కంబైండ్ స్టడీ చేస్తే ఖచ్చితంగా ఏదైనా సాధించి తీరతాం" అన్నాడు భాస్కర్ ధీమా వ్యక్తం చేస్తూ.

"చిన్నాడంత కాన్ఫిడెంటుగా చెప్తూ ఉంటే ఎందుకురా వాడినలా డిస్కరైజ్ చేస్తావు? వాడి ప్రయత్నమేదో వాడిని చేయనీయరాదా?" అన్నాడు శంకర్రావు.

"అదికాదు నాన్నా, ఇప్పటినుండే వాడు సంపాదించాలంటారా? నిండా ఇరవై ఏళ్ళయినా లేవు వాడికి" అన్నాడు రామచంద్ర.

"అయితే ఏమైందిరా, టెస్టులు రాసినంత మాత్రాన వెంటనే ఉద్యోగం వస్తుందా, ఏమిటి? లేనిపోని ఆలోచనలతో ఊరికే వర్రీకాకు. ఏదో సరదా పడుతున్నాడుగా వెళ్ళనీ" అన్నాడు శంకర్రావు.

తండ్రి అలా అనేసరికి ఇంకేం మాట్లాడలేకపోయాడు రామచంద్ర.

భాస్కర్, హరిప్రసాద్ కలిసి చాలా సీరియస్‌గా ప్రిపేర్ అవ్వడమే కాక ఇద్దరూ టెస్ట్ రాసి పాసయ్యారు. ఏడాది తిరగకుండానే ఇద్దరికీ ఉద్యోగాలు వచ్చేశాయి. హరిప్రసాద్‌కి యం.వి.పిలో ఉన్న స్టేట్ బ్యాంక్ బ్రాంచిలో వస్తే, భాస్కర్‌కి విజయనగరంలో వచ్చింది.

ఇద్దరికీ ఉద్యోగాలు వచ్చినందుకు సంబరపడినా చెరోచోటా తమకు ఉద్యోగాలు వచ్చినందుకు ఇద్దరూ బాధపడ్డారు.

ఇరవై ఏళ్ళకే ఇద్దరూ ఉద్యోగస్తులయినందుకు రెండు కుటుంబాల్లోనూ పండగ వాతావరణం నెలకొంది.

రామచంద్రకి మాత్రం తమ్ముడు ఇంకా చదువుకుంటే బాగుండేది అనే చిన్న వెలితి అలాగే మిగిలిపోయింది.

అది గమనించిన భాస్కర్ "నేను డిగ్రీతోనే చదువు సరిపెట్టేశానని బాధపడకన్నయ్యా. ప్రైవేటుగా నైనా యంకాం చేస్తాను. ఆ పైన డిపార్టుమెంటు టెస్టులు రాసి నువ్వు కోరుకున్నట్లే మంచి పొజిషన్‌లోకి చేరుకుంటాను" అన్నాడు హామీ ఇస్తున్నట్లుగా.

"ఇంకేం బాచీ హామీ ఇచ్చాడుగా. మీరు నిశ్చింతగా ఉండండి. తను అనుకున్నది సాధించి తీరతాడు" అంది జానకి నవ్వేస్తూ.

రామచంద్ర కూడా తేలికపడిన మనసుతో నవ్వుతూ భుజం తట్టాడు.

భాస్కర్ మొదటి నెల జీతం అందుకుని అందరికీ బట్టలు కొన్నాడు. జానకికి కొన్న పట్టుచీర చేతిలో పెట్టి కాళ్ళకు నమస్కారం చేశాడు.

"ఇదేమిటి బాచీ లే...లే" అంది జానకి కంగారుగా వెనక్కి నడుస్తూ.

"నా దృష్టిలో అమ్మవూ, అక్కవూ, వదినవూ అన్నీ నీవే, అంతేకాదు నా జీవితానికో మంచి గైడ్‌వి కూడా నువ్వే" అన్నాడు ఆరాధనగా చూస్తూ.

"మాటలు బాగా నేర్చావు. నువ్విలా మాట్లాడుతూ ఉంటే హఠాత్తుగా పెద్దవాడివి అయిపోయావా అనిపిస్తోంది నాకు" అంది జానకి నవ్వుతూ.

"ఎంత పెద్దవాడినయినా సరే, నీ చేతి ముద్ద తినే పసివాడినే వదినా నేను" అన్నాడు భాస్కర్ హాయిగా నవ్వేస్తూ.

శంకర్రావు, రామచంద్ర వాళ్ళిద్దరి వైపూ వాత్సల్యంగా చూశారు.

అదే సమయంలో హరిప్రసాద్ కూడా అక్కా బావలకు, మేనమామకు బట్టలు తీసుకుని వచ్చాడు.

"అరే ఏంటోయ్ ఇదంతా మీరిద్దరూ కూడబలుక్కుని చేశారా ఏమిటి?" అన్నాడు రామచంద్ర హరిప్రసాద్ భుజం తడుతూ.

"అదేంలేదు బావగారూ అమ్మానాన్నల తర్వాత నా దృష్టిలో మీరే పూజ్యులు" అంటూ వంగి నమస్కారం చేశాడు ముగ్గురికీ.

"బావుంది. ఇద్దరూ ఇద్దరే" అంటూ శంకర్రావు హరిప్రసాద్‌ను దగ్గరకు తీసుకున్నాడు.

హరిప్రసాద్, భాస్కర్‌లు ఇద్దరూ ఒకచోట ఉద్యోగాలు చేయకపోయినా వాళ్ళ స్నేహానికి ఎలాంటి అంతరాయం కలగలేదు. శెలవు వస్తే చాలు, ఇద్దరూ చెట్టపట్టాలు వేసుకుని విశాఖపట్నం మొత్తాన్ని చుట్టి వచ్చేవారు. తిండీ తిప్పలు మరిచి.

చూస్తూండగానే సంవత్సరాలు గడిచిపోయాయి. అనుకున్నట్లుగానే భాస్కర్ ఎం.కాం పాసయి రామచంద్రకి ఆనందాన్ని కలిగించాడు. అతడితోపాటే హరిప్రసాద్ కూడా ఎం.కాం పరీక్ష రాశాడు. ఏ పని చేసినా కలిసి చేయడం వాళ్ళిద్దరికీ అలవాటు. ఆ అలవాటునే కొనసాగిస్తున్నారు ఇద్దరూ.

"రామం ఈ ఏడాది తమ్ముడి పెళ్ళి చేసేద్దాం రా ఏమంటావు?" అన్నాడు శంకర్రావు.

"అప్పుడే వాడికి పెళ్ళేమిటి నాన్నా. కనీసం పాతికేళ్ళయినా రానీయండి. ఈ రోజుల్లో ఆడపిల్లలు కూడా ఈ వయసులో పెళ్ళిళ్ళు చేసుకోవడంలేదు" అన్నాడు రామచంద్ర.

"అవుననుకో. వాడికి ఉద్యోగం వచ్చి మూడేళ్ళు కావస్తోంది. రోజూ విజయనగరానికీ ఇక్కడికీ అప్ అండ్ డౌన్ చేసి చాలా స్ట్రెయిన్ అవుతున్నాడు. పెళ్ళి చేసేస్తే వాడికా బాధ తప్పడమే కాదు మన బాధ్యత కూడా తీరిపోతుంది" అన్నాడు శంకర్రావు.

"సరే చూద్దాం లెండి నాన్నా" అన్నాడు రామచంద్ర.

కొడుకు పచ్చజెండా ఊపడంతో తెలిసినవాళ్ళందరికీ చెప్పాడు శంకర్రావు, భాస్కర్‌కి తగిన సంబంధాలు ఉంటే చెప్పమని.

తండ్రి ఆలోచనను తెలుసుకున్న భాస్కర్ ఒక చల్లని సాయం సంధ్యవేళ జానకి మేడమీద సన్నజాజులు కోసుకుంటుండగా సాయానికన్నట్లుగా వెళ్ళాడక్కడికి.

ఓ రెండు సన్నజాజి మొగ్గలు కోసి జానకి పట్టుకున్న గిన్నెలో వేశాడు.

అలా భాస్కర్ తన వెనక తచ్చాడుతుంటే, ఏదో టెండర్ పెట్టడానికే వచ్చాడని గ్రహించేసింది జానకి.

"ఏమిటి బాచీ, ఏమిటి సంగతి? తమరిలా దయచేశారు?" అంది నవ్వుతూ.

"సంగతేముంటుంది? అసలే ఇంటిపనులతో అలసిపోతున్నావు కదా. ఏదో కొంచెం సాయం చేద్దామని వస్తే" అంటూ మరో నాలుగు మొగ్గలు తుంచి జానకి చేతిలో ఉన్న గిన్నెలో వేశాడు.

మొగ్గలు కోయడం ఆపి డాబా పిట్టగోడను ఆనుకుని కూర్చుంటూ "నాన్చకుండా పాయింటుకురా. ఏమిటి సంగతి?" అంది జానకి సీరియస్‌గా అతడివంక చూస్తూ.

"ఏంలేదంటే వినవేం. అవునూ రవిగాడు కనబడడంలేదు. ఎక్కడికి వెళ్ళాడు?" అన్నాడు భాస్కర్ .

"రవి ఆడుకునేందుకు వెళ్ళాడని నీకు కూడా తెలుసుగానీ విషయానికి రా" అంది జానకి లేని విసుగు నటిస్తూ.

"అబ్బా, ఎందుకమ్మా అంత విసుగు? ఏదో ఇన్నాళ్ళూ ఇంట్లో పనులు చేసుకుంటూ అలిసిపోయావుకదా. నీకు తోడుగా ఎవరైనా వస్తే బాగుంటుందని నా ఆలోచన. అంత విసుగ్గా చూడకు తల్లీ చెప్పేస్తాను నాన్నగారు అందరితోనూ నాకు సంబంధాలు చూడమని చెప్తున్నారు కదా. నాకవేవీ వద్దు. నా దృష్టిలో ఒక అమ్మాయి ఉంది. మీ అందరికీ ఇష్టమయితే" అంటూ సగంలో ఆపేశాడు భాస్కర్ సిగ్గుపడుతున్నట్లుగా. అప్పటికే అతని ముఖం ఎర్రగా కందిపోయింది.

అలాంటిదేదో ఉంటుందని ముందే ఊహించిన జానకి, అదేం వ్యక్తం చేయకుండా, "ఏమిటేమిటీ, మా పాలబుగ్గల పసివాడు. అప్పుడే ప్రేమలో పడిపోయాడా?" అంటూ భాస్కర్ బుగ్గల రెండూ పట్టుకుని ఊపేసింది.

"అంత సీనేం లేదులేమ్మా. మొన్న అనుకోకుండా మా కొలీగ్ మాధవరావు వాళ్ళింటికి వెళ్ళాను. అక్కడ అతడి చెల్లెల్ని చూశాను. పేరు కమలట. చూడ్డానికి చాలా బాగుంది" అంటూ మాటలాపేసి సిగ్గుగా నవ్వాడు.

"అయితే లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అన్నమాట" అంది జానకి ఆటపట్టిస్తున్నట్లుగా.

"పోన్లే అలాగే అనుకో. ఏదో వదినవు కదా, సాయం చేస్తావని నీకు చెపితే ఇలా ఎగతాళి చేస్తున్నావు కదూ" అన్నాడు భాస్కర్ నిష్ఠూరంగా.

"ఏయ్ పిచ్చీ, ఊరికే ఉడుక్కుంటున్నావే. ఏదో సరదాగా అంటేను. సరేలే మీ అన్నయ్యతో చెప్తాలే, టెన్షన్ పడకు. ఇంతకీ అమ్మాయి వాళ్ళ వివరాలు ఏమిటి? ఎంతవరకూ చదువుకుంది?" అనడిగింది జానకి ఆసక్తిగా.

"నేను అవేవీ తెలుసుకోలేదు వదినా. చూడగానే తను చాలా నచ్చింది నాకు అయితే ఈ సంగతి నా ఫ్రెండ్ మాధవరావుకి కూడా చెప్పలేదు నేను ముందు మీ అందరి అంగీకారం తీసుకోవాలనేది నా ఉద్దేశ్యం" అన్నాడు భాస్కర్.

అతడి ఆలోచనా విధానం చూసి ఎంతో ముచ్చటపడింది జానకి. "సరేణ ఇంటి అడ్రసు చెప్పు మిగతావి నేను చూస్తాను" అంది.

"అలా అన్నావు బావుంది" అంటూ హుషారుగా ఈలవేసుకుంటూ డాబామెట్లు దిగి కిందికి మిగతావి నేను చూస్తాను" అంది.

"అలా అన్నావు బావుంది" అంటూ హుషారుగా ఈలవేసుకుంటూ డాబామెట్లు దిగి కిందకి వెళ్ళిపోయాడు భాస్కర్.

అతడు వెళ్ళినవైపే మురిపెంగా చూస్తూండిపోయింది జానకి కొన్ని క్షణాలు.

ఆ రాత్రి తాను విన్న సమాచారం భర్తకీ, మామగారికీ తెలియజేసింది జానకి.

"అయితే మన బాచీ పెద్దవాడయిపోయినట్లే జానకీ. తనంత తాను పిల్లని వెతుక్కుని మనకు సంబంధాలు చూసే శ్రమ తగ్గించాడు" అన్నాడు రామచంద్ర.

"గట్టిగా అనకు. వింటే చాలా ఫీలయిపోతాడు. మెల్లగా మాట్లాడి ఆ మాధవరావు వివరాలు కనుక్కోముందు" అంది జానకి.

"అవును రామం, వివరాలు కనుక్కుని ఒకసారి మావయ్యను తీసుకుని అక్కడికి వెళ్ళిరా! అన్నాడు శంకర్రావు.

అనుకున్నట్లే ఆదిశేషు, రామచంద్ర వివరాలు తెలుసుకుని విజయనగరం వెళ్ళొచ్చారు.

"**అమ్మాయి కుందనపు** బొమ్మలా ఉంది బావా. ఇంతకీ వాళ్ళెవరో తెలుసా? మా పెదతాతగారి మనవడు కాంతారావు లేడూ వాళ్ళమ్మాయి. ఏదో పెళ్ళిళ్ళలో పేరంటాల్లో కలవడం తప్ప పెద్దగా రాకపోకలు లేవు కదా మనకు అందుకే వాళ్ళింట్లో పెళ్ళీడు అమ్మాయి ఉందని మనకి తెలిసింది కాదు. దూరం నుండి ఇల్లు చూడగానే అనుకున్నాను, ఇది మనవాళ్ళ ఇల్లులా ఉంది అని" అన్నాడు ఆదిశేషు.

"బాచీ చెప్పిన కమల మన కమలేనా నాన్నా? తనయితే నాకు బాగా పరిచయమే. మొన్న విశాల పిన్నిగారింట్లో జరిగిన ఫంక్షన్‌కి తను కూడా వచ్చింది. అమ్మాయి చక్కగా పొందిగ్గా ఉంటుంది నాన్నా" అంది జానకి ఉత్సాహంగా.

"మన జానక్కి నచ్చిందంటే ఇంక తిరుగేమి ఉంటుంది బావా. మంచిరోజు చూసుకుని మాట్లాడివద్దాం" అన్నాడు శంకర్రావు ఉత్సాహంగా.

"కానీ నాన్నా వాళ్ళ తీరంతా చాలా హైఫైగా ఉంది నాన్నా. ఆ కాంతారావుగారిని అందరూ జమిందారు కాంతారావుగారని అంటున్నారు. ఇల్లు కూడా చాలా దర్జాగా ఉంది. అలాంటి చోట పెరిగిన అమ్మాయి మన సామాన్యమైన ఇంటికి వచ్చి ఇమడగలదా? అసలా అమ్మాయిని మనకిస్తారా?" అన్నాడు రామచంద్ర సందేహంగా చూస్తూ.

"మీరన్నట్లే మా పెదనాన్నగారి హయాంలో చాలా దర్జాగానే ఉండేది పరిస్థితి. అయితే అన్నయ్య హయాముకి వచ్చేసరికి ఆస్తిలో చాలా భాగం హరించిపోయింది. పెదనాన్నగారిది చాలా పెద్ద చెయ్యి. అడిగినవారికి కాదనకుండా చేతికెంత వస్తే అంతా ఇచ్చేసేవారు. ఫలితంగా ఆ భవంతి, ఏవో కొద్దిగా భూములు తప్ప ఏమీ లేవిప్పుడు అందుకే వాళ్ళబ్బాయి బేంకులో ఉద్యోగం చేస్తున్నాడు.

అయితే ఒకటి చెప్పుకోవాలి. ఉన్ననాడు, లేనినాడు కూడా ఏ భేషజాలు లేకుండా అందరితో చాలా ఆత్మీయంగా ఉంటారు వాళ్ళు" అన్నాడు ఆదిశేషు.

"అయితే ఇంకేం. మన బాచీకి ఆ అమ్మాయి బాగా నచ్చింది కనుక ప్రొసీడయిపోదాం" అన్నాడు రామచంద్ర.

ఇరుపక్షాల పెద్దలూ మాట్లాడుకుని లాంఛనంగా పెళ్ళిచూపులు ఏర్పాటు చేశారు. అన్నయ్య స్నేహితుడే తనకి కాబోయే వరుడని తెలిసి ఆశ్చర్యపోయింది కమల. జానకి అక్కే తన తోటికోడలు అని తెలియడంతోనే మరింత పొంగిపోయి వెంటనే తన అంగీకారం తెలిపింది. ఒక మంచిరోజు చూసుకుని నిశ్చితార్థానికి ముహూర్తాలు పెట్టుకున్నారు.

కళ్యాణమొచ్చినా, కక్కొచ్చినా ఆగదంటారు అలా నెల తిరగకుండానే కమల ఆ ఇంటికోడలు అయిపోయింది.

పెళ్ళయ్యాక భాస్కర్‌ను విజయనగరంలో కాపురం పెట్టించాలనుకున్నారు అంతా. అలా విజయనగరంలో కాపురం పెట్టడం భాస్కర్‌కే కాదు, కమలకీ ఇష్టంలేకపోయింది.

చిన్నకోడలి అభిప్రాయం తెలుసుకుని మరింత ఆశ్చర్యపోయాడు శంకర్రావు. భాస్కర్ ఇష్టంకూడా అదే అని తెలుసుకుని వాళ్ళని విజయనగరం పంపించాలనే ఆలోచనను విరమించుకున్నాడు ఆయన.

సాధారణంగా ఏ ఆడపిల్లయినా పెళ్ళయ్యాక నా భర్త నేను విడిగా స్వేచ్ఛగా ఉండాలని కోరుకుంటుంది. ఇదేమిటి ఈ అమ్మాయి ఉమ్మడి కుటుంబంలో ఉంటానంటోంది అనుకుని ఆశ్చర్యపోయారంతా.

భాస్కర్ సరేసరి. ఆ ఇంటిని, ఇంట్లోని సభ్యులను వదిలి ఉండడానికి ఎంతమాత్రం ఇష్టపడలేదు.

జానకి, కమల ఒక తల్లి కడుపున పుట్టిన బిడ్డల్లా ఎంతో అన్యోన్యంగా మసలుకోవడం చూసి అందరికంటే శంకర్రావే ఎక్కువ సంతోషించాడు. నా పిల్లలిద్దరికీ రత్నాల్లాంటి భార్యలు దొరికారు. ఎప్పటికీ వాళ్ళిద్దరూ ఇలాగే కలిసికట్టుగా ఉంటే చాలు, ఇంకేం వద్దు నాకు అనుకున్నాడు తృప్తిగా. ఇంత ఆనందాన్ని కళ్ళారా చూసుకునే అదృష్టం తన భార్యకు లేకపోయిందే అని బాధపడ్డాడు కూడా.

ఆ కుటుంబ సభ్యుల అన్యోన్యతను చూసి "కొడుకులూ, కోడళ్ళూ అంటే అలా ఉండాలి. నిజంగా ఆ శంకర్రావు ఎంత అదృష్టవంతుడు? మా పిల్లలు కూడా అలా ఉంటే ఎంత బాగుండును" అనుకోసాగారు అంతా.

హరిప్రసాద్‌కి కూడా ఆ సంవత్సరం పెళ్ళిచేసేశాడు ఆదిశేషు మంచి సంబంధం కుదరడంతో.

హరిప్రసాద్ భార్య ఇందిర కూడా చాలా నెమ్మదయిన అమ్మాయి కావడంతో అచిరకాలంలోనే అంతా ఒక కుటుంబంలా కలిసిపోయారు.

వీకెండ్స్‌లో ఏదో ఒక చోటికి మూడు జంటలూ కలిసి వెళ్ళి సరదాగా గడిపి రాసాగారు. ఒకోసారి పెద్దవాళ్ళు వాళ్ళతో చేరినా ఎక్కువగా ఆ మూడు జంటలే వెళ్ళసాగారు.

చూస్తూండగానే భాస్కర్ పెళ్ళి జరిగి సంవత్సరం గడిచిపోయింది. కమల నెల తప్పిందనే వార్త ఆ ఇంటి సభ్యుల సంబరాలను అంబరాన్ని తాకేలా చేసింది.

అయిదవ నెలలో కమలకి ఘనంగా సూడిదలిచ్చి శ్రీమంతం చేసింది సావిత్రమ్మ.

"అన్నయ్యగారూ కమలని లాంఛనంగా మా ఇంటికి తీసుకువెళ్ళి మూడు నిద్రలయ్యాక తిరిగి పంపించేస్తాము. ఆనక ఏడో నెలలో పురిటికి తీసుకువెళ్తాము" అనడిగింది శంకర్రావుని సావిత్రమ్మ.

"దానికేం భాగ్యమమ్మా, అలాగే తీసుకువెళ్ళండి" అన్నాడు శంకర్రావు.

మరునాడు కమలని విజయనగరం తీసుకు వెళ్ళిపోయింది సావిత్రమ్మ.

వాళ్ళు వెళ్ళాక అన్నాడు భాస్కర్ "వదినా ఈ మూడు రోజులూ నేను కూడా అక్కడే ఉంటాను. ఏకంగా మండే ఈవెనింగ్ బేంకయ్యాక ఇద్దరం కలిసి వచ్చేస్తాం."

"అంత పొద్దుపోయాక అమ్మాయిని తీసుకురావడం మంచిదికాదు బాచీ. ఆ రోజు కాస్త పర్మిషన్ తీసుకుని పెందలాడే బయలుదేరి వచ్చేయండి లేదా ఆ రోజు ఆఫ్‌డే లీవు పెట్టు" అంది జానకి.

"విజయనగరానికీ ఇక్కడికీ పట్టుమని గంట ప్రయాణం ఉండదు బండిమీద. ఆ మాత్రం దానికి లీవు పెట్టాలా?" అంటూ నవ్వేశాడు భాస్కర్ వెళ్ళడానికి ఉద్యుక్తుడవుతూ.

"నువ్వు చెప్పింది కరెక్టే, కాదనను. ఇన్నాళ్ళూ మీరెలా తిరిగినా ఏ ఇబ్బందీ లేదు. కమల ఇప్పుడు వట్టిమనిషి కాదు. జాగ్రత్తగా ఉంటే మంచిది కదా" అంది జానకి మందలింపుగా.

"సరే.. సరే, ఆవేశపడకు. నువ్వు చెప్పినట్లే చేస్తాలే" అంటూ వెళ్ళిపోయాడు భాస్కర్.

విజయనగరం వెళ్ళాక తన వదిన అన్నమాటలు భార్యతో చెప్పి నవ్వాడు భాస్కర్ "ఇంకా నేనేదో చిన్నపిల్లాడిని అన్నట్లు మా వదిన సవాలక్ష జాగ్రత్తలు చెప్తుంది చూడు. చెప్పిన టైముకి నేనుగాని, అన్నయ్యగానీ ఇంటికి రాకపోతే కాలుగాలిన పిల్లిలా తిరుగుతుంది కంగారుగా"

"అక్క అన్నదానిలో తప్పేముందండీ? మన జాగ్రత్తకోసమే కదా చెప్పింది. తనన్నట్లే మండే మధ్యాహ్నం సి.ఎల్ పెట్టండి. పెదలాడే ఇంటికి వెళ్ళిపోదాం" అంది కమల.

"నువ్వు కూడా అలాగే అంటావా. హోం మినిస్టర్ ఆర్డరయ్యాక తప్పుతుందా, ఇక అలాగే చేస్తాలే" అన్నాడు భాస్కర్.

మూడురోజులూ మూడు నిమిషాల్లా పుట్టింట్లో గడిపేసింది కమల.

సావిత్రమ్మ కూతురికి ఇష్టమని కజ్జికాయలూ, జంతికలూ చేసింది.

అన్నీ సర్దుకుని భర్త రాకకోసం ఎదురు చూస్తూ కూర్చుంది కమల.

బేంక్‌లో పని తెమలకపోవడంతో ఆ రోజు అనుకున్న దానికంటే ఆలస్యంగా వచ్చాడు భాస్కర్. రావడంతోనే "సారీ కమలా, అనుకోకుండా లేటయింది. బయలుదేరదామా ఇక" అన్నాడు భాస్కర్ హడావుడిగా.

"ఇంత పొద్దుపోయి ఇప్పుడెందుకులెండి. రేపు వెళదాం" అంది కమల.

"రేపు మంగళవారం కదుటే. వెళితే ఇవ్వాళ వెళ్ళండి లేదా ఎల్లుండి బుధవారం వెళ్ళండి" అంది సావిత్రమ్మ.

"అమ్మో, ఎల్లుండి దాకానా. అదేం కుదరదుగానీ, ఇప్పుడే వెళ్ళిపోదాం" అన్నాడు భాస్కర్.

"ఇంత పొద్దుపోయాక బయలుదేరితే అక్క ఏమంటుందోనండీ. అయినా ఈ టైములో ట్రాఫిక్ కూడా ఎక్కువగా ఉంటుంది" అంది కమల.

"ఏం ఫర్లేదులే కమలా అలవాటైన రోడ్డేగా. నేను జాగ్రత్తగా తీసుకువెళ్తాలే" అన్నాడు భాస్కర్.

"పోనీ ఈరోజు నువ్వు వెళ్ళి వచ్చెయ్యి బాబూ. బుధవారం కమలని నేను తీసుకువెళ్ళి దిగబెడతాను" అంది సావిత్రమ్మ.

"మా వదినలాగే మీకూ కంగారు ఎక్కువండి. ఏం ఫర్వాలేదుగానీ బయలుదేరు కమలా, వెళదాం" అన్నాడు భాస్కర్.

అతడంత గట్టిగా చెప్పడంతో కాదనలేక బయలుదేరింది కమల.

"వెళ్ళిన వెంటనే ఫోన్ చెయ్యమ్మా" అంది సావిత్రమ్మ కూతురు వంక చూస్తూ.

"అలాగేనమ్మా వెళ్ళొస్తాను" అంది కమల చెయ్యి ఊపుతూ

అన్నట్లుగానే భాస్కర్ స్లోగా బండి డ్రైవ్ చేయసాగాడు. సరదాగా కబుర్లు చెప్పుకుంటూ వెళ్ళసాగారు.

భాస్కర్ తీసుకోవలసిన జాగ్రత్తలన్నీ తీసుకుని మెల్లగా భార్యకి ఏ ఇబ్బందీ కలగకుండానే డ్రైవ్ చేశాడు. కానీ దురదృష్టవశాత్తూ వెనకనుండి స్పీడుగా వస్తున్న లారీ భాస్కర్ బండిని ఢీ కొట్టింది.

ఆ అదురుకు బండిమీద నుండి ఎగిరి దూరంగా పడిపోయింది కమల.

పక్కకి ఒరిగిపోయిన భాస్కర్ మీద బండి పడడంతో అతడు వెంటనే లేవలేకపోయాడు.

చుట్టుపక్కలవారు హాహాకారాలతో వాళ్ళని చుట్టుముట్టారు.

ఏక్సిడెంట్ చేసిన లారీ డ్రైవర్ పత్తా లేకుండా పారిపోయాడు.

రక్తపు మడుగులో మునిగిపోయిన కమలను చూసి అందరి కళ్ళూ చెమరించాయి. బండి కింద నుండి భాస్కర్‌ని లేవనెత్తారు. కదలిక లేకుండా పడివున్న భార్యను రక్తపు మడుగులో చూడడంతోనే అతడి కళ్ళు చీకట్లు కమ్మాయి.

సిటీకి దగ్గరగానే ప్రమాదం జరగడంతో వెంటనే అంబులెన్స్‌లో ఇద్దర్నీ హాస్పటల్‌కి తరలించారు.

కమలను ఆపరేషన్ థియేటర్‌కి తరలించాక రామచంద్రకి ఫోన్ చేశాడు భాస్కర్.

తమ్ముడు చెప్పింది వింటూనే "ఎక్కడున్నారు మీరు? కమల ఎలా ఉంది?" అనడిగాడు ఆదుర్దాగా.

"ఇప్పుడు అవేమీ చెప్పలేనన్నయ్యా, వదిన్ని తీసుకుని వెంటనే గీతా నర్సింగ్ హోమ్‌కి రా. వచ్చేటప్పుడు డబ్బులు కూడా తీసుకురా" అంటూ ఫోన్ పెట్టేశాడు భాస్కర్.

అన్నగారితో మాట్లాడాక నిస్త్రాణంగా అక్కడున్న కుర్చీలో వాలిపోయాడు. అక్కడక్కడ గాయాలయ్యాయిగానీ అదృష్టవశాత్తూ అతడికి ఫ్రాక్చర్ ఏమీ కాలేదు.

అరగంటలో జానకి, రామచంద్రలు నర్సింగ్‌హోంకి వచ్చేశారు.

విజిటర్స్ హాల్లో ఉన్న భాస్కర్‌ని చూడడంతోనే "ఎలా ఉందిరా కమల?" అనడిగాడు రామచంద్ర ఆదుర్దాగా.

అన్నగారిని చూడడంతోనే "అన్నయ్యా" అంటూ అతడిని చుట్టేశాడు భాస్కర్. అంతవరకూ ఉగ్గబట్టుకున్న దుఃఖం వరదలై పొంగింది.

"బాచీ ఏమిటి బాబూ, ఏమైంది?" అంటూ జానకి ఆత్రంగా అతడి తలమీద చెయ్యి వేసింది.

"వదినా నువ్వు చెప్తూనే ఉన్నావు, పొద్దుపోయి బయలుదేరవద్దని. నేనే దౌర్భాగ్యుడ్ని. మొండిగా బయలుదేరాను. నా కమల నాకు దక్కుతుందంటావా, వదినా?" అంటూ జానకి భుజం మీద తలవాల్చి బావురుమన్నాడు భాస్కర్.

"కమలకేం కాదు బాచీ. మనమెవరికేమీ అన్యాయం చేయలేదు. ఆ దేముడు మనకి అన్యాయం చెయ్యడులే" అంది జానకి ఓదార్పుగా భాస్కర్ భుజం మీద చేయివేసి.

కానీ ఆపరేషన్ థియేటర్ నుండి బయటకు వచ్చిన డాక్టరు చెప్పింది విని ముగ్గురూ నిశ్చేష్టులయ్యారు.

వణుకుతున్న చేతులతో నర్స్ అందించిన కాగితాలపై సంతకాలు చేశాడు భాస్కర్.

రామచంద్ర ఓదార్పుగా తమ్ముడి భుజం చుట్టూ చేయివేసి దగ్గరకు లాక్కున్నాడు.

జానకి నిస్తేజంగా నుంచున్న చోటునే కూర్చుండిపోయింది.

జరిగిన దారుణం గుర్చి రామచంద్ర ఫోన్ చేయగా సావిత్రమ్మ, కాంతారావు, మాధవరావులు ఆఘమేఘాల మీద వచ్చేశారు హాస్పటల్‌కి.

"అక్కడికీ ఈ రోజు వెళ్ళొద్దని నేను చెప్తూనే ఉన్నానమ్మా విన్నారు కాదు. పిల్ల కడుపుతో ఉందని మురిసినంతసేపు పట్టలేదు. జీవితంలో నా చిట్టితల్లి ఇక తల్లే కాలేదన్నమాట విని తట్టుకోగలదా జానకీ?" అంటూ సావిత్రమ్మ జానకిని పట్టుకుని భోరున ఏడ్చింది.

"శని నా నెత్తిన ఎక్కి నాట్యం చేస్తూంటే మీ ఎవరి మాటలైనా ఎలా తలకెక్కుతాయత్తయ్యా నాకు? రేపు కమలకి నా ముఖం ఎలా చూపించను?" అన్నాడు భాస్కర్ తిరిగి ఏడ్చేస్తూ.

"అలా జరగాలని రాసిపెట్టి ఉంటే తప్పించడానికి మనమెవరం బాబూ. పెద్ద ప్రాణం దక్కిందని సంతోషించాలంతే" అన్నాడు కాంతారవు ఓదార్పుగా.

"బాచీ, జరిగింది తక్కువ నష్టం అని నేననను. కానీ నువ్వే ఇలా ఢీలా పడిపోతే కమలని ఊరడించేవాళ్ళెవరు, చెప్పు? మనసు దిటువు చేసుకోవాలి నాయనా తప్పదు" అంది జానకి భాస్కర్ తల నిమురుతూ.

"వదినా దురదృష్టం కాకపోతే నాకే ఎందుకిలా జరగాలి?" అన్నాడు భాస్కర్ బేలగా.

"నీకే కాదు బాబూ పగవారికి కూడా ఇలా జరగకూడదు. సంతోషానికి మారుపేరులా ఉన్న మీ కుటుంబాన్ని చూసి లోకమే కాదు. ఆ దేముడు కూడా ఓర్వలేకపోయాడేమో? అందుకే ఇలా జరిగింది" అంది సావిత్రమ్మ బాధగా.

కాంతారావు కూడా ఓదార్పుగా అల్లుడి భుజం తట్టాడు.

ఆ రాత్రంతా జాగారణ చేస్తూ కమలకు ఎప్పుడు తెలివి వస్తుందా అని ఆతృతగా అక్కడే ఉండిపోయారు అంతా.

మర్నాడు ఉదయం ఏడుగంటలకు కమలకు మెలుకువ వచ్చింది.

తాను హాస్పటల్‌లో ఉన్నానని అర్థం చేసుకున్న కమల చుట్టూ అయోమయంగా చూస్తూ "నాకేమయింది ఆయనేరీ?" అంది కంగారుగా.

"కమలా నేనిక్కడే ఉన్నాను. నాకేం కాలేదు. ఏవో కొంచె దెబ్బలు తగిలాయంతే" అన్నాడూ భాస్కర్ వచ్చే దుఃఖాన్ని బిగబట్టి కమల చేతులు పట్టుకుంటూ.

తల్లిదండ్రులవైపు, తోటికోడలూ బావగారి వైపూ ఆశ్చర్యంగా చూస్తూ "మీరంతా ఎప్పుడొచ్చారు?" అనడిగింది ఆశ్చర్యంగా.

"ఇప్పుడే వచ్చాం కమలా నువ్వు ఎక్కువగా మాట్లాడకుండా విశ్రాంతి తీసుకోమ్మా" అన్నాడు కాంతారావు కూతురి తలమీద చేయివేసి.

జానకి ఓదార్పుగా తోటికోడలు చేతులు పట్టుకుంది.

జరిగిందంతా రాత్రే రామచంద్ర చెప్పడంతో శంకర్రావు ఉదయమే మనవడిని తీసుకుని హాస్పిటల్‌కి వచ్చేశాడు.

భాస్కర్‌ని చూడడంతోనే "ఏమ్మిరా ఇలా జరిగింది?" అంటూ కొడుకుని హృదయానికి హత్తుకున్నాడు.

"అంతా నా దురదృష్టం నాన్నా. నా చేతులారా నేనే" అని ఆ పైన మాటలు పూర్తిచేయలేక తండ్రి భుజం మీద తలవాల్చాడు భాస్కర్.

వారం రోజుల తర్వాత కమలని హాస్పిటల్ నుండి డిశ్చార్జి చేశారు.

కాంతారావు దంపతులు కమలని తమ ఇంటికి తీసుకువెళ్ళి కోలుకున్నాక తిరిగి పంపిస్తామని అన్నారు.

"వద్దు పెద్దమ్మా ఈ పరిస్థితుల్లో కమల అక్కడ ఉంటే తేరుకోవడం కష్టం. మీరే నాలుగురోజులు ఇక్కడ ఉండి మంచీ చెడ్డా చూసి వెళ్ళండి" అంది జానకి.

"అది కాదమ్మా నీకు ఇంట్లో చాలా పని ఉంటుంది. కమలకి కూడా చేయాలంటే కష్టం కదా" అంది సావిత్రమ్మ.

"జరిగిన దారుణం చిన్నది కాదు కదా పెద్దమ్మా. ఎవరో ఒకరు పరామర్శకు వచ్చి సానుభూతి పేరుతో కమలని మరింత బాధకు గురి చేస్తారు. ఆపైన జరిగిన దారుణం కమలకి తెలియచేస్తారు. ఇప్పుడున్న ఆరోగ్య పరిస్థితుల్లో కమల అది విని తట్టుకోగలదా? చెప్పండి. అందుకే మిమ్మల్ని ఇక్కడ ఉండమంటున్నాను" అంది జానకి.

"నువ్వన్నదీ నిజమేనమ్మా. ఊరినిండా మన బంధుబలగమే ఉన్నారక్కడ. మనమీద అభిమానంతోనే వాళ్ళు వస్తారనుకో. కానీ ఆ పరామర్శలు కమలను మరింత బాధకు గురిచేస్తాయి" అంది సావిత్రమ్మ.

పదిరోజులపాటు విశాఖపట్నంలోనే ఉండి కమల మంచి చెడ్డలన్నీ దగ్గరుండి చూసుకుంది సావిత్రమ్మ. కమల కొంచెం లేచి తిరగడం మొదలుపెట్టాక విజయనగరం వెళ్ళిపోయింది.

యాక్సిడెంటయి నెలరోజులు గడిచిపోయాయి. భాస్కర్ తిరిగి విజయనగరం బేంకుకు వెళ్ళి రాసాగాడు.

జరిగిన దుర్ఘటన గురించి నెలరోజులైనా కమల శాశ్వతంగా తల్లి కాలేదనే విషయాన్ని ఆమెకు చెప్పే సాహసం ఎవరూ చేయలేకపోయారు. తెలిస్తే తట్టుకుంటుందో లేదో అనే భయంతో.

అయితే ఏదైతే కమలనుండి దాచాలని అంతా ప్రయత్నించారో అది సావిత్రమం చెల్లెలిద్వారా కమలకి తెలిసిపోయింది.

ఆవిడ వస్తూనే "ఎంత పనైందే తల్లీ ఆ భగవంతుడు నీకు ఇంత అన్యాయం చేస్తాడని కలలో కూడా అనుకోలేదమ్మా. నువ్వు కడుపుతో ఉన్నావని తెలిసి ఎంత సంబరపడ్డామో తెలుసా? చివరికి ఆ దేముడు ఇచ్చినట్లే ఇచ్చి నీ నొసటి నుండి సంతాన గీతను శాశ్వతంగా చెరిపేశాడా తల్లీ" అంటూ బావురుమందావిడ కమలన్ చుట్టేసి.

ఆ మాటలు వింటూనే వెనక్కి విరుచుకుపడిపోయింది కమల.

ఆవిడ మాటలు వింటూనే పరుగున వంటింటిలోనుండి వచ్చిన జానకి నేలకి ఒరిగిపోతున్న కమలను ఒడిసిపట్టుకుని "ఎంత పనిచేశారు పిన్నీ కమల ఇంకా పూర్తిగా కోలుకోలేదని తనకి ఈ విషయం ఇంకా చెప్పలేదు మేము. మీరేమో సడెన్‌గా వచ్చి అంతా చెప్పేశారు. ఇప్పుడేమవుతుందో ఏమో?" అంటూ కమల చెంపలమీద తట్టి "కమలా.. కమలా" అంటూ కంగారుగా పిలిచింది.

కోడలి గొంతులో కంగారు విని "ఏమైందమ్మా, కమలకి ఏమైంది?" అంటూ శంకర్రావు ఆతృతగా వచ్చాడక్కడికి.

గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి కమల ముఖం మీద చిలకరిస్తూ "పిల్లకిలా జరిగిందని విని ఆ బాధ తట్టుకోలేక నేనే మాటల మధ్యలో జరిగింది చెప్పేశానన్నయ్యగారూ. అది వింటూనే కమల ఇదిగో ఇలా పడిపోయింది" అంది ఆవిడ అపరాధిలా తలవంచుకుని.

మెల్లగా కళ్ళు తెరిచిన కమల "నిజమేనా అక్కా ఇది. పిన్ని చెప్పింది నిజమేనా? నాకెందుకు చెప్పలేదు మీరీ సంగతి?" అంటూ జానకిని కుదిపేస్తూ హృదయవిదారకంగా ఏడవసాగింది.

"అమ్మా కమలా ఊరుకోవే నా తల్లీ" అంటూ కమలని రెండు చేతులతో చుట్టేసి తన హృదయానికి హత్తుకుంది ఆవిడ.

"ఊరుకోమ్మా. ఎంతో ఘోరప్రమాదం నుండి బయటపడి నువ్వు మాకు దక్కావు. అంతేచాలు అనుకుంటున్నాము మేమంతా. నువ్వలా అయిపోతే మేమెవరమూ తట్టుకోలేమమ్మా" అన్నాడు శంకర్రావు.

"ఎందుకు మామయ్యా నేను బ్రతకడం? అమ్మా అనిపించుకోలేని బ్రతుకు కూడా ఒక బ్రతుకేనా?" అంది కమల మరింత బిగ్గరగా ఏడుస్తూ.

"తప్పమ్మా అలా అనకు. ఈ మాట బాచీ వింటే తట్టుకోలేడసలు. నీమీదే ప్రాణాలు పెట్టుకుని బతుకుతున్నాడు. జరిగిందానికి నేనే బాధ్యుడను అంటూ కుమిలిపోతున్నాడూ. మీరిద్దరూ ఒకరికోస్మ ఒకరు బ్రతకాలమ్మా" అన్నాడూ శంకర్రావు ఓదార్పుగా.

"అవును కమలా జరిగిన నష్టాన్ని పూడ్చలేకపోయినా నిన్ను తన కంటిపాపలా చూసుకుని ప్రాణాలు ఉగ్గబెట్టుకుని నీకోసమే బ్రతుకుతున్నాడు బాచీ. అతడి కోసమైనా నువ్వు మనసు గట్టిపరచుకోవాలి తప్పదు" అంది జానకి అనునయంగా.

"ఎలా తట్టుకోమంటావు అక్కా? పుట్టబోయే పాపాయి కోసం మేమిద్దరం ఎన్ని కలలు కన్నాము? పాప పుడితే ఏ పేరు పెట్టాళి? బాబు పుడితే ఏ పేరు పెట్టాలి అంటూ ఎంత వాదులాడుకున్నామో ఇద్దరమూ. పోనీ ఇది పోతే పోయింది. మళ్ళీ పుట్టకపోతారా అనుకున్నానే కానీ, ఇంత ఘోరం జరుగుతుందనుకోలేదు నేను" అంది కమల గుండెలు పిండేలా ఏడుస్తూ.

ఎవరు ఎంతగా ఓదార్చినా ఆ రోజంతా అలా ఏడుస్తూనే ఉంది కమల.

బేంకు నుండి వచ్చిన భాస్కర్‌ని చూడడంతోనే "ఏమండీ" అంటూ అతడిని చుట్టేసి బావురుమంది కమల.

భార్యకు విషయం తెలిసిపోయిందని అర్థమైన భాస్కర్ "కమలా, నన్ను క్షమించు ఈ అనర్ధానికంతా కారణం నేనే" అన్నాడు కన్నీరు కారుస్తూ భార్యని మరింత గట్టిగా పట్టుకుని.

"బావుంది బాచీ చెల్లాయిని ఓదార్చాల్సింది పోయి నువ్వుకూడా ఇలా అయిపోతే ఎలా?" అంది జానకి మందలింపుగా.

అలా ఒకరినొకరు ఓదార్చుకుంటూ ధైర్యం చెప్పుకుంటూ ఆ ఇంటి సభ్యులంతా దుఃఖాన్ని దిగమింగే ప్రయత్నం చేయసాగారు. హరిప్రసాద్ స్నేహితుడికి వచ్చిన ఈ కష్టాన్ని చూసి విలవిలలాడిపోయాడు. తరచూ తన భార్య

ఇందిరతోపాటు వచ్చి భాస్కర్‌నీ, కమలనూ ఓదార్చి వెళ్ళసాగాడు. ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా, చైతన్య స్రవంతిలా ఉండే కమల స్తబ్ధుగా మారిపోయింది.

ఆనందాల హరివిల్లులా, సంతోషాలకు సంకేతంలా ఉండే ఆ ఇల్లు విషాదానికి ప్రతిరూపం అన్నట్లుగా మారిపోయింది ఇప్పుడు. సంతోషాలూ, సందడులూ కనుమరుగయిపోయాయి. చిక్కటి చీకటిలా నిశ్శబ్దం రాజ్యమేలుతోంది ఆ ఇంటిలో.

కమల అన్నయ్య మాధవరావుకు కొడుకు పుట్టాడు. బాలసారెకు పిలవడంతో ఇంటి ఆడపడుచు కనుక తప్పనిసరిగా బయలుదేరింది కమల. సావిత్రమ్మ జానకిని కూడా రమ్మని మరీ మరీ చెప్పడంతో జానకి కూడా కమల వెంట బయలుదేరింది. ఉన్న ఊళ్ళోనే మాధవరావు అత్తవారిల్లు కనుక పెద్దగా ఇబ్బందిపడలేదు జానకి అక్కడికి వెళ్ళేందుఉకు.

మేనల్లుడి అందచందాలు చూసి ఎంతో ముచ్చటపడింది కమల. ప్రేమగా వాడిని ఒడిలోకి తీసుకుని తాను తెచ్చిన గొలుసును పసివాడి మెడలో వేసింది.

కూతురికి జరిగిన నష్టాన్ని తలచుకుని కంటనీరు పెడుతూ "అన్నీ సవ్యంగా జరిగి ఉంటే మా కమల కూడా ఈసరికి పండంటి బిడ్డని ఎత్తుకుని తిరిగేది. ఆ దేముడికి దయలేకపోయింది దానిమీద" అంది సావిత్రమ్మ బాధగా.

తల్లి మాటలు వినడంతోనే కమల ముఖం చిన్నబోయింది. ఏదైతే మర్చిపోవాలని కమల ప్రయత్నిస్తున్నదో దాన్ని గుర్తుకి తెచ్చుకునేలా చేసింది.

ఆవిడ ఆ మాటలను కూతురి మీద సానుభూతితోనే అన్నా కమలలోని మానిన గాయాన్ని తిరిగి రేపినట్లయింది. కమల మనసులోని ఆనందం అంతా ఆవిరి కాగా ఉప్పెనలా పొంగివస్తున్న కన్నీటిని బలవంతాన అదుముకుని తోటికోడల్ని తీసుకుని బయటకు వచ్చేసింది అక్కడ ఉండలేక.

కూతురు బాధతో వెళ్ళిపోవడం చూశాక తాను అనవసరంగా ఆ ప్రస్తావన తెచ్చి కూతురిని బాధపెట్టానే అని దిగులుగా చూసింది సావిత్రమ్మ.

ఇంటికి వచ్చాక ఎప్పటిలాగే దిగులుగా కూర్చుండిపోయింది కమల. ఆ రాత్రి ఎవరెంత చెప్పినా కమల భోజనం చేయలేదు.

భార్య ఏదో సందర్భంలో ఇలా అప్ సెట్ అవుతుండడం చూసిన భాస్కర్ చాలా తీవ్రంగా ఆలోచించడం మొదలు పెట్టాడు. ఇలాగే మరికొంత కాలం ఉంటే కమల ఏమయిపోతుందోనని భయపడ్డాడు. అసలు ఈ మనుష్యులకు, ఈ పరిసరాలకు దూరంగా వెళ్ళిపోతే తప్ప ఆమె మనసు కుదుటపడదేమో అనుకున్నాడు.

"అన్నయ్యా, కమల పరిస్థితి రోజురోజుకీ దిగజారిపోతోంది. ఇలాగే ఉంటే తను నాకు దక్కదేమోనని భయం వేస్తోందన్నయ్యా. ఎప్పటినుండో బెంగళూరు నుండి ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ చేయించుకోవాలని ఒకతను ప్రయత్నిస్తున్నాడు. అతడూ నేనూ మ్యూచ్యువల్ ట్రాన్స్‌ఫర్ క్రింద మారితే బాగుంటుందనిపిస్తోంది నాకు. ఏమంటావు" అనడిగాడూ భాస్కర్.

కమల పరిస్థితిని కళ్ళారా చూస్తున్న రామచంద్ర తమ్ముడి నిర్ణయాన్ని కాదనలేకపోయాడు. కాకపోతే పుట్టిన దగ్గరనుండీ ఎప్పుడూ విడిచి ఉండని తమ్ముడిని వదిలి నేనుండగలనా అని దిగులుపడ్డాడు. కానీ పరిస్థితులు చూస్తున్న అతడు అంతకంటే మరో మార్గం లేదుకదా అనుకున్నాడు బాధగా.

"వెళితే మంచిదేగానీ, మరీ అంత దూరమా? నిన్ను వదిలి మేమందరం ఎలా ఉండాలిరా? ముఖ్యంగా నాన్నగారు" అన్నాడు రామచంద్ర దిగులుగా చూస్తూ.

"ఈ పరిస్థితుల్లో అంతకంటే మరో మార్గం కనబడడంలేదన్నయ్యా. నాకు మాత్రం మీ అందర్నీ విడిచి ఉండడం బాధ కాదా? కానీ కమలని దక్కించుకోవాలంటే మరో మార్గం కనబడడంలేదు నాకు. కోరి పెళ్ళిచేసుకున్నాను కమలని నేను. చేజేతులా తన జీవితంలోని ఆనందాన్నంతటినీ దూరం చేశాను. కనీసం మనశ్శాంతినయినా ఇవ్వాలని నా ప్రయత్నం" అన్నాడు భాస్కర్ కన్నీళ్ళతో రామచంద్ర భుజం తడిపేస్తు.

"ఊరుకోరా నిన్నిలా చూస్తూంటే నా గుండె చెరువైపోతోంది. వెళ్ళి రండి. అమ్మాయ్ ఆరోగ్యం కంటే ఏదీ ఎక్కువకాదు. మీవదిన కొంచెం బాధపడినా అర్థం చేసుకుంటుందిలే" అన్నాడు రామచంద్ర ఓదార్పుగా.

అతడన్నట్లుగానే మొదట జానకి బాధపడినా కమల పరిస్థితిని అర్థం చేసుకోవడం వలన గట్టిగా అభ్యంతర పెట్టలేదు.

చిన్నప్పటినుండీ భాస్కర్‌నే అంటిపెట్టుకుని తిరిగిన హరిప్రసాద్ అతడ్ని విడిచి ఉండేందుకు అందరికంటే ఎక్కువ బాధపడ్డాడు.

అతడిని సాగనంపేందుకు స్టేషన్‌కు వచ్చి కన్నీళ్ళతో భాస్కర్‌ని కౌగిలించుకుని "ఏంరా ఇలా అయిపోయింది మనపని. నిన్ను చూడకుండా నేను ఎలా ఉండాలిరా?" అన్నాడు బేలగా చూస్తూ.

"నాకు మాత్రం సంతోషంగా ఉందా హరీ. మీ అందర్నీ వదిలి ఇలా దూరంగా వెళ్ళిపోవడం. అయినా ఉత్తరాల్లోనూ, ఫోనుల్లోనూ పలకరించుకుందాములే. మనం మనుషులం దూరంగా ఉన్నా మనసులెప్పుడూ దగ్గరగానే ఉంటాయిలే" అన్నాడు భాస్కర్ ప్రేమగా స్నేహితుడి భుజం తట్టి.

"నువ్వన్నది నిజమే అయినా ఈ దూరం భరించడం నా వల్ల కాదేమో అనిపిస్తోందిరా" అన్నాడూ హరిప్రసాద్ చెమ్మగిల్లిన కళ్ళతో. "అలా అనకు హరీ నువ్వలా అంటే నాకు కూడా చాలా దిగులుగా ఉంది. ఇకనుండీ నా బదులుగా నువ్వే నాన్ననీ, అన్నయ్యనీ, వదిన్నీ చూసుకోవాలి" అన్నాడూ భాస్కర్ అప్పగింతలు పెడుతూ. విజయనగరంలో కాపురం పెట్టేందుకే ఇష్టపడని కమల ఇప్పుడు వాళ్ళందరినీ వదిలి వెళ్తున్నందుకు ఎంతో బాధపడింది. సావిత్రమ్మా, జానకీ, శంకర్రావులు కలిసి ఎంతో నచ్చచెప్పిన మీదట వెళ్ళడానికి ఒప్పుకుంది.

బెంగుళూరు వెళ్ళాక కూడా చాలాకాలం కమలలో ఆ స్తబ్దత పోలేదు. గలగల పారే సెలయేరులా నిత్యం నవ్వుతూ, తుళ్ళుతూ తిరిగే కమల అలా మౌనవీణలా మారిపోవడం భాస్కర్ మనసును కలిచివేసింది. తిరిగి కమలను మనుషుల్లో పడవేసేందుకు ఎంతో ప్రయత్నించాడు భాస్కర్. అందులో భాగంగానే అవకాశం ఉన్నంత మేరా కమలను ఏదో ఒక

ప్రదేశానికి తీసుకువెళుతూ తనకు ప్రశాంతతను చేకూర్చేందుకు ప్రయత్నించాడు. అతడి ప్రయత్నం ఫలించి క్రమేపీ కమలలో మార్పు వచ్చింది.

అయితే పసిపిల్లలను చూసినప్పుడల్లా కమల ఏదో పోగొట్టుకున్నదానిలా శూన్యంలోకి చూస్తూ కూర్చునేది. అది చూసిన భాస్కర్‌కి ఏం చేయడానికీ పాలుపోయేది కాదు. తాత్కాలికంగా ఏవో మాటలు చెప్పి మురిపించినా, అది కమల సమస్యకు శాశ్వత పరిష్కారం కాదనిపించింది భాస్కర్‌కి.

ఎవరినైనా పిల్లల్ని తెచ్చి పెంచుకుంటే ఎలా ఉంటుంది అనుకున్నాడు. అయితే అందుకు భార్య అంగీకరిస్తుందా అని కూడా సందేహపడ్డాడు. అయినా ప్రయత్నం చేసి చూస్తే తప్పేం లేదు కదా అనుకున్నాడు. మంచి సమయం చూసి ఆ మాటే భార్యతో చెప్పాడు భాస్కర్.

"ఎవరినైనా అంటే మీ ఉద్దేశ్యం మన చుట్టాల పిల్లల్ని అనా?" అనడిగింది కమల.

"అలా అని ఏం లేదు ఎవరో ఒకర్ని, మన వెల్తిని పూడ్చుకునేందుకు తెచ్చుకుందాం. పసిపాప మనింట్లో తిరుగుతుంటే మన సమస్యలన్నీ మరిచిపోయి హాయిగా ఉండొచ్చు" అన్నాడూ భాస్కర్.

"అలా అయితే ఏదైనా అనాథ ఆశ్రమం నుండి తెచ్చి పెంచుకుందాం. అలాగైతే ఆ బిడ్డ మా బిడ్డ అంటూ ఫ్యూచర్‌లో ఎవరూ క్లైయిం చేయరు" అంది కమల.

"ఓ.కె, నీకు ఎలా ఇష్టమయితే అలా చేద్దాం" అన్నాడు భాస్కర్ ఉత్సాహంగా. భార్య అంత సులభంగా పెంపకానికి అంగీకరించినందుకు అతడికి ఎంతో ఆనందంగా అనిపించింది.

ఇద్దరూ ఒక అంగీకారానికి రావడంతో పిల్లల కోసం అన్వేషణ ప్రారంభించారు.

భాస్కర్ ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా ఎవరో ఒకర్ని తెచ్చి పెంచుకోవాలని ఆరాటపడసాగారు. అందుకే తెలిసినవాళ్ళనందర్నీ అడిగి అనాథాశ్రమాల అడ్రసులు సేకరించి భార్యను తీసుకుని వెళ్ళసాగాడు.

కమల మాత్రం ఎవరిని చూసినా "వాళ్ళని చూస్తే నాలో ఏ స్పందనా కలగడంలేదు" అని అనేది నిరుత్సాహంగా.

"అలవాటు పడితే మమకారం అదే కలుగుతుంది కమలా" అంటూ భాస్కర్ నచ్చచెప్పే ప్రయత్నం చేసేవాడు.

"వాళ్ళకి పళ్ళూ, స్వీట్సూ, బట్టలు ఇవ్వడం వరకూ ఫర్వాలేదు నాకు. కానీ శాశ్వతంగా వాళ్ళని తెచ్చుకుందామంటే నా మనసెందుకో అంగీకరించడంలేదు" అంది కమల బాధగా.

అలాంటి పరిస్థితిలో జానకి మగపిల్లవాడిని ప్రసవించిందని బాలసారెకు మీరు తప్పకుండా రావాలని రామచంద్ర భాస్కర్‌కి ఫోన్ చేసి చెప్పాడు.

"నేనా వేడుకల్లో పాల్గొనలేనండి. కావాలంటే మీరు వెళ్ళిరండి. నేను ఒక్కతినీ ఇక్కడుంటాను. నాకేం భయంలేదు" అంది కమల.

"అదేంటి కమలా అలా అంటావు? నువ్వు రాకుండా నేనెలా వెళ్తాను? నువ్వు రాకపోతే అన్నయ్యా, వదినా బాధపడరా? అదీగాక మనమిక్కడికి వచ్చి ఏడాదిపైనే అయింది. మీ అమ్మగారు కూడా చూడాలని ఉందంటూ పదే పదే

ఫోన్లు చేస్తూనే ఉన్నారు. వెళ్ళి అందర్నీ చూసొచ్చేద్దాం కమలా. నాక్కూడా మా నాన్నగార్ని చూడాలనిపిస్తోంది'' అన్నాడు భాస్కర్ నచ్చచెప్తున్నట్లుగా.

''నాక్కూడా అందర్నీ చూడాలనే ఉందండీ. కానీ ఇలాంటి సందర్భాల్లో అమ్మలక్కలంతా ఒకచోట చేరి సానుభూతి పేరుతో వాళ్ళేదైనా అంటే నేను తట్టుకోలేనండీ'' అంది బాధగా.

''అలాంటి భయం నువ్వేమీ పెట్టుకోవద్దు. ఫంక్షన్ చాలా క్లుప్తంగా చేస్తున్నారట. మీ అమ్మగారిని, మా అత్తయ్యా మావయ్యలను అంటే మా వదిన అమ్మగారిని తప్ప వేరెవరినీ పిలవడంలేదని అన్నయ్య చెప్పాడు'' అన్నాడు భాస్కర్.

''సరే అయితే వెళదాం లెండి'' అంది కమల.

చాలా రోజుల తర్వాత ఇంటికి వచ్చిన భాస్కర్నీ, కమలనీ చూసి ఎంతో సంతోషించారంతా. ఎంతో ఆప్యాయంగా వాళ్ళని ఆహ్వానించారు.

పెద్ద పెద్ద కళ్ళతో బూరెల్లాంటి బుగ్గలతో ముద్దుగా ఉన్న బాబునుండి చూపులు తిప్పుకోలేకపోయింది కమల. వెళ్ళిన దగ్గరనుండీ ఏదో వంకతో బాబుని వడిలోకి తీసుకుని మురిసిపోయింది కమల.

బాబుకి ఏం పేరు పెట్టాలి అనే చర్చ వచ్చింది.

''పెద్దాడికి రవికిరణ్ అని పేరు పెట్టారు కనుక చిన్నాడికి శశికిరణ్ అని పెడదాము'' అంది జానకి.

అది విని ''బాగుంది సూర్యచంద్రులనిద్దరినీ నీ నట్టింట్లో కట్టేసుకుందామనా జానకీ'' అన్నాడు రామచంద్ర పరిహాసంగా.

ఆ మాట విని నవ్వేస్తూ పసివాడి బుగ్గలు ఆప్యాయంగా నిమిరింది జానకి.

''వదిన సెలక్షన్ చాలా బాగుందన్నయ్యా. బాబుకి ఆ పేరే పెడదాం'' అన్నాడు భాస్కర్.

''మీ వదిన సెలక్షన్ నీకు ఎప్పుడు నచ్చలేదో ఒకసారి చెప్పరా, వింటాను'' అన్నాడూ రామచంద్ర.

''ఆయనకే కాదు బావగారూ అక్కయ్య సెలక్షన్ నాకు కూడా నచ్చింది. బాబుకి ఆ పేరే పెడదాం'' అంది కమల.

తోటికోడలూ, మరిదీ తనకే సపోర్టు రావడంతో 'నేనే గెలిచాను' అన్నట్లుగా భర్తవంక చూసింది జానకి.

''సరేలెండ్రా, మీరు ముగ్గురూ ఒక్కటయ్యాక నామాటేం చెల్లుతుంది ఇంక? అలాగే కానీయండి'' అన్నాడు రామచంద్ర ఏదో బలవంతాన ఒప్పుకుంటున్నట్లుగా ముఖం పెట్టి.

''నిజం చెప్పన్నయ్యా. ఏదో బింకానికి అంటున్నావుగానీ, నీక్కూడా ఆ పేరు నచ్చింది కదూ'' అన్నాడు భాస్కర్ ఆటపట్టిస్తున్నట్లుగా అన్నగారి వంక చుస్తూ.

తమ్ముడు అలా అడగడంతో దొరికిపోయిన దొంగలా నవ్వేస్తూ ''ఛ, పోరా'' అంటూ అక్కడినుండి వెళ్ళిపోయాడు రామచంద్ర.

భర్త అటు వెళ్ళాక ''రవికి ఆ పేరు సెలక్ట్ చేసింది మీ అన్నయ్యే కదా బాచీ. దానికి మేచ్ అయ్యేలా నేనీ పేరు సెలక్ట్ చేస్తే ఎంత పోజిస్తున్నారో చూడు'' అంది జానకి నవ్వేస్తూ.

సరదాలు, సందడుల మధ్య బాబుకి నామకరణం జరిగిపోయింది. చాలా రోజుల తర్వాత ఆ ఇంటి సభ్యులంతా ఆనందంగా గడిపారా రోజు.

ఆ రాత్రి భాస్కర్‌తో "బాబు చాలా ముద్దొస్తున్నాడు కదండీ?" అంది కమల.

"అవును కమలా, నాక్కూడా అలానే అనిపించింది" అన్నాడు భాస్కర్.

"వాడిని మనం పెంచుకుంటే ఎలా ఉంటుందండీ?" అంది కమల.

బావుంటుంది కానీ నీకు అయినవాళ్ళ పిల్లల్ని ఎవర్నీ పెంచుకోవడం ఇష్టంలేదన్నావు కదా" అన్నాడు భాస్కర్ ఆశ్చర్యంగా.

"అవును.. శశిని చూసేవరకూ అలాగే అనుకున్నాను. కానీ వాడిని చూశాక నా మనసులో మనసులో మమకారం వెల్లువలా పొంగుతోంది. వాడు నవ్వినా, ఏడ్చినా ఏదో తెలియని పారవశ్యం కలుగుతోంది. రోజంతా వాడిని చూస్తూ అలాగే ఉండిపోవాలనిపిస్తోంది. అందుకే వాడిని నా స్వంతం చేసుకోవాలని మనసు ఆరాటపడుతోంది" అంది కమల ఉద్వేగంగా.

"కానీ అన్నయ్యా, వదినా ఏమంటారో? రవి తర్వాత దాదాపు ఏడేళ్ళ తర్వాత వీడు పుట్టాడు. అయినా వదిన మొదటిసారి బిడ్డను కన్నట్లు వాడిని చూసుకుని మురిసిపోతోంది. వాడిని మనకిస్తారంటావా?" అన్నాడు భాస్కర్ సందేహంగా.

"ఎందుకివ్వరు. సంతోషంగా ఇస్తారు. ఎందుకంటే వాడికి మనం మంచి భవిష్యత్తునిస్తాం కదా" అంది కమల ధీమాగా.

"అదేం మాట కమలా... శశి వాళ్ళ దగ్గర ఉంటే మంచి భవిష్యత్తు ఇవ్వలేరనా నీ ఉద్దేశ్యం? నన్ను పెంచి బేంకు మేనేజర్‌గా ఈ స్థాయికి తెచ్చింది వాళ్ళేకదా" అన్నాడు భాస్కర్.

"ఇదిగో మీతో నేను వాదించలేను. మీరు వాళ్ళకేం చెప్తారో, ఏం చేస్తారో నాకు తెలియదు. బాబు నాకు కావాలంతే" అంది కమల తన నిర్ణయానికి తిరుగులేదు అన్నట్లుగా.

మొట్టమొదటిసారి భార్య కళ్ళల్లో కదలాడే ఆనందాన్ని, ఉద్వేగాన్ని చూసిన భాస్కర్ ఇంకేమీ తర్కించలేదు.

"సరే, నీకంత కోరికగా ఉన్నప్పుడు నేను కాదని ఎలా అంటాను, అడుగుదాంలే రేపు. పొద్దుపోయింది పడుకో" అన్నాడు భాస్కర్.

అతని మాటలు వినడంతోనే ఆనందం పట్టలేక భాస్కర్ ముఖాన్ని చేతుల్లో ఇముడ్చుకుని ముద్దులతో ముంచెత్తింది కమల.

చిన్నపిల్లలా సంబరపడుతున్న భార్యని చూస్తే అతడికి ఎంతో ముచ్చటగా అనిపించింది. "నువ్వే చిన్నపిల్లలా వున్నావు నా కళ్ళకు. ఇంకా చిన్నపిల్లలెందుకు మనకి?" అన్నాడు అనురాగంతో ఆమెని దగ్గరకు లాక్కుంటూ.

"అలా అని చెప్పి బాబుని అడగరా ఏమిటి?" అంది కమల సందేహంగా. "భయపడకు, అడుగుతాలే" అన్నాడు భాస్కర్ హామీ ఇస్తున్నట్లుగా.

ఆ మరునాడు భాస్కర్ వాళ్ళని అడిగేదాకా ఆగలేకపోయింది కమల.

"అక్కా, బాబు చాలా ముద్దొస్తున్నాడు. వాడిని నాకిచ్చెయ్యకూడదూ?" అంటూ శశిని అపురూపంగా వడిలోకి తీసుకుని ముద్దులాడసాగింది కమల.

తోటికోడలి నుండి అలాంటి ప్రస్తావన వస్తుందని ఏమాత్రం ఊహించని జానకి తెల్లబోయింది ఒక్క క్షణం. అడిగిందానికి జవాబేమివ్వాలో తోచక చప్పున తలవంచుకుంది.

ముద్దుల మూట కట్టినట్లున్న బాబుని వదులుకునేందుకు ఆ తల్లి మనసు అంగీకరించలేదు. అలా అని ఇవ్వను అని చెప్పి తోటికోడలి మనసు నొప్పించలేక మౌనంగా ఉండిపోయింది ఒక్క క్షణం.

తన జవాబు కోసం ఆత్రంగా చూస్తున్న కమల వంక సూటిగా చూడలేక "నాదేముంది కమలా మీ బావగారి ఇష్టం" అంది జానకి గొంతు పెగుల్చుకుని.

అంతవరకూ తోడికోడలు తన ప్రతిపాదనకు సంతోషంగా అంగీకరిస్తుందని ఊహల్లో తేలిపోయిన కమల మాట రానట్లుండిపోయింది. అంతలోనే నవమొసాలూ మోసి బిడ్డను కన్నది కదా. అంత తొందరగా ఎలా అంగీకరిస్తుంది అని సరిపెట్టుకుంది.

తమకంటే ఆమెకు ఎంత మమకారమో తెలిసిన కమల దాన్నే ఆయుధంగా ఉపయోగించి బాబును దక్కించుకోవాలనుకుంది.

అదే సమయంలో భాస్కర్ కూడా రామచంద్రతో బాబుని తమకు ఇవ్వమని అడిగాడు.

"బాచీ, నిజంగా కమలే అడగమందా లేక నువ్వే కావాలని అడుగుతున్నావా? ఎందుకంటే తనకి దగ్గరవాళ్ళ పిల్లల్ని పెంచుకోవడం ఇష్టంలేదుకదా" అన్నాడు రామచంద్ర.

"ఆమాట నిజమేగాని అన్నయ్యా. బాబుని చూసిన దగ్గర నుండీ కమల చాలా ఎక్సైటెడ్‌గా ఉంది ఇది తన ప్రపోజలే. చెప్పన్నయ్యా బాబుని నాకిస్తావా?" అన్నాడు భాస్కర్ ఆతృతగా.

ఏనాడూ నాకిది కావాలని అడగని తమ్ముడు అలా దీనంగా చూస్తూ అడుగుతూంటే కాదనలేకపోయాడు. అసలే చచ్చి బ్రతికిన మరదలు ఇలాగైనా కాస్త సంతోషంగా ఉంటుంది అనిపించి వెంటనే తన అంగీకారాన్ని తెలియజేశాడు.

అన్నగారి మాటలు వింటూనే, "చాలా థేంక్సన్నయ్యా. నువ్వేమంటావో అని చాలా భయపడ్డాను నేను" అన్నాడు భాస్కర్.

"అదేమిట్రా, అలా అంటావు. కమల బావుండడం కంటే ఏం కావాలి మనకు. బాబు నీ దగ్గరుంటేనేం, మా దగ్గరుంటేనేం" అన్నాడు రామచంద్ర లాలనగా తమ్ముడి భుజం తడుతూ.

ఆ మాట వింటూనే ఉద్వేగంగా భాస్కర్ రామచంద్రని కౌగలించుకున్నాడు.

రామచంద్ర చెప్పింది వింటూనే "అయితే ఒప్పేసుకున్నావా, బావా వాడిని వదిలి ఉండలేననిపిస్తోంది నాకు" అంది జానకి జాలిగా అతడి వంక చూస్తూ.

"తప్పదు జానకీ. కమల మనుషుల్లో పడాలంటే మనం ఈ త్యాగం చేయక తప్పదు. అయినా బాచీ ఎవరు? నీ కొడుకులాంటి వాడే కదా. వాడికీరోజు రాకూడని కష్టం వచ్చింది. తన మూలంగానే కమల మాతృత్వానికి దూరమైందనే అపరాధభావంతో కుమిలిపోతున్నాడు. ఇలాగైనా వాడి మనసుకు ఊరటకలిగితే అంతే చాలు అయినా బాబు ఉండేదెక్కడ? మన బాచీ దగ్గరే కదా. వాడు అక్కడున్నా, ఇక్కడున్నా మన బిడ్డే" అన్నాడు రామచంద్ర భార్య తల నిమురుతూ.

అతడలా అనడంతో జానకి మనసు కొంచెం తెప్పరిల్లింది. నిజానికి తల్లిలేని భాస్కర్ అంటే జానక్కి మొదటినుండీ పుత్రవాత్సల్యమే. అలాంటిది ఈ రోజు అతడి మనసు కష్టపెట్టగలదా?

తోడికోడలు పెద్దమనసు చేసుకుని శశికిరణ్‌ని తనకు ఇస్తున్నందుకు కమల మనసు ఆమె పట్ల కృతజ్ఞతతో నిండిపోయింది.

ఈ సంగతి విన్న సావిత్రమ్మ తన కూతురికి పుత్రభిక్ష పెట్టినందుకు జానకిని మనసారా అభినందించి అక్కున జేర్చుకుంది.

బాబుని తీసుకుని బెంగుళూరు వెళ్ళిపోతూ "అక్కా, ఎన్ని జన్మలెత్తినా మేము మీ ఋణం తీర్చుకోలేము" అంటూ రామచంద్ర జానకిల పాదాలంటి నమస్కరించింది కమల. ఆమె ఆ మాటలంటున్నప్పుడు జలజలా జారిన కన్నీళ్ళు జానకి పాదాలను తడిపేశాయి.

ఏడుస్తున్న కమలను అక్కున జేర్చుకుని "పిచ్చిపిల్లా, మనలో మనకు ఋణాలు, తీర్చుకోవడాలూ ఏమిటి? బాబు మీ దగ్గరున్నా, మా దగ్గరున్నా ఒకటే, అయితే నాదో చిన్నకోరిక. మా తమ్ముడు హరికి మగపిల్లాడు పుట్టి నాకు ఆడపిల్ల పుట్టినా లేక నాకు మగపిల్లాడు పుట్టి వాడికి ఆడపిల్ల పుట్టినా వాళ్ళకు పెళ్ళిచేసి మా బంధం నిలుపుకోవాలని చిన్నప్పటినుండీ ఎంతో ఆశపడుతూ వచ్చాము. ఇప్పుడు వాడికి కూతురు పుట్టినా రవికి ఈడుకాదు. కనుక వాడికి కూతురు పుడితే శశికైనా చేయాలని ఆశపడుతున్నాను. నా కోరిక తీరుస్తావా కమలా?" అంది జానకి చెయ్యి చాస్తూ.

ఆ మాటలు వినడంతోనే "అదేంటక్కా అలా అంటావు. నువ్వు అడగడం కాదు ఆజ్ఞాపించాలి నన్ను. తప్పకుండా మన శశికి హరి అన్నయ్య కూతుర్ని చేద్దాం" అంటూ కమల జానకి చేతిలో చేయి వేసింది.

"నాకు తెలుసమ్మా. నువ్వు నా మాట కాదనవని" అంటూ కమల చేతిని ప్రేమగా నొక్కి వదిలింది జానకి.

జానకీ రామచంద్రా స్టేషన్‌కు వెళ్ళి వాళ్ళకు వీడ్కోలిచ్చి వచ్చారు.

"అమ్మా, తమ్ముడ్ని బాబాయికి ఇచ్చేశారెందుకమ్మా? వాడితో ఆడుకోవాలని ఎంతో ఆశపడ్డాను నేను" అన్నాడు రవి బాధగా.

"పాపం పిన్నికీ, బాబాయికీ ఎవరూ లేరుగా అందుకే ఇచ్చేశాము. తొందరలోనే మనకు తమ్ముడో చెల్లో వస్తారులే" అన్నాడు రామచంద్ర ఓదార్పుగా కొడుకు భుజం తట్టి.

వాళ్ళని స్టేషన్‌లో దిగబెట్టి వచ్చిన దగ్గరనుండీ దిగులుగా ఉన్న కోడలిని చూస్తూంటే శంకర్రావు మనసు ద్రవించిపోయింది.

"రామం, చిన్నాడి కష్టం తీర్చినందుకు సంతోషంగానే ఉన్నా బాబుని వదిలి ఉండలేక లోలోపలే కుమిలిపోతున్న జానకిని చూస్తూ ఉంటే కడుపు తరుక్కుపోతోందిరా" అన్నాడు.

"నాలుగు రోజులు పోతే తనే సర్దుకుంటుందిలే నాన్నా. జానకి ఈరోజు కాకపోతే రేపైనా మరో బిడ్డను కనగలదు. కానీ కమలకి ఆ అదృష్టంలేదు కదా" అన్నాడు రామచంద్ర జాలిగా.

"నువ్వన్నదీ నిజమే కానీ, జానకి ముఖం చూస్తూంటే ఏదో గిల్టీగా వుందిరా నాకు" అన్నాడు శంకర్రావు.

"వద్దు నాన్నా, మీరలాంటి శంకలేవీ పెట్టుకోకండి. జానకి సంగతి నేను చూసుకుంటాను కదా" అన్నాడు రామచంద్ర.

కూతురికి జ్వరంగా ఉందని తెలిసి చూడడానికి వచ్చింది పంకజం. రామచంద్ర ఒంటరిగా ఉన్న సమయం చూసి "నీకిదేమైనా న్యాయంగా ఉందా రామం? పసివాడికి దూరమై జానకి ఎలా తల్లడిల్లిపోతోందో గమనించావా? నీకు నీ తమ్ముడి మీద ప్రేమ ఉంటే ఇల్లంతా దోచిపెట్టు. ఎవరూ కాదనరు. నవమాసాలూ మోసి కన్న బిడ్డను ఇలా ధారపోస్తావా?" అంది నిష్ఠూరంగా.

"అత్తయ్యా, నువ్వేనా ఇట్లా మాట్లాడుతున్నది? వేరే ఎవరైనా ఇలా మాట్లాడితే నాకు ఆశ్చర్యం కలిగేది కాదు. నువ్వు ఇలా మాట్లాడడం నాకు చాలా వింతగా ఉంది. వ్యక్తిగా నువ్వంటే నాకెంతో గౌరవం. ఇలాంటి మాటలు నీనుండి ఊహించలేదసలు. నువ్వొచ్చి ధైర్యం చెబుతావనుకుంటే ఇలా మాట్లాడుతున్నావేంటి? ఇలా అయితే జానకి ఎలా మనసు కూడదీసుకుంటుంది?" అన్నాడు రామచంద్ర ఆశ్చర్యంగా చుస్తూ.

అతడు అలా మాట్లాడడంతో తగ్గిపోయింది పంకజం. "నాకుగా నేను ఏ కష్టమైనా భరించగలను బాబూ. కానీ నా బిడ్డకు కలిగిన కష్టం చుస్తూ అంటే తట్టుకోలేకపోతున్నాను నేను" అంది జాలిగా.

"అత్తయ్యా. జానకీ, హరీలేనా నీ బిడ్డలు? నేనూ, బాచీ నీకేమీ కామా? నీలో ఇంతకాలం మేమిద్దరం మా అమ్మనే చూసుకున్నాము. బాచీ కూడా నీ బిడ్డ అనుకుంటే ఇలా మాట్లాడవు నువ్వు" అన్నాడు రామచంద్ర బాధగా.

"అంతమాట అనకు రామం. ఏదో జానకి బాధ చూడలేక అలా అన్నానేకానీ బాచీ మీద నాకే కోపమూలేదు" అంది పంకజం.

శశికిరణ్‌ను బెంగుళూరు తీసుకువెళ్ళిన దగ్గరనుండీ కమలా, భాస్కర్‌ల జీవితాల్లోకి వసంతం ప్రవేశించినట్లయింది.

బాబు కోసం రకరకాల డ్రెస్‌లు, బొమ్మలు కొని ఇల్లంతా నింపేశారు.

భాస్కర్ సాయంత్రం బేంకు నుండి వచ్చేసరికి కమల ఎంతో ఉత్సాహంగా ఎదురువెళ్ళి "శశి ఈరోజు నన్ను చూసి నవ్వాడండీ. వాడు వస్తువులను గుర్తుపడుతున్నాడు తెలుసా?" అంటూ రోజుకొక కొత్త వార్త అతడికి చెప్పేది.

పిల్లాడిని దగ్గరలో ఉన్న పార్కులో తిప్పేందుకు స్ట్రోలర్ కూడా కొన్నారు. పిల్లల కోసం బజార్లోకి ఏ కొత్త ఆటవస్తువు వచ్చినా అది తమ ఇంట్లో ఉండవలసిందే అన్నట్లుగా ఎంతో ఆరాటపడిపోయేది కమల.

ఇలా దినమొక పండగలా గడిచిపోతోంది వాళ్ళకు. వాళ్ళ ఆశలూ, ఆలోచనలూ అన్నీ బాబు చుట్టూనే.

భాస్కర్‌కి కొడుకు పట్ల ఎంత మమకారమున్నా అంతా బయటకు వ్యక్తం చేసేవాడు కాదు. కానీ కమల మాత్రం బాబు పట్ల పిచ్చి మమకారాన్ని పెంచుకుని ప్రాణాలన్నీ ఆ పసివాడి మీదే అన్నట్లు బ్రతకసాగింది.

చివరికి అది ఎలా పరిణమించిందీ అంటే ఎవరైనా తననుండి శశికిరణ్‌ని దూరం చేసేస్తారేమో తాను వాడికి స్వంత తల్లి కాదనే నిజాన్ని చెప్పేస్తారేమోనని అనుక్షణం భయపడే స్థితికి చేరుకుంది. ఈ నిజం బాబుకి తెలియకుండా ఉండాలంటే వాడిని విశాఖపట్టణం తీసుకువెళ్ళకుండా ఉండడం ఒక్కటే మార్గం అనుకుంది.

ఒకవేళ ఏదైనా తప్పనిసరి పరిస్థితుల్లో అక్కడికి వెళ్ళవలసి వచ్చినా అక్కడ ఉన్నంతసేపూ కొడుకును తన కనుసన్నల నుండి దాటిపోకుండా చూసుకునేది.

బాబుని తనకిచ్చేందుకు కూడా కమల వెనకాడడం చూసి జానకి తల్లి మనసు తల్లడిల్లిపోయేది. ఒక్కసారి వాడిని ఎత్తుకుని తనివితీరా హృదయానికి హత్తుకోవాలనే జానకి ఆశ అడియాసగానే మిగిలిపోయింది కమల ప్రవర్తన వలన. కమల చూడకుండా దొంగచాటుగా వాడిని ఎత్తుకుని ముద్దుపెట్టుకునే పరిస్థితి వచ్చినందుకు లోలోపలే కుమిలిపోయింది జానకి.

మిగతా విషయాల్లో ఎంతో కలివిడిగా ఉండే కమల పసివాడి విషయానికి వచ్చేసరికి ఎందుకంత పొసెసివ్‌గా బిహేవ్ చేస్తూందో అర్థంకాక మథనపడే జానకి తన గోడునంతా రామచంద్ర ముందు వెళ్ళబోసుకునేది.

కమల తమ బిడ్డను ఎంత అపురూపంగా చూసుకుంటున్నదో గమనించమని రామచంద్ర జానకికి నచ్చచెప్పడంతో ఇంకేమీ అనలేకపోయేది. ఎక్కడున్నా తన కొడుకు సుఖంగా ఉంటే చాలని మనసును సరిపెట్టుకునేది.

బాబు నాకే స్వంతం, నా ఒక్కదానికే హక్కు అన్నట్లు ప్రవర్తిస్తున్న మరదలి చేష్టలను చూసి చిన్నపిల్ల చేష్టలుగానే భావించాడు తప్ప జానకిలా రామచంద్ర ఎప్పుడూ తప్పుగా అనుకోలేదు. అందుకే జానకికి అలా నచ్చచెప్పగలిగాడు.

బాబును తీసుకు వెళ్ళాక చిన్నకోడలిలో పూర్వపు ఉత్సాహం చూసి ఎంతో ఆనందించాడు శంకర్రావు. వాడు ఎక్కడున్నా తన మనవడే కదా అనే భరోసాతో.

కమలా భాస్కర్ వచ్చారని తెలిసి పంకజం, ఆదిశేషూ వచ్చారు మనవడిని చూసేందుకు. కమల బాబుని దగ్గరకు రానివ్వకపోవడంతో జానకిలాగే వాళ్ళూ నిరాశ చెందారు.

ఈ విషయంలో భాస్కర్ కమలకి నచ్చచెప్పాలని చేసిన ప్రయత్నం వృథా అయిందే తప్ప ఏ మాత్రం ఫలితం లేకపోయింది.

మరో రెండు రోజులు పోయిన తర్వాత హరిప్రసాద్‌కి కూతురు పుట్టిందనే కబురు తీసుకువచ్చాడు ఆదిశేషు. ఆ వార్త వింటూనే ఉప్పొంగిపోయింది జానకి.

మూడేళ్ళ శశిని ఎత్తుకుని ముద్దులతో ముంచెత్తుతూ "ఒరే కన్నా నీకు పెళ్ళాం పుట్టిందిరా పెళ్ళాం" అంది. పక్కనే వున్న కమల వైపు ఆనందంగా చుస్తూ "విన్నావా కమలా హరికి కుతురు పుట్టింది. వాడికి కూతురు పుడుతుందో లేదో అని ఇన్నాళ్ళూ ఎంత బెంగపడ్డానో తెలుసా? అమ్మయ్య ఇప్పటికి నా బెంగ తీరింది. ఇప్పుడు నాకెంత సంతోషంగా ఉందో తెలుసా?" అంది జానకి ముఖమంతా ఆనందంతొ వెలిగిపోతుండగా.

అయితే కమల మాత్రం జానకి ఆనందంలో పాలుపంచుకోలేదు.

జానకి చేతుల్లోనుండి శశిని లాక్కుంటూ "ఏమిటక్కయ్యా ఇది చిన్నపిల్లలకి ఇప్పటినుండే పెళ్ళిమాటలు ఏమిటి అసహ్యంగా. ఇప్పుడంటే అన్నావుగానీ, ఇంకెప్పుడూ ఇలాంటి మాటలు నాముందు మాట్లాడకు" అంటూ కొడుకుని పట్టుకుని చిట్లించుకున్న ముఖంతో చరచరా అక్కడినుండి వెళ్ళిపోయింది.

తను చెప్పిన వార్త విని తోటికోడలు సంతోషపడుతుందని ఆశించిన జానకి ఆమె మాటలు విని అవాక్కయింది. తన కొడుకుని పెంపకానికి తీసుకువెళుతూ చేసిన వాగ్దానానికి ఇప్పుడు కమల అన్నమాటలకు ఏమాత్రం పొంతన లేకపోవటం జానకిని ఎంతో విస్మయపరచింది.

చిన్ననాటినుండీ తన తమ్ముడు హరీ, తానూ కలిసి పెట్టుకున్న ఆశలు, కలలు ఇలా కుప్పకూలినట్లు కావడం జానకి భరించలేకపోయింది. ఈ మాట వింటే హరి కూడా చాలా బాధపడతాడు అనుకుంది. ఎందుకంటే బాచీ, హరిల అనుబంధం రామచంద్రకి తెలియనిది కాదు. తాను తన కొడుకును పెంపకానికి ఇచ్చి తప్పుచేశానా అని బాధపడింది ఒక క్షణం. జాలిగా అక్కడేవున్న భర్తవంకా, తండ్రివంకా, భాస్కర్ వంకా చూస్తూ మెల్లగా అక్కడినుండి లేచి లోపలికి వెళ్ళిపోయింది.

భాస్కర్ కమల చేసిన తప్పేదో తానే చేసినట్లుగా సిగ్గుతో కుంచించుకుపోయాడు. మేనమామ వంకా, అన్నగారి వంకా చూడలేక తల వంచుకున్నాడు. చెల్లెలి కొడుకు బాచీ అంటే మొదటినుండీ ఎంతో వాత్సల్యం కల ఆదిశేషు ఓదార్పుగా భాస్కర్ భుజం తట్టి "వస్తానురా బాచీ, చిన్నపిల్ల ఏదో తెలియక అన్నది. నువ్వలా బాధపడకు" అన్నాడు.

రామచంద్ర వంక చుస్తూ "జానకిని కాస్త ఓదార్చరా నాన్న బయటకు వెళ్ళినట్లున్నాడు. వచ్చాక చెప్పు హరికి కూతురు పుట్టిన సంగతి" అంటూ బయటకు వెళ్ళిపోయాడు.

అతడు వెళ్ళిపోయాక అన్నగారి చేతులు పట్టుకుని "సారీ అన్నయ్యా కమల ప్రవర్తనకు చాలా సిగ్గుపడుతున్నాను నేను. వదినతో మాట్లాడేందుకు ముఖం చెల్లడం లేదు నాకు. ఎంత బాధపడుతోందో ఏమో? వెళ్ళి సముదాయించు" అన్నాడు భాస్కర్ దిగులుగా.

ఈ విషయంలో భార్య ఎంత ఆశలు పెంచుకుందో రామచంద్రకు తెలియంది కాదు. ఈనాడు కమల నుండి ఇంత వ్యతిరేకత ఎదుర్కోవలసి వస్తుందని ఊహించలేదు అతడు కూడా.

అదే సమయంలో జరిగినదానికి తల్లడిల్లిపోతున్న తమ్ముడి వంక చూస్తే జాలివేసింది అతడికి. "నువ్వేమీ బాధపడకురా. నేను మీ వదినకు సర్దిచెప్తానులే. నువ్వు మాత్రం అనవసరంగా కమలని కేకలు వేయకు. ఎందుకంటే, తను అన్నదాంట్లో కూడా పెద్ద తప్పేమీలేదు. చిన్నపిల్లలకు ఇప్పటినుండే పెళ్ళి మాటలు ఎందుకని వాళ్ళు పెద్దయ్యాక ఎలా ఇష్టమైతే అలా చేయవచ్చునేది కమల అభిప్రాయం అయి ఉంటుంది" అన్నాడు రామచంద్ర అనునయంగా.

తన భార్య ఎంత అవివేకంగా ప్రవర్తించినా అన్నయ్య ఔదార్యంతో ఆమెను సమర్థించిన తీరు చూశాక భాస్కర్ కళ్ళు చెమరించాయి.

"అలాగే అన్నయ్యా నీ మాట నేనెప్పుడు కాదన్నాను?" అంటూ అక్కడినుండి కదిలాడు భారంగా.

రామచంద్ర మెల్లగా భార్య దగ్గరకు వెళ్ళాడు. కళ్ళకు చేతులు అడ్డంపెట్టుకుని నిశ్శబ్దంగా కన్నీరు కారుస్తోంది జానకి.

మంచమ్మీద కూర్చుని లాలనగా ఆమె తలమీద చెయ్యివేసి నిమురుతూ "ఊరుకో జానకీ ఏమిటిది చిన్నపిల్లలా. నువ్విలా రావడం చూసి మీ నాన్నగారు ఎంత బాధపడతారో కొంచెం అయినా ఆలోచించావా? అయినా శశి పెళ్ళి విషయంలో తల్లిదండ్రులుగా వాళ్ళకి కూడా ఏవేవో ఆశలు ఉంటాయి కదా. అందులో తప్పేముంది చెప్పు ఎంతయినా శశి వాళ్ళ పిల్లాడు. ఊరుకో బాధపడకు" అన్నాడు అనునయంగా.

"అంతేనా? వాడు మనకేమీ కాడా. ఇన్నాళ్ళూ నేను పెంచుకున్న ఆశలన్నీ అడియాసలేనా?" అంది జానకి గట్టు తెగిన గోదారిలా అతడి ఒడిలో తలపెట్టి ఏడ్చేస్తూ.

"అవును, ఎప్పుడైతే శశిని వాళ్ళకిచ్చేశామో అప్పుడే మనకి వాడిమీద ఉన్న హక్కులన్నీ వదులుకున్నట్లే కదా. ఏది ఎలా జరగాలని ఉంటే అలా జరుగుతుంది. కేవలం మనం నిమిత్తమాత్రులం" అన్నాడు రామచంద్ర ఓదార్పుగా భార్య తల నిమురుతూ.

"ఈ వేదాంతం కబుర్లకేం బావా. ఎన్నయినా చెప్పవచ్చు. ఆనాడు పిల్లాడిని తీసుకుంటూ మీ మరదలు చేసిన వాగ్దానమేమిటి? ఇవ్వాళ అంటున్న మాటలేమిటి? ఆ రోజు తన బాధ చూడలేక మన మనసులను గట్టిచేసుకుని బిడ్డను తన చేతుల్లో పెట్టాము. దానికిదా ప్రతిఫలం? తను అన్నది విని కూడా బాచీ కూడా ఏమీ మాట్లాడలేదు" అంది జానకి బాధగా

"పిచ్చి జానకీ జరిగిందానికి బాచీ బాధపడడంలేదని ఎలా అనుకున్నావు? అయినా ఏనాడైనా మనం చేసినదానికి ప్రతిగా వాళ్ళేదో చేస్తారని, చెయ్యాలనీ ఎప్పుడైనా ఆశించామా? ఇవ్వాళ ఎందుకు ఇలా కొత్తగా మాట్లాడుతున్నావు? ఆశించింది లభించలేదన్న బాధతోనే గదా ఇదంతా. అది నీ మనసులోంచి తీసెయ్యి ముందు. అప్పుడు నీకింత బాధ ఉండదు.

మా కాలేజీలో ఇంగ్లీషు లెక్చరరుగారు ఎప్పుడూ ఒకమాట చెప్తూండేవారు. డోంట్ ఎక్స్‌పెక్ట్ ఎనీ థింగ్ ఫ్రమ్ ఎనీబడీ. ఇంక్లూడింగ్ యువర్ కిత్ అండ్ కిన్ అని నువ్వు ఇతరులకు ఏదైనా ఫేవర్ చేస్తున్నప్పుడే వారినుండి ఏమీ తిరిగి ఆశించకూడదు అనే నిర్ణయం తీసుకోవాలట. అప్పుడు నీకు ఈ డిసప్పాయింట్‌మెంట్ అనేదే ఉండదని, మనసెంతో తేలిగ్గా ఉంటుందని అన్నారు.

ఇన్నాళ్ళూ ఎంతో బేలన్స్‌డ్‌గా ఉంటూ ఎలాంటి సమస్యనైనా తేలిగ్గా పరిష్కరించే నువ్వు ఇవ్వాళ ఎందుకింత బేలవైపోతున్నావు?" అన్నాడు రామచంద్ర భార్య ముంగురులు సవరిస్తూ.

"నువ్వు మాష్టారివి కదా బావా ఎన్నైనా చెప్పగలవు. స్కూల్లో పిల్లలకు పాఠాలు చెప్పినట్లు ఇలాంటి నీతి వాక్యాలను ఎన్నైనా చెప్పగలవు. కానీ నేను నవమాసాలూ మోసి కన్నతల్లిని. వాడిమీదే నాకే హక్కూ లేదన్నట్లుగా కమల ఈరోజు మాట్లాడుతూంటే తట్టుకోలేకపోతున్నాను బావా" అంది జానకి ఇంకా వెక్కుతూనే.

"ఊరుకో జానకీ. నీ బాధను నేను అర్థం చేసుకోగలను. అదే సమయంలో కమల పరిస్థితిని కూడా కాస్త ఆలోచించు. తను శశి మీదే ఆశలన్నీ పెట్టుకుని బ్రతుకుతోంది. తన నుండి వాడిని ఎవరైనా వేరు చేస్తారనే అభద్రతా భావంతో ఇలా ప్రవర్తిస్తోంది.

వాస్తవానికి కమల ఎలాంటిదో నాకంటే నీకే బాగా తెలుసు. కాలక్రమేణా తనలో తప్పక మార్పు వస్తుంది. అందాకా మనం ఓపికపట్టాలి. తప్పదు. అసలే వట్టి మనిషివి కాదు కదా నువ్వు. ఇలాంటి సమయంలో నువ్విలా బాధపడడం నాకేమీ బాగోలేదు. నువ్విలా

బాధపడితే ఆ ప్రభావం లోపలున్న బిడ్డమీద పడదా? అసలు డాక్టరు ఏమని చెప్పారు నీకు? బాగా నీరసంగా ఉన్నావు. జాగ్రత్తగా ఉండమని కదూ. కానీ, నువ్వేంటి ఇలా? లేచి కళ్ళు తుడుచుకో'' అన్నాడు రామచంద్ర నచ్చచెప్తున్నట్లుగా.

''ఎంతసేపూ వాళ్ళూ వీళ్ళూ బాధపడుతున్నారని చూడడమే గానీ, నా బాధ ఎప్పుడు పట్టించుకున్నావు నువ్వు?'' అంది జానకి నిష్ఠూరంగా.

''నువ్వలా అంటే నేనేం చెప్పలేను జానకీ. నువ్వు రవికీ, శశికే కాదు. బాచీకి కూడా తల్లిలాగే ఉన్నావు ఇన్నాళ్ళూ. ఒకప్పుడు వాడి చదువుకోసం నీ చదువునీ, ఆశలనీ, కోరికలనూ తృణప్రాయంగా వదులుకున్నావు, మర్చిపోయావా? చిన్నవాళ్ళు తప్పుచేస్తే, పెద్దవాళ్ళు క్షమించాలి. ఏమో ఎవరు చూడొచ్చారు? రేపు శశి పెద్దయ్యాక హరి కూతుర్నే చేసుకుంటానంటాడేమో? లే. లేచి బయటకు రా, నీ బాధ చూడలేక బాచీ తల్లడిల్లి పోతున్నాడు'' అన్నాడు రామచంద్ర భార్యకు మంచం మీదనుండి లేచేందుకు చేయి ఆసరా ఇస్తూ.

భాస్కర్ తనకోసం బాధపడుతున్నాడనే మాట వినగానే జానకిలోని మాతృహృదయం కరుణతో నిండిపోయింది. ముఖం కడుక్కుని బొట్టు పెట్టుకుని తల సరిచేసుకుని హాల్లోకి వచ్చింది.

ఇదేమీ తెలియని రవి, శశిని దగ్గర కూర్చోబెట్టుకుని ఆడిస్తున్నాడు. జానకి ప్రశాంతంగా ఇంటిపనులు చక్కపెట్టుకోవడం చూసి భాస్కర్ మనసు కాస్త కుదుటపడింది. మర్నాడు తాను ఒక్కడూ వెళ్ళి హరిప్రసాద్ కూతుర్ని చూసి వచ్చాడు భాస్కర్. తనకు కూతురు పుట్టడం వలన స్నేహితుడితో వియ్యం అందబోయే అదృష్టం దక్కినందుకు హరిప్రసాద్ ఎంతో పొంగిపోతూ భాస్కర్‌ని కౌగలించుకున్నాడు. మనసులో ఎంత అలజడిగా ఉన్నా, అదేమీ పైకి వ్యక్తం చేయకుండా స్నేహితుడి ఆనందంలో పాలుపంచుకున్నాడు భాస్కర్.

కమల మాత్రం అందరితోనూ ముభావంగానే ఉండిపోయింది. తన ప్రవర్తన అనుచితంగా ఉందని, భర్త హెచ్చరిస్తూ ఉన్నా. ఒప్పుకునేందుకు అహం అడ్డువచ్చింది. విశాఖలో ఉన్న రెండు రోజులూ అంటీ ముట్టనట్లు ఉండిపోయింది అందరితోనూ. బెంగుళూరుకు బయలుదేరుతున్న నాడు కూడా జానకితో మనసు విప్పి మాట్లాడలేకపోయింది.

తోటికోడలు ప్రవర్తన చుసి జానకి బాధపడిందే తప్ప భాస్కర్ చూసి ఏమీ అనలేకపోయింది.

గతంలో బెంగుళూరు నుండి తరచూ ఫోన్లు చేసి జానకితో గంటలు గంటలు మాట్లాడే కమల ఈసారి వెళ్ళాక ఫోన్‌లు చేయడం పూర్తిగా బంద్ చేసింది.

ఎంతో అవసరమైతే తప్ప తాను విశాఖపట్నం వచ్చేది కాదు. తల్లిదండ్రులను చూడాలనిపిస్తే వాళ్ళను విజయనగరం నుండి బెంగుళూరు రప్పించుకేది.

సావిత్రమ్మ కూతురికి నువ్వు చేస్తున్నది చాలా తప్పని ఎంతో నచ్చచెప్పేది. అయినా కమల తన వైఖరిని ఏమాత్రం మార్చుకోలేకపోయింది.

జానకి ఆడపిల్లను ప్రసవించిందని ఫోన్ చేశాడు రామచంద్ర.

చాలారోజుల తర్వాత తమ ఇంట్లో ఆడపిల్ల పుట్టిందని ఎంతో సంబరపడ్డాడు భాస్కర్.

''పాపను చూడాలని వుంది, వెళ్దాం కమలా'' అనడిగాడు భాస్కర్ బ్రతిమాలుతున్నట్లు.

ఆడపిల్ల అనగానే కమలకి కూడా ఆశగానే అనిపించింది. కానీ అక్కడికి వెళ్ళేందుకు మనస్కరించలేదు ఆమెకు. వాళ్ళంతా కలిసి తన కొడుకును తనకి కాకుండా చేసేస్తారేమోననే భయం ఆమెని పట్టిపీడిస్తోంది.

"మొన్నేకదా వెళ్ళొచ్చాం, ఇంతలోనే ప్రయాణమా నా వల్లకాదు బాబూ" అంది కమల.

భార్య వైఖరి మార్చలేనని గ్రహించిన భాస్కర్ తనే వెళ్ళి పుట్టిన పాపను చూసి వచ్చాడు. ఆ తరువాత కూడా తన అన్నావదినలనూ, తండ్రినీ చూడాలనిపించినప్పుడల్లా ఒక్కడే విశాఖపట్నం వెళ్ళి రాసాగాడు.

అతడు వెళ్ళిన ప్రతిసారీ అందరికీ పేరుపేరునా కానుకలు పంపేది కమల. రవికీ, రమ్యకూ రకరకాల డ్రస్‌లు కొని పంపడమే కాక వచ్చేటప్పుడు ఆ డ్రస్‌లు వేసి ఫోటోలు తీసి తీసుకురమ్మని పురమాయించే కమలను ఎలా అర్థం చేసుకోవాలో బోధపడేది కాదు భాస్కర్‌కి.

అక్కడ విశాఖపట్నంలో రామచంద్ర, జానకిలు కూడా అలాగే అనుకునేవారు.

రవి మాత్రం తన తమ్ముడిని చూడాలని, వాడితో కలిసి ఆడుకోవాలని ఎంతో ఆశ. ఫోటోల్లో తప్ప స్వయంగా తమ్ముడిని చూడలేకపోతున్నందుకు ఎంతో బాధపడేవాడు. కానీ తల్లి బాధపడుతున్న తీరు చూశాక తన బాధను లోలోపలే అణచివేసుకోవడం అలవాటు చేసుకున్నాడు.

రమ్యకు మాత్రం శశికిరణ్ తన స్వంత అన్నయ్య అనే నిజం తెలియనే తెలియదు. ఇంట్లో వాళ్ళు కూడా తెలియచెప్పే ప్రయత్నం చేయలేదు. శశి తన బాబాయి కొడుకు అనే అనుకుంటున్నది. అయినా రవి తన పెద్దన్నయ్య, శశి తన చిన్నన్నయ్య అనుకుంటూ అలాగే పిలుస్తూ ఉంటుంది అభిమానంగా. దూరంగా ఉన్న పిన్ని, బాబాయి, చిన్నన్నయ్య అంటే వల్లమాలిన ప్రేమ రమ్యకు.

హరిప్రసాద్, భాస్కర్‌లు విడని జంటలా ఎలా ఉండేవారో అదేమాదిరిగా హారికా, రమ్యలు ఎంతో స్నేహంగా ఉంటూ అటు హరిప్రసాద్ కుటుంబంలోనూ, ఇటు రామచంద్ర కుటుంబంలోనూ వెన్నెలలు నింపసాగారు.

రమ్య గలగల పారే సెలయేరు లాంటిదయితే హారిక నిండు నదిలాంటిది. చాలా విషయాల్లో ఇద్దరూ భిన్న ధృవాల్లా కనిపించినా, ఒకరంటే ఒకరికి పంచప్రాణాలు. దేహాలు వేరైనా మనసు ఒక్కటే అన్నట్లు ఉంటారు. చదువులోనూ, ఆటపాటల్లోనూ వారిద్దరికీ సాటిపోటీ ఎవరూ లేరన్నట్లుగా ఉంటారు.

హారిక టెంత్‌క్లాస్, రమ్య నైన్త్ క్లాస్ చదువుతున్నారు. ఇద్దరూ రామచంద్ర పనిచేసే స్కూల్‌లోనే చదువుతున్నారు. ఆ ఇద్దరేకాదు, రవి కూడా అదే స్కూల్‌లో చదివాడు.

పిల్లల్లో ప్రతిభ ఉంటే ఎక్కడయినా రాణిస్తారు అనేది రామచంద్ర నిశ్చితాభిప్రాయం. అతడి ఆలోచనలు అనుగుణంగానే రవి, రమ్యా, హారికలు అక్కడే చదువు కొనసాగించారు.

రవి మంచి మార్కులతో టెంత్ పాసవడమే కాక ఎంసెట్‌లో మంచి రేంకు సంపాదించి బి.టెక్, ఎం టెక్ పూర్తిచేసి గీతం కాలేజీలో లెక్చరర్‌గా జాయిన్ అయ్యాడు. అతడికి ఉద్యోగం రావడంతోనే పెళ్ళి కూడా జరిపించారు.

ఆ పెళ్ళికి చాలా సంవత్సరాల తర్వాత భాస్కర్, కమలలతోపాటు శశికిరణ్ రావడం జానకిని ఎంతో ఆనందపరచినా ఆ పెళ్ళిలో కమల ప్రవర్తించిన తీరు జానకి మనసును ఎంతో కలచి వేసింది. కన్నకొడుకుని పరాయివాడిలా దూరం నుండి చూసి ఆనందించే పరిస్థితి వచ్చినందుకు లోలోపలే కుమిలిపోయింది.

రవికి పెళ్ళయిన మూడోనాడు కొడుక్కి క్లాసులు పోతాయంటూ వెళ్ళిపోయారు కమలా, భాస్కర్‌లకు శశికిరణ్‌ని తీసుకుని బెంగుళూరు. కొడుకు రాకకోసం ఆశగా చూసినంతసేపు పట్టలేదు వాళ్ళు రావడానికీ, పోవడానికీను.

ఇంట్లో రమ్యతోపాటు తిరుగుతూన్న హారికను చూస్తే జానకి మనసు శశికిరణ్ మీదకు మళ్ళిపోతున్నది. హారిక నా కోడలు అవుతుందా. కమల పడనిస్తుందా? అసలు నా కొడుకుని మళ్ళీ చూసుకుని మనసారా మాట్లాడుకునే అవకాశమైనా నాకివ్వని కమల ఈ పెళ్ళికి ఎలా ఒప్పుకుంటుంది? కమలకి నా బిడ్డను ఇచ్చి ఎంత తప్పు చేశాను? ఇలా సాగేవి ఆమె ఆలోచనలు.

ఇంట్లో అందరూ ఉన్నా జానకి ధ్యాసంతా చిన్నకొడుకు శశికిరణ్ మీదనే. మనసు ఎంత సరిపెట్టుకోవాలని చూసినా ఆమె వశం కాలేదు. ఆమె చదువూ, సంస్కారం, వివేచనా శక్తి ఈ విషయంలో ఎందుకూ పనికిరాకుండా పోయాయి. అలాంటి సమయంలో హారిక టెంత్ క్లాస్ రిజల్ట్స్ జానకి మనసులోని బాధను కొంతవరకూ మరిపించింది.హారిక ఆ జిల్లాకే ఫస్ట్ రావడం అందరికీ ఎంతో ఆనందాన్ని కలిగించింది. అందరికంటే రమ్య ఎక్కువ ఆనందపడిపోతూ అడిగినవారికీ, అడగనివారికీ తన స్నేహితురాలు సాధించిన ఘనత గూర్చి గొప్పగా చెప్పి మురిసిపోయింది. రమ్య సంబరం చూసి రవి భార్య సుగుణ ఎంతో ఆశ్చర్యపోయింది. ఆ పిల్లకి ఫస్ట్ వస్తే తనకెందుకూ ఇంత సంబరమని. అసలే ఆ పిల్లకి పొగరెక్కువ. ఇక ఈ జిల్లా ఫస్ట్ చూసుకుని మరీ మిడిసిపడుతుంది అనుకుంది సుగుణ లోలోపలే.

అక్కడ.. అభినందన సభలో హారిక ఎంతో నమ్రతగా మాట్లాడుతూ తాను సాధించిన ఈ విజయం తానొక్కదానిదేకాదని తన స్కూల్లో ప్రధానోపాధ్యాయులైన శ్రీరామచంద్రగారిదీ, ఇతర అధ్యాపకులదీ అంటూ పేరు పేరునా అందరికీ ధన్యవాదాలు తెలియజేసింది. ఆ పైన తనకి పారితోషికంగా ఇచ్చిన పదివేల రూపాయలను, విశాఖపట్నంలోని వికలాంగుల స్కూల్‌కి విరాళంగా ప్రకటించి, సభికులను ఆశ్చర్యచకితులను చేసింది.

ఆ మాటలన్నీ విన్న సుగుణ తాను హారిక మీద ఎంత తప్పుడు అభిప్రాయం ఎర్పరచుకుందో తలచుకుని మనసులోనే పశ్చాత్తాప పడింది. ఆ పైన బహుమతిగా వచ్చిన పదివేల రూపాయలను ఏమీ కాకుండా విరాళంగా ఇవ్వడంతో ఇంత చిన్నపిల్లలో ఎంత దొడ్డగుణం బాగుంది అనుకుంది ఆశ్చర్యంగా.

ఆ పైన డిఈఓగారు అడిగిన ప్రశ్నకు తాను ఏం కావాలనుకున్నదీ చెప్పినప్పుడు ఆశ్చర్యపోతూనే అందరూ తమ కరతాళ ధ్వనుల ద్వారా హర్షామోదాలను తెలియజేశారు. సభముగిశాక రవి తన్రఫెండ్ పెళ్ళి ఉండడం వలన సుగుణను తీసుకుని వెళ్ళిపోయాడు.

మిగిలినవాళ్ళందరూ కలిసి హరిప్రసాద్ ఇంటికి వెళ్ళారు. ఇందిర కూతురికి దిష్టి తీసిపోసింది. "ఈ రోజు అందరి కళ్ళూ నా మనవరాలిమీదే" అంటూ పంకజం మరోమారు హారికకు దిష్టితీసింది. ఆదిశేషు "నా మనవరాలు చదువుల సరస్వతి" అంటూ ముద్దులాడాడు.

**హరిప్రసాద్** రిస్టు వాచీ తెచ్చి కూతురి చేతికి పెట్టి బుగ్గలు పుణికి ముద్దుపెట్టుకున్నాడు.

"మావయ్యా, మరి నాకో?" అంది రమ్య తన చేయి చాస్తూ అల్లరిగా.

"దానిలాగే వచ్చే ఏడు నువ్వు కూడా జిల్లా ఫస్ట్ వస్తే అప్పుడిస్తాడు మావయ్య వాచీ" అంది నవ్వుతూ.

"అదెలాగూ సాధిస్తూందిలే అక్కా. అందుకే అడ్వాన్స్‌గా తెచ్చాను, దానికి కూడా" అంటూ మరో వాచీ తీసి రమ్య చేతికి పెట్టాడు హరిప్రసాద్.

సాయంత్రం డిఈఓగారు అడిగినప్పుడు తన కూతురు ఏమాత్రం తడుముకోకుండా తాను ఐ.ఏ.ఎస్ అవ్వాలనుకుంటున్నట్లుగా చెప్పిన దగ్గరనుండీ అతడి మనసు మబ్బుల్లో తేలిపోతున్నట్లు వుంది. హారిక తెలివైనదీ, పట్టుదల కలది అని తెలుసు కానీ, తన చిట్టితల్లి

మనసులో ఇంత బ్రహ్మాండమైన ఆశయం, కోరికా దాగి ఉన్నాయని అతడికి ఏమాత్రం తెలియదు ఇంతవరకూ. మాటలకందని ఆనందోద్వేగాలతో ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నాడు. ప్రేమగా కూతుర్ని దగ్గరకు తీసుకుని హృదయానికి హత్తుకున్నాడు.

రామచంద్ర హారికను దగ్గరకు పిలిచి "ఇది నా బహుమతిరా" అంటూ తాను తెచ్చిన సెల్‌ఫోన్ హారిక చేతిలో పెట్టాడు.

కూతురి చేతిలో ఫోన్ చూసి తెల్లబోయాడు హరిప్రసాద్. "చిన్నపిల్ల ఎందుకు బావా, దానికి సెల్‌ఫోన్?" అన్నాడు వారిస్తున్నట్లుగా.

"ఉండనీయరా. మీ బావగారు సరదాపడి తెచ్చారు" అంది జానకి.

హారిక మెరుస్తున్న కళ్ళతో ఎంతో అపురూపంగా ఫోన్ వైపే చూస్తూండిపోయింది. రమ్య కూడా హారిక చేతిలోని ఫోన్ వంకే ఆసక్తిగా చూడసాగింది.

కూతురి కళ్ళల్లోని ఆసక్తిని గమనించి "ఏరా నీక్కూడా కావాలా ఫోను?" అన్నాడు రామచంద్ర నవ్వుతూ.

"ఎందుకులెండి నాన్నా. కావాలంటే మాత్రం ఇస్తారా? ఏమిటి? వచ్చే ఏడు హారికలా జిల్లా ఫస్ట్ తెచ్చుకుంటే ఇస్తామంటారు" అంది రమ్య తల్లివంక కినుకగా చూస్తూ.

"లేదురా, నీక్కూడా తెచ్చాను చూడు. మీ అమ్మే నీక్కూడా కొనమంది" అంటూ మరో ఫోన్ తీసి కూతురి చేతిలో పెట్టాడు రామచంద్ర.

ఫోన్ చూడడంతోనే రమ్య ముఖం ఆనందంతో వెలిగిపోయింది. "థేంక్స్ నాన్నా!" అంటూ ఎగిరి తల్లి బుగ్గమీద ముద్దు పెట్టుకుంది. ఒకేసారి ఇద్దరికీ థేంక్స్ చెప్తున్నట్లుగా. అందరూ మురిపెంగా రమ్య వైపు చూశారు.

భోజనాలు చేస్తూండగా హరిప్రసాద్ "రవీ, యశ్వంత్‌లు ఉంటే ఇంకా బాగుండేదక్కా" అన్నాడు.

"రవి వాడి ఫ్రెండ్ పెళ్ళికి తప్పనిసరిగా వెళ్ళాలని నీకు ముందే చెప్పాడు కదరా. అయినా వాడు లేడని నిష్ఠూరం ఆడుతున్నావు. ఇంక యశ్వంత్ సంగతి. వాడు వీసా కోసం తప్పక వెళ్ళాలని నీకూ తెలుసు. అయినా ఇక్కడ ఉన్నవాళ్ళందరూ నీకంటికి ఆనడం లేదేంట్రా. వాళ్ళ గూర్చి ఆలోచిస్తున్నావు?" అంది జానకి మందలింపుగా.

"అదికాదక్కా యశ్వంత్ ఎలాగూ దూరంగానే ఉన్నాడు. కనీసం రవైనా ఉంటే బాగుండును అని అలా అన్నాను" అంటూ నవ్వాడు.

"పోన్లే జానకీ, వాడి చాదస్తం వాడిది. ఏం మాట్లాడకు" అంటూ నవ్వాడు రామచంద్ర, అతడి మనసును అర్ధం చేసుకున్నట్లుగా.

హారిక ఇంటర్‌లో ఏ గ్రూపు తీసుకుంటే బాగుంటుంది అనే చర్చ వచ్చింది.

"మీరే చెప్పండి మావయ్యా. ఏ గ్రూపు తీసుకోను?" అని అడిగింది హారిక ఉత్సాహంగా.

"హెచ్.ఈ.సీ తీసుకోమ్మా. అదైతే నీవనుకున్న గమ్యం చేరేందుకు అనుకూలంగా ఉంటుంది" అన్నాడు రామచంద్ర.

చదువంటే ఎంతో ఇష్టం గల జానకి తాను కూడా ఆ చర్చలో ఉత్సాహంగా పాలు పంచుకుంది.

"అవును హారికా, హెచ్.ఈ.సీ తీసుకో" అంది జానకి. తమ కళ్ళముందు పుట్టిన ఈ చిన్నారి ఆశలు తప్పక నెరవేరాలి అన్నట్లుగా.

"అవునే హారికా, మనిద్దరం ఇలా విడిపోతున్నామేంటే. నువ్వు కాలేజీకి, నేను స్కూల్‌కీ అమ్మో, నువ్వు లేకుండా నేను స్కూల్‌కి ఎలా వెళ్ళాలే?" అంది రమ్య దిగులుగా.

"ఛ, అలా అని ఎందుకనుకుంటున్నావు? మనమెప్పుడూ కలిసే ఉంటాము. ఎందుకంటే స్నేహం అనేది ఇంద్రధనస్సులాంటిదట. అది రెండు హృదయాల మధ్యా వంతెనలా ఎప్పుడూ కలిపే ఉంచుతుందట. ఆ పైన ఈ ఫోన్ ఉండనే ఉంది కదా రోజూ మాట్లాడుకునేందుకు" అంటూ చేతిలో ఉన్న ఫోన్ వంక చూపించి నవ్వింది.

అంత చిన్నపిల్ల ఇంత గొప్ప భావాన్ని వ్యక్తం చేయడం చూసి రామచంద్ర విస్మయం చెందాడు. సందేహం లేదు. ఈ చిన్నారి తాను అనుకున్నది తప్పక సాధించి తీరుతుంది అనుకున్నాడు.

జానకి ఎంతో ఉత్సాహంగా ఎలా చదవాలో ఇంటర్‌నుండీ తాననుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు ఎలా పునాది వేసుకోవాలో చెప్పసాగింది.

"అవునమ్మా! ఇక్కడ నుండి నీకు ప్రతి క్షణమూ అమూల్యమైనదే. న్యూస్ పేపరు రెగ్యులర్‌గా చదువుతూ కరెంట్ ఎఫైర్స్ గూర్చి ఒక అవగాహన ఏర్పరచుకోవాలి. మీ అత్త చెప్పినట్లు ముఖ్యమైన సంఘనలన్నీ తేదీలతో సహా నోట్ చేసి పెట్టుకుంటే రిఫరెన్సుకి బాగా పనికి వస్తుంది. అలాగే జనరల్ నాలెడ్జి బాగా డెవలప్ చేసుకోవాలి. సివిల్స్‌కి ప్రిపేర్ అవడం అనేది ఆషామాషీ విషయం కాదు. ఎప్పుడో డిగ్రీ అయ్యాక మొదలు పెడదాం అంటే కుదరదు. ఇప్పటినుండే తపస్సులా నీ కృషి ప్రారంభించాలి. జ్ఞాపకశక్తి బాగా పెరిగేందుకు రోజూ అరగంట పాటైనా మెడిటేషన్ చెయ్యి" అంటున్న రామచంద్రను మధ్యలోనే ఆపుతూ.. "చిన్నపిల్ల దానికి ఇప్పటినుండే మెడిటేషన్ అంటే ఏం తెలుస్తుంది బావా?" అన్నాడు హరిప్రసాద్.

"మెడిటేషన్ అనగానే ఆధ్యాత్మికం అనుకుంటున్నావు కదూ. అదొక్కటే కాదు. శ్వాస మీద ధ్యాస పెట్టడంవలన మెదడు చురుగ్గా పనిచేస్తుంది. ధారణాశక్తి పెరుగుతుంది. అది హారికకు ఫ్యూచర్‌లో ఎంతో ఉపయోగపడుతుంది హరీ" అన్నాడు రామచంద్ర.

తనకి మెడిటేషన్ చాలా ఉపయోగపడుతుందని మేనమామ చెప్పడంతోనే ఎంతో ఉత్సాహం కలిగింది హారికకు. "చేస్తాను మావయ్యా, మీరు చెప్పినట్లే మెడిటేషన్ చేస్తాను. కానీ ఎలా చెయ్యాలో నాకు రాదే" అంది కొంచెం నిరుత్సాహంగా.

"ఓ నాలుగు రోజులు మా ఇంటికి వచ్చి ఉంటే నీకూ, రమ్యకూ ఇద్దరికీ నేర్పుతాను" అన్నాడు రామచంద్ర.

కూతురి ఉత్సాహం చూసి హరిప్రసాద్ కూడా ఆనందపడిపోతూ "దీనిదంతా మా అక్కపోలికే బావా. చదువంటే ఆరోప్రాణం దీనికి" అన్నాడు కూతురి ముంగురులు ప్రేమగా సవరిస్తూ.

"ఏం లాభం? అంత ఆసక్తి ఉన్నదాన్ని తీసుకువెళ్ళి వంటింటి కుందేలును చేసి తన ఆశల్నీ, టేలంటునీ వృధా చేశాను నేను" అన్నాడు రాంచంద్ర బాధగా.

అది వింటూనే అతడి వైపు అభిమానంగా చుస్తూ "ఎందుకు బావా, అలా మాట్లాడుతున్నావు నువ్వీ రోజు.. నేనెప్పుడూ ఆ రకంగా అనుకోలేదు. డిగ్రీలు చదువుకు కొలబద్ద కాదని నా ఉద్దేశ్యం. నీ సాహచర్యంలో ఎన్నో నేర్చుకున్నాను. ఎంతో విజ్ఞానాన్ని సంపాదించాను. మాలతీ చందూర్‌గారు ఏ డిగ్రీలు చదివి అంత మేధావి అయ్యారు? ప్రపంచం అంతా ఆమెని ఎందుకలా ఆరాధించి గౌరవిస్తున్నారు? ఒకప్పుడు ఆంధ్రప్రభలోనూ, నిన్నా మొన్నటివరకూ స్వాతిలోనూ ఆమె ఇచ్చే జవాబుల వలన ఎంతో మంది ప్రభావితులై మంచి మంచి రచనలు చేసి సమాజానికి అందించారు. నీ దృష్టిలో డిగ్రీయే చదువుకు కొలబద్ద అయితే నేను కూడా ఎం.ఏ పాసయి ఈ రోజు జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా చేస్తున్నాను కదా. చాలదా?" అంది ఆరాటంగా భర్తవంక చూస్తూ.

అతడు తన చదువు గురించి ఇన్ని సంవత్సరాలుగా మనసులో బాధపడుతున్నాడనే భావన జానకిని స్థిమితంగా ఉండనివ్వలేదు.

అయినా రామచంద్ర భార్య వివరణతో సంతృప్తి పడలేదు. "ఎప్పుడు పూర్తిచేశావు. నలభై ఏళ్ళు వచ్చాకా?" అన్నాడు దిగులుగా.

"ఎప్పుడైతేనేం చేశాను కదా! అంతకు ముందు నేను నిర్వహించిన బాధ్యతలు తక్కువైనవా? భార్య పోస్టులో నిన్ను మెప్పించి సక్సెస్ అయ్యానా, లేదా? తల్లిలేని బాచీకి తల్లినై అతడి బాధ మురిపించాను చాలదా? మీ నాన్నగారు ఎన్నోసార్లు నాకు కూతురులేని లోటు జానకి తీర్చిందని నీతో అన్నారని చెప్పావు కదా నువ్వే. ఏ డిగ్రీలు ఇవ్వలేని సంతృప్తినీ, సంపదనూ అవన్నీ ఇచ్చాయి కద బావా నాకు. ఇంత ఆనందకరమైన సమయంలో లేనిపోని ఆలోచనలతో మనసు కలతపెట్టుకోకు బావా" అంది జానకి అనునయంగా.

"అవును బావా, అక్క చెప్పింది నూటికి నూరుపాళ్ళు నిజం. మనం ఇలా ఉంటే పిల్లలు చూడు, ఎలా బిక్కచచ్చిపోయారా?" అన్నాడు హరిప్రసాద్ వాతావరణాన్ని తేలిక పరిచే ఉద్దేశ్యంతో.

"సరే లేవోయ్, తానా అంటే తందానా అంటూ మీ అక్క మాటని నువ్వు సమర్థించనిదెప్పుడు?" అంటూ నవ్వాడు రామచంద్ర.

అతడి నవ్వు చూసి అందరి మనసులూ తేలికపడ్డాయి.

చూస్తుండగానే హారిక ఇంటర్ పూర్తిచేసి డిగ్రీలో జాయిన్ అయింది. రమ్య ఇంటర్ సెకండియర్‌లోకి వచ్చింది.

ఆదిశేషూ, పంకజాలు ఒకరి తర్వాత ఒకరు ఈలోకం నుండి నిష్క్రమించారు. తల్లిదండ్రుల ఎడబాటుతో దిక్కుతోచని పక్షిలా అల్లాడిపోతున్న హరిప్రసాద్‌ని జానకీ, రామచంద్రలు తల్లిదండ్రులై ఊరడించారు. ఆ పైన భాస్కర్ అనునయ వాక్యాలతో తిరిగి అతడిని మనుషుల్లో పడేలా చేసింది.

హారిక రామచంద్ర చెప్పినట్లే చాలా సీరియస్‌గా చదువుతోంది. ఏ చిన్న విశేషం కనిపించినా, దాన్ని కూలంకషంగా అధ్యయనం చేసి తన మెదడులో నిక్షిప్తం చేసుకుంటోంది. సుగుణ కూడా జానకితోపాటు హారికకు అవసరమైన సమాచారాన్ని సేకరించడంలో ఉత్సాహంగా పాలు పంచుకుంటోంది.

హారిక ఏ కాస్త సమయం చిక్కినా, మేనత్తగారింటికి వెళ్ళి రమ్యతో కాసేపు గడిపి రిలాక్స్ అవుతోంది. అదే సమయంలో చదువులో తన పురోగతి గూర్చి ఎప్పటికప్పుడు జానకితో చెపుతూ ఆమె సలహాలు తీసుకుంటోంది.

రమ్య తన స్నేహితురాలితో సరదాగా గడుపుతున్నప్పటికీ, ఆమె చదువుకి ఎటువంటి ఆటంకం లేకుండా చూసుకోసాగింది. ఆ పైన రవి కూతురు కావ్య ఆటపాటలతో ఎవరికీ పొద్దే తెలియడంలేదు.

ఆ రోజు ఆదివారం కావడంతో రమ్యతో కాసేపు గడిపి వద్దామని మేనత్తగారింటికి వెళ్ళింది హారిక.

ఆమెని చూస్తూనే "రావే హారికా, నీకోసమే చూస్తున్నాను. ఇంకా రాలేదేమిటా అని" అంది జానకి ఉత్సాహంగా.

"ఏమిటత్తా విశేషం?" అంది హారిక ఆసక్తిగా.

"విశేషమేమీ లేదులేవే. నిన్న హిందూలో ఓ ఆర్టికల్ పడింది. అది నువ్వు చూశావో, లేదోనని కట్ చేసి ఉంచాను" అంటూ పేపర్ కటింగ్ హారిక చేతికిచ్చింది జానకి.

సుప్రీం కోర్టు జడ్జీగా పనిచేసి రిటైరైన మార్కండేయ కట్జూగారు రాసిన ఆర్టికల్ అది.

"ఆయన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఛైర్ పర్సన్‌గా కూడా పనిచేశారు. ఇలాంటివన్నీ చదివితే నీకు మన దేశం గూర్చి సమగ్రమైఅన్ అవగాహన వస్తుందని మీ మావయ్య కూడా అన్నారు" అంది జానకి.

"అలాగా" అంటూ ఆ కటింగ్ తీసుకుని చదవసాగింది.

"వందల సంవత్సరాలు హిందూ ముస్లిమ్‌లు అన్నదమ్ముల్లా స్నేహంగా ఉండేవారు. ఒకరి పండుగల్లో ఒకరు ఉత్సాహంగా పాలు పంచుకునేవారు అని రాశారు. మొగలాయిలు మనదేశం మీదకి దండయాత్రకి వచ్చినప్పుడు మన దేవాలయాలను నాశనం చేసిన మాట వాస్తవమే. కానీ తర్వాత వచ్చిన పాలకులు మత సామరస్యాన్ని పాటించారు. వారిలో ప్రముఖంగా చెప్పుకోవలసిన వ్యక్తి అక్బర్ పాదుషా. అతడు హిందువులను గౌరవించడమే కాదు, సంబంధ బాంధవ్యాలు పెంచుకున్నాడు. హిందూ రాజకుమార్తెను తన పట్టపు రాణిని చేసుకున్నాడు. అశోకుడులాంటి పాలకుడు ప్రపంచంలో ఎక్కడాలేడని ప్రశంసించాడు. మంచి ఎక్కడున్నా అనుసరణీయమే అన్నాడు.

కానీ వ్యాపార నిమిత్తం మనదేశం వచ్చిన ఆంగ్లేయుల సంస్థానాల మధ్య, రాజుల మధ్య తగవులు పెట్టి, పెంచి పోషించి ఏదో పక్షానికి కొమ్ము కాసి వాళ్ళకి సాయం చేసినట్లు నటిస్తూనే మొత్తం మనదేశాన్ని కైవసం చేసుకున్నారు. 1857లో ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా ఝాన్సీరాణి నాయకత్వాన హిందూ, ముస్లింలు కలిసి పోరాడారు. యుద్ధంలో విజయం సాధించలేకపోయినా, బ్రిటిష్ పాలకులను గడగడలాడించారు. వారి పాలన సుస్థిరంగా ఉండాలంటే, రెండు మతాల మధ్యా చిచ్చు పెట్టడం ఒకటే దారి అనుకున్నారు. అలా విభజించి పాలించు అనే పాలసీని వాళ్ళు మన దేశం విడిచి వెళ్ళేవరకూ అనుసరించారు.

రహస్యంగా పండిట్‌జీలను పిలిపించి, వాళ్ళకు పెద్ద మొత్తాల్లో ధనాన్ని ఇచ్చి హిందూ వేదికల మీద ముస్లింలు చెడ్డవారని, మన మతాన్నీ, దేవాలయాలను ధ్వంసం చేశారని వారు మన శత్రువులని ప్రచారం చేయమన్నారు. అలాగే మౌల్వీలను రహస్యంగా పిలిచి వారికీ డబ్బిచ్చి, హిందువులను అదేరకంగా విమర్శించమని చెప్పారు. ఆ పైన పాత పాఠ్యపుస్తకాలన్నిటినీ నాశనం చేసి ఒకరిపై ఒకరికి ద్వేషం కలిగేలా చరిత్ర పుస్తకాలు రాయించి ఉగ్గుపాలతో మనదేశ ప్రజానీకంలో అంత వైషమ్యాలను రంగరించి మనలో మనం కొట్టుకు చచ్చేలా చేశారు. చివరికి మన దేశాన్ని విడిచిపోతూ, దేశాన్ని రెండు ముక్కలు చేసి పోయారు. గతంలో సంస్థానాధీశులు పరస్పరం కొట్టుకు చచ్చినట్లే వీళ్ళు మతాల కోసం కొట్టుకు చచ్చి తిరిగి తమనే ఆశ్రయిస్తారు అనుకున్నారు.

వాళ్ళు ఆశించినట్లు యథాతథంగా జరగకపోయినా, ఆనాడు వారు వేసిన అగ్నికణం రగిలి రగిలి దావనంలా మారి ఈనాడు అరాచకం, ఉగ్రవాదం, బాంబు దాడుల రూపం తీసుకుంది.

వలస పాలకులుగా వచ్చిన వారు బ్రిటిష్‌వారు. దండయాత్రలతో మనదేశానికి వచ్చినాకూడా, మనతో మమేకమై సహజీవనం చేస్తున్నవారు ముస్లింలు. అసలు సర్వమతాలనూ సమానంగా చూడాలనేది మన రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాల్లో పొందు పరుచుకున్నాము. మతం అన్నది వ్యక్తిగతమైనదే తప్ప దానికి పాలనా యంత్రాంగంలో ఎలాంటి సంబంధం ఉండకూడదు అని రాసుకున్నాం. దాన్ని సరైన రీతిలో ఆచరిస్తే సెక్యులరిజం ఈజ్ ది ఓన్లీ పాలసీ, వుచ్ కెన్ హోల్డ్ అవర్ కంట్రీ టు గెదర్ అండ్ టేకిట్ టు ది పాత్ ఆఫ్ ప్రోస్పరిటీ అన్నారు రాజ్యాంగ రూపకర్త" అంటూ ముగించారు ఆయన.

"మొన్న ఉద్యోగ రీత్యా బెంగుళూరులో ఉన్న ఈశాన్యవాసులకు ఏం జరిగిందో నీకూ తెలుసు. అలా ఆయన రాసిన ఒకో విషయం చదువుతూంటే నాకు మతిపోయింది హారికా. అందులో విషయాలు కొన్ని నాకు తెలిసినా, ఎక్కువ భాగం తెలియనివేనమ్మా అందుకే అవన్నీ నీకు బాగా ఉపయోగపడతాయని మావయ్య అన్నారు" అంది జానకి.

"నిజమే అత్తా, చాలా బాగా రాశారు ఆయన. చరిత్రలో భూస్థాపితం అయిన విషయాలు ఆయన మూలంగా వెలుగు చూశాయి ఈరోజు" అంది హారిక.

మాటల మధ్యలో జానకి గుండె చేత్తో పట్టుకుని గోడకి చేరబడడం చూసి "ఏమిటత్తా, ఏమయింది?" అనడిగింది హారిక ఆదుర్దాగా.

"ఏమీలేదే, ఈ మధ్య గుండెల్లో కొద్దిగా నొప్పిగా అనిపిస్తోంది, అంతే" అంది జానకి మామూలుగా ఉండడానికి ప్రయత్నిస్తూ.

"అయ్యో మరైతే డాక్టర్ గారికి చూపించుకోవచ్చుకదా అత్తా" అంది హారిక కంగారుగా.

"అబ్బ, కంగారు పడకే, డాక్టర్ దగ్గరకు వెళితే ఆయన మజిల్ పెయిన్ అయివుంటుందని పెయిన్ కిల్లర్స్ రాసిచ్చారు. అవి వేసుకుంటున్నా. ఆ నొప్పి అలా అప్పుడప్పుడూ పలకరించి పోతోంది" అంది జానకి నవ్వడానికి ప్రయత్నిస్తూ.

"ఆయన సరిగా చూసి ఉండరత్తా. నువ్వు వెంటనే స్పెషలిస్టుకి చూపించుకుంటే మంచిది. చూడు ముఖమంతా ఎలా చెమటలు పోసేస్తోందో. ఉండు మామయ్యను పిలుచుకు వస్తాను" అంటూ లేచింది హారిక వెనకనుండి జానకి పిలుస్తున్నా వినిపించుకోకుండా హారిక చెప్పింది వింటూనే, రామచంద్ర ఆదుర్దాగా వచ్చాడక్కడికి. భార్య పరిస్థితి చూసి కంగారుగా రవిని పిలిచాడు. వెంటనే ఇద్దరూ కలిసి జానకిని హాస్పటల్‌కు తీసుకువెళ్ళారు.

నెలరోజుల క్రితం శంకర్రావు మరణం రామచంద్రని బాగా క్రుంగదీసింది. ఇప్పుడు అనుకోని ఈ విపత్తు అతడ్ని మరింత భాధకు గురిచేసింది. హారికా, రమ్యా, సుగుణా ఒకరికొకరు ధైర్యం చెప్పుకుంటూ గడిపారు. అక్కగారికి బాగోలేదని తెలిసి హరిప్రసాద్ పరుగుపరుగున హాస్పటల్‌కు వచ్చేశాడు.

జానకిని హాస్పటల్‌లో ఎడ్మిట్ చేసుకుని టెస్టులన్నీ చేసి బైపాస్ సర్జరీ చేయాలని తేల్చారు డాక్టర్స్.

అసలే జానకి షుగర్, బి.పిలతో బాధపడుతుంటే ఇప్పుడు ఇదొకటా తన ప్రాణానికి అనుకున్నాడు రామచంద్ర.

అసలే తమ్ముడు దూరమై దిగులుతో కృంగిపోతున్న అమ్మ ఈ ఆపరేషన్‌కి తట్టుకోగలదా?

మూలిగే నక్కమీద తాటిపండు పడ్డట్లు తాతయ్య జబ్బువలన పడిన బాధలు, ఖర్చులూ, ఆపైన ఆయన పోయిన బాధనుండి ఇంకా తేరుకోలేదు. ఇలాంటి సమయంలో ఇదేమిటి అమ్మకిలా అయింది అనుకున్నాడు రవి బాధగా.

తండ్రి, కొడుకులు ఇద్దరు ఒకరివైపు ఒకరు దిగులుగా చూసుకున్నారేగానీ, నోరు తెరిచి మాట్లాడేందుకు ఎవరికీ ధైర్యం చాలనేలేదు.

జానకిని రెండు రోజులు హాస్పటల్లో ఉంచి తాత్కాలికంగా ట్రీట్‌మెంటు ఇచ్చి ఇంటికి పంపిస్తూ "ఎంత వీలైతే అంత తొందరగా ఈమెకు సర్జరీ చేయిస్తే మంచిది. లేకపోతే ప్రాణానికే ప్రమాదం. మేమిచ్చే మందులతో పాటు బలమైన పౌష్టికాహారాన్ని వ్వండి" అన్నారు డాక్టర్లు.

ఆపరేషన్ అనగానే మరింత ఢీలా పడిపోయింది జానకి. ఎవరెంత ధైర్యం చెప్పినా స్థిమిత పడలేదు ఆమె.

"చిన్నాడిని చూసి అప్పుడే నాలుగేళ్ళు అయిపోయింది. వాడిని చూడాలని నా మనసెంత తహ తహలాడుతోందో మీకూ తెలుసు. ఇన్నాళ్ళూ వాడి చదువు వంకతో వాడిని ఇక్కడికి రాకుండా చేసింది కమల. కనీసం మీ నాన్నగారు పోయినప్పుడైనా వస్తాడనుకుంటే ఇంటర్వ్యూ ఉందంటూ అప్పుడూ రాలేదు. ఇంకెప్పుడు వస్తాడు వాడు? అసలు నేను బ్రతికి ఉండగా వాడిని చూస్తానంటారా?" అని హృదయవిదారకంగా ఏడుస్తున్న భార్యని ఓదార్చేందుకు మాటలు దొరకలేదు రామచంద్రకు.

"వద్దు జానకీ, అలా మాట్లాడకు. నీకేం కాదు. నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డేసి కాపాడుకుంటాను. ఇంతకాలం కష్టంలోనూ, సుఖంలోనూ నా తోడు నీడగా ఉన్న నువ్వు ఇప్పుడు అర్ధాంతరంగా నన్ను విడిచి ఎక్కడికి వెళ్తావు? నీకు కావలసింది చిన్నాడిని చూడడమే కదా బాచీతో చెప్పి వాడిని ఇక్కడకు రప్పిస్తాను, సరేనా?" అన్నాడు రామచంద్ర అనునయంగా.

"ఎంత పిచ్చివాడివి బావా నువ్వు, మనం అడిగితే మాత్రం కమల వాడిని ఇక్కడకు పంపిస్తుందా? వాడి పెళ్ళి నా తమ్ముడి కూతురుతో చేయాలని ఎన్ని కలలు కన్నాను? అది ఇష్టం లేకే కదా కమల శశిని మనకి దూరం చేసింది. కమలతో చెప్పు బావా, అలాంటి ప్రయత్నం ఏదీ నేను చేయనని. ఒక్కసారంటే ఒక్కసారి వాడిని కళ్ళారా చూసుకుని, తిరిగి అక్కడికి పంపిచేస్తానని చెప్పు" అంది జానకి ప్రాధేయపడుతున్నట్లుగా అతడి వంక చూస్తూ.

ఒక పక్క శశికిరణ్‌ని కమల ఇక్కడకు పంపించదు అని చెప్తూనే తిరిగి పంపించమని అడగమంటూంది. తన మాట మీద తనకే నమ్మకం లేకపోయినా, ఏదో ఆశా, ఆతృతా ఆమెతో అలా మాట్లాడిస్తోంది.

రామచంద్ర ఎంతో ఓదార్చినా అదే మనోవేదన ఆమె ఆరోగ్యాన్ని మరింత క్షీణింప జేసింది. ఏ క్షణాన ఏం జరుగుతుందనే బెంగతో ఇంట్లో వాళ్ళందరూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని తిరగసాగారు.

ఆపరేషన్‌కు తట్టుకునే శక్తి ఆమెకు లేకపోవడం వలన ఎప్పటికప్పుడు ఆపరేషన్‌ని వాయిదా వేయసాగారు.

రామచంద్ర ఎన్నో విధాలుగా భార్యను ఊరడించాలని ప్రయత్నించాడు. కానీ సాధ్యంకాలేదు. ఇంత సున్నితమైన మనసున్న భార్యకు బిడ్డను దూరంచేసి చాలా తప్పుచేశాను అని లోలోపలే బాధపడసాగాడు అతడు.

రవికి కూడా తల్లి మనోవేదనను ఎలా తీర్చాలో అర్థమయ్యేదికాదు.

"అమ్మా! నీ బాధ నేను అర్థం చేసుకోగలను. అయినా తమ్ముడొక్కడేనా నీ బిడ్డ? నేనూ, చెల్లీ కామా అమ్మా. మా ఇద్దరి కోసమైనా నీ మనసు కుదుటపరచుకోవాలి కదమ్మా. నువ్విలా మనోవేదనతో కృంగిపోతూ ఉంటే నీ ఆరోగ్యం ఏంకాను. నీకేదైనా అయితే మేమంతా ఏం కావాలమ్మా?" అంటుఉన్న రవిని మధ్యలోనే వారించింది జానకి."

"అంతమాట అనకు నాన్నా. మీరంతా చల్లగా ఉండాలి. నేనూ అనుకుంటూనే ఉంటాను. నేనిలా బాధపడడం, ఆలోచించడం సరైందికాదని. కానీ ఎంత ప్రయత్నించిన మనసును కంట్రోలు చేసుకోలేకపోతున్నాను. ఈ మధ్య నా ఆరోగ్యం పాడైన దగ్గర నుండీ తమ్ముడి మీద ఒకటే ధ్యాసగా ఉంది. వాడి పెళ్ళి కళ్ళారా చూడకుండా పోతానేమోనని దిగులుగా ఉంది నాకు" అంది జానకి చెమరించిన కళ్ళతో.

"ఛ, అవేం మాటలత్తయ్యా. మీరు నిండు నూరేళ్ళు చల్లగా ఉంటారు. శశి పెళ్ళి, రమ్య పెళ్ళి దగ్గరుండి జరిపిస్తారు. మన చిట్టి తల్లి కావ్య అచ్చట్లు, ముచ్చట్లు ఎవరు తీరుస్తారు చెప్పండి. మీరు కాక. ఆ పైన శశి పిల్లల్ని, రమ్య పిల్లల్ని చూడాలా, వద్దా? ఇవన్నీ వదిలేసి మీరెక్కడికి వెళ్తారనీ?" అంది సుగుణ ఆశాభావంగా జానకి చేతులను తన చేతుల్లోకి తీసుకుంటూ."

"అదికాదు సుగుణా. ఈ ఆపరేషన్ అయితే నేను బ్రతుకుతానో, లేదో?" అంది జానకి అనుమానంగా చూస్తూ.

అంతవరకూ వాళ్ళ సంభాషణ వింటూన్న రామచంద్ర "అయితే, అందుకేనా జానకీ ఆపరేషన్ వద్దంటున్నావు? ఆపరేషన్ మానేసి పళ్ళబిగువున ఈ బాధను ఎన్నాళ్ళు భరిద్దామనుకుంటున్నావు? అసలు అది సాధ్యపడుతుందనే అనుకుంటున్నావా నువ్వు? ఎంతసేపూ దూరంగా ఉన్న చిన్నాడి గూర్చే ఆలోచిస్తావు కానీ, కళ్ళెదుట ఉన్న రమ్య గూర్చి ఆలోచించవెందుకని?

మగపిల్లలు వాళ్ళెలాగైనా బ్రతికేస్తారు. ఆడపిల్లకే తల్లి అవసరం ఎక్కువ ఉంటుంది. దాన్నేం చేసి పోదామనుకుంటున్నావు? అసలిదంతా సరే, ఈ వయసులో నన్ను.. నన్నేం చేసి.." ఆపైన మాట్లాడలేక టవల్ అడ్డం పెట్టుకుని అక్కడనుండి లేచాడు రామచంద్ర. రవి చప్పున తండ్రి భుజంమీద చేతులు వేసి "ఏమిటి నాన్నా, మీరు కూడా. అమ్మకి ధైర్యం చెప్పవలసింది పోయి మీరే ఇలా దిగులుపడితే ఎలా? మీరే ఇలా అయిపోతే మా పరిస్థితి ఏమిటి నాన్నా?" అన్నాడు చెమ్మగిల్లిన కళ్ళను ఒత్తుకుంటూ.

"ఏం చేయనురా. రోజురోజుకీ కృశించిపోతున్న అమ్మని చూస్తూంటే నా కాళ్ళూ చేతులూ ఆడడం లేదురా" అన్నాడు రామచంద్ర బేలగా చూస్తూ.

"అత్తయ్యగారికి ఏంకాదు మావయ్యగారూ. ఆపరేషనయిపోతే అంతా నార్మల్ అయిపోతుంది నాకా నమ్మకం ఉంది" అంది సుగుణ.

"అంత డబ్బు ఇప్పుడు ఎక్కడనుండి తెస్తారమ్మా. రవి నిన్నగాక మొన్న ఉద్యోగంలో జాయిన్ అయ్యాడు. మీ మామయ్యగారి రిటైర్మెంట్ బెనిఫిట్స్‌లో చాలాభాగం తాతగారి జబ్బుకోసం ఖర్చయింది. మిగతాది ఇదిగో ఈ ఏడాదిగా నేను ఇలా హాస్పటల్‌లో జాయిన్ అయినప్పుడల్లా వేలకు వేలు ఖర్చయిపోతూనే ఉన్నాయి. ఇప్పుడు ఆపరేషన్‌కు లక్షలు కావాలంటున్నారు. ఎక్కడినుండి తెద్దాం?" అంది జానకి దీనంగా."

"మీ అబ్బాయి ఆఫీసులో ఏవో లోన్లు పెట్టి డబ్బు తెస్తానంటున్నారు. ఆ పైన నా నగలున్నాయి. అమ్మేద్దాం. అవీ చాలకపోతే చిన్నమావయ్యగార్ని అడుగుదాం. ప్రాణం కంటే ఏదీ ఎక్కువకాదు కదా" అంది సుగుణ.

"అవునమ్మా అలా చేద్దాం. నీకంటే మాకు ఏదీ ఎక్కువ కాదు" అన్నాడు రవి.

"ఒద్దురా. ఛస్తానో బ్రతుకుతానో తెలియని నాకోసం ఇంత డబ్బు వృధా చేయకండి" అంది జానకి ఆయాసపడుతూనే.

"వద్దు జానకీ నా ముందెప్పుడూ అలాంటి మాటలు మాట్లాడకు. రేపే బాచీకి ఫోన్ చేస్తాను. మనమింత కష్టంలో ఉంటే చూస్తూ ఊరుకోడు వాడు" అన్నాడు రామచంద్ర.

"బాచీని డబ్బడుగుతారా? వద్దు, కమల తీరు చూశాక వాళ్ళని అడగడం నాకిష్టంలేదు" అంది జానకి కళ్ళు తుడుచుకుంటూ.

ఆ పరిస్థితుల్లో కూడా తల్లి తన ఆత్మాభిమానాన్ని వదులుకోకపోవడం గమనించిన రవి, "పోన్లే నాన్నా అమ్మకిష్టం లేని పని మనం ఎందుకు చేయాలి. మనమే ఏవో తంటాలు పడదాం" అన్నాడు.

కొడుకు మాటలకు అవునని గానీ కాదని గానీ అనకుండా మౌనంగా అక్కడినుండి లేచి వెళ్ళిపోయాడు రామచంద్ర.

దాదాపు నలభై ఏళ్ళు ఉద్యోగం చేసి సంపాదించినా ఈరోజు అవసరానికి మరొకరి ముందు చేయిచాచాల్సిన పరిస్థితి రావడం అతడికి చాలా బాధగా ఉంది.

కానీ ఎన్నో కష్టాలు పడి పెంచిన తండ్రి కేన్సర్‌తో బాధపడుతూంటే చూస్తూ ఉండలేకపోయాడు. సర్వశక్తులూ ఒడ్డి తండ్రిని బ్రతికించుకోవాలనే చూశాడు. కానీ సాధ్యం కాలేదు. రామచంద్రానికి మిగిలిన తృప్తి ఏమిటంటే తండ్రి చివరిరోజులు ప్రశాంతంగా గడిపి నిశ్చింతగా తన ఒడిలోనే కన్నుమూశాడని.

నిజానికి తండ్రి సుస్తీ కోసం సగం ఖర్చు తమ్ముడిని భరించమని అడిగి ఉంటే భాస్కర్ కాదనేవాడు కాదు. అప్పుడు తన దగ్గర ఉంది కదా అని తమ్ముడిని అడగలేదు రామచంద్ర. అక్కడికీ భాస్కర్ ఎంతో కొంత అప్పుడప్పుడూ తండ్రికోసం పంపాడేగానీ అన్నయ్యకు ఎంత ఖర్చవుతుంది? అంత డబ్బు ఎలా సర్దుబాటు చేస్తున్నాడు అని అతడు కూడా ఆలోచించలేదు.

అన్నదమ్ముల మధ్య ఎలాంటి బేధాభిప్రాయాలు లేకపోయినా రామచంద్ర మనసు విప్పి చెప్పకపోవడం వలన ఈరోజు లేని ఇబ్బంది కొని తెచ్చుకున్నట్లయింది అతడికి. బాగా ఆలోచించిన మీదట తమ్ముడికి విషయం చెప్పి డబ్బు సర్దుబాటు చేయమని అడుగుదామనే నిర్ణయానికి వచ్చాడు రామచంద్ర.

"కమలా, వదినకి చాలా సీరియస్ గా ఉందట. అన్నయ్య ఫోన్ చేశాడు. మన శశిని చూడాలని కలవరిస్తోందట. మనం ఓసారి విశాఖపట్నం వెళ్లి వద్దాం!" అన్నాడు భాస్కర్ ఆదుర్దాగా భార్య వంక చూస్తూ, "అయ్యో, ఇప్పుడెలా? మా క్లబ్ లో ఇంటర్నేషనల్ వుమెన్స్ డే సెలబ్రేషన్స్ చాలా గ్రాండ్ గా చేయాలని ప్లాన్ చేస్తున్నాము. దానికి ఇనీషియేట్ చేస్తున్నది నేనే! ఇప్పుడిలా అర్ధాంతరంగా ప్రయాణం పెట్టుకుంటే మా ప్రోగ్రాం అంతా అప్ సెట్ అవుతుంది. పోనీ శశిని తీసుకొని మీరు వెళ్లండి. తర్వాత నేను జాయిన్ అవుతాను అంది కమల.

" అదేమిటి కమలా అలా అంటావు? మనిషి ప్రాణం కంటే ఈ ప్రోగ్రాములు ఎక్కువా నీకు? " అన్నాదు భాస్కర్ నిష్టూరంగా.

" ఎక్కువో, తక్కువో ఈ ప్రోగ్రాం కండెక్టు చేస్తున్నది నేను, కనుక నేను ఉండి తీరవలసిందే. అంతే తప్ప మాట తప్పి మీ వదినలా శశిని చూడాలని ఉందంటూ ఏదో వంకన పదే పదే ఇలా కబుర్లు పెట్టను. నాకు తెలియక అడుగుతాను, ఆవిడకి నిజంగా అనారోగ్యమేనా? లేక ఆ వంకన వీడిని రప్పించుకుని తన తమ్ముడి కూతుర్ని కట్టబెట్టాలని ప్లానా?" అంది కమల వెటకారంగా.

" ఎంత దారుణంగా మాట్లాడుతున్నావు కమలా? శశి పెళ్లి కోసమని కోరి వదినకు అనారోగ్యమని అన్నయ్య చెప్పాడంటావా? అయినా వాళ్ల కోరికలో తప్పేముంది? శశిని మనకి ఇస్తున్నప్పుడే వదిన మాట తీసుకుంది కదా వాడికి హరి కూతుర్ని చేసుకోవాలని. కానీ ఇప్పుడదేదో కొత్తవిషయంలా మాట్లాడుతున్నావు నువ్వు! "అన్నాడు భాస్కర్ భార్య వంక తీవ్రంగా చూస్తూ.

అతడి చూపులనే మాత్రం లక్ష్యపెట్టకుండా" అందుకే కదా నా ఏడువంతా. ఎప్పుడో పిల్లలు పుట్టక ముందు అనుకున్న మాటల కోసం పిల్లలు పెద్దయ్యాక వాళ్ల అభిరుచులేమిటో, ఆలోచనలేమిటో తెలుసుకోకుండా ఇచ్చిన మాట అంటూ ఇలా వాళ్ల భవిష్యత్తుకు సంకెళ్లు వేయడం సరైందేనంటారా? " అంది కమల కోపంగా.

" నేనేమీ వాడికి సంకెళ్లు వేద్దామనడం లేదు నువ్వు నీ స్నేహితురాలి కూతుర్ని మనవాడికి ఇచ్చి చేయాలనడాన్ని గానీ, మా వదిన హరి కూతుర్ని చేయాలనడాన్ని గానీ దేన్ని నేను సమర్ధించలేదు. ఈ విషయంలో పూర్తి నిర్ణయం వాడికే వదిలేద్దామని మొదటి నుండీ చెప్తూనే ఉన్నాను. అయినా మనిషి చావు బ్రతుకుల్లో ఉంది అని చెప్తూ ఉంటే నువ్విలా మాట్లాడడం నాకేమీ బాగాలేదు "అన్నాడు భాస్కర్ బాధగా.

" నా మాటలు ఎప్పుడు నచ్చాయి గనుక మీకు? అనూష వాడితో పాటు సమానంగా చదువుకొని ఉద్యోగం చేస్తోంది. అందానికి అందం, చదువుకు చదువు ఉంది. సంస్కారం గల పిల్ల. తనైతే సంఘంలో మన కల్చర్ కి సోషల్

స్టేటస్ కి తగినట్లుగా ఉంటుందని ఆశపడుతున్నాను. అదే ఆ హారిక, ఏ నాగరికతా లేని ఆపిల్ల మన శశికి ఎలా నూటవుతుంది? ఆ పిల్లని చేసుకుంటే నలుగురి ముందూ వాడెంత చిన్నబోతాడు. ఇదేమైనా గ్రహించారా మీరు? అనలిదంతా ఉంటుందనే అయినవాళ్ల పిల్లల్ని వద్దన్నది నేను. ఇంటి పేరిట వాడు రక్తంలో రక్తం అంటూ ఎగబడి తెచ్చి ఇప్పుడిలా నా గొంతు మీద కూర్చున్నారు "అంది కమల ఊపిరి ఎగబీలుస్తూ.

అంతవరకూ ఎంతో సహనంగా మాట్లాడిన భాస్కర్ కమల మాటల్ని ఏమాత్రం సహించలేకపోయాడు.

" ఏం మాట్లాడుతున్నావు నువ్వు? నేనా వాడిని కావాలని తీసుకువచ్చింది. నువ్వే మోజుపడి, మా వదిన కాళ్ల వేళ్లవడి వాడిని తెచ్చుకున్నావు  గతం మర్చిపోయి నామీద నిందలు వేస్తున్నావు ఈవేళ! " అన్నాడు తానేమీ తీసిపోనట్లుగా,

ఆ మాటలు వినడంతోనే దెబ్బతిన్న పావురంలా విలవిలలాడిపోయింది కమల. ఒంట్లోని శక్తంతా హరించుకుపోయినట్లు కాగా నిస్త్రాణంగా పక్కనే ఉన్న సోఫాలో వాలిపోయింది.

కళ్ల వెంట బొటబొటా కన్నీరు కారుతూ కంపిస్తున్న పెదాలతో  అనండి, నన్నే అనండి! నాకు బిడ్డల్ని కనే యోగం లేదు కనుక ఆవిడ కాళ్లు పట్టుకున్నాను. అంతేకదా, మీరనేది? " అంటూ ముఖం మీద రెండు చేతులూ కప్పుకొని ఏడవసాగింది.

ఆ మాట నోరు జారాక భాస్కర్ కూడా అనుకున్నాడు" ఇదేమిటి నేనివేళ ఇలా మాట్లాడాను! " అని. భార్య ఏడుపు చూడడంతోనే అతడి మనసు కరిగి నీరయిపోయింది.

దాదాపు పాతికేళ్లుగా కొడుకు చుట్టూనే ఎన్నో ఆశలు అల్లుకున్నది కమల. శశి ఆమె స్వంత బిడ్డ కాదు అనే భావననే ఆమె భరించలేదు. ఆ తల్లి కొడుకుల మధ్య ఎవరి జోక్యాన్ని సహించలేదు కమల. అన్ని విషయాల్లోనూ ఎంతో విశాలంగా ఆలోచించే కమల కొడుకు విషయానికి వచ్చేసరికి తోటికోడలు జానకిని ఆమడ దూరాన ఉంచాలని చూస్తుంది అందుకే  చప్పున ఏడుస్తున్న భార్య దగ్గరకు వెళ్లి ముఖం మీద చేతులు తొలగిస్తూ "ఊరుకో కమలా, నువ్విలా బాధపడితే నాకేం బాగుండదు వదినకు బాగులేదనే ఆందోళనతో మాట జారానే తప్ప నిన్ను నొప్పించాలని కాదు. అయాం సారీ! "అన్నాడు భాస్కర్ అనునయంగా.

అతడలా ఓదార్పుగా మాట్లాడడంతో  కమల దుఖం కొంచెం ఉపశమించింది. " ఎవరేమన్నా భరించగలను గానీ, శశి నా కొడుకు కాదని మీరంటే మాత్రం తట్టుకోలేనండీ!"అంది కమల అతడి భుజం మీద తలవాల్చి కన్నీరు కారుస్తూ.

" పిచ్చి కమలా. ఆ భావన నాకే కాదు, మన కుటుంబంలో ఎవరికీ లేదని నీకూ తెలును. అయితే ఒకోసారి వాడి మీద నీకు గల మమకారం వాస్తవాన్ని చూడనివ్వడం లేదు, అంతే . పావం వదినకు నిజంగానే! "అంటున్న అతడి నోటికి చేయి అడ్డం పెట్టింది కమల.

" సారీ, అనవసరంగా నేనే ఎక్కువ ఊహించుకొని మిమ్మల్ని నొప్పించాను. నిజంగానే చెప్తున్నాను నేను కావాలని అక్కడికి రానని అనడం లేదు. ఈ ఫంక్షన్ మేము ప్రిస్టేజి ఇష్యూగా చేస్తున్నాము. ఆ వాసవీ క్లబ్ వాళ్లకంటే మేము ఎందులోనూ తీసిపోమని నిరూపించాలని మా ఆరాటం. పోనీ ముందు మీరిద్దరూ వెళ్లండి తర్వాత నేను వస్తాను "అంది కమల అభ్యర్థినున్నట్లుగా

" నరే అలాగే చేద్దాంలే! "అన్నాడు భాస్కర్ భార్య కంఠంలో ధ్వనించిన నిజాయితీని గమనించి.

" సరే అయితే, నేను వాణీగారి ఇంటికి వెళ్లోస్తాను ... ఫంక్షన్ ఎరేంజిమెంట్సు గురించి మాట్లాడేందుకు. శశి వచ్చాక మీరు భోజనాలు కానిచ్చేయండి. నేను వచ్చేనరికి లేటవుతుంది"అంది కమల.

" సెలవు రోజున కూడా సరదాగా గడవకుండా ఏమిటి కమలా ఇది? నాకు కుదిరితే నీకు కుదరడం లేదు. నీకు కుదిరితే నాకు కుదరడం లేదు. ఈ మధ్య మన ముగ్గురం కలిసి భోజనం చేయడమే అరుదైపోతోంది" అన్నాడు భాస్కర్ నిష్ఠూరంగా.

"ఈ ఒక్కసారికే లెండి. ఈ ఫంక్షన్ అయ్యాక నేను ఫ్రీ అయిపోతాను. ఇంకేం పెట్టుకోను!" అంది కమల హామీ ఇస్తున్నట్లుగా,

"ఈ డైలాగ్ ఎక్కడో విన్నట్లుంది" అన్నాడు భాస్కర్ నందేహంగా చూస్తూ.

"విన్నట్లు కాదు. అన్నట్లుంది అని సరిచేసుకోండి మహానుభావా! తరచూ తమరు చెప్పే స్టాక్ డైలాగ్ ఇదే కదా. అయినా మీరు చేసినట్లుగా నేను చేయనులెండి!" అంది కమల నవ్వేస్తూ.

"అమ్మో, నువ్వు కనబడవు గానీ, బాగానే రిటార్డు ఇస్తావు!" అన్నాడు భాస్కర్, తాను అప్పుడప్పుడూ భార్యకు ఇచ్చే హామీలు గుర్తుకు రాగా,

"ఏదో సరదాగా అన్నాలెండి. నేనేం మీలా చేయను, భయపడకండి. సరే నే వెళ్తాను. ఇప్పటికే అందరూ అక్కడికి వచ్చేసి నాకోసం ఎదురుచూస్తూ ఉంటారు" అంది కమల చెప్పులు వేసుకొని బయటకు నడుస్తూ.

భార్య వెళ్లిన వైపే దీర్ఘంగా చూసి నిట్టూర్చాడు భాస్కర్. ఏవని తలపెట్టినా, ఎంతో శ్రద్ధగా, చాకచక్యంగా చేస్తుంది కమల. ఆ పైన అనుక్షణం అందరూ తనని గుర్తించాలనీ తాను, చేసే పనిని అంతా మెచ్చుకోవాలని ఆరాటపడుతుంది. తాను ఆశించిన విధంగా ఏది జరగకపోయినా, తల్లడిల్లి పోతుంది.

ఒక్క శశి విషయంలో తప్పించి బావగారి కుటుంబం అంటే ఎంతో గౌరవం కనబరుస్తుంది కమల. అయినా నలుగురిలో గుర్తింపు కోసం తహతహలాడే ఆమె ఫంక్షన్ కే ప్రాధాన్యత ఇచ్చింది. తోటికోడలు అనారోగ్యంగా ఉందని తెలిసి కూడా! అలా అని వాళ్లంటే అయిష్టం ఏమీ లేదు కమలకు. తాను తప్పు చేస్తున్నాని తెలిసి కూడా దానిని సమర్ధించుకునేందుకు ప్రయత్నిస్తుంది దానికోసం.

ఒకోసారి ఎదుటివాళ్లని తూలనాడేందుకు కూడా ఏమాత్రం వెనుకాడదు. హరికి కూతురు పుట్టినప్పుడు జానకిని అలాగే గాయపరచింది. అందుకే ఈ రోజు ఆమెను కలిసేందుకు ముఖం చెల్లడం లేదు కమలకు. ఎప్పటికప్పుడు దూరం నుండి వాళ్ల మంచి చెడ్డలు కనుక్కునే కమల ముఖాముఖీ వాళ్లను కలిసేందుకు వెనుకాడుతున్నది అందుకే!

మళ్లీ అతడి మనసు అన్నగారితో జరిగిన ఫోన్ సంభాషణను మననం చేసుకొంది ....

"హలో బాచీ, మీ వదిన ఆరోగ్యం అనలేమీ బాగుండడం లేదురా  శశిని చూడాలని కలవరిస్తోంది. ఒక్కసారి వాడిని తీసుకొని మరదలూ, నువ్వూ వచ్చి వెళ్లండి!" అన్నాడు రామచంద్ర దైన్యం నిండిన కంఠంతో.

"అదేమిటన్నయ్యా, అలా అంటావు? వదినకు బాగుండకపోతే మేము రాకుండా ఎలా ఉంటామనుకున్నావు? ఇంతకూ ఏమిటి సుస్తీ వదినకు?" అనడిగాడు భాస్కర్ ఆదుర్దాగా.

"హార్ట్ ప్రోబ్లమ్ గుండెలో ఏవో వాల్వులు బ్లాక్ అయ్యాయని, ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా ఆపరేషన్ చేయాలి అంటున్నారు డాక్టర్లు. మీ వదినకు బి.పి, షుగర్ ఉన్నాయి. ముగర్ కంట్రోలులో ఉంటేనే ఆవరేషన్ చేస్తామంటున్నారు. రోజూ ఇన్సులిన్ మీదే బండి నడుస్తోంది. మీ వదినేమో ఆవరేషన్ చేయించుకునేందుకు భయపడుతోంది" అన్నాడు రామచంద్ర బాధగా,

"అయ్యో, మరి ఇంతవరకూ ఈ సంగతి నాకెందుకు చెప్పలేదన్నయ్యా?" అన్నాడు భాస్కర్ బాధగా.

"దూరంగా ఉన్నావు కదా  ఇదంతా నీకు తెలిస్తే కంగారు పడతావని మీ వదినే చెప్పవద్దంది"

"వదిన అలానే చెప్తుంది ఎప్పుడూ  కాని నువ్విలా నా దగ్గర విషయం దాచిపెడితే నాకెంత బాధగా ఉంటుందో తెలుసా?" అన్నాడు భాస్కర్ నిష్టూరంగా.

"ఎందుకు తెలియదురా, అందుకే కదా మీ వదిన వద్దంటున్నా ఇప్పుదు ఫోన్ చేసింది. వీలైనంత తొందరగా బయలుదేరి రండి. వచ్చేటప్పుడు తప్పకుండా శశిని తీసుకొని రండి వాడిని. గూర్చి అదేపనిగా కలవరిస్తోంది.  బహుశా తన చివరి కోరిక వాడిని చూడాలనుకోవడమేనేమో! "అన్నాడు రామచంద్ర.

ఆ చివరి మాటలు అంటున్నవుడు అతని కంఠం వణకడం భాస్కర్ గమనించాడు. అతడి మనసు బాధతో మెలితిరిగినట్లయింది.

"అలా అనకన్నయ్యా వదినకేం కాదు. వీలైనంత త్వరగా మేము బయలుదేరి వస్తాము. వచ్చేటప్పుడు డబ్బేమైనా తీసుకురానా అన్నయ్యా? "అనడిగాడు భాస్కర్.

డబ్బు అడుగుదామనే రామచంద్ర ఫోన్ చేసింది. తీరా తమ్ముడు డబ్బు గూర్చి అడిగేసరికి అతడికి నోటమాట రాలేదు.

" వచ్చాక మాట్లాడుదాం లేరా ... ఉంటాను! "అంటూ ఫోన్ పెట్టేశాడు రామచంద్ర.

డబ్బుగూర్చి ఎత్తితే అన్నయ్య మాట్లాడలేదెందుకు అనుకున్నాడు భాస్కర్. అంతలోనే అన్నయ్యకు మొహమాటం ఎక్కువ. నేను వెళ్లాక అక్కడి అవసరాలేమిటో కనుక్కోవాలి. అలా అనుకోగానే అతని మనసు కొంచెం స్థిమితపడింది. వదిన ఎంత మంచిది? పెళ్లయి, ఇంటికి వచ్చిన మరునాటి నుండే తన బాధ్యతను భుజాన వేసుకుంది. తల్లిలాగా తన ఆలనా, పాలనా చూడడమే గాక గురువులా మంచి శిక్షణ ఇచ్చి తనని వదిమందిలో ఉన్నతంగా నిలిచేలా తీర్చిదిద్దింది.

తనకి ఏ చిన్న బాధ కలిగినా విలవిల లాడిపోయేది. తన తమ్ముడు హరికంటే నన్నే ఎంతో ఆదరంగా చూసేది వదినకి బిడ్డలు పుట్టినా కూడా నన్నే పెద్దకొడుకుగా భావించింది. అందుకే భాస్కర్ కి ఏనాడూ తల్లి లేదనే భాధ కలగలేదు. అలాగే యాక్సిడెంటయి కమల మాతృత్వానికి దూరమైనప్పుడు తన భార్య మానసికంగా కృంగిపోయి మంచం పట్టింది. అలాంటి స్థితిలో కమలని కడుపులో పెట్టుకుని కాపాడడమే గాక, తన కడుపున పుట్టిన బిడ్డను కమలకు ఇచ్చి నిండుమనసుతో ఆమె ఒడి నింపింది. అలాంటి తల్లి ఋణం కమలా, నేనూ ఎలా తీర్చుకోగలం? అనుకున్నాడు భాస్కర్.

అతడు మనిషిగా అక్కడే ఉన్నా మనసు మాత్రం తన అన్నా వదినల చుట్టూ చిన్ననాడు తాను ఆడిపాడిన పరిసరాల చుట్టూనే పరిభ్రమించసాగాయి.

టెన్నిస్ ఆడడానికి వెళ్లిన శశికిరణ్ బేట్ ఊపుకుంటూ ఇంట్లోకి వచ్చాడు. బూట్లు విప్పి పక్కన పెడుతూ " డాడీ, పెద్దమ్మ గారికి ఏం బాగాలేదట. ఇందాక అన్నయ్య ఫోన్ చేసి చెప్పాడు" అన్నాడు.

" అవునురా, నాకూ పెదనాన్నగారు ఫోన్ చేసి చెప్పారు"అన్నాడు భాస్కర్ కొడుకు వంక చూస్తూ.

" అయితే మనం ఎప్పుడు వెళ్తున్నాం డాడీ, విశాఖపట్నం?" అనడిగాడు శశికిరణ్ ఆసక్తిగా.

" ఇంకా ఏమీ అనుకోలేదురా నీతో ఒకమాట చెప్పి రిజర్వేషన్ సంగతి చూడాలనుకుంటున్నాను ఎందుకంటే నీ లీవ్స్ సంగతి చూసుకోవాలి కదా! "అన్నాడు భాస్కర్

"నాకు లీవులకేమీ ప్రోబ్లమ్ లేదు డాడీ మొన్ననే మా ప్రోజెక్టు వర్కు పూర్తయింది . మేము చాలా తక్కువ టైములో మా ప్రాజెక్టు వర్కు పూర్తి చేశామని మా బాస్ ఎంతో మెచ్చుకున్నాడు. కనుక నేను ఇప్పుడు లీవుకి అప్లయి చేసినా, ఏమీ అనకుండా శాంక్షన్ చేసేస్తారు "అన్నాడు ఉత్సాహంగా.

"నాక్కూడా ఏమీ ప్రోబ్లమ్ లేదురా. నా ఎరన్ లీవ్ అంతా అలాగే ఉంది. కాకపోతే మార్చి నెల కదా ఫైనాన్షియల్ ఇయర్ ఎండింగ్ అంటూ మా ఛీఫ్ మేనేజరు కాస్త గొణుగుతాడంతే! "అన్నాడు భాస్కర్.

" అయితే టికెట్సు బుక్ చేసేద్దాం డాడీ! "అంటూ లాప్ టాప్ తీశాడు శశికిరణ్.

"ముందు మనిద్దరి కోసం రేపటికేమైనా ఉన్నాయేమో చూడు. మమ్మికేదో పనుందట. తను తర్వాత వస్తుంది" అన్నాడు భాస్కర్.

"ఏం పని? ఆ లేడీస్ క్లబ్ పనేనా? మమ్మీకి ఈ మధ్య ఆ క్లబ్ పిచ్చి ఎక్కువయిపోయింది డాడీ! ఎప్పుడు చూసినా ఏవో మీటింగులు, పనులు అంటూ హడావిడిగా ఉంటుంది. అవతల పెద్దమ్మగారికి బాగులేదని తెలిశాక కూడా తన పనులు వాయిదా వేసుకోదన్నమాట! "అన్నాడు శశికిరణ్ విసుగ్గా.

వాళ్లంతా నెలరోజుల ముందునుండీ ప్లాను చేసుకుంటున్నారట ఇంటర్నేషనల్ వుమెన్స్ డే గూర్చి. ఇప్పుడు మధ్యలో మానేస్తే ఏం బాగుంటుంది చెప్పు? మనకి రేపటికి చేసేసి మీ మమ్మీకి నైన్ కి బుక్ చేయి" అన్నాడు భాస్కర్.

"వెయిట్ లిస్ట్ పది, పదకొండూ వున్నాయి డాడీ. చేసేయనా?" అనడిగాడు ఉత్సాహంగా.

"వద్దురా, కన్ఫర్మ్ కాకపోతే చాలా రిస్క్. తత్కాల్ ఉంటుంది చూడు!" అన్నాడు భాస్కర్.

"థాంక్ గాడ్. మనకోసమే రెండు టికెట్లు మిగిలి వున్నాయి, చేసేస్తాను!" అన్నాడు ఎక్సైటింగ్ గా.

"ఆ చేసెయ్యి!" అన్నాడు భాస్కర్.

కమల వచ్చాక టికెట్సు బుక్ అయిన విషయం చెప్పాడు భాస్కర్.

"మరీ రేపేనా మీ ప్రయాణం? ఈ అయిదు రోజులూ మీరిద్దరూ లేకుండా నేనొక్కతినీ ఎలా ఉండాలి?" అంది కమల దిగులుగా చూస్తూ.

"నీకు తోచకపోవడం ఏమిటి మమ్మీ? మీ క్లబ్బూ ... ఆ క్లబ్బు మెంబర్సూ ఉండగానూ!" అన్నాడు శశికిరణ్ ఆటపట్టిస్తున్నట్లుగా.

"ఛ, పోరా నీకెంత సేపూ మా క్లబ్ మెంబర్స్ మీదే ఉంటుంది దృష్టంతా! మా వాళ్లంతా నువ్వెంతో బుద్ధిమంతుడివనీ, తెలివైనవాడివని ఎంతో మెచ్చుకుంటూ ఉంటారు. నువ్వేమో ఎప్పుడు చూసినా మా క్లబ్ వాళ్లను తిడుతూనే ఉంటావు" అంది కమల నిష్ఠూరంగా.

"నాకు మీ క్లబ్ వాళ్లని పెట్టడం తప్ప వేరే పనేం లేదా ఏమిటి? సోషల్ సర్వీసు మోటివ్ గా మీరా క్లబ్ స్థాపించామన్నారు. కానీ నేతిబీరకాయలో నెయ్యి మాదిరిగా ఉంటుంది సోషల్ సర్వీసు! మంచి ఆశయాలతో క్లబ్బుని స్థాపించామంటారు. కానీ మీలో మీరే వదవుల కోసం ప్రాకులాడుతూ ఉంటారు అవేవో ఇంద్రవదవులన్నట్లుగా. ఈ మాత్రం భాగ్యానికి నువ్వు ఇల్లు పట్టకుండా తెరిగి ఒంటికి తెచ్చుకుని మాటిమాటికీ పడకేస్తూ ఉంటావు. ఇదంతా అవసరమా చెప్పు నీకు?" అన్నాడు.

అక్కడి సంగతులన్నీ మీతో చెప్పి పెద్ద తప్పు చేసినట్లున్నానే నేను? మనుషులన్నాక ఏవేవో చిన్న చిన్న బలహీనతలుంటాయి ఎవరికైనా ... మేం చేసే పనుల ముందు అవి చాలా చిన్నవిరా!

అందుకే కదా మొన్న సండే పేవరులో మేము చేస్తున్న కృషి గూర్చి వివరంగా పెద్ద ఆర్టికిల్ రాశారు"అంది కమల గొప్పగా కొడుకు వంక చూస్తూ.

"మీరా పేవరు వాడికి ఎంత లంచం ఇచ్చారో ఏమిటో .... అందుకే అలా రాసి ఉంటాడు"అన్నాడు శశికిరణ్ అల్లరిగా నవ్వుతూ.

" పోరా, నేను నీతో వాదించలేను. మొండిగా అలా వాదిస్తున్నానే కానీ, మేము చేసే వనులు నచ్చే మొన్న డిసెంబరు నెలలో మాతో పాటు వచ్చి పేమెంట్ల మీద పడుకున్న వాళ్ల మీద బ్లాంకెట్స్ కప్పావు. పైగా మా క్లబ్ కు డొనేషన్ ఇవ్వడమే కాక నీ ఫ్రెండ్స్ తో కూడా ఇప్పించావు"అంది కమల కొడుకు వాదనను తిప్పి కొడుతూ.

" ఓ.కె .... ఓ.కె .... ఒప్పుకున్నాను. మా మమ్మీతో పాటు వాళ్ల క్లబ్ మెంబర్స్ అంతా చాలా గ్రేట్ అని. సరేగానీ, మమ్మీ నా కడుపులో ఎలుకలు వరుగెడుతున్నాయి. అన్నం పెట్టవా?"అన్నాడు శశికిరణ్ కమల భుజాల చుట్టూ చేతులు వేసి గారంగా.

" ఏమిటి మీరిద్దరూ భోజనం చేయలేదా? ఇప్పుడు టైమ్ ఎంతయిందో తెలుసా? ఏమండీ మీ ఇద్దర్నీ భోజనం చేయమని చెప్పే వెళ్లాను కదా! "అంది కమల.

" నేనూ చేసేద్దామనే అన్నాను కమలా వాడు నువ్వు వచ్చేదాకా ఉందామన్నాడు. వాడికి నువ్వు పెడితేనే తిన్నట్లు ఉంటుందట! "అన్నాడు భాస్కర్.

" పిచ్చికన్నా  నేనంటే ఎందుకురా నీకింత ప్రేమ? "అంది కమల ఆర్ధ్రంగా కొడుకు తల మీద చెయ్యివేసి.

" అంత సీన్ ఏం లేదులే మమ్మీ. నీ పతిదేముడు గారు ఆ టి.వి రిమోట్ పట్టుకొని ఛానల్స్ మారుస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. అందులో పడి భోజనం మాటే మర్చిపోయారు. పైగా నువ్వు తిట్టకుండా ఉండాలని నా పేరు ఉపయోగించుకొని, సెంటిమెంటు అడ్డం పెట్టి నిన్ను కూల్ చేయాలని చూస్తున్నారు" అన్నాడు శశికిరణ్ అల్లరిగా.

" ఒరేయ్, మా ఇద్దరికీ మధ్య ఫిటింగ్ పెట్టేస్తున్నావా? ఉండు నీ పని చెప్తాను! "అంటూ చేతిలోని రిమోట్ అక్కడ పెట్టి భాస్కర్ లేచాడు అక్కడి నుండి.

"అయ్యబాబోయ్, డాడీ కొట్టేసేలా ఉన్నారు మమ్మీ ... సేవ్ మీ! "అంటూ కమల వెనక్కి వెళ్లి నుంచున్నాడు.

" పోరా బడుద్ధాయ్. ఇన్నేళ్ళొచ్చాయి, ఉద్యోగం చేస్తున్నావు. ఇంకా అయిదేళ్ల కుర్రాడిలా అమ్మ వెనక నక్కావు "అంటూ నవ్వాడు భాస్కర్.

భర్తనీ, కొడుకునీ మురిపెంగా చూస్తూ "బాగుంది మీ ఇద్దరి అల్లరీను. వాడినంటున్నారు కానీ, చిన్నపిల్లాడిలా ఆ పరుగులేమిటండీ మీకు?" అంది కమల కొడుకును దగ్గరకు లాక్కుంటూ.

" అలా అడుగు మమ్మీ. లేకపోతే ఈ వయసులో నాతో సమానంగా ఆయనకు పరుగులెందుకట" అన్నాడు శశికిరణ్.

"ఒరేయ్, నీ సంగతి ఇప్పుడు కాదు కానీ, తర్వాత చెప్తాను. పద భోజనానికి! "అంటూ వంటింటి వైపు దారి తీసింది కమల.

భోజనాలయ్యాక ముగ్గురూ కలిసి ప్రయాణానికి కావలసిన బట్టలు సర్దడం మొదలు పెట్టారు.

తన ప్రయాణం అయిదు రోజుల తర్వాతే అయినా  తర్వాత కుదురుతుందో లేదోనని తన బట్టలు కూడా బేగ్ లో సర్ది పెట్టుకుంది కమల.

" ఇప్పటి నుండే నీ బట్టలు ఎందుకు మమ్మీ సర్దుకోవడం? "అనడిగాడు శశికిరణ్.

" పోన్లేరా సర్దుకోనీ ఈపని వత్తిడిలో మీ మమ్మీకి తర్వాత తీరికుంటుందో లేదో? "అన్నాడు భాస్కర్.

" ఈ లెక్కన మమ్మీ ఈ అయిదు రోజులూ వంట మానేసి ఏ బ్రెడ్డూ జామ్ తోనో సరిపెట్టుకుంటుంది అనుకుంటా" అన్నాడు శశికిరణ్.

"ఆ పని మాత్రం చేయకు కమలా.  అసలే ఎనిమిక్ గా ఉన్నావు అన్నారు డాక్టరు నిన్ను. ఇంకా నీరనవడిపోతావు" అన్నాడు భాస్కర్ అభిమానంగా భార్య వంక చూస్తూ.

" అదేం లేదు లెండి, ఏదో ఒకటి చేసుకొని తింటాను. మీరనవసరంగా వర్రీ కాకండి! "అంది కమల నవ్వేస్తూ,

" దట్స్ గుడ్! "అన్నాడు శశికిరణ్ తల్లి భుజం తడుతూ.

" హారికా, ఎప్పుడూ చదువేనా? ఒక్కసారి అత్తయ్యా వాళ్లింటికి వెళ్లి రారాదూ?"అన్నాడు హరిప్రసాద్.

" చదవాల్సింది చాలా ఉంది నాన్నా. ఇవేళ కాదు గానీ, రేపు వెళతాను లెండి! అత్తయ్య దగ్గరకు వెళితే ఓ పట్టాన కదలనివ్వదు. నాక్కూడా తనని వదిలి రాబుద్ధి కాదు "అంది హారిక.

"పాపం అక్కయ్య చాలా పాడయిపోయిందమ్మా! నిన్న తన పరిస్థితి చూశాక నా గుండె తరుక్కు పోయిందనుకో. ఎలా ఉండే మనిషి, ఎలా అయిపోయింది? బ్రతుకుతానో లేదోనని బాగా బెంగ పెట్టేసుకున్నట్లుంది అత్తయ్య. పది రోజుల క్రితం నేను చూసినప్పటికీ ఇప్పటికీ ఎంత మార్పు వచ్చిందనుకున్నావు తనలో! "అంది ఇందిర.

"తనదంతా అనవసరమైన బెంగ ఇందిరా. ఆపరేషన్ చేస్తే అక్కయ్య తప్పక బ్రతుకుతుంది. నాకా నమ్మకం ఉంది" అన్నాడు హరిప్రసాద్.

నాన్నా, ఆపరేషన్ కు డబ్బు ఇబ్బంది ఏమైనా ఉందేమో కనుక్కున్నారా? "అంది హారిక.

" ఉంటే మావయ్య చెప్పడా. తన రిటైర్ మెంట్ బెనిఫిట్స్ ఉంటాయి కదా" అన్నాడు హరిప్రసాద్.

" ఉన్నాయో, లేవో మనకేం తెలును నాన్నా? ఒకసారి మావయ్యను గానీ, బావను గానీ కనుక్కోండి. ఒక వేళ డబ్బు లేక ఆపరేషన్ పోస్ట్ పోన్ చేస్తున్నారేమోనని అనుమానంగా ఉంది నాకు" అంది.

" అవునండీ హారిక అంటూ ఉంటే నాకూ అనిపిస్తోంది. అన్నయ్యకు రిటైర్ అయ్యాక డబ్బు చాలా వచ్చినా బాబాయిగారి జబ్బుకి బాగానే ఖర్చయింది కదా. ఎంత ఉందో వారి దగ్గర? ఇంకా ఏమవసరమో మనం తెలుసుకోవాలి కదా"అంది ఇందిర ఆలోచనగా.

"నిజమే నాకా విషయం తట్టలేదు. రేపు వెళ్లి బావగార్ని కనుక్కుంటాను "అన్నాడు హరిప్రసాద్.

తల్లి తండ్రి అక్కడి నుండి వెళ్లిపోయాక చదువుదామని పుస్తకం తీసింది హారిక. కాని మేనత్త జానకి కళ్లముందు మెదలడంతో ఎంత ప్రయత్నించినా చదువు మీద కాన్సెన్ ట్రేట్ చేయలేక పుస్తకం అక్కడ పెట్టి హాల్లోకి వచ్చేసింది.

ఆరోజు ఆదివారమే కావడంతో హరిప్రసాద్ ఇంటి దగ్గరే ఉన్నాడు. ఉయ్యాల్లో కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తున్న తండ్రిని చూస్తే జాలేసింది హారికకు.

తండ్రి, మేనత్తా ఒకరంటే ఒకరు ఎంత ప్రాణంగా ఉంటారో హారికకు తెలియంది కాదు. అత్తకు రేపు జరగరానిది ఏదైనా జరిగితే నాన్న తట్టుకోగలడా! అనుకుంది. ఆ ఊహే భరించలేనట్లుగా తల విదిలిస్తూ

" నాన్నా! "అంటూ తండ్రి పక్కన కూర్చుని అతని భుజానికి తల ఆన్చింది.

" ఏంటమ్మా? ఏం కావాలి? "అనడిగాడు హరిప్రసాద్ లాలనగా.

" నాకేం వద్దు నాన్నా. నువ్విలా దిగులుగా కూర్చుంటే నాకు చాలా బాధగా ఉంది నాన్నా" అంది హారిక.

" ఏంచేయనమ్మా? ఎంత వద్దనుకున్నా మీ అత్తా నేనూ చిన్ననాడు ఆడుకున్న ఆటపాటలన్నీ గుర్తుకు వస్తున్నాయి. మా అమ్మానాన్నలయినా ఎప్పుడైనా నన్ను కొట్టారు గానీ. మా అక్క మాత్రం ఏనాడూ చెయ్యెత్తి ఒక్క దెబ్బ కొట్టలేదు నన్ను. అంత ప్రేమ నేనంటే!

ఇదిగో ఈ ఉయ్యాల మీద మానాన్నగారి పక్కన కూర్చునేందుకు నేనూ మీ అత్తా పోటీలు పడేవాళ్లం!

అత్తకి నన్ను బాధపెట్టడం ఇష్టం లేక తనే లేచి వెళ్లిపోయేది. అక్క ముఖం చిన్నది చేసుకుని వెళ్లిపోతే నాకు ఏదోలా ఉండేది. చివరికి నేనే ఎలాగో అక్కను బ్రతిమాలి ఉయ్యాల్లో కూర్చోబెట్టి తన ఒడిలో తల పెట్టుకొని పడుకునే వాడిని.

తల్లి లేని వాడని బాచీ మీద మా అక్క ఒక్క రవ్వ ప్రేమ ఎక్కువ చూపించేది మా అక్క అంటే ఎంత ప్రేమ ఉన్నా నాకు వాడి మీద కొంచెం కూడా ఈర్ష్య కలిగేది కాదు.

ఎందుకంటే వాడూ నేనూ చిన్నప్పటి నుండీ ఎంతో స్నేహంగా ఉండేవాళ్లం. మా అక్క ప్రేమ మా ఇద్దరికీ సమానమే అనుకొనే వాడిని నేను. ఒకోసారి మాత్రం అక్క నా స్వంతం అన్నట్లుగా అల్లరి చేసేవాడిని.

మా అక్క ఓపిగ్గా నీకు అమ్మా, నాన్నా, అక్కా అందరూ ఉన్నారు కద నాన్నా! పాపం బాచీకి అమ్మ లేదు కదా ఆ లోటు వాడికి తెలియకుండా మనమే ప్రేమగా, స్నేహంగా ఉండాలని నచ్చజెప్పేది. మా అక్క మాట్లాడే తీరు ఎలాంటి వాళ్లనయినా తేలిగ్గా కన్విన్స్ చేసేటట్లుగా ఉండేది–"

**ఇద్దరికీ సమానమే** అనుకొనేవాడిని నేను. ఒకోసారి మాత్రం అక్కనా స్వంతం అన్నట్లుగా అల్లరి చేసేవాడిని.

మా అక్క ఓపిగ్గా నీకు అమ్మా, నాన్నా, అక్కా అందరూ ఉన్నారు కద నాన్నా ... పావం బాచీకి అమ్మ లేదు కదా ఆ లోటు వాడికి తెలియకుండా మనమే ప్రేమగా, స్నేహంగా ఉండాలని నచ్చజెప్పేది. మా అక్క మాట్లాడే తీరు ఎలాంటి వాళ్లనయినా తేలిగ్గా కన్విన్స్ చేసేటట్లుగా ఉండేది. –తను ఇంగ్లీషు పొయిట్రీ బాగా చెప్పేది తనేదైనా ఎక్స్ ప్లయిన్ చేస్తే అది హృదయానికి హత్తుకునేట్లుగా ఉండేది దాని. సారాంశం బైహార్ట్ చేసినట్లుగా ఎగ్జామ్స్ లో బాచీ, నేనూ మక్కీకి మక్కీ దింపేసేవాళ్లం.

అనలు తను బాగా చదువుకొని పెద్ద ఉద్యోగం చేయాలని బోలెడు కలలు కన్నది. పావం తనకి ఏదీ తీరలేదు. మావయ్యకి యాక్సిడెంటయి చెయ్యి పోగొట్టుకోవడం వలన మానాన్న తొందర పెట్టి బావతో అక్క పెళ్లి జరిపించేశాడు. దాంతో అక్క బాధ్యతల నిర్వహణలో తలమునకలై అన్ని కోరికలనూ, ఆశలనూ వదులుకుంది.

అనలు మా అక్కలాంటి మనుష్యులు నూటికీ, కోటికీ ఒక్కరుంటారేమో! అలాంటి దానికి రావలసిన కష్టమా ఇది?" అన్నాడు బాధగా.

" అవును నాన్నా, అత్త ప్రతిమాటలోనూ సెల్ఫ్ రెస్పెక్ట్ బాగా కన్పిస్తుంది నాకు బహుశా అత్త జీన్సే నాకూ వచ్చి ఉంటాయి. అందుకే చదువు పట్ల ఇంత ఇష్టమూ, మమకారమూనేమో! అత్త సాధించలేనిది నేను సాధించి తనకి సంతోషం కలిగిస్తాను నాన్నా. నేను అక్కడికి ఎప్పుడు వెళ్లినా, నా చదువెలా సాగుతుందనే అడుగుతుంది. ఎలా చదవాలో,

చదివింది ఎలా గుర్తు పెట్టుకోవాలో చెప్తూ మంచి మంచి టిప్స్ ఇస్తుంది లాస్ట్ టైమ్ నేను వెళ్లినప్పుడు కూడా అలాగే చెప్పింది. నేను ఎంచుకున్న గోల్ రీచ్ అవ్వాలంటే బాగా కష్టపడాలని, ఎప్పటికప్పుడు కరెంట్ ఎఫైర్స్ గూర్చి న్యూస్ ఫాలో అవుతూ స్టడీ మెటీరియల్ గేదర్ చేసుకోవాలని చెప్పింది "అంది హారిక.

"అవును, మా అక్క చాలా జీనియస్. తనకి తెలియని విషయం అంటూ ఏమీలేదు ... కానీ రేపు ఏం జరుగుతుందో అనే ఆందోళనతో నాకు నిద్ర సరిగా పట్టడం లేదమ్మా! "అన్నాడు హరిప్రసాద్ తిరిగి దిగులుపడిపోతూ, జానకి గూర్చి మాట్లాడినంత సేపూ అతడి ముఖం ఎలా వెలిగిపోయిందో, ఆమె ఆరోగ్య పరిస్థితి గుర్తుకు రాగానే తండ్రి ముఖం ఎలా వాడిపోయిందో గమనించిన హారిక తండ్రి భుజం మీద ఓదార్పుగా తలానించింది. నీకు నేను ఉన్నాను అన్నట్లుగా, ఇంతలో ఎదురింటి మీనాక్షి రావడంతో ..." ఏమ్మా బాగున్నావా? "అంటూ పలకరించి ఉయ్యాల్లోంచి లేచి లోపలికి వెళ్లిపోయాడు హరిప్రసాద్.

"రా వదినా కూర్చో! "అంటూ మర్యాద చేసింది ఇందిర.

"బాగున్నారా ఆంటీ విద్య ఇంట్లో ఉన్నాడా?" అనడిగింది హారిక పలకరింపుగా.

"బాగున్నానమ్మా విద్య ఇంకా ఇంటికి రాలేదు నువ్వేంటి మరీ లాగేసినట్లున్నావు? తిండి సరిగా తినడం లేదా?" అనడిగింది మీనాక్షమ్మ హారిక వంక అభిమానంగా చూస్తూ.

"అలా అడగండి వదినా నేను చెప్తే నామాట అనలు ఖాతరు చేయడం లేదిది!"అంది ఇందిర కంప్లయింట్ ఇస్తున్నట్లుగా.

"అదేంలేదాంటీ  అమ్మకీ, మీకూ నేనెప్పుడూ అలాగే కనిపిస్తాను అంతే! "అంటూ నవ్వేసింది హారిక.

హారిక నవ్వు ముఖాన్ని ఒక్క క్షణం ముగ్ధురాలైనట్లుగా చూసి" నువ్వు అలా నవ్వుతూ ఉంటే నిన్నలా చూస్తూనే ఉండాలనిపిస్తుందమ్మా నాకు.  మనసుకి చాలా హాయిగా ఉంటుంది మా విద్య నీకంటే చాలా చిన్నవాడైపోయాడు గానీ లేకపోతేనా నిన్ను నాకోడలిగా చేసుకునేదాన్ని! "అంటూ హారిక బుగ్గలు పుణికి ముద్దు పెట్టుకుంది మీనాక్షమ్మ.

"పోండాంటీ. నాకప్పుడే పెళ్లేంటి? నాచదువు పూర్తికావాలి ముందు"అంది హారిక చిన్నగా నవ్వేస్తూ.

"ఆడపిల్లవి పెళ్లి చేసుకొని ఓ ఇంటికి వెళ్లాల్సినదానివి. కాని నీకెప్పుడు చూసినా చదువు ధ్యాసే. నిన్ను చూస్తే ఎంతో ముచ్చటగా ఉంది. మా గాడిదలిద్దరూ ఎప్పుడు చూసినా రోడ్లమ్మట బలాదూర్ తిరగడం తప్ప కుదురుగా కూర్చొని రోజుకో గంటయినా చదవరు కదా! "అంది మీనాక్షమ్మ బాధగా.

" అదేంటి ఆంటీ అలా అంటారు? విద్యాసాగర్‌కున్న టేలెంట్స్ నాకుంటేనా ఎప్పుడో పుస్తకాలు మూలన పడేసేదాన్ని. ఎంత బాగా పాడతాడు. ఎన్ని కాంపిటీషన్స్ లో ఎన్ని ప్రైజులు కొట్టుకొచ్చాడు. నిజంగా అంత తీయని కంఠం

అతడికి ఉండడం దేముడిచ్చిన వరం కదూ. ఇక ఆనంద్ మంచి క్రికెట్ ప్లేయర్! అలాంటి పిల్లలున్నందుకు గర్వపడాలాంటీ మీరు" అంది హారిక ఉద్వేగంగా.

" ఎందుకొచ్చిన టేలెంట్సమ్మా ఇవన్నీ. కూటికా, గుడ్డకా? నడిసముద్రంలో నావలా అయిపోయింది నా బ్రతుకు ఈరోజు ... మీ అంకుల్ పోవడంతో.

ఆయనున్నప్పుడు ఇంద్రుడు చంద్రుడు అంటూ పొగిడి ఎవరికి అందింది వాళ్లు వుచ్చుకుపోయారు. హఠాత్తుగా ఆయన పోవడంతో మీవారు మాకు అంతెవ్వాలి, ఇంతవ్వాలి అంటూ దొంగనోట్లు సృష్టించి అయినవాళ్లే మమ్మల్ని నిలువుదోపిడీ చేసి వీధిలో నిలబెట్టారీ రోజు. మిగిలిన ఆ ఒక్క ఇంటినీ ఆధారం చేసుకొని ఈ పిల్లలిద్దరిని పైకి తీసుకొద్దామని నేనాశపడుతూంటే వాళ్లిలా తయారవుతున్నారు ... నా బాధ ఎవరితో చెప్పుకోను? "అంది మీనాక్షమ్మ కళ్లు ఒత్తుకుంటూ.

"బాధపడకండాంటీ ఏమో ఎవరు చూడొచ్చారు? వాళ్లెన్నుకున్న మార్గంలోనే గొప్పవాళ్లయి తిరిగి మీకు పూర్వ వైభవాన్ని తెస్తారేమో?"అంది హారిక ఆశాభావంతో ఆమె వంక చూస్తూ.

"చిన్నదానివైనా ఎంత చల్లని మాట చెప్పావమ్మా? ఏమో నీ నోటి చలవవల్ల వాళ్లు ప్రయోజకులైతే అంతకంటే కావలసింది ఏముంది నాకు?"అంది మీనాక్షి హారిక వంక చూస్తూ.

కూతురు మాట్లాడిన తీరు ఇందిరకి కూడా ఎంతో నచ్చింది. మురిపెంగా కూతురి వంక చూస్తూ "మీరు మాట్లాడుతూ ఉండండి వదినా, ఈలోగా కాఫీ కలువుకు వస్తాను"అంటూ లేచిందక్కడి నుండి.

తల్లి వెళ్లాక" ఇంకేంటి ఆంటీ విశేషాలు. మొన్న మీ అన్నయ్యగారి ఇంటికి వెళ్లి వచ్చినట్లు ఉన్నారు అక్కడ అంతా బాగున్నారా?" అనడిగింది హారిక మాట మారుస్తూ.

పుట్టింటి సంగతి వచ్చేసరికి అంతవరకూ నవ్వుతూ ఉన్న మీనాక్షి ముఖం ఒక్కసారిగా కళ తప్పింది.

"అందరూ బాగానే ఉన్నారమ్మా ... నా రోజులే బాగాలేవు. మేము వచ్చగా ఉన్నంత కాలం మా వాళ్లంతా నన్నెంతో అవురూపంగా చూశారు. ఈరోజు నా పరిస్థితి అంతా తల్లకిందులవడంతో అంతా మారిపోయింది. ఏదో మానాన్నగారు మంచాన పడ్డారు కదా అని చూసేందుకు వెళ్లాను వెళ్లినందుకు బాగానే బుద్ధి చెప్పారు వాళ్లు"అంది మీనాక్షి కళ్లనీళ్ల పర్యంతం అవుతూ.

ఆవిడ ముఖం చూసి అరే అనవసరంగా ఈ విషయం ఎత్తి ఆంటీని బాధ పెట్టానే అనుకుంటూ "పోనీలెండి ఆంటీ జరిగిపోయిన దాని గూర్చి దిగులుపడుతూ మీ ఆరోగ్యం పాడు చేసుకోకండి. మీరు బాగుంటేనే కదా, విద్యకీ, ఆనంద్ కి మంచి భవిష్యత్ దొరుకుతుంది! "అంది హారిక ఓదార్పుగా మీనాక్షి చేయి మీద చేయి వేసి.

" కాదమ్మా ఎవరెలా ఉన్నా తోడబుట్టిన మా అన్నయ్య నన్నంత హీనంగా చూస్తాడని కలలో కూడా అనుకోలేదు. నిజానికి మా వదినే ఇన్నాళ్లూ మమ్మల్ని సరిగా చూడనివ్వడం లేదని ఎంతో అపార్థం చేసుకున్నాను. కానీ ఆమె మేలిమి బంగారం! డబ్బుకీ, ప్రాణానికి లంకె పెట్టుకున్న మా అన్నయ్య నన్ను ఎంతగా అవమానించాలో అంతా అవమానించాడు. వాడి కూతుళ్లు వాడి కంటే రెండాకులు ఎక్కువే చదివి నన్ను పురుగు కంటే హీనంగా చూశారు. పాపం మా వదిన జరిగినదానికి కన్నీళ్లు పెట్టుకోవడం తప్ప ఏం చేయలేక పోయింది"అంది మీనాక్షి బాధగా.

"పోన్లెండి ఆంటీ ... కష్టాలు వచ్చినప్పుడే నిజంగా మనకి ఆవులెవరో, శత్రువులెవరో తెలిసేది. మీరు అనవసరంగా వర్రీ కాకండి! "అంది హారిక.

"అమ్మా, నేను చెప్పానని కాదు గానీ, ఓసారి విద్యకీ, ఆనంద్ కీ చెప్పమ్మా, బాగా చదువుకోమని. నువ్వు చెపితే నీ మాట వింటారు వాళ్లు. నీ మాట అంటే అంత గురి వాళ్లకు. చదువు తర్వాతే ఏ సరదాలైనా అని చెప్పమ్మా! "అంది మీనాక్షి అర్థిస్తున్నట్లుగా,

"తప్పకుండా చెప్తానాంటీ మీరు నిశ్చింతగా ఉండండి"అంది హారిక హామీ ఇస్తున్నట్లుగా.

ఇంతలో లోపలి గదిలో ఉన్న హరిప్రసాద్ కు కాఫీ ఇచ్చి, ముగ్గురికీ కాఫీలు పట్టుకొని వచ్చింది ఇందిర అక్కడికి.

కాఫీలయ్యాక కొంచెం సేపు కూర్చొని వెళ్లిపోయింది మీనాక్షి.

ఆవిడ వెళ్లాక" పాపం ఆంటీని చూస్తే చాలా బాధేసిందమ్మా నాకు ... ఎలా ఉండేవారు ఎలా అయిపోయారు? ఒక్క సంవత్సరంలో మనిషిలో ఎంత మార్పు వచ్చిందో కదా! ఆపదలో చెల్లెల్ని ఆదుకోవాల్సిన వాళ్లన్నయ్య ఏమిటమ్మా ... అంత దుర్మార్గంగా ప్రవర్తించాడు? అసలిలాంటి మనుష్యులు సినిమాల్లోనూ, సీరియల్స్ లోనూ తప్ప నిజ జీవితంలో ఉండరనుకున్నాను ... కానీ ఆంటీ చెప్తుంటే అనిపించింది, అంతకంటే నాలుగు ఆకులు ఎక్కువ చదివినవాళ్లే ఉన్నారని! "అంది హారిక.

" అవునమ్మా ... తన పరిస్థితి చూస్తే నాకూ అలాగే అనిపించింది. ఓడలు బళ్లు ... బళ్లు ఓడలు అవడం అంటే ఇదేనేమో! "అంది ఇందిర.

" అమ్మా, అత్తయ్యగారింటికి వెళ్దాం వస్తావా? "అనడిగింది హారిక.

" ఇప్పుడా? నాకు చాలా పనివుందమ్మా ఇంట్లో. పోనీ ముందు చెప్పి ఉంటే పని తెముల్చుకునేదాన్ని అట్నుండి వచ్చేసరికి ఎంత టైము అవుతుందో ఏమో?"అంది ఇందిర.

"పోమ్మా! ఎప్పుడూ పనే అంటావు. బైక్ మీదే కదా! ఎంత సేపటిలో వెళ్లి వచ్చేస్తాము?" అంది హారిక.

"అదికాదే, ఇందాక వెళ్లమంటే చదువుకోవలసింది చాలా ఉందన్నావు. ఇప్పుడేమో లేడికి లేచిందే పరుగన్నట్లు వెళదామంటున్నావు ఎలాగే నీతో? "అంది ఇందిర.

"అవునూ. అప్పుడు చదువుకోవాలనిపించింది. అందుకని వెళ్లనన్నాను. కానీ మీ అందరి మూలంగా నా మూడ్ చెడిపోయింది ఇప్పుడు. ప్లీజ్ అమ్మా, వెళ్ళొచ్చేద్దాం. కావాలంటే వచ్చాక పని సాయం చేస్తాలే" అంది హారిక బ్రతిమాలుతున్నట్లుగా,

"నువ్వా? పనిసాయమా? ఇంకేం లేదు, సూర్యుడు పడమట ఉదయించినట్లే!"అంది ఇందిర పరిహాసంగా.

"ఏమ్మా మొన్న నీకు జ్వరం వస్తే ఇంటిపనీ, వంటపనీ చేయలేదా నేను?"అంది హారిక అలిగినట్లుగా ముఖం పెట్టి

" నువ్వు చేయలేదని, చేయవని నేనన్నానటే? కాకపోతే నేను వంటింట్లో ఉన్నంతసేపూ ఆ ఛాయలకే రావు కదా నువ్వు! "అంది ఇందిర నవ్వుతూ కూతురి తలమీద మొట్టి.

"లేదులేమ్మా ... ఈరోజు నిజంగా సాయం చేస్తాను. నేను ఒక్కతిని అక్కడికి వెళితే ఇన్నిరోజులూ ఎందుకు రాలేదని వాళ్లు వేసే యక్ష ప్రశ్నలకు జవాబు చెప్పలేను. అందులోనూ ఈరోజు ఆదివారం కదా రమ్య ఇంట్లోనే ఉంటుంది. దానికి ఒంటరిగా నేను దొరికానంటే నా దుంప తెంచుతుంది" అంది హారిక.

"అదా సంగతి? అందుకేనా, సాయంగా నన్ను రమ్మంటున్నావు. ఏమిటి చెప్మా, ఎప్పుడూ లేనిది ఈరోజు నన్ను తోడు రమ్మంటోంది అనుకుంటున్నాను ఇందాకటి నుండీ!" అంది ఇందిర.

"తెలిసిందిగా ... తొందరగా తయారవ్వు మరి!" అంటూ మరోమాటకు అవకాశం ఇవ్వకుండా లోపలికి వెళ్లిపోయింది హారిక.

సామాన్లన్నీ సర్దుకొని తండ్రీ కొడుకులు ఇద్దరూ రిలాక్స్డ్ గా కూర్చున్నారు. తమ సీట్లలో. ఏ.సి. కంపార్టుమెంటు కావడంతో పెద్దగా రణగొణధ్వనులేమీ లేకుండా ప్రశాంతంగా ఉంది.

ట్రైన్ మెల్లగా వేగం పుంజుకుంది.

శశికిరణ్ కిటికీలోంచి బయటకు చూస్తూ కూర్చున్నాడు. భాస్కర్ చదువుకునేందుకు బేగ్ లో నుండి పుస్తకం తీసుకున్నాడు. కొంచెం సేపు అయ్యాక శశికిరణ్ లేప్ టాప్ తీసి కరాటే కెడ్ అనే చైనా సినిమాను పెట్టుకొని చూడసాగాడు.

భాస్కర్ కాసేపు పుస్తకం చదివి మూసేసి పక్కన పెట్టి కళ్లు మూసుకొని వెనక్కి చేరబడ్డాడు. తను చదువుతున్న నవలకీ, తమ కుటుంబానికి దగ్గర పోలికలు కనబడడంతో అతడి మనసంతా భారమైపోయింది.

అతడికి బాల్యమంతా కళ్ల ముందు మెదిలింది. వదినఎంతమంచిది? అమ్మ లేదనే బాధ ఏనాడూ నాకు తెలియనివ్వలేదు. ఇంట్లో పనిపాటలు

చేసుకుంటూనే ఎంతో ఓపికగా పాఠాలు చెప్పేది. నాకేదైనా అవసరం వస్తే తండ్రిని గానీ, అన్నయ్యను గానీ అడిగేవాడిని కాదు నేరుగా వదిన్ని వెళ్లి అడగడమే. మరి వదిన ఏం చెప్పేదో, ఏం చేసేదో తెలియదు మర్నాటికా వస్తువు నాచేతిలో ఉండేది. ఒకవేళ నాకోరిక ఖరీదైనది అయితే, అది తీర్చలేకపోతే, నాకంటే వదినే ఎక్కువ బాధపడేది. నాకోసం తను ఎన్నెన్ని చేసింది? చివరికి తన బిడ్డను కూడా ఇచ్చేసింది, మా దంపతుల బాధ చూడలేక. అలాంటి వదిన మాకు దూరం కానుందా? అనలా ఊహనే భరించలేనట్లుగా తలవిదిల్చాడు భాస్కర్.

"భగవంతుడా! మా వదిన్ని కాపాడు తండ్రీ!" అంటూ రెండు చేతులూ పైకెత్తి నమస్కరించాడు.

సినిమా చూస్తూ యాధాలాపంగా తల పైకెత్తి తండ్రి వంక చూసిన శశికిరణ్ ఆశ్చర్యపోయాడు. తండ్రి కంటి నుండి ధారాపాతంగా కురుస్తున్న కన్నీటిని చూసి.

"డాడీ, ఏమిటి డాడీ, ఏమైంది? ఎందుకా కన్నీరు?" అనడిగాడు ఆదుర్దాగా.

అంతవరకూ తానేడుస్తున్నాననే విషయం కూడా భాస్కర్ కి తెలియలేదు చేతులతో చెంపలు తుడుచుకుంటూ "ఏంలేదురా ... ఏంలేదు" అంటూ సర్దుకొని కూర్చున్నాడు.

"అదేమిటి డాడీ ... అంత బాధపడుతూ ఏంలేదు అంటారు? నాతో షేర్ చేసుకుంటే మీ బాధ కొంచెం అయినా తగ్గుతుంది కదా!" అంటూ శశికిరణ్ లేప్ టాప్ మూసి తండ్రి దగ్గరగా జరిగి కూర్చున్నాడు.

"ఏం లేదురా మా వదిన పరిస్థితి తలచుకుంటే చాలా బాధగా ఉంది. నిత్యం కళకళలాడుతూ లక్ష్మీదేవిలా మా ఇంట్లో తెరుగుతూ ఉంటే చూసేందుకు రెండు కళ్లూ చాలేవి కావు. ఆమె మట్టెల సవ్వడితోనే నాకు తెల్లవారేది.

అమ్మలా నన్ను సాకింది. అక్కలా నాతోడు నిలిచి నా వెన్నుతట్టి ప్రోత్సహించేది. గురువులా నాకు మార్గదర్శనం చేసి నడిపించి నా ఉన్నతికి పాటుపడింది.

చివరికి మేము పిల్లలు లేక అల్లాడుతూంటే పెద్దమనసుతో నిన్ను మాకిచ్చి మీ అమ్మ ఒడి నింపింది. అలాంటి తల్లి ఈరోజు నిస్సహాయంగా మంచానపడి రోజులు లెక్కపెడుతున్నదని మా అన్నయ్య చెప్పింది విన్నదగ్గర నుండీ నా మనసు నిలవడం లేదురా! "అన్నాడు భాస్కర్.

తండ్రి చెప్తున్నదంతా ఎంతో ఆసక్తిగా వింటూన్న శశికిరణ్ అతడు చెప్పిన చివరిమాటలు వింటూనే షాక్ కి గురయ్యాడు.

కొన్ని క్షణాలు మాటలు రానట్లుగా అలా ఉండిపోయాడు.

" నో డాడీ! ఏమిటి మీరు చెప్తున్నది? నేను మీ బిడ్డను కానా? "అనడిగాడు శరీరం కంపిస్తూండగా.

" అవున్రా ... మా అన్నయ్యా, వదినలే నీ కన్నతల్లిదండ్రులు. మేము కాము! "అన్నాడు భాస్కర్ భారంగా.

" డాడీ, మీరు చెప్పేది నిజమేనా? ఆయ్ కాంట్ బిలీవ్ ఇట్ .... మీరు జోక్ చేస్తున్నారు కదూ నాతో? " అంటూ భాస్కర్ ని పట్టుకొని కుదిపేశాడు శశికిరణ్.

"లేదు నాన్నా నేను నిజమే చెప్తున్నాను. వాళ్లే నీ తల్లిదండ్రులు! "అన్నాడు భాస్కర్ కొడుకు తలమీద చేయి వేసి అనునయంగా,

“ఐ కాంట్! మీరే నా పేరెంట్స్!" అంటూ బాధతో వణికిపోతూ భాస్కర్ ని చుట్టేశాడు.

"ఏంరా ఇది? కంట్రోల్ యువర్ సెల్ఫ్ ... చూడూ, అందరూ మననే విచిత్రంగా చూస్తున్నారు!" అంటూ భాస్కర్ మృదువుగా శశికిరణ్ వెన్ను నిమిరాడు.

"డాడీ, పెదనాన్నా, పెద్దమ్మ గార్లంటే నాకెంతో భక్తి, గౌరవాలున్నాయి. వాళ్లే నా తల్లిదండ్రులని మీరు చెప్పినా సరే నా మనస్సు అంగీకరించడం లేదు. మమ్మీ, మీరూ నన్నెలా పెంచారు? ఇవాళ మీరు నాకేమీ కారంటే తట్టుకోలేకపోతున్నాను. మీరు చెప్పింది నిజమే కావచ్చు. కానీ ఇన్నాళ్ల తర్వాత నాకెందుకు చెప్పారు. ఈ నిజం? ఏదిఏమైనా ఎప్పటికీ మీరే నా తల్లిదండ్రులు!" అంటూ భాస్కర్ ని పెనవేసుకుపోయాడు

శశికిరణ్ అది ట్రైన్ అని అందరూ తమని గమనిస్తున్నారనే విషయాన్ని పూర్తిగా విస్మరించి, కొడుకు మనసు స్థిమితపడే వరకూ అలా అతడిని నముదాయిస్తున్నట్లుగా వీపు నిమురుతూ ఉండిపోయాడు భాస్కర్.

ఆ తరువాత కళ్లు తుడిచి "నాకు మాత్రం నిన్ను దూరం చేసుకోవడం ఇష్టమా, చెప్పు? అసలు నీకీ నిజం ఎప్పటికీ తెలియజేయకూడదనే అనుకున్నాను శశీ. కానీ మీ అమ్మ నీకోసమే బెంగపెట్టుకొని అనుక్షణం నిన్ను తలచుకుంటూ స్వాతివాన కోసం ఎదురుచూసే ముత్యపు చిప్పలా నిన్ను చూడాలని ఆశపడుతుందని అన్నయ్య చెప్పాడు. అలా చెప్తూ బహుశా అదే తన చివరి కోరికేమోనని అన్నయ్య అన్నాక ఇక ఈ విషయం నీ దగ్గర దాచాలనిపించలేదు.

ఎందుకంటే మా వదిన తాను కరిగిపోతూ అందరికీ వెలుగు పంచే కొవ్వొత్తి లాంటిది. ఆ తల్లికి మనశ్శాంతిని కలిగించడం నా బాధ్యత అనిపించింది. రేపు జరగరానిది ఏదైనా జరిగితే నన్ను నేను జీవితాంతం క్షమించుకోలేనురా అందుకే చెప్పేశాను! అయితే నీకీ విషయం తెలిసిందనే సంగతి మాత్రం పొరపాటున కూడా మీ మమ్మీకి తెలియనివ్వకు తెలిస్తే తన గుండె పగిలిపోతుంది!" అన్నాడు భాస్కర్ రుద్ధకంఠంతో.

"మమ్మీకే కాదు  నాకు కూడా అలాగే ఉంది డాడీ! మీరింత చెప్పినా, ఇప్పుడు కూడా  అమ్మా అని అనుకోగానే, వెన్నెలలా చల్లగా నవ్వే మమ్మియే నాకంటికి కనిపిస్తుంది తప్ప పెద్దమ్మగారు కాదు  నిజం ఏదైనా నాకు మాత్రం మమ్మీయే కావాలి!

పెద్దమ్మగారి అనారోగ్య పరిస్థితి నాక్కూడా బాధకలిగిస్తోంది. అవసరమైతే ఎంత ఖర్చయినా చేసి తనని సేవ్ చేసుకుందాం . అంతే తప్ప నన్ను మీ నుండి దూరం చేయకండి డాడీ. ప్లీజ్! "అన్నాడు శశికిరణ్ ప్రాధేయపడుతున్నట్లుగా.

" శశీ, నువ్వలా అంటూంటే నా మనసుకు చాలా కష్టంగా ఉందిరా! ప్రాణమొక ఎత్తుగా పెంచుకున్నాము నిన్ను. తప్పనిసరి పరిస్థితుల్లో నీకీ నిజం చెప్పానే గానీ, నిన్ను దూరం చేసుకోవాలని కాదు. అయితే

ఎంతయినా వాళ్లు నీకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు. ఎంత కాదనుకున్నా, వాళ్ల బాధ్యత నీకూ ఉంటుంది! "

అన్నాడు భాస్కర్ నచ్చజెవనట్లుగా,

" నేను కాదనడం లేదు డాడీ ... పెద్దమ్మా పెదనాన్నా, అన్నయ్యా వదినా, చెల్లి పాపా, అందరూ నాకు

కావలసిన వాళ్లే ... ఆత్మీయులే! అందులో ఎలాంటి సందేహమూ లేదు. అయితే వాళ్లంతా నా దృష్టిలో మీ

తరువాతే! నన్ను మీనుండి దూరం చేయనని మాటిస్తే  మీరేం చేయమంటే అది చేస్తాను. ఎలా నడుచుకోమంటే

అలా నడుచుకుంటాను! "అంటూ చేయి చాచాడు శశికిరణ్ ప్రమాణం చేయమన్నట్లుగా.

"శశీ  నాన్నా! నా కంఠంలో ప్రాణం ఉండగా నిన్ను దూరం చేసుకోనురా . కాకపోతే నా రిక్వెస్టు ఒక్కటే! నీ ప్రేమకోసం తపించే మా వదినకు సాంత్వన చేకూర్చరా! నీ ప్రేమ అమృతమై ఆమెను బ్రతికిస్తుందని ఆశపడుతున్నాను. నా వలనే తనకీ బాధలన్నీ కలిగాయి. అందుకే నా మనసు గట్టిచేసుకొని ఇదంతా నీకు చెప్పాను. మీ తల్లికొడుకులను ఒక్కటి చేయాలని తాపత్రయపడుతున్నాను "అన్నాడు భాస్కర్ బరువైన కంఠంతో.

" డాడీ, మీరలా మాట్లాడకండి తన మనసుకు ఊరట కలిగేలా చేస్తాను. పెద్దమ్మ ఆరోగ్యం తప్పక కుదుటపడుతుంది మీరేం వర్రీ కాకండి! "అన్నాడు శశికిరణ్ భరోసా ఇస్తున్నట్లుగా,

" థాంక్స్ రా! "అంటూ కొడుకు భుజంమీద ప్రేమగా తట్టాడు భాస్కర్.

సామాన్లు తీసుకొని లోపలికి వస్తున్న భాస్కర్ ని, శశికిరణ్ ని చూసి ఆశ్చర్యపోయాడు రామచంద్ర.

" అదేమిట్రా  వస్తున్నట్లు ఫోన్ చేస్తే స్టేషన్ కి వచ్చేవాడిని కదా! "అన్నాడు నొచ్చుకుంటున్నట్లుగా.

" ఎందుకన్నయ్యా స్టేషన్ కి రావడం? నువ్వలా వస్తావనే ఉద్దేశ్యంతోనే నేను వస్తున్న విషయం

చెప్పలేదు నీకు. అయినా ఇదేమైనా తెలియని ఊరా నాకు? "అన్నాడు భాస్కర్ నవ్వేస్తూ,

అలికిడి విని సుగుణ లోపలి నుండి వచ్చింది. మరిదిగార్నీ, చినమావగార్నీ చూసి ఆశ్చర్యపోతూ

" బావున్నారా? బయలుదేరుతున్నట్లు ఫోన్ అయినా చేశారు కాదు? "అంటూ భాస్కర్ చేతిలోంచి సామాన్లు అందుకొంది.

"మరేం ఫర్వాలేదులేమ్మా ... మనిల్లే కదా!"అంటూ అన్నగారి వైపు తిరిగి" వదినకు ఎలా ఉంది అన్నయ్యా! "అని అడిగాడు భాస్కర్ ఆత్రంగా.

" అలాగే ఉందిరా . పద చూద్దువుగానీ! "అంటూ జానకి ఉన్న గదిలోకి దారితీశాడు రామచంద్ర.

భాస్కర్, శశికిరణ్ అతని వెంటే ఆ గదిలోకి నడిచారు.

శుష్కించిపోయిన శరీరంతో మంచానికి బల్లిలా అంటుకుపోయిన జానకిని చూడడంతోనే భాస్కర్ కళ్లు నీటితో నిండిపోయాయి .

"ఏమిటన్నయ్యా, ఇలా చేశావు. వదినకు ఇలా ఉందని నాకిన్నాళ్లూ ఎందుకు చెప్పలేదు?" అంటూ రామచంద్ర భుజం మీద తలవాల్చి ఏడ్చేశాడు భాస్కర్.

"ఊరుకోరా ఏమిటిది చిన్నపిల్లాడిలా? నిన్ను చూసి శశి తల్లడిల్లిపోతున్నాడు చూడు"అన్నాడు రామచంద్ర ఓదార్పుగా తమ్ముడి భుజం మీద చేయి వేసి.

**తండ్రి చెప్పాడని కాదు** గానీ. జానకి పరిస్థితి చూడడం తోనే. శశికిరణ్ మనసు ద్రవించిపోయింది. ఆమె తనకు జన్మనిచ్చిన తల్లి అనుకోగానే జానకి పై మమకారం గుండెలోతుల్లో నుండి వెల్లువలా పొంగుకొచ్చింది. అతడికి తెలియకుండానే కళ్లు అశ్రుపూరితాలయ్యాయి.

ఎంత అమృతమూర్తి కాకపోతే ... మరిదీ, తోటికోడలు సంతోషం కోసం కన్నబిడ్డను త్యాగం చేస్తుంది? అనుకున్నాడు శశికిరణ్ జానకి వంకే ఆరాధనగా చూస్తూ.

"జానకీ, ఎవరొచ్చారో చూడు?" అన్నాడు రామచంద్ర మెల్లగా.

ఆమాటలతో మగతగా కళ్లు మూసుకొని పడుకుని ఉన్న జానకి మెల్లగా కళ్లు తెరిచింది. ఎదురుగా భర్త వక్కనే నించొని ఉన్న భాస్కర్ ని చూడడంతోనే ఆమె చూపులు ప్రశ్నార్థకంగా రామచంద్ర వంక తిరిగాయి.

"నీకు బాగుండలేదని నేనే ఫోన్ చేసి చెప్పాను. అటు చూడు, నిన్ను చూసేందుకు శశి కూడా వచ్చాడు" అన్నాడు రామచంద్ర మంచానికి రెండో వైపు నించున్న చిన్న కొడుకును చూపిస్తూ.

"శశి వచ్చాడా?" అంటూ సంభ్రమంగా భర్త చూపించిన వైపు దృష్టి మరల్చింది జానకి.

తన వంకే ఆత్రంగా చూస్తున్న కొడుకు వైపు చూస్తూనే "వచ్చావా నాన్నా?" అంటూ తన బలహీనమైన చేతిని చాచి అతడి చేతిని అందుకోబోయింది జానకి.

"వచ్చాను పెద్దమ్మా ... నిన్ను చూడాలనే వచ్చాను!" అంటూ మంచం అంచు మీద కూర్చుని ఆప్యాయంగా జానకి చేతిని అందుకున్నాడు శశికిరణ్.

కొడుకు చేతి స్పర్శ ఎండి బీటలు వారిన ఆ మాతృహృదయానికి అమృతవు చినుకులా తోచింది. అతడి వంకే తృప్తిగా చూస్తూ "కమల రాలేదా బాచీ?" అనడిగింది జానకి.

"వస్తుంది వదినా మరో నాలుగు రోజుల్లో తనూ వస్తుంది" అన్నాడు భాస్కర్.

అలాగా అన్నట్లు తల ఆడిస్తూ "సుగుణా, కొంచెం టిఫిన్ ఏదైనా చేసి పెట్టమ్మా. అసలే బాచీ ఆకలికి ఆగలేడు!" అంది జానకి కోడల్ని ఉద్దేశించి.

"అలాగే అత్తయ్యా. స్టవ్ మీద పాలు పెట్టి వచ్చాను. ముందు కాఫీ కలిపేసి ఇస్తాను. ఆ తర్వాత టిఫిన్ సంగతి చూస్తాను" అంది సుగుణ.

అంత అనారోగ్య పరిస్థితిలో ఉండి కూడా తన ఆకలి గూర్చి ఆలోచిస్తున్న వదినగారి వంక అభిమానంగా చూస్తూ సుగుణను ఉద్దేశించి, "ఇప్పుడేమీ వద్దమ్మా ట్రైన్ లోనే టిఫిన్ చేసేశాము. కాఫీ ఇవ్వు చాలు!" అన్నాడు భాస్కర్.

సుగుణ లోవలికి వెళ్లి కాఫీ కలిపి తెచ్చి ఇచ్చింది ముగ్గురికీ. రమ్య కాలేజీకి వెళ్లిందా అమ్మా! "అనడిగాడు భాస్కర్ కాఫీగ్లాసు అందుకుంటూ "అవును మావయ్యా మీరు కాఫీలు తాగేసి, స్నానాలు కానిచ్చేయండి! ఈలోగా నేను వంట ముగించేసి వడ్డించేస్తాను" అంది సుగుణ వంటగది వైపు వెళ్లబోతూ.

"వదినా, పాప కనిపించదేం?" అనడిగాడు శశికిరణ్.

"ఇప్పటిదాకా ఇక్కడే ఆడుకుంది బాబూ. పక్కింట్లో దాని ఈడుదే ఒక పావ ఉంది. అక్కడికి పెత్తనాలకి పోయి ఉంటుంది. వచ్చేస్తుందిలే!" అంటూ వెళ్లిపోయింది సుగుణ.

రామచంద్ర "రెస్టు తీసుకో జానకీ!" అంటూ భాస్కర్ చేయి పట్టుకొని బయటకు నడిచాడు.

శశికిరణ్ కూడా వాళ్లతో పాటు వెళ్లేందుకు మంచం మీద నుండి లేవబోయాడు  కానీ, జానకి అతడి

చేతిని గట్టిగా పట్టుకొని వదలకపోవడంతో అలాగే కూర్చుండిపోయాడు.

“ఎన్నాళ్లయిందిరా కన్నా నిన్ను చూసి ... మీ అమ్మకీ, నీకూ అంత కాని దానినైపోయానా నేను?" అంది జానకి కన్నీళ్లతో.

"అదేం లేదు పెద్దమ్మా చదువులో పడి నేనే ఇక్కడికి వచ్చేందుకు అశ్రద్ధ చేశాను. నాకు భోజనానికి ఇబ్బంది అవుతుందని నాతో పాటు మమ్మీ ఉండిపోయింది" అన్నాడు శశికిరణ్ సర్ది చెప్తున్నట్లుగా.

"పోనే ఇప్పటికైనా వచ్చావు, నాకంతే చాలు!" అంది జానకి తృప్తిగా అతడి వంక చూస్తూ.

"సారీ పెద్దమ్మా, ఇంకెప్పుడూ అలా చేయను ఇకపై తరచూ వస్తూ ఉంటానులే! కాకపోతే ఒకటే కండిషన్. నువ్వు త్వరగా ఆపరేషన్ చేయించుకొని మామూలు మనిషివి కావాలి. నాకిష్టమైనవన్నీ నీ చేతులతోనే స్వయంగా వండి పెట్టాలి తెలిసిందా?" అన్నాడు శశికిరణ్ చూపుడు వేలెత్తి ఆడిస్తూ,

"నేను మళ్లీ లేచి తిరుగుతానంటావా బాబూ?" అంది జానకి అవనమ్మకంగా చూస్తూ.

ఆ మాట వింటూనే "అమ్మా, నీకేం కాదు!" అంటూ జానకిని హృదయానికి హత్తుకోవాలనే కోరికను బలవంతాన అణచుకొని, "తిరుగుతావు పెద్దమ్మా. మా అందరి కోసం తప్పక తెరుగుతావు! నా పెళ్లి, చెల్లి పెళ్లీ నీచేతులతోనే చేయాలి. రవి అన్నయ్య పిల్లల్నీ, నా పిల్లల్ని, చెల్లి పిల్లల్ని ఆడించాలి. ఇవన్నీ పక్కన పెట్టి మా అందర్నీ వదిలేసి ఎక్కడికి వెళ్లామని?" అన్నాడు శశికిరణ్ నిలదీస్తున్నట్లుగా

కొడుకు అలా మాట్లాడుతూంటే జానకి మనసు నిండిపోయినట్లయింది. మురిపెంగా అతడి వంక చూస్తూ "నా బంగారు తండ్రీ  నిన్ను చూసేసరికే సగం రోగం తగ్గిపోయినట్లయింది నాకు! నీనోటి చలువ వలన నేను లేచి మామూలుగా తెరగగలిగితే అంతకంటే కావలసింది ఏముందింకా నాకు?" అంది జానకి ఆయాసపడుతూనే.

ఆదుర్దాగా జానకి వంక చూస్తూ, "పెద్దమ్మా, ఊరికే హైరానా పడకు. నేను చెప్తున్నాను కదా నీకేం కాదు. నాకా నమ్మకం ఉంది. రెస్టు తీసుకో, నేను మళ్లీ వస్తాను!" అంటూ ఆమె చేయి మెల్లగా విడిపించుకొని మంచం మీద నుండి లేచాడు శశికిరణ్.

"అలాగే నాన్నా, వెళ్లిరా!" అంది జానకి వెలిగిపోతున్న మొహంతో కొడుకు వంకే అభిమానంగా చూస్తూ.

భోజనాల దగ్గర అడిగాడు భాస్కర్, "వదినకు ఆపరేషన్ డేట్ ఫిక్స్ చేశారా అన్నయ్యా?" అంటూ.

"ఇంకా లేదురా. చూడాలి. ఇవ్వాళో, రేపో డాక్టరు దగ్గరకు వెళ్లి మాట్లాడుతానన్నాడు రవి!" అన్నాడు రామచంద్ర.

"ఇప్పటికే వదిన చాలా పాడయిపోయింది కదన్నయ్యా ... ఇంకా లేటు చేస్తే ప్రమాదం కదూ!" అన్నాడు భాస్కర్.

"నేనేం చేయనురా, నిన్నా మొన్నటి వరకూ ఆపరేషన్ అంటే మీ వదిన ససేమిరా అంది. ఇప్పుడే కొంచెం దారిలోకి వచ్చింది" అన్నాడు రామచంద్ర,

"అవును మావయ్యా, ఆవరేషన్ అయితే తాను బ్రతుకుతానో లేదో అని ఒకటే టెన్షన్ పడుతున్నారు అత్తయ్య!" అంది సుగుణ.

శశికిరణ్ పెళ్లి చూస్తానో లేదోనని ఆవిడ ఆరాటపడుతోందనే విషయాన్ని చెప్పలేకపోయింది సుగుణ.

"ఎందుకు వదినా భయం? వైద్యశాస్త్రం ఎంతో అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో బైపాస్ సర్జరీకి అంత వర్రీ అవ్వాల్సిన అవసరం ఏమీలేదు" అన్నాడు శశికిరణ్.

"అవును, ఆ మాట నిజమే ... మీరు వచ్చారు కదా, అత్తయ్యకు కొంచెం ధైర్యం వచ్చినట్లుంది.

ఈపూట ఏ పేచీ పెట్టకుండా కామ్ గా భోజనం చేసేశారు" అంది సుగుణ నవ్వేస్తూ.

కాలేజీ నుండి వచ్చిన రమ్య, శశికిరణ్ ను చూడడంతోనే ఆశ్చర్యపోయింది.

"చిన్నన్నయ్యా ఎప్పుడు వచ్చావు?" అంటూ అతడిని చుట్టేసింది

"ప్రశాంతికి వచ్చాము రా.  నువ్వేంటి ఇలా అయిపోయావు?" అనడిగాడు బుగ్గలు లోపలికి పోయి ఎముకలు పైకి తేలి ఆరిపోయినట్లున్న చెల్లెలి వంక బాధగా చూస్తూ.

"ఇంట్లో బాగుంటే ఒంట్లో బాగుంటుంది కదన్నయ్యా! అమ్మకి అలా అయ్యాక మాకెవరికీ బాగులేదన్నయ్యా. పెద్దన్నయ్య అయితే మరీ పాడయిపోయాడు" అంది రమ్య దిగులుగా,

"మీరంతా ఇలా నీరసపడిపోతే అమ్మ ఆరోగ్యం బాగుపడుతుందా రమ్యా? మనం ధైర్యంగా ఉండి, అమ్మకి ధైర్యం చెప్పాలి గానీ!" అన్నాడు శశికిరణ్ మందలింపుగా.

"ఏమో అన్నయ్యా, అమ్మని అలా చూస్తుంటే నాకు చాలా దిగులుగా ఉంది ... ఇంట్లో మృత్యువు పొంచి ఉందా అని భయం వుదుతోంది నాకు!" అంది రమ్య. ఆ చివరి మాటలు అంటూండగా రమ్య కళ్లనుండి జలజలా జారిపోయాయి కన్నీళ్లు

చప్పున రమ్య నోరుమూసి దగ్గరకు లాక్కుని "భయపడకమ్మా ... అమ్మకేం కాదు!" అన్నాడు చెల్లెలి తల నిమురుతూ.

ఆ ఇంట్లో ఒక్కొక్కరినీ చూస్తూ ఉంటే అతడి గుండె నీరయిపోతోంది. వాళ్లని అలా చూడడంతోనే సుగుణ మనసు కూడా భారమయిపోయింది.

అంతలోనే సర్దుకుంటూ, "ఏమిటి రమ్యా ఇది? ముఖం కదుక్కుని రా, కాఫీ తాగుదువు గానీ" అంది మందలింపుగా,

వెంటనే రమ్య శశి నుండి విడివడి కళ్లు తుడుచుకుంటూ ఇంట్లోకి నడిచింది. ఆడపడుచు వెళ్లిన వంకే జాలిగా చూస్తూ ఉండిపోయింది సుగుణ.

ఇంతలో రవికిరణ్ బైక్ హారన్ మోగిస్తూ వచ్చాడు ఇంటికి. బైక్ సౌండ్ వింటూనే, "ఆ .... నాన్నొచ్చాదు, నాన్న!" అంటూ చప్పట్లు కొదుతూ వీధిలోకి వరుగుతీసింది కావ్య.

"నా బంగారు తల్లి!" అంటూ కూతుర్ని ముద్దు పెట్టుకొని బైక్ మీద ఎక్కించుకుని వీధిలో ఒక రౌండు వేసి వచ్చాడు.

అదంతా ముచ్చటగా చూస్తూ వీధి వాకిల్లోనే నుంచున్నాడు శశి.

తమ్ముడ్ని చూసి నవ్వుతూ, "ఏరా ఎప్పుడు వచ్చావు?" అంటూ కూతుర్ని కిందకు దింపి, బండి స్టాండ్ వేసి లోవలికి వచ్చాడు.

రమ్య చెప్పినదాంట్లో ఏమీ అతిశయోక్తి లేదు అనుకున్నాడు చిక్కిపోయిన అన్నగార్ని చూడడంతోనే శశికిరణ్.

ఆప్యాయంగా తమ్ముడి చేయి అందుకొని కుశలప్రశ్నలు వేస్తూ లోపలికి నడిచాడు రవి. అతదు కాళ్లూ చేతులూ కదుక్కొని వచ్చేసరికి ముగ్గురికీ కాఫీలు తీసుకువచ్చింది నుగుణ. రమ్యకీ,

రవికీ చెరో కప్పు ఇచ్చి, మూడోది శశికి ఇవ్వబోయింది. "నాకెందుకు వదినా కాఫీ ... ఇందాకే కదా తాగాను" అన్నాడు శశికిరణ్.

"మరేం ఫర్వాలేదులే ... కొంచెమేగా తీసుకో!" అంది సుగుణ.

"సరే అయితే, ఇంత వద్దు గానీ, మరో కప్పు తీసుకురా ... సగం నువ్వు కూడా తీసుకుందువు గానీ!" అన్నాడు శశికిరణ్.

"మొత్తానికి భలేవాడివే నువ్వు!" అని నవ్వుకుంటూ కప్పు తెచ్చేందుకు లోవలికి వెళ్లింది సుగుణ.

కాఫీ తాగుతూ "పిన్నీ, బాబాయీ కనిపించరేం ... బయటకు వెళ్లారా?" అనడిగాడు రవి.

"మమ్మీ రాలేదన్నయ్యా ... డాడీ నేనే వచ్చాము. మమ్మీ పదో తేదీన వస్తుంది. పెదనాన్నగారూ, డాడీ కలిసి బయటకు వెళ్లారు" అన్నాడు శశికిరణ్.

అలాగా అన్నట్లుగా తలవంకిస్తూ ... "సుగుణా, అమ్మ మందులు వేసుకుందా!" అనడిగాడు రవి.

"వేసుకుందండీ ... శశి వచ్చిన దగ్గర నుండి మీ అమ్మగారి ముఖం కళకళలాడిపోతోంది. మందులు వేసుకోవడమే కాదు, పేచీ పెట్టకుండా భోజనం కూడా చేసేశారు" అంది సుగుణ ఉత్సాహంగా.

"అవునా?" అంటూ ఆప్యాయంగా వక్కనే కూర్చున్న తమ్ముడి వీపు తట్టాడు రవి.

రమ్య కాఫీ తాగడం అయిపోయాక  కప్పులన్నీ తీసుకుని లోపల పెట్టేసి తల్లి ఉన్న గదిలోకి వెళ్లింది.

"అదికాదన్నయ్యా పెద్దమ్మకి ఇంత సుస్తీ చేస్తే మాట మాత్రం మాకు చెప్పలేదేమన్నయ్యా?" అన్నాడు శశికిరణ్ బాధగా.

"దూరంగా ఉన్నారు. కంగారు పడతారని అమ్మే చెప్పనివ్వలేదు. అయినా కానీ ఆగలేక మొన్న నీకు ఫోన్ చేశాను కదా నేను!" అన్నాడు రవి.

"ఎప్పుడూ? పరిస్థితి పూర్తిగా విషమించాకా? అయినా మేమంత పరాయివాళ్లం అయిపోయామా మీకు?" అన్నాడు శశి కంపిస్తున్న స్వరంతో.

"అలా అనకురా. కలలో కూడా మేమెవరం అలా అనుకోవడం లేదు. అలా అనుకునే మాటయితే ఇప్పుడు మాత్రం నీకెందుకు ఫోన్ చేస్తాను?" అన్నాడు రవి ఆరాటంగా చూస్తూ.

"డాడీ, పెదనాన్న గారూ ఎంత క్లోజ్ గా ఉంటారు? ఆయన కూడా మా దగ్గర విషయం దాచారు. ఇదేనా దగ్గరతనమంటే?" అన్నాడు శశికిరణ్ నిలదీస్తున్నట్లుగా.

"నువ్వడిగే ప్రశ్నలకు దేనికీ నేను జవాబు చెప్పలేనురా. అమ్మ ఆరోగ్యం సగం శారీరికమైనదైతే, సగం మానసికమైనది. ఏరోజు ఎలా ఉంటుందో తెలిసేది కాదు మాకు. కాస్త బాగుంది ఈరోజు అని మేము స్థిమితపడేలోగా మళ్లీ మొదటికే వచ్చేది పరిస్థితి. అమ్మని హాస్పటల్ కీ, ఇంటికీ తిప్పడంతోనే సరిపోయింది మాకు. ఆపైన మనీ ప్రోబ్లమ్స్" అంటూ చప్పున మాటలు ఆపేశాడు రవి, నోరు జారినట్లుగా నాలిక్కరుచుకుంటూ.

"మనీ ప్రోబ్లమ్మా ... నిజమా? ఆ సంగతి ఎందుకు చెప్పలేదు నాకు. అందుకేనా ఆపరేషన్ డిలే చేస్తున్నది మీరు?" అన్నాడు శశికిరణ్ ఆందోళనగా రవి వంక చూస్తూ.

డబ్బు విషయం తమ్ముడి ముందు మాట జారినందుకు తడబడ్డాడు రవి.

"అది కాదురా, అమ్మకి!". అంటూ మాట్లాడేందుకు అవస్థపడుతున్న భర్తని చూస్తే జాలేసింది నుగుణకు.

"ఎందుకండీ ఇంకా శశి దగ్గర దాచాలని చూస్తారు?" అంటూ మరిది వైపు తిరిగి "అవును శశీ, డబ్బుకి చాలా ఇబ్బందిగా ఉంది. ఈ సంవత్సరం రోజులుగా హాస్పటల్ బిల్లుకూ, మందులకూ రెండు, మూడు లక్షల దాకా ఖర్చయింది. అంతేకాదు, ఆపరేషన్ అంటే అత్తయ్యగారు చాలా భయపడుతున్నారు, బ్రతుకుతానో లేదోనని. ఈపాటి భాగ్యానికి ఆపరేషన్ చేయించుకొని మిమ్మల్ని అప్పుల్లో ముంచి పోనా? అంటూ మొండిగా వాదిస్తున్నారు" అంది నుగుణ.

"అలా అని కన్నతల్లిని చేజేతులా చంపేసుకుందామా అన్నయ్యా మనం? ఇది.. ఇది నాకెంత బాధకలిగిస్తుందో మీకు తెలుస్తోందా అనలు?" అంటూ శశి కన్నీళ్లతో రవిని పట్టి కుదిపేశాడు. ఆమాటలు వింటూనే రవి కళ్లు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి.

"శశీ, ఈ విషయం నీకెలా తెలిసింది?" అంటూ తమ్ముడ్ని దగ్గరకు పొదువుకున్నాడు రవి.

"డాడీ నిన్న ట్రెయిన్ లో నాకు జరిగిందంతా చెప్పారు. నాకోసమే అమ్మ బెంగపెట్టుకొని ఈ దశకు చేరుకుందని చెప్పారు" అన్నాడు మెల్లగా.

"బాధపడకు శశీ. నువ్వు వచ్చాక అత్తయ్యగారు కొంచెం తేరుకున్నట్లే ఉన్నారు. ఆపరేషన్ కు కూడా తను ఏమీ అభ్యంతరం చెప్పరనే అనుకుంటున్నాను" అంది సుగుణ ఓదార్పుగా,

"అదిసరే అన్నయ్యా ఆపరేషన్ కి ఎంత డబ్బు అవసరం అవుతుందంటున్నారు?" అనడిగాడు

"వాళ్లు చెప్పిందాన్ని బట్టి వది లక్షల దాకా ఖర్చవుతుందని అనుకుంటున్నాను నేను బ్యాంకులో పర్సనల్ లోన్ కి అప్లయి చేశాను. రెండు లక్షలు ఇస్తానన్నారు. వదిన నగలమ్మితే మరో రెండు లక్షల దాకా రావచ్చు. నాన్నగారి దగ్గర రెండు లక్షలున్నాయి. మిగతాది వెతుక్కోవాలి!" అన్నాడు రవి.

"మీరు చేసిన పెద్ద తప్పు ఇంతకాలం ఈ విషయాన్ని మా దగ్గర దాచడం. అలాకాకుండా ముందే మాతో చెప్పి ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. మనం డైరెక్టుగా ఆవరేషన్ కి వెళ్లిపోతే అమ్మ ఇంత నీరసపడేది కాదు. ఆ పైన మనకి ఇన్నాళ్లూ హాస్పటల్ కీ, మందులు అయిన ఖర్చు మిగిలేది. సరే, జరిగిందేదో జరిగింది. డాడీతో మాట్లాడి ఆడబ్బును నేను ఏదోవిధంగా ఏర్పాటు చేస్తాను" అన్నాడు శశి.

"చాలురా, నీ మాటలతో నాకు ఎంతో ధైర్యం వచ్చింది" అన్నాడు రవి అభిమానంగా తమ్ముడి వంక చూస్తూ.

"నాకు మాత్రం నీమీద కోపం ఇంకా పోలేదన్నయ్యా. అది పోవాలంటే నువ్వొక పని చేయాలి. చేస్తావా?" అనడిగాడు శశికిరణ్.

"చెప్పరా. నువ్వేం చేయమన్నా చేస్తాను!" అన్నాడు రవి ఉద్వేగంగా.

"అయితే వదిన నగలు అమ్మకుండా అట్టి పెట్టన్నయ్యా!" అన్నాడు శశికిరణ్ కమెండ్ చేస్తున్నట్లుగా గంభీరంగా అన్నగారి వైపు చూస్తూ,

తమ్ముడి మాటలు విని తెల్లబోయినట్లుగా చూశాడు ఒకక్షణం. అతడి ముఖంలో కదలాడుతున్న భావాలు చూడడంతోనే ఇంకేమీ అనాలనిపించలేదు రవికి.

"సరేలేరా అలాగే చేస్తాను!" అనేశాడు.

కాలేజీ నుండి వచ్చిన రమ్య, శశికిరణ్ ను చూడడంతోనే ఆశ్చర్యపోయింది. "చిన్నన్నయ్యా ... ఎప్పుడు వచ్చావు?" అంటూ అతడిని చుట్టేసింది.



Post your comments

"ప్రశాంతికి వచ్చామురా ... నువ్వేంటి ఇలా అయిపోయావు?" అనడిగాడు బుగ్గలు లోపలికి పోయి ఎముకలు పైకి తేలి ఆరిపోయినట్లున్న చెల్లెలి వంక బాధగా చూస్తూ.

"ఇంట్లో బాగుంటే ఒంట్లో బాగుంటుంది కదన్నయ్యా! అమ్మకి అలా అయ్యాక మాకెవరికీ బాగులేదన్నయ్యా ... పెద్దన్నయ్య అయితే మరీ పాడయిపోయాడు" అంది రమ్య దిగులుగా,

"మీరంతా ఇలా నీరసపడిపోతే అమ్మ ఆరోగ్యం బాగుపడుతుందా రమ్యా? మనం ధైర్యంగా ఉండి, అమ్మకి ధైర్యం చెప్పాలి గానీ!" అన్నాడు శశికిరణ్ మందలింపుగా.

"ఏమో అన్నయ్యా, అమ్మని అలా చూస్తూంటే నాకు చాలా దిగులుగా ఉంది ... ఇంట్లో మృత్యువు పొంచి ఉందా అని భయం వుడుతోంది నాకు!" అంది రమ్య. ఆ చివరి మాటలు అంటూండగా రమ్య కళ్లనుండి జలజలా జారిపోయాయి కన్నీళ్లు చప్పున రమ్య నోరుమూసి దగ్గరకు లాక్కుని "భయపడకమ్మా ... అమ్మకేం కాదు!" అన్నాడు చెల్లెలి తల నిమురుతూ.

ఆ ఇంట్లో ఒక్కొక్కరినీ చూస్తూ ఉంటే అతడి గుండె నీరయిపోతోంది. వాళ్లని అలా చూడడంతోనే సుగుణ మనను కూడా భారమయిపోయింది. అంతలోనే సర్దుకుంటూ, "ఏమిటి రమ్యా ఇది? ముఖం కడుక్కుని రా, కాఫీ తాగుదువు గానీ!" అంది మందలింపుగా,

వెంటనే రమ్య శశి నుండి విడివడి కళ్లు తుడుచుకుంటూ ఇంట్లోకి నడిచింది. ఆడపడుచు వెళ్లిన వంకే జాలిగా చూస్తూ ఉండిపోయింది సుగుణ.

ఇంతలో రవికిరణ్ బైక్ హారన్ మోగిస్తూ వచ్చాడు ఇంటికి. బైక్ సౌండ్ వింటూనే, "ఆ .... నాన్నొచ్చాడు, నాన్న!" అంటూ చప్పట్లు కొడుతూ వీధిలోకి వరుగుతీసింది కావ్య.

"నా బంగారు తల్లి!" అంటూ కూతుర్ని ముద్దు పెట్టుకొని బైక్ మీద ఎక్కించుకుని వీధిలో ఒక రౌండు వేసి వచ్చాడు. అదంతా ముచ్చటగా చూస్తూ వీధి వాకిల్లోనే నుంచున్నాడు శశి.

తమ్ముడ్ని చూసి నవ్వుతూ, "ఏరా ఎప్పుడు వచ్చావు?" అంటూ కూతుర్ని కిందకు దింపి, బండి స్టాండ్ వేసి లోపలికి వచ్చాడు.

రమ్య చెప్పినదాంట్లో ఏమీ అతిశయోక్తి లేదు అనుకున్నాడు చిక్కిపోయిన అన్నగార్ని చూడడంతోనే శశికిరణ్.

ఆప్యాయంగా తమ్ముడి చేయి అందుకొని కుశలప్రశ్నలు వేస్తూ లోపలికి నడిచాడు రవి. అతడు కాళ్లూ చేతులూ కడుక్కొని వచ్చేసరికి ముగ్గురికీ కాఫీలు తీసుకువచ్చింది సుగుణ. రమ్యకీ, రవికీ చెరో కప్పు ఇచ్చి, మూడోది శశికి ఇవ్వబోయింది.

"నాకెందుకు వదినా కాఫీ ... ఇందాకే కదా తాగాను" అన్నాడు శశికిరణ్.

"మరేం ఫర్వాలేదులే ... కొంచెమేగా తీసుకో!" అంది సుగుణ.

"సరే అయితే, ఇంత వద్దు గానీ, మరో కప్పు తీసుకురా. సగం నువ్వు కూడా తీసుకుందువుగానీ!" అన్నాడు శశికిరణ్.

"మొత్తానికి భలేవాడివే నువ్వు!" అని నవ్వుకుంటూ కప్పు తెచ్చేందుకు లోపలికి వెళ్లింది సుగుణ.

రామక్రిష్ణా బీచ్ ఎప్పటిలాగే ఎంతో కోలాహలంగా ఉంది పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అందరూ ఆ కడలి కెరటాల ముందు వసివాళ్లైపోయి కేరింతలు కొడుతున్నారు. లోకంలోని అందమూ, ఆనందమూ తమ స్వంతమేనన్నట్లుగా పిల్లలు ఆ సముద్రపు అలలతో పోటీపడుతూ ఉరకలు వేసే ఉత్సాహంతో వరుగులు తీస్తున్నారు.

జంటలు జంటలుగా, గుంపులు గుంపులుగా అక్కడికి వచ్చిన జనసందోహం ఆ సాగర సౌందర్యాన్ని తిలకించి పులకించిపోతున్నారు.

రామచంద్రా, భాస్కర్ బీచ్ ఒడ్డున కట్టిన గట్టు మీద కూర్చున్నారు. వచ్చేపోయే వాళ్లను చూస్తూ కొంచెంసేపు గడిపారు. ఇద్దరికీ మాట్లాడాలని ఉన్నా ఏదో సంకోచం వెనక్కి లాగుతోంది. ఐస్ క్రీం, మూరమసాలా బళ్లవాళ్లు గంటవాయిస్తూ గట్టుమీద కూర్చున్న వాళ్ల దృష్టిని ఆకర్షించాలనే ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగానే, "సార్ ఐస్ క్రీం కావాలా? మురీ మసాలా ఇమ్మంటారా?" అంటూ పలకరించసాగారు.

తమ్ముడికి ఇష్టమని రెండు మూరీమసాలాలు కట్టించి తాను ఒకటి తీసుకొని, భాస్కర్ కి ఒకటి ఇచ్చాడు రామచంద్ర. మసాలా తింటూ, "చెప్పన్నయ్యా ... ఏదో మాట్లాడాలన్నావు కదా!" అన్నాడు భాస్కర్.

రోడ్డుకి అవతల వైపు ఉన్న ఎక్కిరాల క్రిష్ణమాచార్యగారి విగ్రహం వంక తదేకంగా చూస్తూ "అదేరా మీ వదిన ఆపరేషన్ గూర్చి " అంటూ ఆగాడు రామచంద్ర,

ఏమిటన్నట్లుగా అన్నగారి వంక చూశాడు భాస్కర్.

"బాచీ! నీదగ్గర దాచేదేముందిరా? డబ్బుకి చాలా ఇబ్బందిగా ఉంది. నా రిటైర్మెంట్ బెనిఫిట్స్ లోంచి నాన్నగారికి బాగులేనప్పుడు చాలా భాగాన్ని ఖర్చు పెట్టేశాను. మిగతాది ఈ సంవత్సరం రోజులుగా హాస్పటల్ బిల్లుకూ, మందులకూ ఖర్చయిపోయింది. ఆపరేషన్కి పదిలక్షల దాకా ఖర్చవుతుందంటున్నారు. నాదగ్గర రెండు లక్షలే మిగిలి ఉన్నాయి. రవి పర్సనల్ లోను పెట్టి మరో రెండు లక్షలు తెస్తానన్నాడు. మిగతాది నువ్వేమైనా సర్దగలవట్రా?" అన్నాడు రామచంద్ర తమ్ముడి వంక దీనంగా చూస్తూ.

"అదేమిటన్నయ్యా, అలా అంటావు, నీ అవసరం నాది కాదా? ఈ సంగతి మొన్న నేను ఫోన్‌లో అడిగినప్పుడే చెప్పాల్సింది నువ్వు!" అన్నాడు భాస్కర్ అభిమానంగా అన్నగారి వంక చూస్తూ.

"మొదట చెబ్దామనే అనుకున్నానురా. కానీ ఎందుకనో ఫోన్లో చెప్పలేకపోయాను. రవి మన ఇల్లు తాకట్టు పెట్టిగానీ,

అమ్మిగానీ  ఆపరేషన్ చేయిద్దామన్నాడు. కానీ ఇల్లు ఉమ్మడి ఆస్తి కదా ... ఎలా అమ్ముతాను? అందుకే ఇల్లు మొత్తం నీ పేరు రాసేద్దాం అనుకుంటున్నాను" అన్నాడు రామచంద్ర.

అన్నగారి మాటలు వింటూనే భాస్కర్ దెబ్బతిన్నట్లుగా చూస్తూ "ఏమిటన్నయ్యా, అలా మాట్లాడుతున్నావు? నేనంత పరాయివాడిని ఎప్పుడయ్యాను నీకు? ఇంట్లో నాకు వాటా ఉందనే మాట నేనుగానీ కమల గానీ ఎప్పుడైనా ఎత్తామా? ఇంతకాలం మీరే నా తల్లి దండ్రులు అనుకున్నాను. ఆడపిల్ల పుట్టింటికి వచ్చి వెళ్లినట్లుగా  నేను బ్రతికినంత కాలం ఈ ఇంటికి వచ్చి పోతూ ఉండాలని ఆశపడుతున్నానే తప్ప ఇంటిలో వాటా గూర్చి నేనెప్పుడూ ఆలోచించలేదు. నేను ఆశించింది కేవలం మీ అందరి ప్రేమానురాగాలనే!

వదిన అనారోగ్యం గూర్చి తెలిసిన దగ్గర నుండీ నేనెంత తల్లడిల్లిపోతున్నానో నీకెలా చెప్పను? అసలు నేను మీపట్ల చాలా బాధ్యతారహితంగా ప్రవర్తించాను. నాన్నకి అంత జబ్బు చేసింది కదా కీమోథెరపీకి, మందులకు ఎంతో ఖర్చయి ఉంటుంది. నేను నాన్నకి జబ్బుగా ఉందని  నువ్వు ఒంటరిగా అవస్థలు పడుతున్నావని ఆలోచించాను. ఆయన పోయినప్పుడు తట్టుకోలేక నిన్నూ, వదిననూ పట్టుకొని ఏడ్చానే గానీ, నాన్న జబ్బుకు చాలా ఖర్చయి ఉంటుంది, అంత డబ్బు అన్నయ్య ఎక్కడ నుండి తేగలడు? అని ఈ నిముషం వరకూ నేను ఆలోచించలేదు. నీ దగ్గరకు వస్తే నేను పిల్లాడ్ని అయిపోతానే తప్ప, ఒక బాధ్యత గల వ్యక్తిగా ఎన్నడూ ప్రవర్తించలేదు.

ఆరోజు నేను చేసిన పొరపాటూ, నా బాధ్యతా రాహిత్యమే ఈరోజు నీకిన్ని కష్టాలు తెచ్చిపెట్టిందన్నయ్యా  ఇంతవరకూ జరిగింది చాలు, ఇకపై ఈ సమస్యలన్నీ నాపై వేసి నువ్వు నిశ్చింతగా ఉండు!" అన్నాడు భాస్కర్ ఉద్వేగంగా.

"అదికాదురా బాచీ  ఒకటి, రెండు రూపాయలు కాదు ఆరు లక్షలు ... అంత ఎమౌంట్" అంటున్న రామచంద్రని మధ్యలోనే ఆపేశాడు భాస్కర్.

"చాలన్నయ్యా ఇంకేమీ  మాట్లాడకు. నా ఈ జీవితం మీరు పెట్టిన బిక్ష. ఇవ్వాళ నేనింత ఉన్నతమైన స్థాయిలో ఉన్నానంటే దానికి కారణం నువ్వూ, వదినే కదా! నా ఉన్నతికి నీతో పాటు సమానంగా కష్టపడిన వదినకు ఏమిచ్చి ఋణం తీర్చుకోను? వదిన ఎప్పుడూ చెప్తూండేది కదా నేనే మీ పెద్దకొడుకునని పెద్దకొడుకు హోదాతోనే చెప్తున్నాను, ఆపరేషన్ సంగతి నాకు వదిలి పెట్టమని. రేపు రవితో చెప్పెయ్యి  వాడిని లోన్ తీసుకోవద్దని ఇంకేం మాట్లాడినా నామీద ఒట్టే" అంటూ రామచంద్ర చేయి తీసి తన తలమీద పెట్టుకున్నాడు భాస్కర్.

" బాచీ, ఏంట్రా ఇది? "అంటూ ఆదుర్దాగా తమ్ముడి చేతులు పట్టుకున్నాడు రామచంద్ర,

" అదంతే. నామాటకు తిరుగులేదు! "అన్నాడు భాస్కర్.

తమ్ముడికి తనపై గల ప్రేమను చూసి రామచంద్ర మనను ఆనందంతో నిండిపోయింది. మాటలు కూడదీసుకుంటూ" బాచీ,

ఇన్నిరోజులుగా నేను పడుతున్న బాధంతా నీమాటల వలన చేత్తో తీసేసినట్లయిందిరా–ఎందుకురా ఇలా ఒట్టు పెట్టావు?" అంటున్న రామచంద్ర కళ్లు ఆనందమో, దుఖమో తెలియనట్లుగా వర్షించాయి. అది చూసి" ఏమిటన్నయ్యా, ఎందుకు బాధవదుతున్నావు. నాకు తెలియకుండానే నామాటలతో నిన్ను నొప్పించానా? "అన్నాడు భాస్కర్ ఆదుర్దాగా.

" లేదురా, నీమాటలు నాకెంతో బలాన్ని చేకూర్చాయి. నువ్వింకా నా చిటికెన వేలు పట్టుకొని ఈ బీచ్ రోడ్ల మీద నావెంట నడిచిన పసివాడిలాగే కనిపించావు ఇన్నాళ్లూ. రవితో పాటు నిన్నూ సమానంగానే భావించాను తప్ప మరోలా అనుకోలేదు. అందుకే ఏ బరువు, బాధ్యతలు నీకు పంచాలనుకోలేదు. ఇప్పుడు నీ బాధ చూశాక అనిపించింది, నేను తప్పు చేశానని అయితే కొంచెం గర్వంగా కూడా ఉంది. నా ఒడిలో కూర్చొని అ, ఆలు దిద్దిన వసివాడు ఈరోజు నా తప్పులను సవరించేంత పెద్దవాడయ్యాడని! "అన్నాడు రామచంద్ర అభిమానంగా తమ్ముడి వంక చూస్తూ,

" అంతమాట అనకన్నయ్యా ... నేనెప్పుడూ నీ ముందు వసివాడిగానే ఉండిపోవాలని కోరుకుంటున్నాను" అన్నాడు భాస్కర్ ఆత్మీయంగా అన్నగారి వంక చూస్తూ.

" పద, చాలా టైమయింది. ఇంటి దగ్గర మనకోసం చూస్తూ ఉంటారు!" అంటూ లేచాడు రామచంద్ర.

"అవును, వెళదాం పద. ఈసరికి రవి కూడా ఇంటికి వచ్చి ఉంటాడు. వాడిని చూసి చాలా కాలమైంది!" అన్నాడు భాస్కర్ తాను కూడా లేస్తూ.

రామచంద్ర ఆటో కోసం చూస్తూ ఉండగా అతడి సెల్ మోగింది. తీసి చూశాడు ఎవరై ఉంటారా అని. హరిప్రసాద్ నెంబరు కనిపించడంతో టాక్ బటన్ నొక్కి "చెప్పు హరీ!" అన్నాడు రామచంద్ర.

"బావా, ఎక్కడున్నారు మీరు?" అనడిగాడు హరిప్రసాద్ అటునుండి.

"నేనూ బాచీ, బీచ్ లో ఉన్నాము. ఇప్పుడే ఇంటికి బయలుదేరుతున్నాము. ఏమిటి విషయం?" అనడిగాడు రామచంద్ర.

"బాచీ వచ్చాడా, బాగున్నాడా?" అని కొంచెం ఆగి, "ఏంలేదు బావా మీతో ఒక విషయం మాట్లాడుదామని!" అంటూ సంకోచంగా ఆగిపోయాడు హరిప్రసాద్.

అతడికి రామచంద్ర అంటే చిన్నప్పటి నుండి ఒకరకమైన బెరుకే. ఇంత పెద్దవాడైనా, ఆ బెరుకు ఏమాత్రం తగ్గలేదు అతడికి.

"చెప్పు, ఫర్వాలేదు!" అన్నాడు రామచంద్ర.

"మీరేమీ అనుకోనంటే ఒకమాట బావా ... అసలీ విషయం నేనే స్వయంగా వచ్చి మీతో మాట్లాడుదామనుకున్నాను. కానీ బ్యాంకులో పనివత్తిడి వలన కుదిరింది కాదు. అక్క ఆపరేషన్ కి డబ్బు ఏమైనా కావాలంటే చెప్పండి బావా నేను సర్దుతాను" అన్నాడు హరిప్రసాద్ మెల్లగా, అతడు బెదురుతూ అడిగిన తీరు చూసి నవ్వేశాడు రామచంద్ర.

"భలేవాడివే. ఆ మాట అడగడానికి అంత భయవడతావెందుకు? అయినా ఇప్పుడేమీ అవసరం లేదులే! బాచీ సర్దుతానన్నాడు" అన్నాడు రామచంద్ర.

"అదేమిటి బావా అలా అనేశారు. బాచీ దగ్గర తీసుకుంటారు గానీ, నా దగ్గర తీసుకోరా?" అన్నాడు నిష్టూరంగా హరిప్రసాద్.

"అదేంలేదోయ్. బాచీ, నువ్వు వేరు వేరని నేనెప్పుడూ అనుకోలేదు. బాచీ ముందుగా ఇస్తాను అని అన్నాడు కనుక సరేనన్నాను. అంతే!" అన్నాడు రామచంద్ర నచ్చజెప్తున్నట్లుగా.

"ఏమో, నాకు మాత్రం ఏం బాగాలేదు బావా. మా అక్కకి నేనా మాత్రం చేయగూడదా?" అన్నాడు హరిప్రసాద్ నీరసవడిపోతూ.

"హరీ, నువ్వలాంటి శంకలేవీ మనసులో పెట్టుకోకు. ఇదిగో బాచీతో మాట్లాడుతావా?" అంటూ అతడి మనసును మళ్లించేందుకు ఫోన్ని భాన్కర్కి ఇచ్చాడు రామచంద్ర.

"హలో హరీ, ఎలా ఉన్నావు?" అంటూ అడిగాడు భాస్కర్

భాస్కర్ గొంతు వింటూనే హరిప్రసాద్ కి ఉత్సాహం వచ్చినట్లయింది. "నాకేం బాచీ, నేను బాగానే ఉన్నాను. నువ్వెలా ఉన్నావు? మా చెల్లీ, శశీ బాగున్నారా?" అన్నాడు హరిప్రసాద్ ప్రశ్నల మీద ప్రశ్నలు గుప్పిస్తూ.

"అందరం బాగానే ఉన్నాం హరీ. రేపు ఒకసారి అటు రాగూడదూ? చూసి చాలా రోజులయింది" అన్నాడు భాస్కర్,

"అరే బాచీ, దగ్గరగా ఉంటేనేరా ఈ ప్రేమలన్నీ కురిపిస్తావు నువ్వు. వైజాగ్ దాటావా అన్నీ మర్చిపోతావు" అన్నాడు హరిప్రసాద్ నిష్టూరంగా.

"ఈ మాటలకేంలే బాబూ. నువ్వేమైనా తక్కువ తిన్నావా? ఇన్నాళ్లయింది ఒక్క ఫోన్ అయినా చేశావా నాకు?" అన్నాడు భాస్కర్.

"ఇక్కడి నుండి బెంగుళూరు వెళ్లింది నువ్వు. ఫోన్ చేయాల్సింది నువ్వు పైగా నింద ఒకటా నామీద?" అన్నాడు హరిప్రసాద్ నిలదీస్తున్నట్లుగా.

అలా మిత్రులిద్దరూ ఫోన్ లోనే నీది తప్పంటే, నీది తప్పని వాదించుకోసాగారు. రామచంద్ర ఫోన్ తీసుకొని "హరి, మీ ఇద్దరి తగువూ ఫోన్ లో తేలేది కాదుగానీ రేపు ఇంటికి వచ్చి తీరిగ్గా పోట్లాడు. నేను కూడా సరదాగా ఎంజాయ్ చేస్తాను మీరు పోట్లాడుకోగా చూసి చాన్నాళ్లయింది!" అంటూ నవ్వాడు.

బావగారి కంఠం విని తగ్గిపోతూ, "సరే బావా!" అంటూ ఫోన్ పెట్టేశాడు హరిప్రసాద్.

రామచంద్ర సెల్ ఆఫ్ చేసి జేబులో పెట్టుకున్నాడు. ఇంతలో ఆటో రావడంతో ఇద్దరూ ఎక్కి కూర్చున్నారు.

"అన్నయ్యా, ఇన్నేళ్లయినా హరి ఏం మారలేదు. ఇప్పటికీ నువ్వంటే అదే భయం!" అన్నాడు భాస్కర్ నవ్వుతూ.

రామచంద్ర నవ్వి ఊరుకున్నాడు జవాబేం చెప్పకుండా.

ఆ రాత్రి పడుకోబోయే ముందు తండ్రితో అన్నాడు శశికిరణ్. "డాడీ, పెద్దమ్మగారి ఆపరేషన్ గూర్చి అన్నయ్యా వాళ్లు చాలా వర్రీ అవుతున్నారు."

"పెదనాన్నగారు సాయంత్రం అంతా నాతో చెప్పారు"అన్నాడు భాస్కర్.

" చెప్పారా? ఏమన్నారు మీరు? "అనడిగాడు శశికిరణ్ ఆదుర్దాగా.

" ఏమంటానురా. మనీ మేటర్స్ విషయం మొత్తం నాకు వదిలెయ్యమన్నాను దానికి. బదులుగా ఈ ఇల్లు మొత్తం నాకు రాసిచ్చేస్తానన్నారు. నేను వద్దనీ, అది మీకే ఉండాలని గట్టిగా చెప్పాను "అన్నాడు భాస్కర్.

" మంచివని చేశారు డాడీ. నేనూ అన్నయ్యా ఫ్యూచర్ లో మీలా ఇంత అన్యోన్యంగా ఉండగలమంటారా? "అనడిగాడు శశికిరణ్ సందేహంగా తండ్రి వంక చూస్తూ,

" అదేం మాటరా! మాకంటే మీరు మరింత సన్నిహితంగా ఉంటారు. డోంట్ వర్రీ ఎబౌట్ ఇట్ " అన్నాడు భాస్కర్ మందహాసంతో.

" డాడీ, నా అకౌంట్ లో త్రీ లాక్స్ ఉన్నాయి కదా. అవి తీసిస్తాను. మిగతా ఎమౌంట్ మీరు ఎరేంజ్ చేయండి" అన్నాడు శశికిరణ్.

" ఏరా నాతో పోటీకి వస్తున్నావా? నేను మా అన్నయ్యకి చెప్పాను ఈ ఆపరేషన్ ఖర్చంతా" అన్నాడు భాస్కర్.

"మీతో నాకు పోటీ ఏమిటి డాడీ నా కష్టార్జితంలో కొంత పెద్దమ్మగారికి ఖర్చు పెడితే నా మనసుకు శాటిస్ ఫేక్షన్ గా ఉంటుంది" అన్నాడు శశి మెల్లగా.

కొడుకు ఆంతర్యం అర్ధమైన భాస్కర్ మనసు అర్థమయింది. "సరే, అలాగే చేద్దాము లేరా!" అంటూ కొడుకు భుజం తట్టాడు.

"డాడీ, రేపు ఉదయం మమ్మీకి ఫోన్ చేసి విషయం అంతా చెబుదాము. పాపం తాను చాలా వర్రీగా ఉండి ఉంటుంది. వీలైతే ట్రైన్ టికెట్ కాన్సిల్ చేసుకొని ఫ్లైట్ లో వచ్చేయమందాం అక్కడి ఫంక్షన్ అయిన వెంటనే!" అన్నాడు శశికిరణ్.

"మీ మమ్మి వర్రీగా ఉంటుందా  లేక తనకోసం నువ్వే బెంగపెట్టుకున్నావా? సరేలే, ఇది ఒకందుకు మంచిదే. అన్ని గంటలు పాపం మీ మమ్మీ ఒక్కతే ప్రయాణం చేయాలంటే చాలా బోర్ ఫీలవుతుంది. అలాగే చేద్దాం. చాలా టైమయింది, పడుకుందాం ఇక!" అన్నాడు భాస్కర్ నిద్రకి ఉపక్రమిస్తూ,

"సరే డాడీ, గుడ్ నైట్!" అంటూ దుప్పటి మీదకి లాక్కున్నాడు శశికిరణ్.

మర్నాడు రామచంద్రా, భాస్కర్ కలసి జానకిని హాస్పటల్ కి తీసుకువెళ్లారు. నార్మల్ చెకప్స్ అన్నీ అయిన తర్వాత "కండీషన్ అంతా బాగుంది కనుక మార్చి పదో తేదీన ఆపరేషన్ చేసేద్దాం ... ఈలోగా షుగర్, బి.పీ లెవెల్స్ నార్మల్ గా ఉండేలా చూసుకోండి" అన్నారు డాక్టర్.

హాస్పటల్ లో ఉన్నంత సేపూ జానకి ఏమీ మాట్లాడలేదు. ఇంటికి వచ్చాక ఆపరేషన్ వద్దంటే వద్దని గొడవ చేసింది. ఎవరెంత చెప్పినా జానకి ఆపూట భోజనం చేయలేదు.

"ఇలా అయితే ఎలా జానకీ ... అసలే షుగర్ పేషెంటువి. ఇలా భోజనం మానేస్తే ఎంత ప్రమాదమో నీకు తెలియదా? ప్లీజ్, లేచి భోజనం చెయ్యి!" అన్నాడు రామచంద్ర.

"నాకేం వద్దు. మీరు ఆపరేషన్ చేయించను అని మాటిస్తేనే భోజనం చేస్తాను" అంది జానకి మొండిగా.

"అలా అంటే ఎలా జానకీ, ఆపరేషన్ అయితే తప్ప నీవు మామూలు మనిషివి కాలేవని డాక్టర్లు చెబుతున్నారు కదా. అకారణంగా కోరి బాధలు కొనితెచ్చుకోకు. నా మాట విను!" అన్నాడు రామచంద్ర బ్రతిమాలుతున్నట్లుగా.

"ఏంకాదు, ఆవరేషన్ చేస్తే నేను బ్రతుకుతాను అనే నమ్మకం నాకు లేదు. ఎన్నాళ్లు బ్రతికితే అన్నాళ్లు నన్నిలా ఉండనివ్వండి!" అంది జానకి కళ్లనీళ్లతో చేతులెత్తి నమస్కరిస్తూ,

భాస్కర్, రవీ, సుగుణా ఎంతో నచ్చజెప్పాలని ప్రయత్నించారు. కానీ జానకి పట్టిన పట్టు విడిచి పెట్టలేదు.

చివరికి రమ్య జానకి పాదాలు పట్టుకొని "అమ్మా, నాకోసమైనా అన్నం తినమ్మా. నువ్వు ఆపరేషన్ చేయించుకుంటే తప్పకుండా బ్రతుకుతావు. నువ్విలా ఉంటే నాకేం బాగుండదు ... నువ్వు లేకుండా నేను ఎలా ఉండాలమ్మా?" అంటూ వెక్కివెక్కి ఏడ్చింది.

కూతురి ఏడుపు చూడడంతోనే జానకి మనను ద్రవించిపోయింది.

"ఏడవకు రమ్యా ... ఆపరేషన్ అయితే బ్రతుకుతాననే నమ్మకం లేదు నాకు. ఉన్నన్ని రోజులైనా కంటినిండుగా మీ అందర్నీ చూసుకోవాలని నా ఆశ!" అంది బలహీనమైన గొంతుతో.

అప్పుడే బయట నుండి వచ్చిన శశికిరణ్ జానకి గదిలో నుండి గోలగోలగా మాటలు వినిపిస్తూండడంతో ఆదుర్దాగా అక్కడికి వెళ్లాడు, ఏం జరిగిందోనని.

అందరి ముఖాలూ కళ తప్పి ఉండడం చూసి "ఏమైంది పెద్దమ్మకు!" అనడిగాడు కంపిస్తున్న స్వరంతో.

"ఏం కాలేదురా. నేనూ పెదనాన్నా, పెద్దమ్మని హాస్పటల్ కి తీసుకువెళ్లి ఆపరేషన్ డేట్ ఫిక్స్ చేసుకు వచ్చాం. వచ్చిన దగ్గర నుండి నాకు భయంగా ఉంది ఆపరేషన్ వద్దంటూ భోజనం మానేసి కూర్చుంది" అన్నాడు భాస్కర్.

చిన్నన్నయ్యను చూడడంతోనే ఏదో ఆలంబన దొరికినట్లుగా అతడిని గట్టిగా పట్టుకొని "నువ్వైనా చెప్పన్నయ్యా ఆపరేషన్ చేస్తే అమ్మ బ్రతుకుతుందని. ఇలా ఉంటే అమ్మ మనకి దక్కుతుందా?" అంటూ రమ్య బిగ్గరగా ఏడ్చేసింది.

నెలల తరబడి ఉగ్గబెట్టుకున్న దుఖం వరద గోదారిలా పొంగింది రమ్యకు.

రమ్యలా పైకి ఏడవక పోయినా, అందరి పరిస్థితీ అలాగే ఉంది. చెల్లెలి మాటలు వింటూనే శశి గుండెలు గుబగుబలాడాయి. అయినా లేని ధైర్యం తెచ్చుకొని రమ్య కళ్లు తుడిచి "ఊరుకోమ్మా అమ్మకేం కాదు, నే చెప్తాను కదా!" అంటూ మంచానికి దగ్గరగా స్టూలు లాక్కుని కూర్చున్నాడు.

మిగతావాళ్లని వెళ్లిపొమ్మని సైగ చేయడంతో అందరూ మెల్లగా తప్పుకున్నారు. అక్కడి నుండి.

రమ్య మాత్రం అతని చెయ్యి గట్టిగా పట్టుకొని అక్కడే ఉండిపోయింది. ఇంజనీరింగ్ చదువుతూ ఉన్నా, ఇంకా పసితనపు ఛాయలు వదలనట్లుగా ఉన్న చెల్లెలి ముఖం వైపు ఆదరంగా చూశాడు శశికిరణ్.

"రమ్యా, పెరుగన్నం కలిపి స్పూన్ వేసి తీసుకురా. అమ్మకీ రోజు అన్నం నేను తినిపిస్తాను" అన్నాడు శశికిరణ్.

అతడి మాటలు వింటూనే "అలాగే అన్నయ్యా!" అంటూ ఉత్సాహంగా వంటింటి వైపు పరుగులాంటి నడకతో వెళ్లింది రమ్య.

చెల్లెలు వెళ్లాక తల్లి వంక చూస్తూ, "ఇప్పుడు చెప్పు పెద్దమ్మా ఏమిటి నీ ప్రోబ్లం?" అన్నాడు.

"అందరి వంతు అయింది ... ఇక నీ వంతు మిగిలిందేమిట్రా? మీ అందర్నీ బాధపెట్టడం నాకు మాత్రం ఇష్టమా చెప్పు? నిద్ర కోసం కళ్లు మూతలు పడుతున్నప్పుడు కూడా భయంతో వణికిపోతున్నాను. తిరిగి మేల్కొని కళ్లు తెరిచి మీ అందర్నీ చూస్తానో, లేదో అని. ఆ భావం మనసులో మెదలగానే, కంటి మీదకి కునుకన్నదే రావడం లేదు.

ఈరోజు హాస్పటల్ కి వెళ్లేవరకూ ధైర్యంగానే ఉన్నాను. తీరా డేట్ ఫిక్స్ అయ్యాక గుండె దడ మొదలయ్యింది, ఏమవుతుందో ఏమో అని. ఆపరేషన్ అయితే తెరిగి మీ అందర్నీ చూస్తానో లేదో అనే బెంగ నన్ను నిలవనీయడం లేదురా. ఏం చేయను? అంది జానకి నిస్సహాయంగా ఏడుస్తూ.

జానకి మాటలు శశి గుండెలను పిండేసినట్లయింది. ఉబికి వస్తున్న కన్నీళ్లను బలవంతాన నిగ్రహించుకొని మెల్లగా ఆమె నుదురూ, చెంపలూ నిమురుతూ," నీదంతా ఉత్త అపోహ పెద్దమ్మా. నేను చెప్తున్నాను గదా, నీకేం కాదు అనలు నీలో ఉన్న ఈ పిరికితనాన్ని ముందు బయటకు తరిమెయ్యి. అన్నిటికంటే మనిషికి ముఖ్యంగా కావలసింది ఏమిటో తెలుసా? సెల్ఫ్ కాన్ఫిడెన్స్! తన మీద తనకి నమ్మకం లేకపోతే మనిషి ఏదీ సాధించలేదు.

ఇవేళ నీకు హార్ట్ ప్రోబ్లెమ్ వచ్చింది. నిజానికి ఇది చాలా బాధాకరమైన విషయమే! అయినా ప్రమాదకరమైనది ఏమీ కాదు. కానీ నువ్వు మాత్రం ఇది ఎట్టి పరిస్థితుల్లోనూ నయం కాదనే ఒక నెగిటివ్ కంక్లూషన్ కి వచ్చేశావు.

అందువలన ఇన్ని రోజులుగా నువ్వు తీసుకున్న ట్రీట్మెంటుగానీ, మందులు గానీ ఏమీ ప్రభావం చూపలేకపోయాయి నీమీద. అదే నువ్వు ధైర్యంగా ఇది నన్నేం చేస్తుందని ఎదుర్కొనే ప్రయత్నం చేస్తే పరిస్థితి మరోలా ఉండేది. నీకు బ్రతకాలని, మా అందరితోనూ సంతోషంగా గడపాలని మనసులో ఎంతో ఆశగా ఉంది. కానీ చనిపోతానేమోననే నెగిటివ్ థాట్ నీ మానసిక స్థైర్యాన్ని దెబ్బతీస్తోంది. ఈ నెగెటివ్ థాట్స్ వైబ్రేట్ అయ్యి సబ్ కాన్షస్ లో ఉన్న నీ మైండ్ కి నెగెటివ్ సజెషన్ ఇస్తోంది దాన్ని. ముందు వదిలించుకో పెద్దమ్మా. అప్పుడు

అంతా పాజిటివ్ గానే కనిపిస్తుంది. అది నీ ఆరోగ్యాన్ని కుదుటపడేలా చేస్తుంది. చదువుకున్నదానివి, నీకింతకంటే

చెప్పవలసిన అవసరం లేదని నేను అనుకుంటున్నాను. నువ్వెంతో ధైర్యవంతురాలివని డాడీ ఎప్పుడూ చెప్తూ ఉంటారు. డాడీకి చిన్నప్పుడు స్మాల్‌పాక్స్ వచ్చాయట ఒళ్లంతా ఖాళీ లేకుండా కుండలు పూశాయట! అప్పుడు అన్నయ్య నీ కడుపులో ఉన్నాడని, నిండు గర్భిణివనీ చెప్పారు. అలాంటి పరిస్థితిలో డాడీ దగ్గరకు వెళితే ప్రమాదమని అందరూ హెచ్చరిస్తున్నా నువ్వేమీ లెక్క చేయకుండా అన్నిటికీ ఆ భగవంతుడే ఉన్నాడంటూ డాడీకి ఎంతో ధైర్యంగా సేవచేసి బ్రతికించుకున్నావని చెప్పారు.

అదేనా? ఇంట్లో ఏ సమస్య వచ్చినా తాతగారికీ, పెదనాన్నగారికీ ఎంతో ధైర్యం చెప్పేదానివని అన్నారు. అలాంటి నువ్వు ఇంత పిరికిదానిలా ఎలా మారిపోయావు పెద్దమ్మా ఇప్పుడు?

నేను నా పిల్లల కోసం, నా వారందరికోసం బ్రతకాలి, బ్రతికి తీరుతాను అనే భావాన్ని నీ మనసులో స్థిరంగా అనుకో. బ్రతకాలనే ఆశని ఆలంబనగా చేసుకో! అవుడు ఈ భయం నిన్నేమి చేయదు.

నామీదా, అన్నయ్య మీదా, చెల్లి మీదా ఉన్న మమకారంతో ఆపరేషన్ అయితే చచ్చిపోతానేమో, వాళ్లని ఇంక చూడలేనేమో అని భయపడే బదులు, మా మీద గల ఆ మమకారాన్నే ఆయుధంగా ఉపయోగించి నీ జబ్బుతో పోరాడు

పెద్దమ్మా  అప్పుడు ఇది నిన్నేమీ చేయలేదు. నా మాట నమ్ము! "అంటూ జానకి రెండు చేతులూ పట్టుకున్నాడు శశి ప్రేమగా.

చిన్న కొడుకు మాటలు జానకి చెవులకు మంత్రాల్లా సోకి మనసుకి ఎంతో ధైర్యాన్ని, ఊరటని కలిగించాయి.

ఒక్కోపలుకూ అమృతపు గుళికలా ఆమెలో బ్రతకాలనే కాంక్షను రేకెత్తించాయి.

" శశీ, నువ్వు చెప్తూంటే నాకు ఏదో తెలియని ధైర్యం వస్తోందిరా.  ఇది ఆపరేషన్ బల్ల ఎక్కేవరకూ ఉంటూందంటావా? "అంది జానకి అనుమానంగా.

తల్లి మాటల్లో వచ్చిన మార్పు అతడికెంతో ఆనందాన్నిచ్చింది. ఉద్వేగంగా ఆమె చేతులు పట్టుకొని " ఉంటుంది పెద్దమ్మా. నువ్వేమీ అధైర్య వడకు, నీ వెనుక మేమంతా ఉంటాము కదా! "అన్నాడు శశి.

రమ్య అన్నం పట్టుకొని అక్కడికి ఎప్పుడు వచ్చిందో అతడి మాటలు వింటూ మంత్రముగ్ధలా తల్లివంక చూస్తూ అలా నిలుచుండి పోయింది. ఆ తరువాత" అన్నయ్యా! "అంటూ అతడి చేయి ప్రేమగా నొక్కింది.

శశికిరణ్ నవ్వుతూ చెల్లెలి చేతిలోని అన్నం గిన్నె అందుకుంటూ," పెద్దమ్మా! కొంచెం లేచి కూర్చుంటే అన్నం తినడానికి వీలవుతుంది. లేవగలవా? "అంటూ చేయి ఆసరా ఇచ్చాడు.

" లేస్తాను"అంటూ ప్రయాసపడి లేచి కూర్చుంది జానకి.

" మెల్లగా"అంటూ మంచం దండేనికీ, గోడకీ కలిపి దిండ్లు ఆనించి జానకిని కూర్చోబెట్టి స్పూన్ తో  అన్నం తినిపించసాగాడు.

"నా వలన ఇంట్లో అందరూ నలిగి పోతున్నారు. చిన్నా!" అంది జానకి.

"అదేం లేదు. నువ్వు బాగుంటే అందరూ బాగుంటారు. మా అందరి కష్టం తీర్చాలి అంటే, ఒకటే మార్గం నీకు! నువ్వు తొందరగా కోలుకొని ఎప్పటిలాగే మాకందరికీ అన్నీ చేసి పెట్టాలి. తెలిసిందా?" అన్నాడు నవ్వుతూ.

"ఏమో, అంతా ఆ భగవంతుడి దయ!" అంటూ రెండు చేతులూ జోడించింది జానకి పైకి చూస్తూ.

జానకి భోజనం అయ్యాక నేప్కిన్ అంచు తడిపి మూతి తుడిచింది రమ్య. ఆ తరువాత ఉత్సాహంగా తన చిన్నన్నయ్య తల్లితో మాట్లాడిన తీరు గూర్చి వర్ణించి, వర్ణించి చెబుతూ ఉంటే అందరూ ఎంతో ఆసక్తిగా విన్నారు. ఆ పూట అంతా ఎంతో స్థిమితంగా భోజనం చేశారు.

చాలా రోజుల తర్వాత అందరి ముఖాల్లోనూ ఒకరకమైన నిశ్చింత కనిపించింది ఆ రోజు.

"అక్కా ఇదిగో నువ్వు అడిగిన పుస్తకాలు!" అంటూ వస్తూనే తాను తెచ్చిన ముళ్లపూడి వెంకటరమణగారి

కోతి కొమ్మచ్చి పుస్తకాలు సుగుణ చేతికిచ్చింది హారిక.

"థేంక్స్ హారికా. అడిగిన వెంటనే తెచ్చి పెట్టావు కానీ ప్రస్తుతానికి చదవడానికి అవ్వదులే!" అంది సుగుణ.

"అదేం అంత బిజీనా?" అంది హారిక.

"అవును. అత్తయ్యగారికి ఆపరేషన్ డేట్ ఫిక్స్ చేశారు. రేవు పదో తేదీన ఆపరేషన్!" అంది సుగుణ.

"అవునా. పోన్లే నాన్నగారు కూడా చాలా వర్రీ అవుతున్నారు అత్తయ్య ఆరోగ్యం గూర్చి. ఈ మాట విని కొంచెం స్థిమితపడతారులే!" అంది హారిక.

"మా అందరికీ కూడా అలాగే ఉంది హారికా ... ఆపరేషన్ కి అత్తయ్యగారు అసలు ఒప్పుకోలేదు. శశి గట్టిగా చెప్పిన మీదట అంగీకరించారు" అంది సుగుణ.

"అవునా, అయితే శశి బావ దగ్గర చాలా టేలెంట్ ఉందన్నమాట ... ఏడీ కనిపించడు, ఇంట్లో లేడా?" అనడిగింది హారిక చుట్టూ చూస్తూ.

ఏదో బ్యాంకు పని ఉందంటూ బయటకు వెళ్లాడు అంది సుగుణ.

వాళ్లు మాటల్లో ఉండగానే బయటకు వెళ్లిన భాస్కర్, శశికిరణ్ వచ్చేశారు.

వాళ్లని చూడడంతోనే హారిక లేచి నిలబడుతూ "బాగున్నారా మావయ్యా?" అంటూ పలకరించింది.

"బాగున్నానమ్మా. నువ్వు?" అంటూ ప్రశ్నార్థకంగా చూశాడు భాస్కర్ హారిక వంక.

"నేను హరిప్రసాద్ గారి అమ్మాయిని మావయ్యా!" అంది హారిక తనని తాను పరిచయం చేసుకుంటూ.

"ఓ, నువ్వు మా హరి కూతురివా? ఎంత పెద్దదానివయిపోయావు. ఎప్పుడో రవి పెళ్లిలో చూశాను. గుర్తు పట్టలేకపోయాను. ఏమీ అనుకోకమ్మా! అమ్మా, నాన్నా బాగున్నారా?" అని కుశల ప్రశ్నలు వేశాడు భాస్కర్.

"బాగున్నారు మావయ్యా!" అంది హారిక వినయంగా.

శశికిరణ్ ఆమెని చూస్తూనే ... ఈ అమ్మాయేనా హారిక? ఇప్పుడిప్పుడే రేకు విచ్చుకుంటున్న గులాబీలా ఎంత స్నిగ్ధంగా ఉంది! ... అనుకున్నాడు కన్నార్పకుండా హారికనే చూస్తూ.

అతడి **చూపులకు** ఇబ్బంది పడుతున్నట్లుగా కదిలింది హారిక. ఆ తరువాత "వచ్చి చాలా సేపయింది గదా ఒకసారి అత్తయ్యని చూసి వస్తాను" అంటూ జానకి గదిలోకి వెళ్లిపోయింది, శశి చూపులనుండి తప్పించుకునేందుకు.

హారిక వెళ్లిన వంకే నిర్నిమేషంగా చూస్తున్న మరిది వంక పరిహాసంగా చూస్తూ "ఏమిటి బాబూ ఆ చూపులు మా చెల్లాయికి దిష్టి తగిలేను!" అంది సుగుణ మెల్లగా అతడికి మాత్రమే వినిపించేలా.

ఆ మాటలకు సిగ్గుపడుతున్నట్లుగా నవ్వేస్తూ "అదేం లేదు వదినా  మీ పెళ్లికి వచ్చినప్పుడు తనింత ఉండేది.. ఇంతలో ఎంతగా మారిపోయిందా అని చూస్తున్నాను" అన్నాడు శశి.

"ఎప్పుడో అయిదేళ్లనాటి మాట నీకు నిన్నా, మొన్నటి సంగతెలా కనిపిస్తోందా? లేక ఇంకేదైనా అంటూ కళ్ళెగరేసి నవ్వింది సుగుణ.

" ఫో వదినా! "అంటూ అక్కడి నుండి వెళ్లిపోయాడు శశి సిగ్గుపడుతున్నట్లుగా.

అదంతా చూసి భాస్కర్ గుంభనంగా నవ్వుకుంటూ గదిలోకి వెళ్లిపోయాడు. హఠాత్తుగా అతడికి భార్య కమల గుర్తుకు వచ్చింది.

శశి ఇక్కడకు వస్తే వాడిని ఎలాగైనా ఒప్పించి హారికను ఇచ్చి ఎక్కడ పెళ్లి చేసేస్తారోనని కొడుకుని ఇక్కడకు పంపడమే మానేసింది. కాని ఈరోజు ఎవరి ప్రమేయం లేకుండానే  కొడుకు హారిక పట్ల ఆకర్షితుడు

కావడం చూసి భార్యని తలచుకొని జాలిగా నవ్వుకున్నాడు భాస్కర్.

" అత్తా, ఎలా ఉన్నావు? "అనడిగింది హారిక జానకి దగ్గర కూర్చుంటూ.

" నాకేం బాగానే ఉన్నాను. సాగితే గాయమంత హాయి లేదంటారు పెద్దలు. అందరూ ఇంత శ్రద్ధగా చూస్తూ ఉంటే నాకేం లోటు చెప్పు? అమ్మానాన్నా వచ్చారా? "అనడిగింది జానకి ప్రశాంతంగా నవ్వుతూ.

" రాలేదత్తా. నేను కాలేజీ నుండి ఇటు వచ్చేశాను. అబ్బ, ఎన్నాళ్లయిందత్తా, నువ్విలా నవ్వుతూ మాట్లాడడం చూసి. సుగుణక్క చెబితే ఏమో అనుకున్నాను. శశి బావ దగ్గర నిజంగా ఏదో మంత్రమో, మేజిక్కో ఉన్నట్లుంది. నాలుగు రోజులు క్రితం నేను వచ్చినప్పటికీ, ఇప్పటికీ నీలో చాలా మార్పు వచ్చింది. నీ ముఖం ఈరోజు చాలా తేటగా కనబడుతోంది "అంది హారిక సంబరంగా.

" అవునమ్మా నిజంగా వాడి మాటల్లో ఏదో మేజిక్ ఉంది. ఇన్నాళ్లూ నా మనసులో గూడు కట్టుకున్న దిగులంతా చేత్తో తీసేసినట్లు మాయమయిపోయింది"అంది జానకి.

" పోన్లే అత్తా, నీ ఆరోగ్యం ఎలాగోలా బాగుపడితే అంతే చాలు. నాన్నగారెప్పుడూ నిన్ను తలచుకొనే బాధపడుతూ ఉంటారు " అంది హారిక.

"వాడు చిన్నప్పటి నుంచీ అంతేనమ్మా ఈ అక్కకి ఏదైనా అయితే వాడు తట్టుకోలేడు. మా అమ్మానాన్న పోయాక మరీ బేలగా తయారయ్యాడు. నా మీదే పంచప్రాణాలు పెట్టుకొని బ్రతుకుతున్నాడు" అంది జానకి,

"బాగుంది. ఇద్దరూ ఒకరి కోసం ఒకరు బ్రతుకుతున్నట్లు మాట్లాడుతారు. అది సరే, కమలత్త రాలేదా?" అనడిగింది హారిక.

"తను తొమ్మిదో తేదీన వస్తుందమ్మా. ఇంతకీ నీ చదువెలా సాగుతుంది? బాగా చదువుతున్నావా?" అని అడిగింది జానకి ఆసక్తిగా.

అంత సుస్తీలో కూడా మేనత్త తన చదువు గూర్చి అడగడం చూసి ఆశ్చర్యపోయింది హారిక. చదువు పట్ల ఆమెకు గల ఆసక్తి హారికలో మరింత పట్టుదలను పెంచింది తాను. అనుకున్నది సాధించేందుకు.

"బాగానే చదువుతున్నాను అత్తా కానీ ఎంత చదివినా, చదవవలసింది ఎంతో ఉందనిపిస్తోంది" అంది హారిక.

"అవును, అలాగే ఉంటుంది. మనం ఎంచుకున్న గమ్యం అలాంటిది  చేరాలంటే ఆమాత్రం కష్టపడక తప్పదు! అవును గానీ హారికా. శశి బావను చూశావటే నువ్వు?" అనడిగింది జానకి కుతూహలంగా.

చదువు గురించి ఎంతో గొప్పగా మాట్లాడిన అత్త, మామూలు స్త్రీలా ఇలాంటి ప్రశ్న వేయడం చాలా వింతగా అనిపించింది. అయినా అదేం వ్యక్తం చేయకుండా "చూశానత్తా చిన్నమావయ్య, శశిబావాఇప్పుడే వచ్చారు బయట నుండి!" అంది హారిక.

"వాడు నీతో మాట్లాడాడటే?" అంది జానకి ఆశగా చూస్తూ.

మేనత్త ఆరాటం చూసి ఫక్కున నవ్వింది హారిక.

"ఏమిటత్తా నువ్వు  ఇప్పుడదంత అవసరమా మనకు? ఉండు, రమ్య వచ్చినట్లుంది. మళ్లీ వస్తాను!" అంటూ లేచింది హారిక, ఆమె ప్రశ్న వరంవర నుండి తప్పించుకునేందుకు.

శశికిరణ్ లోవలికి వస్తూ ఆమెకు ద్వారం దగ్గర ఎదురయ్యాడు. క్షణం పాటు ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి.

జానకి మంచం దగ్గరకు వచ్చినవాడు కాస్తా  హారికను మరొక్కసారి చూడాలనిపించి వెనక్కి తిరిగాడు.

ఠీవిగా రాజహంసలా నడిచిపోతున్న ఆమె వంక అలా చూస్తూండిపోయాడు. హారిక మాత్రం అదేం గమనించకుండా సుగుణ దగ్గరకు వెళ్లి రమ్య గురించి అడిగింది.

"ఇవాళేదో ప్రాక్టికల్స్ ఉంటాయి, లేటవుతుందని చెప్పే వెళ్లిందమ్మా!" అంది సుగుణ.

"అలాగా, మొన్న వచ్చినప్పుడు కూడా తను కనిపించలేదు ... చూసి చాలా రోజులయింది" అంది హారిక.

"పోనీ ఈ పూటకు ఇక్కడే ఉండిపోగూడదా అమ్మకి ఫోన్ చేసి చెప్తాను" అంది సుగుణ.

"వద్దులే అక్కా  చదువుకోవాల్సింది చాలా ఉంది. మరోమాటు వచ్చినప్పుడు ఉంటాలే!" అంది హారిక వెళ్లడానికి ఉద్యుక్తురాలవుతూ.

బట్టలు మార్చుకొని వచ్చి వాళ్ల దగ్గర కూర్చున్నాడు భాస్కర్.  అతడు కూర్చున్న వెంటనే తాను వెళ్లేందుకు లేస్తే బాగుండదని ఆగిపోయింది హారిక.

"ఏంటమ్మా హారికా విశేషాలు? ఏం చదువుతున్నావు?" అని అడిగాడు భాస్కర్.

"బి.ఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను మావయ్యా. మీరు వచ్చారని విన్నదగ్గర నుండి మిమ్మల్ని

చూడాలని నాన్న ఒకటే కలవరిస్తున్నాడు. బ్యాంకులో పని చాలా ఎక్కువగా ఉందట రాలేకపోతున్నానని బాధపడుతున్నారు" అంది హారిక.

"తెలుసమ్మా. మార్చి ఫైనాన్షియల్ ఇయర్ ఎండింగ్ కదా అలాగే ఉంటుంది" అన్నాడు భాస్కర్.

"చిన్నప్పుడు మీరిద్దరూ తెగ కొట్టుకునేవారట గదా మావయ్యా. ఆ ముచ్చట్లు అప్పుడప్పుడూ చెవుతూ ఉంటారు. ఆపైన ఎక్కడికి వెళ్లినా మీరిద్దరూ కలిసే వెళ్లేవారట. ఈవెన్ బేంక్ టెస్టులు కూడా కలిసే రాశారట!" అంది నవ్వుతూ.

"అవునమ్మా. ఆరోజులే వేరు. మాకు అదొక బంగారు కాలం! మేమిద్దరం అలా జంటగా తిరగడం చూసి మా కాలేజిమేట్స్ మాకు జంటకవులు అని పేరు పెట్టారు" అన్నాడు భాస్కర్ నవ్వుతూ.

"అవును, అది కూడా చెప్పారు. అంతే కాదు, కాలేజీ ఎగొట్టి షోలే సినిమాకి వెళ్లారట. ఆ సినిమా పదిసార్లు చూశారట. బోర్ కొట్టలేదా మావయ్యా మీకు?" అంది హారిక నవ్వుతూ.

"బడుద్ధాయ్, అది కూడా చెప్పేశాడా నీకు?" అంటూ నవ్వుతున్న హారిక వంకే తదేకంగా చూస్తూ, "నీ నవ్వు చాలా బాగుంటుందమ్మా మా హరి నీకు హారిక అని పేరు పెట్టి తప్పు చేశాడు. సుహాసిని అని పేరు పెడితే నీకు అతికినట్లుగా సరిపోయేది "అన్నాడు భాస్కర్.

" పోనీ ఇప్పుడు మాత్రం ఏంపోయింది మావయ్యా ... మార్చేసుకుంటే పోలేదా పేరు! "అంది హారిక తేలిగ్గా నవ్వేస్తూ.

పక్కనే ఉన్న సుగుణ," ఎంత తేలిగ్గా అనేశావు హారికా పేరు మార్చాలంటే మాటలా? రిజిష్టరులోనూ, ఎగ్జామ్స్ లోనూ ఆ పేరే కదా నమోదయి ఉంటుంది "అంది అమాయకంగా.

"ఏదో మాట వరసకి అంటే అయిపోతుందా అమ్మా భలేదానివే నువ్వు"అంటూ పక్కనే బల్ల మీద ఉన్న పుస్తకాలు తీసుకొని పేరు చదివాడు.

" కోతికొమ్మచ్చి పుస్తకాలు చాలా బాగుందట కదా మా ఫ్రెండ్స్ చాలా మంది చెప్పారు కానీ చదవాలంటే మహా బద్ధకం నాకు ఇంత వత్తిడిలో కూడా అన్నయ్య ఇంకా పుస్తకాలు చదువుతున్నాడా? " అనడిగాడు భాస్కర్ ఆశ్చర్యంగా.

" మావయ్యా అత్తయ్యలే కాదు మావయ్యా అక్క కూడా పుస్తకాల వురుగే! మా కాలేజీ లైబ్రరీలో ఉన్న పుస్తకాల్లో సగం పైగా అక్క చదివేసింది. ఈ పుస్తకాలు కూడా లైబ్రరీలో ఉన్నాయి, తెస్తాను అంటే వద్దంది. తనకి పుస్తకాల కలెక్షన్ హాబీ కదా అందుకని కొని తెచ్చాను "అంది హారిక.

“ఇంట్లో ఇంత పని చేస్తూ ఉంటావు ... నీకు పుస్తకాలు చదివే ఖాళీ ఎక్కడుంటుందమ్మా? "అనడిగాడు భాస్కర్ ఆదరంగా సుగుణ వంక చూస్తూ.

"మీకు తెలుసుకదా మావయ్యా మంచి వుస్తకం మంచి మిత్రుని వంటిదని. నాకు చిన్నప్పటి నుండీ పుస్తకాలు చదవడం అలవాటే. పెళ్లయి ఇక్కడికి వచ్చాక అత్తయ్యగారు కలెక్టు చేసిన వుస్తకాలు చూసిన నాకు విందు భోజనం దొరికినంత ఆనందం కలిగింది. రోజూ రాత్రి పడుకునే ముందు ఎంతో కొంత చదివితే గానీ తృప్తిగా ఉండదు నాకు అయితే ఈ మధ్య పాపతో అంత తీరిక ఉండటం లేదు, మునుపటిలా చదివేందుకు. అయినా వుస్తకాలంటే ఆశ నాకు"అంది సుగుణ.

"ఈ రోజుల్లో వయోబేధం లేకుండా అందరూ టి.విలకు అతుక్కుపోతూంటే నువ్వేమిటమ్మా ఇంకా బుక్సే అంటావు? "అన్నాడు భాస్కర్ ఆశ్చర్యంగా.

" ఏమో మావయ్యా నాకా టి.వి. సీరియల్స్ చూడాలంటే పరమ చిరాకు. ఒకటే కథను తిప్పి తిప్పి రాస్తూ, తీస్తూ ఉంటారు. కక్షలూ, కారణ్యాలతో అంతా నింపేసి జీళ్లపాకంలా ఏళ్ల తరబడి సాగదీస్తూ ఉంటారు.

ఒక్కొక్కరి కళ్లల్లో ఎంత క్రౌర్యమో ఆ డైలాగుల్లో ఎంతో హింసా ప్రవృత్తి కన్పిస్తూ ఉంటుంది. ప్రేక్షకుల సహనానికి పరీక్ష పెట్టినట్లు ఉండే ఆ సీరియల్స్ చూడడం నావల్ల కాదు అంది నుగుణ.

"నువ్వన్నది నిజమేనమ్మా. పుస్తకాలు చదివితే కలిగే హాయి ఈ టి.వి. సీరియల్స్ వలన రానే రాదు. కానీ ఈ టి.విల వలన రీడబిలిటీ బాగా పడిపోయిందమ్మా. ఎంత విద్యావంతులైనా టి.వి రిమోట్ పట్టుకొని ఛానల్స్ మార్చి మార్చి చూస్తూ టైమ్ ని కిల్ చేస్తూ ఉంటారు. అఫ్ కోర్సు నేను కూడా అంతేననుకో. దీని మూలంగా అక్షరాలు అదృశ్యమయ్యే పరిస్తితి వస్తోంది. ముఖ్యంగా మన తెలుగు భాష మృతభాషగా మారిపోతోంది" అన్నాడు భాస్కర్ బాధగా,

“ఆమాట నిజమే అయినా మళ్లీ వెనకటి రోజులు వచ్చి తీరతాయి అనిపిస్తోంది మావయ్యా! నాకు తెలిసిన వాళ్లలో చాలామంది ఆ డీ టి.వి. సీరియల్స్ పట్ల విరక్తి పెంచుకొని తిరిగి బుక్స్ చదవడం మొదలు పెట్టారు" అంది సుగుణ.

"ఆమాట నిజమే మావయ్యా  మానవుడు నిరంతర అన్వేషి కాదు, వివేకవంతుడు కూడా! తన ఆనందం కోసం, సుఖం కోసం అనునిత్యం కొత్త కొత్త మార్గాలు వెతుకుతూనే ఉంటాడు. మొదట్లో టి.వి మాధ్యమం మనిషిని బాగా ఎట్రాక్ట్ చేసింది. ఇప్పుడిప్పుడే దాని నుండి బయటపడుతున్నాడు. ఎందుకంటే అందులో వచ్చే కార్యక్రమాలు మనిషిని నిర్వీర్యునిగా మార్చేస్తున్నాయి.

అంతేకాదు, టి.విలో వచ్చే నేరాలు ఘోరాలు, ఆశ్చర్యం వంటి కార్యక్రమాల వలన మనిషిలోని నేర ప్రవృత్తిని ప్రవోక్ చేస్తున్నది. మూఢనమ్మకాల్లో కూరుకుపోయేలా చేస్తున్నది. వీటిని ప్రసారం చేయడం

మొదలు పెట్టాక నేరాల సంఖ్య బాగా పెరిగిపోయిందని ... ప్రభుత్వ గణాంకాల ద్వారానే తేటతెల్లమవుతోంది.

నిప్పుతో వంట చేసుకోవచ్చు. ఇల్లు కూడా తగలబెట్టుకోవచ్చు. అలాగే ఇది కూడా! సరదా కోసంథ్రిల్ కోసం కూడా హత్యలూ, మానభంగాలూ జరుగుతున్నాయని పలు సర్వేల ద్వారా వెల్లడయింది. ఇది

చూసి, చదివి చాలా మంది తల్లిదండ్రులలో ఇప్పుడిప్పుడే అలజడి మొదలయింది. ఫలితంగా ఇందాక అక్క చెప్పినట్లుగా చాలామంది టి.వి. చూడడం మానుకున్నారు "అంది హారిక.

ఇంత చిన్నపిల్ల ... అంత విశ్లేషాత్మకంగా మాట్లాడడం చూసి ఎంతో ఆశ్చర్యపోయాడు భాస్కర్.

హారిక మాటలు విని గది బయటకు వచ్చిన శశికిరణ్ చేతులు కట్టుకొని ఆ మాటలు వింటూ అలా నుంచుండిపోయాడు.

ఆ రాత్రి అనుకున్నాడు శశికిరణ్  మమ్మీ హారిక గూర్చి చెప్పినదానికి  తను ఇక్కడ చూస్తున్నదానికి ఏమాత్రం పోలిక లేదనుకున్నాడు. అతనికి ఆడపిల్లల్ని చూడడం, వాళ్లతో మాట్లాడడం కొత్తేమీ కాదు.

చదువుకుంటున్నప్పుడు, ఉద్యోగం చేస్తున్న చోట ఎందరో అమ్మాయిలు పరిచయమయ్యారు అతడికి. ఒకరితో ఒకరు ఎంతో చనువుగా ఉంటారు. కానీ ఎవరిని చూసినా కలగని భావం అతడికి హారికను చూడగానే కలిగింది. అందానికి మించి ఏదో ఆకర్షణ శక్తి ఆమెలో ఉందనిపించింది.

హారిక మాటలూ, నవ్వూ ఎంతో సమ్మోహనంగా మరీ మరీ చూడాలనిపించేటట్లు ఉంది. ఎందుకో ఎప్పుడూ లేనిది నాలో తనని చూడగానే ఇంతటి అలజడి కలిగింది? మనను పదే పదే తన సమక్షాన్నే కోరుకుంటోంది.

బహుశా డాడీ తన గూర్చి చెప్పి ఉండటాన్ని అలాంటి ఫీలింగ్ కలుగుతోందా? అంటే అయివుంటుంది. లేకపోతే ఒక్కసారి చూసినంత మాత్రాన నాకిలాంటి ఫీలింగ్ కలగడం ఏమిటీ, చిత్రంగా! ఈ ఆపరేషన్ అయ్యాక తాను బెంగుళూరు వెళ్లిపోతే హారిక ఎవరో, తనెవరో? అనుకుంటూ ఆలోచనలన్నిటినీ పక్కన పెట్టేయాలని చూశాడు శశికిరణ్

కానీ ఎంత ప్రయత్నించినా హారిక నవ్వు ముఖం అతడిని మెస్మరైజ్ చేస్తున్నట్లు అనిపించగా ఆ రాత్రి నిద్రకు దూరమయ్యాడు.

కొడుకు నిద్రపోకుండా మంచం మీద అటూ, ఇటూ కదులుతూండడం చూసి " ఏరా నిద్ర రావడం లేదా? అమ్మగూర్చి ఆలోచిస్తూ మనను పాడుచేసుకుంటున్నావా? అమ్మకేం కాదులే ... నిద్రపో! "అంటూ

భాస్కర్ శశి వీవు మీద చేయివేసి చిన్నపిల్లాడిని జోకొట్టినట్లు జోకొట్టసాగాడు.

తాను అమ్మాయి గూర్చి ఆలోచిస్తూ ఉంటే ... డాడీ అమ్మ గూర్చి అనుకుంటున్నారు అని తనలో తాను నవ్వుకుంటూ మెల్లగా నిద్రలోకి జారిపోయాడు.

ఆపరేషన్ డేట్ ఫిక్స్ అయిందని కూతురు వచ్చి చెప్పడంతో అక్కగారిని చూసేందుకు హరిప్రసాద్ భార్యని తీసుకొని వెళ్లాడు.

పూర్వంలా నిరాశగా మాట్లాడకుండా ఎంతో ధైర్యంగా మాట్లాడుతున్న జానకిని చూడడంతోనే అతడు ఎంతో రిలీఫ్ గా ఫీలయ్యాడు.

" హారిక చెప్తే ఏమో అనుకున్నాను గానీ అక్కా నిన్ను చూస్తే చాలా సంతోషంగా ఉంది నాకు. మొత్తం మీద శశిగాడు నీలో చాలా మార్పు తీసుకువచ్చాడు సుమి! "అన్నాడు ఆనందంగా.

" నిజమేరా ... వాడిని చూశాక కొండంత ధైర్యం వచ్చినట్లనిపించింది నాకు. చిన్నవాడైనా వాడి మాటల్లో ఎంత మెచ్యూరిటీ ఉందనుకున్నావు? "అంది జానకి చిన్న కొడుకుని తలచుకొని మురిసిపోతూ.

" నీకు వాడి మీద గల మమకారం అక్కా అదంతా. నీ చుట్టూ ఇంతమందిమి అనుక్షణం నిన్ను కనిపెట్టుకుని ఉన్నా రాని ధైర్యం వాడిని చూస్తే వచ్చిందా? నీ మీద బెంగతో చిక్కి సగమైనాడు రవి. ఎపుడైనా గమనించావా వాడిని? పాపం ఆ సుగుణ వయసులో చిన్నదైనా కన్నతల్లిలా నిన్ను చూస్తోంది. పిచ్చిపిల్ల రమ్య నీకు జబ్బు చేసిన దగ్గర నుండి ఎలా ఢీలా పడిపోయిందో చూశావా అసలు? "అన్నాడు హరిప్రసాద్ మందలిస్తున్నట్లుగా,

" అవునురా . రవిని చూస్తే నా కడుపు తరుక్కుపోతోంది. కళ్లల్లో ప్రాణాలు పెట్టుకొని బ్రతుకుతున్నట్లున్నాడు వాడు. సుగుణ సంగతి సరేసరి. బంగారు తల్లి, ఎంతో ఓపిగ్గా నా మంచి చెడ్డలన్నీ చూస్తోంది. ఇంక రమ్య నిన్న దాని ఏడుపు చూస్తే నాకు మతిపోయిందనుకో! వీళ్లందర్నీ ఏం చేసి పోతావు? అంటూ శశి నన్ను నిలేసేసరికి నానోట మాట రాలేదనుకో" అంది జానకి సజల నయనాలతో.

" పోన్లే అక్కా, ఇప్పటికైనా నీ మనసు తెలుసుకున్నావు అంతేచాలు"అన్నాడు హరిప్రసాద్ ఆప్యాయంగా జానకి చెయ్యి పట్టుకొని,

"అది సరేగానీ, హారిక ఏమంటోందిరా శశిని గూర్చి? "అనడిగింది జానకి ఆశగా తమ్ముడి వంక చూస్తూ.

" ఇప్పుడీ ఆలోచనలన్నీ ఎందుకక్కా నీకు? ఏ వత్తిడి లేకుండా మనసు ప్రశాంతంగా ఉంచుకో. ముందీ గండం నుండి బయటపడ్డాక మిగతా విషయాల గూర్చి ఆలోచిద్దాము "అన్నాడు హరిప్రసాద్ అనునయంగా,

" అవును వదినా, ఆయన చెప్పినట్లు మనను ప్రశాంతంగా ఉంచుకో. అన్నీ అయ్యాక నిదానంగా మాట్లాడుకుందాం ఇవన్నీ! మీ తమ్ముడికి నిద్రలోనూ, మెలకువ లోనూ నీ ధ్యాసే! ఇదిగో ఇవేళ నిన్ను చూశాక

ఆయన మనను కొంచెం స్తిమితపడింది "అంది ఇందిర.

" పిన్నీ, జ్యూస్ తీసుకోండి! "అంటూ సుగుణ జ్యూస్ గ్లాసులు తెచ్చి ఇందిరకూ, హరిప్రసాద్ కు ఇచ్చింది.

" ఇప్పుడెందుకమ్మా ఇదంతా. ఉన్నవన్నీ చాలక ఈ మర్యాదలన్ని పెట్టుకుంటావు! "అంది ఇందిర సుగుణ వంక ఆప్యాయంగా చూస్తూ,

" పెద్ద పనేం ఉంది పిన్ని. ఈ మాత్రానికే ఏమయిపోతుంది? "అంది సుగుణ నవ్వేస్తూ.

" ఈ కాలంలో ఉండవలసిన దానివి కాదమ్మా నువ్వు. అవునూ, పాపేదీ కనవడదు? "అనడిగింది ఇందిర.

" అది వాళ్ల బాబాయితో షికారుకు పోయింది. శశి వచ్చిన దగ్గర నుండి ఒక్కక్షణం వదలడం లేదు తనని. బయటకు తీసుకువెళ్లి అతనితో అదీ ఇదీ కొనిపించుకొంటూంది"అంది సుగుణ.

" దాని బాబాయి దగ్గర దానికి ఆమాత్రం హక్కు లేదా ఏమిటి? అదో నేరంలా మాట్లాడుతున్నావే నువ్వు" అంది జానకి మనవరాలిని తలచుకొని మురిసిపోతూ.

"మీ మనవరాలు ఏంచేసినా మీకు ముద్దేలెండి . సరే లోపల పని ఉంది. మీరు మాట్లాడుతూ ఉండండి. వస్తాను!" అంటూ వాళ్లు తాగిన జ్యూస్ గ్లాసులు తీసుకొని వెళ్లిపోయింది సుగుణ అక్కడి నుండి.

"ఎంత మంచి పిల్ల వదినా సుగుణ ఎంత పనిచేసినా, ఎవరి మీదా, ఎప్పుడూ విసుక్కోగా చూడలేదు" అంది ఇందిర.

"అవును ఇందిరా, తను గాబట్టే ఈ ఇంటిని ఇంత సమర్ధవంతంగా నెట్టుకొస్తోంది. మరొకరైతే సంవత్సరం రోజులుగా నేనిలా మంచాన పడ్డందుకు చెయ్యలేక వేరు కాపురం అంటూ కుటుంబాన్ని విడదీసేవారు "అంది జానకి.

"అదేంమాటలే అక్కా. నువ్వు మంచిదానివి కనుకే, తనూ మంచిగా మనలుకుంటోంది! "అన్నాడు హరిప్రసాద్ ఆరాధనగా అక్కగారి వంక చూస్తూ.

" పోరా, లోకంలో నీ అక్క తప్ప మరెవరూ మంచివాళ్లు ఉండరంటావు–ఈ కబుర్లకేంగానీ, శశిని మీ ఇంటికి పిలుచుకువెళ్లరా. వాళ్లిద్దరి మధ్యా అభిమానాలు ఏర్పడితే, మన ఆశలు ఎంతలో తీరేను? వాళ్ల పెళ్లి చూడాలని నా మనసెంత ఆరాటపడుతోందో నీకు కూడా తెలుసు కదా ఈ పెళ్లి జరిగితే తన మనవరాలూ, మనవడూ ఒకటైనందుకు పైన ఉన్న అమ్మా, నాన్న కూడా ఎంతో సంతోషిస్తారు "అంది జానకి ఉద్వేగంగా.

"ఆ ఆశ నీకే గానీ, నాకు లేదంటావా అక్కా? ముందు నీ ఆరోగ్యం కుదుటపడనీయ్. మిగతావన్నీ తర్వాత ఆలోచిద్దాం" అన్నాడు హరిప్రసాద్ ప్రేమగా జానకి చెయ్యి నిమురుతూ.

"నువ్వలా అంటే నేను ఏమి చెప్తానులే "అంటూ అలసటగా కళ్లు మూసుకొంది జానకి.

ఇంతలో సుడిగాలిలా కావ్య అక్కడికి పరుగెత్తుకుంటూ వచ్చింది. " చూడు నానమ్మా నా బొమ్మలు ... బాగున్నాయి కదూ! "అంది కావ్య ఆనందంతో ముఖమంతా వెలిగిపోతూండగా.

సవ్వడికి కళ్లు తెరిచిన జానకి మనవరాలి ముఖంలో ఆనందం చూసి మురిపెంగా నవ్వేస్తూ" చాలా బాగున్నాయమ్మా! "అంది.

కావ్యతో పాటు లోపలికి వచ్చిన శశికిరణ్, హరిప్రసాద్ ని, ఇందిరనీ చూసి" బాగున్నారా మావయ్యా? అత్తయ్యా, ఎలా ఉన్నారు? "అంటూ కుశలప్రశ్నలు వేశాడు.

" బాగున్నాంరా . నువ్వెలా ఉన్నావు? అమ్మ రాలేదటకదా మీతో? "అన్నాడు హరిప్రసాద్.

" మమ్మీ ఎల్లుండి వస్తుంది మావయ్యా. యశ్వంత్ ఎలా ఉన్నాడు. చూసి చాలా రోజులయింది" అన్నాడు శశికిరణ్

" నీకు తెలియదా వాడు యు.ఎస్. వెళ్లి నాలుగేళ్లు అయింది. ఇంజనీరింగ్ అయిన వెంటనే యం.యస్ చేసేందుకు అమెరికా వెళ్లిపోయాడు "అన్నాడు హరిప్రసాద్.

" అవునా. యు.ఎస్ వెళ్లిపోయాడా అయితే? రవన్నయ్య పెళ్లికి వచ్చినప్పుడు చెప్పాడు యు.ఎస్ వెళ్లడం తన కలని మొత్తానికి నెరవేర్చుకున్నాడన్నమాట" అంటూ ఇందిర వైపు తిరిగి" ఇంకేమిటత్తా విశేషాలు?" అని అడిగాడు శశికిరణ్, తల్లి మంచం అంచు మీద కూర్చుంటూ.

"ఇంకేముంటాయి బాబూ విశేషాలు? వాడు వెళ్లిన దగ్గర నుండీ ఇల్లు చిన్నబోయినట్లుంది నాకు. తిరిగి ఎప్పుడొస్తాడో, ఏమిటో? వాడిని చూడాలనిపించినప్పుడల్లా వెబ్ కెమేరా ఆన్ చేయడం తప్ప మరో మార్గం లేదు కదా" అంది ఇందిర దిగులుగా,

"మంచి జీవితం కావాలనుకున్నప్పుడు కొన్ని ఇబ్బందులు తప్పవు కదత్తా. ఇక్కడ మా ప్రతిభకు సరైన అవకాశాలుంటే నాలాంటి వాళ్లంతా అక్కడికి ఎందుకు పరుగులు పెడతారు చెప్పు?" అన్నాడు శశికిరణ్ యశ్వంత్ ని సమర్థిస్తూ.

"మీ పిల్లగాళ్లందరిదీ ఒకేమాట అయినప్పుడు ... నేనేం చెప్పగలను? కాకపోతే కన్నవాళ్ల పరిస్థితిని

కూడా మీలాంటి వాళ్లు కాస్త ఆలోచించాలంటాను నేను" అంది ఇందిర.

"మీ అత్త మాటలకేం గాని శశీ. అవి అలా గంగా ప్రవాహంలా సాగుతూనే ఉంటాయి. మేమొచ్చి చాలా సేపయింది వెళ్లొస్తాం!" అంటూ లేచాడు హరిప్రసాద్.

"మీ మావయ్య ఎప్పుడూ ఇంతే. నేను మాట్లాడుతూంటే ఇలా మధ్యలోనే కట్ చేస్తూంటారు. నువ్వు వచ్చి ఇన్ని రోజులయింది కదా ఒక్కసారైనా మా ఇంటికి వచ్చావా?" అంది ఇందిర నిష్ఠూరంగా,

"రావడానికి వాడిని నువ్వెప్పుడు పిలిచావట?" అన్నాడు హరిప్రసాద్ హాస్యంగా,

"అదేమిటి మావయ్యా అలా అంటావు? మీ ఇంటికి రమ్మని నన్ను ప్రత్యేకంగా పిలవాలా? వచ్చిన దగ్గర నుండి ఏదో ఒకపని వలన తీరికలేక రాలేకపోయానంతే .... రేపు తప్పక వస్తాలెండి!" అన్నాడు శశికిరణ్.

అతడికి కూడా హారికను చూడాలని ఆశగా ఉంది. ఎంత వద్దనుకున్నా మనను ఆమె సమక్షం కోసం తహతహలాడిపోతోంది. సందర్భం కోసం వెతుక్కుంటూండగా, అనుకోని ఆహ్వానం అతనికి ఎంతో ఆనందాన్నిచ్చింది. మేనల్లుడి మాటలు విన్న హరిప్రసాద్ ఇందిరల ముఖాలు సంతోషంతో విప్పారాయి.

"తప్పకుండా రావాలి. వచ్చేటప్పుడు మీ నాన్నను కూడా తీసుకురా. చూసి చాలా రోజులయింది" అంటూ అందరికీ చెప్పి వెళ్లిపోయారు.

చిన్న కొడుకు వాళ్లింటికి వెళ్తానని చెప్పడంతోనే హరిప్రసాద్ కంటే జానకే ఎక్కువ సంతోషపడిపోయింది. దేవుడు మేలు చేసి ఏదోవిధంగా వాళ్లిద్దరూ ఒకటయితే అంతేచాలు అనుకుంది మనసులోనే.

హరిప్రసాద్ ఇందిరలు మేఘాల్లో తేలిపోతున్నట్లుగా ఇంటికి వచ్చారు. ఎంతో సంబరంగా ఈ వార్తని కూతురుతో చెప్పారు తల్లిదండ్రుల ముఖాల్లో వెల్లివిరుస్తున్న ఆనందాన్ని చూసి ఆశ్చర్యపోయింది హారిక.

ఇన్నాళ్లూ అమ్మానాన్న నా ముందు బయటపడలేదు గానీ, అతనికి నన్ను ఇచ్చి చేయాలన్న కోరిక చాలా బలంగా ఉందన్నమాట అనుకుంది మనసులో.

కానీ అదేం పైకి వ్యక్తం చేయకుండా "అబ్బా, ఏమిటమ్మా ఈ హడావిడి బావ ఎప్పుడూ మనింటికి రానట్లు ఇదే మొదటిసారి అన్నట్లు చేస్తున్నారే!" అంది విసుగ్గా

"అలా అని కాదు గానీ, మా సంతోషం మాది మీ కమలత్త అక్కడ ఉండి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో? ఆవిడ లేదు కనుక బావ మాతో చాలా అభిమానంగా మాట్లాడాడు. ఇంటికి రమ్మని పిలుస్తే తప్పక వస్తానన్నాడు రేపు ఆవిడ వస్తే మనింటికి తనని రానిస్తుందో లేదో తెలియదు కదా " అంది ఇందిర.

"అవునమ్మా ... ఇన్నాళ్లూ బయటపడలేదు గానీ, వాడికి నేనంటే చాలా అభిమానం. వాడికీ, నీకూ పెళ్లి చేయాలని మీ అత్తయ్యతో పాటు మేము కూడా చాలా ఆశపడుతున్నాము. మీ బాచీ మావయ్యకు కూడా అదే కోరిక. చివరకు ఏమవుతుందో ఏమో?" అన్నాడు హరిప్రసాద్.

"కమలత్త ఉన్నప్పుడు ఒకలా, లేనప్పుడు ఒకలా ప్రవర్తించేవాడు నన్ను పెళ్లి చేసుకుంటాడని ఎలా అనుకుంటున్నారు నాన్నా మీరు? అయినా గానీ నా చదువయ్యే వరకూ పెళ్లి మాట ఎత్తవద్దన్నాను కదా మళ్లీ ఇదేం గోల?" అంది హారిక చిరాకుపడుతున్నట్లుగా

"ఏంటే నీ గోల? ఇప్పుడేదో అతడు పెళ్లి చూపులకు వస్తున్నట్లు, మేమేదో నిన్ను పెళ్లి కోసం తొందర పెడుతున్నట్లు మాట్లాడుతున్నావేం" అంది ఇందిర కూతురి వంక చూస్తూ.

"అలాగే ఉంది మీ ఇద్దరి ధోరణీను ... అతడేదో సరదాగా మనింటికి వస్తానంటే ఆమాత్రం దానికే తలక్రిందులయిపోతున్నారు. మీరు" అంది హారిక పరిహాసంగా.

"నీకు తెలియదమ్మా, ఆడపిల్లల్ని కన్నవాళ్ల ఆరాటం ఎలా ఉంటుందో?" అన్నాడు హరిప్రసాద్.

"ఏమిటి నాన్నా మీరు కూడా అమ్మలా చాదస్తంగా మాట్లాడుతున్నారు. ఈ రోజుల్లో కూడా ఇంకా ఆడా, మగా తేడాలు ఎంచుతున్నారు? వాళ్లలాగే మేమూ కష్టపడి చదివి, కెరియర్ ని ఉన్నతంగా మలచుకుంటున్నాము. అన్ని రంగాల్లోనూ మగవాళ్లకి ఎందులోనూ తీసిపోకుండా ముందంజలోనే ఉంటున్నాము.  కానీ మీరు మాత్రం ఇంకా పాతకాలంలోలా ఆడపిల్లను కనడమే ఏదో నేరమయినట్లుగా మాట్లాడుతున్నారు

నాకేం కన్నొంకరా, కాలొంకరా? ఈ పెళ్లి జరగకపోతే ఏదో మునిగిపోతుంది అన్నట్లుంది నీ ధోరణి!"అంది హారిక చిన్నబుచ్చుకున్నట్లుగా.

**కూతురు** చిన్నబుచ్చుకుందని గ్రహించిన హరిప్రసాద్ "అయ్యో నా ఉద్దేశ్యం నిన్ను తక్కువ చేయాలని కాదమ్మా. ఏదో మాట తొందరలో లోకరీతిగా అందరిలాగే అనేశాను. నిజానికి మీకు పెళ్ళి చెయ్యాలనుకున్నది ఇప్పటి మాట కాదమ్మా. మీరిద్దరూ పుట్టకముందు మీ అత్తా, నేనూ అలా అనుకునేవాళ్ళం. ఒక విధంగా చెప్పాలంటే ఇది మా ఇద్దరి కలానూ. అది నెరవేర్తుతుందో లేదోనని మీ అత్తయ్య బెంగపెట్టుకుంది ఇన్నాళ్ళూ" అన్నాడు చెమరించిన కళ్ళను తుడుచుకుంటూ.

"బాచీ మావయ్యా, నువ్వూ చిన్ననాటి స్నేహితులు కనుక ఆ మాట అనుకోవడంలో అర్థం ఉంది. కానీ అత్తయ్యకు ఎందుకు నాన్నా అంత ఆరాటం, మా పెళ్ళి చేయాలని?" అంది హారిక అర్థం కానట్లు చూస్తూ.

"ఎందుకంటే శశిబావ మీ అత్తయ్యకు కన్నబిడ్డ కనుక. బిడ్డలు లేని వాళ్ళకు పెంపకానికి ఇస్తున్నప్పుడే మాట తీసుకుంది అక్క. నాకు కూతురు పుడితే మీ ఇద్దరికీ పెళ్ళిచేయాలని, మా అక్కా తమ్ముళ్ళ బంధం నిలుపుకోవాలని. అలాగే అంది మీ కమలత్త. తీరా నువ్వు పుట్టిన దగ్గరనుండీ మాతో సంబంధం కలుపుకోవడం ఇష్టంలేక పొమ్మనకుండానే

పొగబెట్టినట్టుగా ఇక్కడికి రాకపోకలు బంద్ చేసింది. దాంతో మీ అత్త కొడుకు మీద బెంగతో ఇలా తయారయింది" అన్నాడు హరిప్రసాద్ బాధగా.

"నిజమా? శశిబావ జానకత్త కొడుకా?" అంది హారిక ఆశ్చర్యంగా చూస్తూ.

"అవునమ్మా ఇప్పుడర్థమైందా, మేమంతా ఎందుకింత ఆరాటపడుతున్నామో?" అంది ఇందిర.

"మీరన్నది నిజమే కావచ్చు. అయినా కానీ అప్పుడెప్పుడో మీరంతా కలిసి ఇచ్చిపుచ్చుకున్న మాటలకోసం ఇపుడు మా మనసుల్లో ఏముందో తెలుసుకోకుండా మీరిల్ ఆఊహలు అల్లుకోవడం ఏమీ బాగోలేదు. బావ సంగతి నాకు తెలియదుగానీ, నా జీవితానికి సంబంధించినంత వరకూ నాకు కొన్ని ఖచ్చితమైన అభిప్రాయాలున్నాయి. అనుకున్నది సాధించేవరకూ నా ముందు పెళ్ళిమాట ఎత్తవద్దు" అంది హారిక.

"ఇప్పుడేదో అర్జెంటుగా నీకు పెళ్ళి చేసేస్తామన్నామా మేము? ఈ పెళ్ళి జరగాలంటే ఎన్ని కుదరాలి? అప్పుడు కదా మీ అభిప్రాయాల గురించి అడగాలి" అంది ఇందిర.

"ఏమో అదంతా నాకు తెలియదు. నా సంగతి నేను చెప్పాను. ఆ తర్వాత చెప్పలేదని మీరు నన్ను బ్లేం చేయకూడదు" అంది హారిక హెచ్చరిస్తున్నట్టుగా.

"ఎక్కడికి పోతాయి ఇందిరా మేనత్త బుద్దులు? పెళ్ళి విషయంలో మా నాన్నతో మాఅక్క కూడా ఇలాగే వాదించిందని మా అమ్మ అనేది ఎప్పుడూ. అక్క కూడా దీనిలాగే చదువూ, చదువూ అని గోలపెట్టేదట" అన్నాడు హరిప్రసాద్ నవ్వుతూ.

"ఇంకేం, అత్త వారసత్వాన్ని నేను నిలబెడుతున్నాననుకోండి. కాకపోతే ఆ రోజుల్లో అత్త మీ అందరితో పోరాడి నెగ్గలేకపోయింది. నేను మాత్రం అనుకున్నది సాధించి చూపిస్తాను" అంది హారిక ఆత్మవిశ్వాసం నిండిన కంఠంతో.

"ఏమిటో దీని తీరెప్పుడూ అర్థంకాదు నాకు. ఎప్పుడు చూసినా చదువంటుంది. ఈ వయసులో పిల్లలందరూ చెలాకీగా ఆడీ పాడీ తిరుగుతూంటే ఇది మాత్రం మరో లోకంలో ఉన్నట్టుంటుంది" అని గొణుక్కుంటూ వంటగదిలోకి వెళ్ళిపోయింది ఇందిర భోజనాలు వడ్డించేందుకు.

తల్లి గొణుగుడంతా హారికకు వినిపిస్తూనే ఉన్నా జవాబేమీ చెప్పే ప్రయత్నం చేయలేదు. అలా జవాబులిస్తూ పోతూ ఉంటే, మాటలు పెరుగుతాయని, దాని వలన అనవసరంగా తల్లి మనసు నొప్పించినట్లు అవుతుందని మెదలకుండా ఊరుకుంది హారిక.

భార్య ఆగలేక బయటకు అన్నమాటలను హరిప్రసాద్ మనసులోనే అనుకున్నాడు కూతురి ధోరణి అర్ధంకాక. కూతురు చదివి గొప్ప స్థాయికి చేరుకోవడం అతడికి ఇష్టమే అయినా అంతకంటే ఎక్కువగా ఇష్టమైనది అతడికి తన అక్కగారితో సంబంధం కలుపుకోవడం.

మేనల్లుడు ఆ రోజు తమ ఇంటికి వస్తున్నాడనే ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అవుతూ భార్యాభర్తిద్దరూ కలిసి నీట్‌గా సర్దేందుకు పోటీలు పడసాగారు.

"సర్దుడు పని నేను చూస్తానుగానీ, వాళ్ళకోసం ఏదైనా చెయ్యి ఇందిరా" అన్నాడూ హరిప్రసాద్.

మా శశికి బొబ్బట్లంటే చాలా ఇష్టమని ఆడపడుచు ఎప్పుడో అన్న మాటలు గుర్తుకు రాగా "బొబ్బట్లు చేస్తానండీ, అవంటే శశికి ఇష్టమట కదా" అంది ఇందిర.

"సరే చెయ్యి. బాచీకి కూడా బొబ్బట్లంటే చాలా ఇష్టం. కాస్త ఎక్కువ చెయ్యి. వాడూ నేనూ పట్టుపడితే మీకెవరికీ మిగలవింక" అన్నాడు హరిప్రసాద్ నవ్వుతూ.

ఇంట్లో జరిగుతున్న హడావిడితో తనకేం నిమిత్తం లేనట్లుగా తన గదిలో కూర్చుని ప్రశాంతంగా చదువుకోసాగింది హారిక.

మరిదిగారు హరిప్రసాద్ గారింటికి వెళ్తున్నాడని తెలిసి, "మా చెల్లాయికి సైట్ కొట్టడానికి భలే ముస్తాబవుతున్నావే" అంది సుగుణ అద్దం ముందు నుండి ఎంతకీ కదలని అతడిని చూసి.

శశికిరణ్ సిగ్గుపడుతున్నట్లుగా నవ్వి అక్కడినుండి బయటకు వచ్చేశాడు.

కొడుకు మావయ్యగారింటికి వెళ్ళివస్తానని చెప్పడంతో జానకి ఎంతో ఆనందపడిపోయింది.

భాస్కర్, శశికిరణ్ వెళ్ళేసరికి హరిప్రసాద్ వీధి వాకిట్లోనే నుంచున్నాడు. వాళ్ళ కోసమే ఎదురు చూస్తున్నట్లుగా.

అది చూసి "ఇదేమిటి మామయ్యా, ఇక్కడ నుంచున్నారు? ఎవరికోసమైనా చూస్తున్నారా?" అనడిగాడు శశికిరణ్.

"ఎవరికోసమో కాదు మీ కోసమే చూస్తున్నాను. ఏరా బాచీ బాగున్నావా?" అంటూ మిత్రుడ్ని కౌగిలించుకున్నాడు హరిప్రసాద్.

"భలేవాడివేరా నువ్వు. వాకిటి దాకా వచ్చిన వాళ్ళం ఇంట్లోకి రామా ఏమిటి?" అన్నాడు భాస్కర్ అతడి చేయి వదలకుండా లోపలికి నడుస్తూ. వాళ్ళని అనుసరించాడు శశికిరణ్.

ఇంట్లోకి వస్తూనే శశికిరణ్ చూపులు హారిక కోసం వెదకడం గమనించాడు హరిప్రసాద్.

"అమ్మా, హారికా ఇలారా, మావయ్యా వాళ్ళూ వచ్చారు" అంటూ పిలిచాడు కూతుర్ని.

వాళ్ళు వచ్చారని వినడంతోనే చదువుతున్న పుస్తకం మడిచి పక్కన పెట్టి హాల్లోకి వచ్చింది హారిక.

భర్త కేక విని వంటింట్లో ఉన్న ఇందిర కూడా హడావిడిగా వచ్చి వాళ్ళిద్దర్నీ పలకరించి, లోపలికి వెళ్ళి మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది.

హారిక వచ్చి "బావున్నారా మావయ్యా" అంటూ భాస్కర్‌నీ, "హాయ్" అంటూ శశికిరణ్‌నీ పలకరించి ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చుంది.

తాము వస్తున్నామని తెలిసి హారిక ప్రత్యేకంగా అలంకరించుకుంటుందని ఆశించాడు శశికరణ్. అతి సింపుల్‌గా ఉన్న ఆమె వస్త్రధారణ చూసి కొంచెం ఆశ్చర్యపోయాడు. అతడికి తన తండ్రితో వాదిస్తూ హారిక గూర్చి తల్లి అన్న మాటలు గుర్తుకు వచ్చాయి.

బుట్టబొమ్మలా ఒంటినిండా నగలు దిగేసుకుని తలలో తట్టెడు పూలు సింగారించుకుని అచ్చం పల్లెటూరి బైతులా ఉన్న హారిక ఎక్కడ. నాగరికతకు ప్రతిరూపంలా అధునాతనంగా ఉండే నా ఫ్రెండ్ కూతురు అనూష ఎక్కడ? నక్కకీ, నాగలోకానికీ ఉన్నంత తేడా ఉంటుంది ఇద్దరి మధ్యా అంటూ.

ఇప్పుడు హారికను మమ్మీ చూస్తే ఏముంటుంది అనుకున్నాడు.

హారికతో గతంలో మాట్లాడి ఉన్న భాస్కర్ ఆమె వేషధారణ చూసి ప్రత్యేకంగా ఆశ్చర్యపోలేదు.

చిన్న చిన్న లేత గులాబీరంగు పూలు ఉన్న తెల్లని టాప్. గులాబీ రంగు బాటం.. అదే రంగు చున్నీతో ఎంతో నిరాడంబరంగా ఉన్నప్పటికీ, తీర్చిదిద్దినట్ళున్న శరీరాకృతితో చూపరులను ఇట్టే ఆకర్షించేటట్లు ఉంది. ముఖ్యంగా ఆ కళ్ళల్లో కాంతి ముఖంలో నిర్మలత్వం, శశికిరణ్ హారికను అలా చూస్తూ ఉండిపోయాడు.

తన వంకే అలా రెప్పవేయకుండా చూస్తున్న శశికిరణ్‌ను "ఏమిటీ బావా, అలా చూస్తున్నావు. ఏదో అపరిచితురాలిని చూస్తున్నట్లు" అంటూ నవ్వింది.

నవ్వుతున్న హారిక ముఖం మరింత సమ్మోహనంగా అనిపించింది అతడికి.

"అపరిచితంగానే అనిపిస్తున్నావు మరి. అప్పుడెప్పుడో అన్నయ్య పెళ్ళిలో చూసినప్పటికీ, ఇప్పటికీ పోలికే లేదు నీలో" అన్నాడు శశికిరణ్.

"అవును, ఏళ్ళ తరబడి ఇక్కడికి రాకపోతివి నువ్వు. అందుకే అలా అనిపిస్తోంది నీకు" అంటూ తాను తెచ్చిన బొబ్బట్ల ప్లేట్లు వాళ్ళ నలుగురికీ ఇచ్చి మంచినీళ్ళు తెచ్చేందుకు లోపలికి వెళ్ళింది ఇందిర.

"ఓ, బొబ్బట్లా నాకు చాలా ఇష్టం. మా పెద్దమ్మగారు చాలా బాగా చేస్తారు ఇవి" అంటూ చాలా ఉత్సాహంగా బొబ్బట్లు తింటూ.

"నాది కూడా సేం డైలాగ్ అమ్మా" అన్నాడు భాస్కర్ ఉత్సాహంగా బొబ్బట్లు తింటూ.

"తెలుసన్నయ్యా, మీకిద్దరికీ ఇష్టమని చేసాను" అంది ఇందిర నవ్వుతూ.

"చాలా బాగున్నాయమ్మా అచ్చం మా వదిన చేసినట్లే ఉన్నాయి" అన్నాడు భాస్కర్ వాటి రుచిని ఆస్వాదిస్తూ.

"అయితే మరో రెండు వేసుకోరా. తీసుకురా ఇందిర్ ఆబాచిగాడికి చాలా ఇష్టం" అన్నాడు హరిప్రసాద్ ఉత్సాహంగా.

"చాలురా బాబూ, ఇంకా చిన్నవాళ్ళమేమిట్రా మనం అప్పట్లా తినేయడానికి" అన్నాడు భాస్కర్ వారిస్తున్నట్లుగా.

"అత్తా నాకు మాత్రం మరో రెండు పట్రా" అన్నాడు శశికిరణ్ తన ప్లేటు ఖాళీ చేసేసి.

బొబ్బట్లు తింటూ మిత్రులిద్దరూ వాళ్ళ చిన్ననాటి ముచ్చట్లలో పడిపోయారు.

"మావయ్యా, డాడీ మీ ముచ్చట్లన్నీ చెబుతూ ఉంటారు. వెనక బెంచీలలో చేరి అమ్మాయిలను బాగా ఏడిపించడంతో సహా" అంటూ తనూ మాటలు కలిపాడు శశికిరణ్.

హారిక ముందు ఆ ప్రస్తావన రావడంతో మిత్రులిద్దరూ సిగ్గుపడిపోయారు.

"నీకు బొత్తిగా సిగ్గులేదురా లేకపోతే పిల్లలతో ఎవరైనా ఇవన్నీ చెబుతారా?" అన్నాడు హరిప్రసాద్ భాస్కర్ భుజం మీద చిన్న దెబ్బ వేసి.

"నువ్వు కూడా ఏం మారలేదురా. అప్పటిలాగే ఇప్పుడు కూడా నా భుజం మీద బాదేస్తున్నావు" అన్నాడు భాస్కర్ హాయిగా నవ్వుతూ.

ఇంతలో రమ్య సుడిగాలిలా దూసుకు వచ్చింది లోపలికి. రమ్యను చూసి అంతా ఆశ్చర్యపోయారు.

అదేం గమనించని రమ్య శశికిరణ్ దగ్గరకు వచ్చి "ఈవేళ క్లాసులేం లేవని తెలిసి కాలేజీ నుండి ఎంతో ఆశగా నీకోసం ఇంటికి వెళ్ళాను. తీరా చూస్తే నువ్విక్కడికి సెటిల్ అయ్యావు అంటూ చుట్టూ చూసి, ఓహో బాబాయి కూడా ఇక్కడే ఉన్నారే? అమ్మా హారికా, నువ్వు కూడా ఇక్కడే ఉన్నావా? ఈ రోజు కాలేజీకి వెళ్ళలేదా ఎన్నాళ్ళయింది నిన్ను చూసి" అంటూ హారిక దగ్గరకు వచ్చి తలమీద మొట్టింది చిన్నగా.

తలమీద చేత్తో తడుముకుంటూ "రాక్షసీ, అందుకే నిన్ను అమ్మ తుఫాన్ అంటుంది. సరే తిట్టి తిట్టి అలిసిపోయావు గానీ, ఇంద ఈ బొబ్బట్టు తిను" అంటూ తన చేతిలోని ప్లేటు రమ్య చేతిలో పెట్టి చెయ్యిపట్టిలాగి తన పక్కన కూర్చోబెట్టుకుంది హారిక.

బొబ్బట్టు తింటూ "ఏమిటి, ఈ ఒక్క బొబ్బట్టుతోనే సరిపెట్టేస్తారా మీరందరూ డజన్లు డజన్ల కొద్దీ లాగించి" అంది రమ్య సీరియస్‌గా మొహం పెట్టి.

"వాములు తినే స్వాముల వారికి పచ్చగడ్డి ఫలహారం అన్నట్లు ఈ ఒక్కటీ ఏమూలకి సరిపోతుందమ్మా నీకు. అదిగో అమ్మ తెస్తోంది భారీగా, లాగించు మరి" అంది హారిక పరిహాసంగా.

"ఎందుకే దాన్నలా ఆడిపోస్తుకుంటావు?" అని కూతుర్ని మందలిస్తూ "దాని మాటకేం. రా తల్లీ నీకెన్ని కావాలంటే అన్నీ తిను" అంటూ తాను తెచ్చిన ప్లేటును రమ్యకు అందించి తల నిమిరింది ఇందిర.

మేనత్త ప్రేమకు రమ్య కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "నీ ప్రేమ చాలత్తా ఇంకేం వద్దు నాకు" అంటూ ఇందిర చేతిని తన చెంపకు ఆనించుకుంది రమ్య.

"పిచ్చిపిల్లా నేనింటికి ఫోన్ చేసి సుగుణకు చెప్తాను కానీ, ఈ పూట అందరూ ఇక్కడే ఉండిపొండి. సరదాగా కలిసి భోజనం చేద్దాం" అంది ఇందిర ఉత్సాహంగా

"భోజనం కోసమా ఇంతదూరం నేను పడీ పడీ వచ్చింది. సరదాగా ఎక్కడికైనా వెళ్ళి వద్దాం" అంది రమ్య.

"రాక్షసీ, నాకు తెలుసు నువ్వు నా చదువు చెడగొట్టడానికే వచ్చావని" అంటూ రమ్య రెండు బుగ్గలూ పట్టుకుని లాగింది హారిక.

"ఇదిగో నన్ను మాటిమాటికీ రాక్షసీ అన్నావంటేనా?" అంది రమ్య తర్జని చూపించి హారికను బెదిరిస్తున్నట్టుగా.

"ఏం చేస్తావే, తలదీసి మొలేస్తావా? అంటాను. ఒక్కసారి కాదు, వందసార్లు అంటాను. రాక్షసీ అని ఏం చేసుకుంటావో చేసుకో పో" అంది హారిక కవ్విస్తున్నట్లుగా.

"అందుకే కాబోలు ఈ రాక్షసిని చూసేందుకు తమరు తెగ కలవరిస్తున్నారట. మా వదిన చెప్పిందిలే" అంటూ హారిక మీద ఒరిగిపోయి నవ్వింది రమ్య.

"బాచీ, వీళ్ళిద్దనీ చూస్తుంటే మన చిన్ననాటి రోజులు గుర్తుకు రావడంలేదూ" అన్నాడు హరిప్రసాద్.

"అవునన్నట్లు"గా తలాడించాడు భాస్కర్.

దాదాపు సంవత్సరం రోజులుగా నవ్వనేదే మర్చిపోయినట్లు దిగులుగా, దీనంగా ఉన్న రమ్య ఈరోజు మనసారా నవ్వుతూంటే ఎంతో సంతోషంగా అనిపించింది హరిప్రసాద్‌కి.

మేనకోడలి వంక ఆప్యాయంగా చూస్తూ "నవ్వమ్మా రమ్యా. నిన్నిలా చ్వూసి యుగాలయినట్లుంది నాకు" అంటూ రమ్య దగ్గరికి వెళ్ళి ఆప్యాయంగా భుజం తట్టాడు హరిప్రసాద్.

ఆ మాట వింటూనే సైలెంట్ అయిపోయి తన పెద్ద పెద్ద కళ్లతో అందరి వైపూ దిగులుగా చూసింది రమ్య.

రమ్య మళ్ళీ దిగుల్లోకి కూరుకుపోతుందేమోనని భయపడిన హారిక "బయటకు వెళ్దామన్నావు కదా ఎక్కడికి వెళ్దాము?" అంది ఉత్సాహపరుస్తున్నట్లుగా.

దాంతో మళ్ళీ మామూలుగా అయిపోతూ "అన్నయ్య ఎక్కడికి వెళ్దాం అంటే అక్కడికే. మీరు కూడా రండి అందరం కలిసి సరదాగా వెళదాం" అంది రమ్య భాస్కర్, హరిప్రసాద్‌ల వంక చూస్తూ.

"మేమెందుకమ్మా పిల్లలు మీరు సరదాగా వెళ్ళిరండి" అన్నాడు భాస్కర్.

"అవునమ్మా, మేమిద్దరం కలిసి చాలా కాలమైంది. చెప్పుకోవలసిన కబుర్లు చాలా ఉన్నాయి. మీరిద్దరూ వెళ్ళిరండి" అన్నాడు హరిప్రసాద్ భాస్కర్ భుజం చుట్టూ చేయివేసి.

ఆ స్నేహితుల ఇద్దరి ప్రేమనీ అపురూపంగా చూస్తూ ఉండిపోయాడు శశికిరణ్.

**"అవున్రా, మీరంతా** శుభ్రంగా తిరిగి రండి. ఈలోగా వంట చేసేస్తాను నేను" అంది ఇందిర.

"ఏమన్నయ్యా ఎక్కడికి వెళ్దాం. కైలాసగిరా, ముడసర్లోవా, సింహాచలమా లేక తెన్నేటి పార్కుకా? ఎక్కడికి?" అంది రమ్య.

"ఈ ఎండలో తెన్నేటి పార్కుకి వెళితే మాంచి సొగసుగా ఉంటుందిలే. కైలాసగిరికి కానీ, సింహాచలంగానీ వెళదాము" అంది హారిక.

"ఏమన్నయ్యా, నువ్వేమంటావు?" అంది రమ్య.

"సింహాచలం వద్దులేమ్మా ఇప్పుడు కైలాసగిరి వెళదాం. నేను చూడలేదు కూడా" అన్నాడు శశికిరణ్.

"సరే అయితే నువ్వు నా బండి తీసుకో. నేనూ హారికా తన బండి మీద వస్తాము" అంది రమ్య.

అది విని "నోవే నా బండి ఎక్కనివ్వను నిన్ను. నీ బండి కొన్నాక, ఒక్కసారి ఇవ్వవే ట్రైచేసి ఇస్తానంటే ఇచ్చావా? ఇప్పుడేమో అడగకుండానే మీ అన్నయ్యకు నీ బండి ఇచ్చేసి నా బండి ఎక్కుతానంటావా? అదేం కుదరదు" అంది హారిక.

"సరే అయితే నువ్వేదో నాకోసం ఏడ్చిపోతున్నావని నీ బండి మీద వద్దామనుకున్నాను. నీ బండి మీద సింగిల్‌గా నువ్వే ఊరేగు. ఎంచక్కా మా అన్నయ్యా, నేనూ కలిసి వస్తాము" అంది రమ్య టీజ్ చేస్తున్నట్లుగా.

"రాక్షసీ, నువ్వేం చేసినా ఏదో నన్ను ఉద్ధరించడానికే అన్నట్లు బిల్డప్ ఇస్తావేగానీ. నీ బండి నాకెందుకు ఇవ్వలేదో జవాబు చెప్పవు కదా, సరే, ఏం చేస్తాను. ఏడు నా బండి మీదే" అంది హారిక నిష్ఠూరంగా.

"ఓ, సారీనే హారికా సారీ. నీక్కూడా ఇస్తాలే నా బండి. పోనీ ఇప్పుడివ్వనా?" అంది రమ్య రాజీకి వచ్చినట్లుగా.

"ఇప్పుడూ, నేను అడిగాక ఇస్తావా? ఏం వద్దులే" అంది హారిక మూతి ముడుస్తూ.

"మూతి ముడిస్తే మహా ముద్దు వచ్చేస్తున్నావే హారికా నువ్వు" అంటూ హారిక బుగ్గమీద చటుక్కున ముద్దుపెట్టుకుంది రమ్య.

దాంతో చల్లబడిపోయిన హారిక "ఈ నయగారాలకేం లే. ఎన్నయినా ఒలకబోస్తావు. నీ పని ఇప్పుడు కాదు. తర్వాత చెప్తాను" అంటూ లేచిందక్కడి నుండి.

చిన్నపిల్లల్లా కొట్టుకుంటూ అంతలోనే ఒకటైపోయిన వాళ్ళిద్దరినీ హరిప్రసాద్, భాస్కర్, ఇందిరలతోపాటు, శశికిరణ్ కూడా ముచ్చటగా చూస్తూ ఉండిపోయాడు.

"నువ్వు చెప్పింది నిజమే హరీ వీళ్ళని చూస్తుంటే మన బాల్యం కళ్ళకు కట్టినట్లుగా ఉంది" అన్నాడు భాస్కర్ వాళ్ళిద్దరి వంకా ప్రేమగా చూస్తూ.

"సరే అత్తా, మేం వెళ్ళొస్తాం" అంటూ లేచింది రమ్య.

హారికతో మరికొంత సమయం గడిపేందుకు అవకాశం కల్పించిన చెల్లెలికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు శశికిరణ్. ఆ తరువాత ఉత్సాహంగా వారితో పాటు బయలుదేరాడు.

ముగ్గురూ కలిసి కైలాసగిరి వెళ్ళారు. సరదాగా కబుర్లు చెప్పుకుంటూ అంతా తిరిగి చూశారు.

శివ పార్వతుల విగ్రహం దగ్గర నుంచొని ఫోటోలు తీసుకున్నారు. సరదాగా టాయ్ ట్రైన్ ఎక్కి తిరిగారు. రోప్‌వే ఎక్కుదామంది హారిక.

''అమ్మో నాకు భయం'' అంది రమ్య గుండెల మీద చెయ్యి వేసుకుని.

''నేనున్నానుగా, భయమెందుకు?'' అంది హారిక ధైర్యం చెబుతూ.

''ఫర్లేదమ్మా. సరదాగా వెళదాం పద. నువ్వు లేకుండా మేము మాత్రం ఎలా వెళ్తాం? అన్నాడు శశికిరణ్.

వాళ్ళిద్దర్నీ నిరాశపరచడం ఇష్టంలేక సరేనంది రమ్య. శశికిరణ్ వెళ్ళి ముగ్గురికీ టికెట్లు తెచ్చాడు.

రమ్య రోప్‌వే ఎక్కాక మొదట కొంచెం సేపు ధైర్యంగానే కూర్చుంది. ఆ తరువాత భయంతో గట్టిగా అరవడం మొదలు పెట్టింది.

''ఏయ్ పిచ్చీ, ఊరుకో'' అంటూ హారిక రమ్య భుజం మీద అనునయంగా తట్టింది.

రోప్‌వే దిగాక తాను భయంతో అలా అరిచినందుకు సిగ్గుపడిపోయింది రమ్య.

''ఇదిగో రమ్యా అరిచింది నువ్వు ఒక్కదానివే కాదు. అందులో ఎక్కినవాళ్ళంతా నీకంటే పెద్ద పెద్ద కేకలు వేశారు. నీ భయంలో నువ్వు ఉండి గమనించలేదంతే నిజానికి ఫస్ట్ టైమ్ ఎక్కినప్పుడు నేను నీకంటే పెద్దగా అరిచాను, తెలుసా?'' అంటూ నవ్వింది హారిక.

''అవును. హారిక చెప్పింది నిజమే. నాకూ మధ్యలో గట్టిగా అరవాలనిపించింది. కానీ మీ ఇద్దర్నీ చూసి ఆగిపోయాను'' అంటూ నవ్వేశాడు శశికిరణ్.

ముగ్గురూ వ్యూపాయింట్ దగ్గరకు వచ్చి సాగర తీర సోయగాన్ని చూస్తూ నుంచున్నారు చాలాసేపు.

''ఇక్కడ నుండి చూస్తే మొత్తం విశాఖపట్నం అంతా కనిపిస్తుందన్నయ్యా'' అంది రమ్య.

''అవును చాలా క్లియర్‌గా కనిపిస్తోంది. బైనాక్యులర్స్ ఉంటే ఎం.వి.పిలో ఉన్న మావయ్యగారి ఇల్లు కూడా కనిపిస్తుందేమో'' అన్నాడు శశికిరణ్.

''మరీ అంత సీనేం లేదుగానీ అటు కూర్చుందాం పదండి'' అంది హారిక నడుస్తూ.

''అవును, కాళ్ళు లాక్కుపోతున్నాయి. అసలు ఇంత ఎండలో బయలుదేరి రావలసింది కాదు మనం ఏ సాయంత్రమో బయలుదేరి వస్తే బాగుండేది'' అంది రమ్య.

''మరి తమరేగా ఈ ప్రోగ్రాం పెట్టింది'' అంటూ హేండ్‌బేగ్‌లో నుండి తల్లి ఇచ్చిన టిఫిన్ బాక్సు తీసి అందులో నుండి బొబ్బట్లు తీసి చెరొకటి ఇచ్చి, తానొకటి తీసుకుంది హారిక.

అవి తిని మంచినీళ్ళు తాగి ''చాలా థాంక్స్ తిరిగి తిరిగి చాలా అలసటగా అనిపించింది. తినడానికి బిస్కెట్స్ ఏమైనా తెద్దామనుకున్నాను నేను. నాకా శ్రమ తప్పించి మంచి టిఫిన్ పెట్టావు'' అన్నాడు శశికిరణ్.

"అమ్మ బలవంతంగా ఈ బాక్స్ నా బేగ్‌లో పెట్టింది. ఇప్పుడే కదా తిన్నాము, వద్దని నేను అంటున్నా వినలేదు. అది ఇలా మన ఆకలి తీర్చింది" అంది హారిక.

"ఎనీవే, అత్తకీ నీకూ డబుల్ థేంక్స్" అంది రమ్య.

అక్కడే కూర్చుని ముగ్గురూ చాలాసేపు కబుర్లు చెప్పుకున్నారు.

"డాడీ చెపితే ఏమో అనుకున్నానుగానీ చాలా బాగుంది ఈ ప్లేసు. నేను చాలాసార్లు విశాఖపట్నం వచ్చానుగానీ ఇంతవరకూ ఇక్కడికి రాలేకపోయాను" అన్నాడు శశికిరణ్.

"అవునా? నిజానికి కైలాసగిరి అంతకు ముందు ఇంకా బాగుండేది. ఇప్పుడంతా కమర్షియలైజ్ చేసేసి దీని అందం చెడగొట్టేశారు" అంది హారిక.

"నేచురల్ బ్యూటీని పాడుచేయడంలో సిద్ధహస్తులు కదా. ప్రతిదాన్నీ వ్యాపారంగా చేసి సొమ్ము చేసుకోవాలని చూస్తారు" అన్నాడు శశికిరణ్.

"అన్నయ్యా, బెంగుళూరులో మోక్షగుండం విశ్వేశ్వరయ్యగారి సైన్స్ మ్యూజియం చాలా బాగుంటుందట కదా ఫ్రెండ్స్ చెప్పారు" అంది రమ్య.

"నిజమే రమ్యా చాలాబాగుంటుంది. మానవుడి పరిణామ క్రమంలో ఆనాటి పాతరాతి యుగం నుండి ఈనాటి రాకెట్ యుగం వరకూ మనిషి సాధించిన ప్రగతి అంతా స్టేజీల వారిగా అక్కడ పొందుపరిచారు. ఈసారి శెలవలకు బెంగుళూరు వస్తే చూపిస్తాను" అన్నాడు శశికిరణ్.

"తనకేగానీ నాకేం చూపించవా బావా?" అంది హారిక హాస్యంగా నవ్వుతూ.

"నువ్వు రావాలేగానీ చూపించడానికి ఏం భాగ్యం హారికా? ఇద్దరూ కలిసి సెలవల్లో ప్లాన్ చేసుకురండి. మీరు ఎప్పుడు వస్తారో చెబితే టికెట్స్ రిజర్వు చేయిస్తాను నేను" అన్నాడు శశికిరణ్.

"థాంక్యూ థాంక్స్ ఫర్ యువర్ ఇన్విటేషన్. కానీ ప్రస్తుతానికి వీలవదు బావా నాకు. చదువుకోవాల్సింది చాలా ఉంది. ఇంకోసారి ఎప్పుడైనా చూద్దాం" అంది హారిక.

ఆ మాటలు వింటూనే ఆశాభంగం చెందినవాడిలా చూస్తూ "ఎందుకు వీలుకాదు? వేసవి సెలవల్లో కూడా చదువేమిటి. ఏదో పెద్ద ఐ.ఏ.యస్‌కి ప్రిపేర్ అవుతున్నట్లు" అన్నాడు విసుగ్గా శశికిరణ్.

"పోనీ అలాగే అనుకో" అంటూ నవ్వేసింది హారిక.

ఏదో చెబ్దామని నోరు తెరిచిన రమ్య చెయ్యి నొక్కి వారించింది హారిక, వద్దన్నట్లుగా కనుసైగ చేస్తూ.

ఆమె సైగననుసరించి మౌనం వహించింది రమ్య.

మరునాడు కమల బెంగుళూరు నుండి వచ్చేసింది. శశికిరణ్ ఎయిర్‌పోర్టుకి వెళ్ళి తల్లిని రిసీవ్ చేసుకున్నాడు. కొడుకును అయిదురోజులు చూడకుండా ఉండడం అదే మొదటిసారి కమలకు. ఆ అయిదురోజులే ఎన్నో యుగాలైనట్లు ఉంది ఆమెకు.

అతడిని చూడడంతోనే పరుగులాంటి నడకతో వడివడిగా వచ్చి అతడ్ని చుట్టేసి "ఎలా ఉన్నావురా?" అని అడిగింది ఆప్యాయంగా.

ఆమె ప్రేమకు ముగ్ధుడవుతూ "ఏంటి మమ్మీ ఇది? నేనేదో ఇంకా చిన్నపిల్లాడిని అన్నట్లుగా ఇలా పట్టేసుకుంటావు. చూడు, అందరూ మనని ఎంత విచిత్రంగా చూస్తున్నారో?" అన్నాడు సిగ్గుగా.

"చూస్తే చూడనీరా తల్లి మనసు ఎలా ఉంటుందో వాళ్ళకేం తెలుసు?" అంది కమల ఆప్యాయంగా అతడినే చూస్తూ.

"ఫంక్షను బాగా జరిగిందా మమ్మీ. మీ క్లబ్ వాళ్ళంతా క్షేమమేనా?" అనడిగాడు శశికిరణ్ తల్లి చేతిలోని ట్రాలీ బేగ్‌ను తీసుకుంటూ.

"ఆ, చాలా బాగా జరిగిందిరా. బాగా చేశామని అంతా మెచ్చుకున్నారు. కానీ నాకే లోలోపల చాలా గిల్టీగా అనిపించింది. ఇక్కడ పెద్దమ్మ ఎలా వుందో ఏమో అని" అంది కమల.

"నిజమే మమ్మీ పెద్దమ్మ చాలా పాడయిపోయింది. పెదనాన్నగారు, అన్నయ్యా, వదినా, రమ్యా అంతా చాలా డీలా పడిపోయారు" అన్నాడు శశికిరణ్.

"అవును ఇంటికి అయిన ఇల్లాలు అలా మూలనపడితే ఇల్లంతా మూలపడినట్లే కదా. ఎవరికి మాత్రం స్థిమితంగా ఉంటుంది?" అంది కమల.

"శశీ, బండేమైనా తీసుకొచ్చావా? లేక టాక్సీ మాట్లాడుకుందామా?" అనడిగింది కమల.

"ఇంత దూరం బండిమీద వద్దన్నాడు అన్నయ్య. అందుకని ఏకంగా రానూ పోనూ టాక్సీ ముందుకు కదిలింది.

కమల కారు దిగడంతోనే "బాగున్నారా అత్తయ్యా?" అంటూ సుగుణ ఎదురు వెళ్ళింది.

ఆప్యాయంగా సుగుణ చేయి అందుకుని బాగున్నానన్నట్లుగా తలూపుతూ "ఎలా వున్నారు బావగారూ?" అని రామచంద్రని పలకరించింది కమల.

"బాగానే ఉన్నానమ్మా ప్రయాణం బాగా జరిగిందా? రా లోపలికి" అంటూ సాదరంగా ఆహ్వానించాడు రామచంద్ర.

"అమ్మా!" అంటూ ఆటలకు వెళ్ళిన కావ్య పరుగెత్తుకుంటూ లోపలికి వచ్చి తల్లి పక్కనున్న కొత్తవ్యక్తిని చూసి బెదురుగా ఆగిపోయింది.

కమల "రామ్మా" అంటూ నవ్వుతూ చేతులు చాచింది.

"ఫర్లేదు రావే. ఎవరనుకున్నావు? చిన్నానమ్మ. నమస్తే చెప్పు" అంది సుగుణ కూతురి బెదురుపోగొడుతూ.

ఇంకా అలాగే బెదురుగా చూస్తున్న కావ్య దగ్గరకు వెళ్ళి ఎత్తుకుంటూ "పాప చాలా క్యూట్‌గా వుంది సుగుణా. ఎంత ముద్దొస్తోందో?" అంటూ ముద్దు పెట్టుకుంది కమల.

కావ్య సిగ్గుపడినట్లుగా చెంగున కిందికి దూకి పరుగెత్తుతూ బుగ్గలకి అంటిన ఎంగిలి తుడిచేసుకుంటూ వెనక్కి తిరిగి కమల వంక చూసింది కుతూహలంగా.

ప్రతిగా కమల నవ్వుతూ చూడడంతో కావ్యకూడా నవ్వేసింది.

కాళ్ళూ చేతులు కడుక్కుని సరాసరి జానకి ఉన్న గదిలోకి వెళ్ళింది కమల.

అలికిడికి కళ్ళు తెరిచిన జానకి తోటికోడల్ని చూడడంతోనే చిన్నగా నవ్వుతూ "బాగున్నావా కమలా" అంటూ చేయి చాచింది.

ఎముకల గూడులా ఉన్న జానకిని చూడడంతోనే కమల కళ్ళు సజలాలయ్యాయి.

"ఏంటక్కా ఇలా అయిపోయావు?" అంటూ జానకి చెయ్యి అందుకుంది కమల.

నీరసంగా నవ్వుతూ "నాకేం బాగానే ఉన్నాను" అంది జానకి.

"ఇప్పుడింకా నయమేనమ్మా. బాచీ, శశీ వచ్చేసరికి మరీ కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకున్నట్లుంది" అన్నాడు రామచంద్ర.

"అసలు అక్కను కాదు బావగారూ. మిమ్మల్ని అనాలి. తనిలా అయిపోతూంటే చూస్తూ ఎలా ఊరుకున్నారు?" అంది కమల బాధగా.

"నేనేం చేయనమ్మా తనిలా అయిపోతూంటే నాకు మాత్రం సంతోషంగా ఉంటుందా? చిన్నపిల్లలా మారాం చేస్తూ, టైముకు తిండి తినక, సరిగా మందులు వేసుకోక ఇలా తయారైంది" అన్నాడు రామచంద్ర జాలిగా చూస్తూ.

"మీ బావగారు అలాగే చెప్తారు గానీ, నువ్వెళ్ళి స్నానం చేసి భోజనం చేసి రామ్మా" అంది జానకి నీరసంగా నవ్వుతూ.

"తింటాలే అక్కా. నిన్నిలా చూస్తూంటే నాగుండె తరుక్కుపోతోంది. అక్కయ్యకు ఇంత సుస్తీ చేస్తే మాకు మాట మాత్రమైనా ఎందుకు చెప్పలేదు బావగారూ. మేమంత కాని వాళ్ళమయిపోయామా మీకు?" అంది కమల బాధగా.

"అదేం కాదమ్మా. దూరంగా ఉన్నారు కదా, మిమ్మల్ని కంగారు పెట్టడం దేనికి అనుకున్నాను. పరిస్థితి ఇంత సీరియస్‌గా అయిపోతుందని మేమూ అనుకోలేదమ్మా" అన్నాడు రామచంద్ర.

అతడలా చెప్పినా కమల మనసు ఏమీ సమాధాన పడలేదు. రవి పెళ్ళికి ఐదేళ్ళ క్రితం వచ్చినప్పుడు లక్ష్మీదేవిలా కళకళలాడుతూ ఉండే అక్క ఎలా అయిపోయింది? ఆ రూపుకూ, ఈ రూపుకూ అసలు పోలికే లేదు. ఒకవేళ అక్క శశి కోసం బెంగపెట్టుకుని ఇలా అయిపోయిందా? నేను వాడిని ఇక్కడకు రాకుండా ఆపి తప్పు చేశానా? పాపం అక్క నా మూలానే ఇలా అయిపోయినట్లుంది.

అక్క నిండు మనసుతో తన బిడ్డను నాకిచ్చి ప్రాణదానం చేస్తే నేను స్వార్థంతో ఆమె మనసును ఇంత క్షోభకు గురిచేశానా? అక్కడికీ ఆయన అడుగడుగునా నన్ను హెచ్చరిస్తూనే ఉన్నారు. కమలా నీ ఆలోచనా విధానం చాలా తప్పు అంటూ. కానీ నేనే మూర్ఖంగా ఆలోచిస్తూ శశి నా ఒక్కదానికే స్వంతం అంటూ ఇంత చేశాను. నేను చేసిన తప్పుకి ఈ రోజు ఇంటిల్లిపాదీ శిక్ష అనుభవిస్తున్నారు, అక్క అనారోగ్యం మూలంగా.

నా పాపానికి నిష్కృతి వుందా? అనుకుంది కమల. పశ్చాత్తాపంతో కమల కళ్ళు కన్నీటి కాలువలయ్యాయి.

కమలని భోజనానికి పిలుద్దామని అక్కడికి వచ్చిన సుగుణ, కమల ఏడుస్తూ ఉండడం చూసి కంగారు పడుతూ, "అత్తయ్యగారూ ఏమిటండీ ఇది? మాకు ధైర్యం చెప్పవలసిన మీరు చిన్నపిల్లలా ఇలా అయిపోతే ఎలా? లేవండి, స్నానం చేసి భోంచేద్దురుగానీ" అంది.

"నాకేం వద్దమ్మా నన్ను కాసేపు ఇలా అక్క దగ్గర ఉండనివ్వండి" అంది కమల దీనంగా చూస్తూ.

చేసేదేమీలేక అక్కడినుండి బయటకు వచ్చిన సుగుణకు శశికిరణ్ కనబడడంతోనే "శశీ మీ అమ్మగారు అత్తయ్యగారిని చూసి చాలా ఢీలా పడిపోయారు. ఈ పరిస్థితిలో మనం ఒకరికొకరు సపోర్టుగా ఉండాలిగానీ ఇలా అయిపోతే ఎలా? వెళ్ళి చిన్నత్తయ్యగారిని బైటకు తీసుకురా" అంది.

అక్కడే ఉండి ఆ సంభాషణ విన్న భాస్కర్ "నువ్వుండరా నేను వెళ్ళి మీ మమ్మీని తీసుకు వస్తాను" అంటూ లోపలికి వెళ్ళాడు.

అతడు వెళ్తూనే "కమలా బైటకు వెళ్దాం పద వదిన రెస్టు తీసుకుంటుంది" అంటూ భార్య చేయి పట్టుకుని బయటకు తీసుకువచ్చేశాడు.

భర్త ముఖం సీరియస్‌గా ఉండడం గమనించి ఇంకేమీ అనకుండా బయటకు వచ్చేసింది కమల.

ఇదంతా నీవల్లనే జరిగింది అనే భావం అతడి ముఖంలో కనబడగా మరింత కృంగిపోయింది.

స్నానం చేసి ఏదో భోజనం తిన్నాననిపించి తిరిగి జానకి గదిలోకి వెళ్తున్న కమలని ఈసారి ఎవరూ నిరోధించలేదు.

భాస్కర్ కొంచెం కోపంగా భార్య వెనకే వెళ్ళబోయాడు. చేసేదంతా చేసి ఇప్పుడీ సానుభూతి ప్రకటించడం ఎందుకన్నట్లుగా చూస్తూ.

అది చూసిన రామచంద్ర "కమలను లోపలికి వెళ్ళనీ బాచీ, వెళ్ళి ఏదోవిధంగా తన భారాన్ని దింపుకోనీ తనేం చేసినా శశి మీద ప్రేమతోనే చేసింది తప్పు. ఎవరికీ హాని చేయాలనుకోలేదు. చేసినదానికి ఇప్పటికే తను చాలా బాధపడుతోంది. ఇంకా మాటలని మరింత బాధపెట్టకు. అది ఎవరికీ మంచిది కాదు" అన్నాడు అనునయం, ఆజ్ఞా మిళితం అయిన స్వరంతో.

అన్నగారి మాటలు వినడంతోనే భాస్కర్ కోపం చప్పున చల్లారిపోయింది.

**ఆ రాత్రి మైల్డ్‌గా** హార్ట్ ఎటాక్ రావడంతో జానకిని హాస్పటల్‌లో జాయిన్ చేశారు. ఆందోళనతో ఆ రాత్రంతా అందరూ మేలుకునే వున్నారు. ఉదయానికి పరిస్థితి కొంచెం మెరుగైంది. కానీ బి.పి షుగర్ లెవెల్స్ బాగా పెరగడంతో ఇలాంటి పరిస్థితుల్లో ఆపరేషన్ చేయడం మంచిదికాదని పోస్ట్‌పోన్ చేశారు పదిరోజులు.

బి.పి, షుగర్ నార్మల్‌కి వచ్చేవరకూ జానకిని హాస్పిటల్‌లోనే ఉంచి తర్వాత ఇంటికి తీసుకు వచ్చేశారు.

"డాడీ, నేను బెంగుళూరు వెళ్దామనుకుంటున్నాను. ఆపరేషన్ డేట్ ఫిక్స్ అయ్యాక ఫోన్ చెయ్యండి, వస్తాను" అన్నాడు శశికిరణ్.

"నేను మాత్రం ఇక్కడ ఉండి చేసేదేముందిరా నేను కూడా డేట్ ఫిక్సయ్యాకే వస్తాను" అన్నాడు భాస్కర్.

"ఇద్దరం ఒక్కసారే వెళ్ళిపోతే పెదనాన్నగారు ఏమైనా అనుకుంటారేమో కాస్త ఆలోచించండి" అన్నాడు శశికిరణ్.

"ఏమీ అనుకోరు వెళ్ళిరండి సుగుణకు సాయంగా అక్కను చూసుకునేందుకు నేనుంటాను కదా"అంది కమల.

ఆ మాటలు వినడంతోనే అభినందనగా భార్యవంక చూశాడు భాస్కర్. ఈ నాలుగురోజులుగా ఆమెలో వచ్చిన మార్పు చూశాక అంతవరకూ భార్యమీద కలిగిన కోపం అంతా మటుమాయమైపోయింది అతడికి.

"మమ్మీ నువ్వు ఒక్కతివీ ఉండగలవా?" అని అడిగాడు శశికిరణ్ సందేహంగా చూస్తూ.

"అదేమిట్రా అలా అంటావు? ఇంతమంది ఉండగా, నేను ఒంటరిదాన్ని ఎలా అవుతాను? భేషుగ్గా వెళ్ళిరండి. ఈలోగా వీలైతే నేను విజయనగరం ఒక్కసారి వెళ్ళి అమ్మమ్మని చూసి వస్తాను" అంది కమల.

"అలా చెయ్యి. అత్తయ్యగారు కూడా చాలా సంతోషిస్తారు. పాపం నిన్ను చూడాలని ఆవిడ చాలా పరితపిస్తూ ఉంటారు" అన్నాడు భాస్కర్.

"అయ్యో, అమ్మమ్మ దగ్గరకా! అమ్మమ్మని చూడాలని నాకూ ఉంది. కానీ వీలుకాదుకదా. పోనీ ఒక పనిచేద్దాం మనం వెళ్ళేటప్పుడు అమ్మమ్మని కూడా బెంగుళూరు తీసుకువెళ్దాం" అన్నాడు శశికిరణ్.

"ఈ వయసులో అమ్మమ్మ ఎక్కడికీ కదలలేదురా మామయ్య కూడా పంపేందుకు ఇష్టపడడం లేదు. ఈసారి విశాఖపట్నం వచ్చాక వీలు చూసుకుని నువ్వే వెళ్ళివద్దువుగాని" అంది కమల.

చిన్నకొడుకు బెంగుళూరు వెళ్తున్నాడని విని జానకి దిగులుగా మొహం పెట్టింది.

"ఇదిగో పెద్దమ్మా నువ్వలా దిగులుగా వుంటే నేనసలు అడుగు తీసి అడుగు వెయ్యలేను. సర్జరీ డేట్ ఫిక్స్ అయిన వెంటనే అన్నయ్య ఫోన్ చేసి చెప్తానన్నాడు. అలా ఫోన్ చెయ్యగానే, ఇలా నేను బయలుదేరి వచ్చేస్తాను" అన్నాడు శశికిరణ్.

చేతికి దొరికిన పెన్నిధి చేజారిపోతుందేమోనన్నట్లు అతడి చెయ్యి గట్టిగా పట్టుకుని "నిజంగా వస్తావు కదూ?" అంది జానకి సందేహంగా చూస్తూ.

"ఎందుకురాను? నీకిలా ఉంటే అక్కడ నేను ప్రశాంతంగా ఎలా ఉండగలను? అనవసరంగా ఎక్కువ ఆలోచించి నీ మనసు పాడుచేసుకోకు. అది నీ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. అయినా నువ్వు నవ్వుతూ వెళ్ళమని చెప్తేనే వెళతాను. లేదా ఇక్కడే ఉండిపోతాను. నా ఉద్యోగం పోయినా సరే" అన్నాడు శశికిరణ్.

ఉద్యోగం పోతుందనే మాట వినడంతోనే కంగారు పడిపోతూ "వద్దురా, అలా అనకు వెళ్ళి తొందరగా వచ్చేయ్" అంటూ అతడి చెయ్యి విడిచిపెట్టింది జానకి.

"మా మంచి పెద్దమ్మ. ఏం చెప్పినా అర్థంచేసుకుంటుంది" అంటూ చటుక్కున వంగి జానకి బుగ్గమీద ముద్దుపెట్టి వెళ్ళిపోయాడు శశికిరణ్.

మేనత్తను చూసేందుకు వచ్చిన హారిక శశికిరణ్, చినమావయ్య బెంగుళూరు వెళ్తున్నారని విని, బట్టలు సర్దుకుంటున్న శశికిరణ్ దగ్గరకు వచ్చి అడిగింది. "ఏం బావా, ఈ రోజు ఊరు వెళ్తున్నారట కదా మళ్ళీ ఎప్పుడు వస్తారు?" అంది ఆప్యాయంగా చూస్తూ.

హారికను చూడడంతోనే అతడి కళ్ళల్లోకి వెలుగు వచ్చేసింది. బెంగుళూరు వెళ్ళేలోగా తనని ఒక్కసారి చూస్తే బావుండును అనుకున్నాడు మనసులో. అది ఇలా వెంటనే నెరవేరడం అతడికి ఎంతో ఆనందాన్నిచ్చింది.

"సర్జరీ డేట్ ఫిక్స్ అయ్యాక వస్తాము హారికా ఈ నాలుగు రోజులూ నాకు బోరు కొట్టకుండా మంచి కంపెనీ ఇచ్చినందుకు థేంక్స్" అన్నాడు.

"నాదేముంది బావా? నువ్వెక్కడుంటే అక్కడ సందడీ, సంరంభమూను. నీ మాటలతో అత్తని మెస్మరైజ్‌చేసి కొంచెం కోలుకునేలా చేశావు. అందుకు మేమంతా నీకే థేంక్స్ చెప్పాలి" అంది హారిక.

"అంత పెద్దమాటలెందుకులే హారికా. ఇందులో నేను చేసింది ఏమీలేదు. ఇతరులనుండి ఏమీ ఆశించకుండా అందరికోసం అన్నీ చేసే పెద్దమ్మకు ఏమిచ్చి మా ఋణం తీర్చుకోగలం?" అన్నాడు శశికిరణ్ బరువైన కంఠంతో.

అతడి మాటల్లో ధ్వనించిన బాధ హారిక మనసును కదిలించి వేసింది. సానుభూతిగా అతడివంక చూస్తూ, "బాధపడకు బావా, అంతా సవ్యంగా జరుగుతుంది. నీ ప్రయత్నేమేదీ వృధా పోదులే" అంది.

కొడుకుతో అంతసేపు మాట్లాడుతున్న హారికను చూడడంతోనే హడావిడిగ వాళ్ళదగ్గరకు వచ్చేసింది కమల, ఏం మాట్లడుకుంటున్నారో వినాలన్నట్లుగా.

ఇక్కడికి వచ్చిన దగ్గర నుండీ ఇంట్లో అందరిపైనా ఎంతో సానుభూతిగా వ్యవహరించిన కమల, కొడుకుతో సన్నిహితంగా మాట్లాడే హారికను చూడడంతోనే ఆమెలో పాత ఆలోచనలు తిరిగి ప్రవేశించాయి. తన కొడుకును ఎవరైనా కాజేస్తారేమోననే అభద్రతా భావం చోటు చేసుకుంది తిరిగి ఆమెలో.

తన దగ్గరగా వచ్చిన కమలవైపు, శశికిరణ్ వైపు నవ్వుతూ చూసి "వస్తాను, అత్తయ్యను ఒకసారి చూసి పోదామని వచ్చాను. వస్తానత్తయ్యా హాపీ జర్నీ బావా" అంటూ వెళ్ళిపోయింది హారిక.

హారిక వెళ్ళిన వంకే తన్మయంగా చూస్తున్న కొడుకు వైపు అనుమానంగా చూస్తూ, "ఫ్లైట్‌కు టైమ్ అవుతోందంటున్నాడు అన్నయ్య. నువ్వేమో ఆ అమ్మాయితో ముచ్చట్లు పెట్టుకుని కూర్చున్నావిక్కడ" అంది కమల విసుగు నిండిన కంఠంతో.

అదేం గమనించని శశికిరణ్ ఏదో ట్రాన్స్‌లో నుండి బయటపడినట్లుగా చూస్తూ "అయిపోయిందమ్మా, వచ్చేస్తున్నా" అంటూ బాగ్ జిప్ వేసి లేచాడక్కడినుండి.

రవి వచ్చి "ఏరా బయలుదేరదామా?" అనడిగాడు.

"ఓ.కె వస్తానుండు అందరితో చెప్పి" అంటూ జానకి గదివైపు అడుగులు వేశాడు.

"ఒరే బాబూ, ఎన్నిసార్లు చెప్తావురా వెళ్తానూ అని. అయినా అందరూ ఇక్కడే ఉన్నారు. నువ్వా బేగ్ పట్టుకుని బయటకు రా అవతల టైమ్ అవుతోంది" అన్నాడు రవి హడావిడి పడుతూ.

"సరే, పద" అంటూ అందరికీ మరోమారు చెప్పి టాక్సీలో తండ్రి పక్కన కూర్చున్నాడు శశికిరణ్.

వాళ్ళు వెళ్ళిన వంకే కాసేపు చూసి లోపలికి వస్తూ తోటికోడలి గదివంక దృష్టి సారించింది కమల హారిక బయటకు వస్తుందేమోనని. ఎట్టిపరిస్థితుల్లోనూ వారిద్దరికీ ఎటాచ్‌మెంట్ పెరగనివ్వకూడదని మనసులోనే స్థిరంగా నిర్ణయించుకుంది.

జానకితో మాట్లాడిన హారిక బయటకు వచ్చింది.

"ఇదిగో హారికా మొన్న నీవిచ్చిన పుస్తకాలు" అంటూ సుగుణ రెండు లైబ్రరీ పుస్తకాలు తెచ్చి హారిక చేతిలో పెట్టింది.

"ఇంత బిజీ టైమ్‌లో కూడా నువ్వు పుస్తకాలు ఎలా చదువుతున్నావో నాకు అర్ధం కాదక్కా" అంది హారిక నవ్వుతూ .

"చెప్పానుకదా రాత్రి పడుకునే ముందు ఏదో ఒక పుస్తకం చదవనిదే నిద్రపోనని. అయినా చిన్నత్తయ్యగారు వచ్చిన దగ్గరనుండీ నాకసలు పనే ఉండడంలేదు. అన్నీ అత్తయ్యగారే చూసుకుంటున్నారు" అంది సుగుణ కమల వంక ఆత్మీయంగా చూస్తూ.

"అదేం లేదు, పనులన్నీ ఎంతో చాకచక్యంగా నువ్వే చేసుకుంటున్నావు" అంది కమల సుగుణ భుజం మీద చెయ్యివేసి.

"సరే అక్కా నేనింటికి వెళ్ళివస్తాను. వస్తానండీ" అంటూ ఇద్దరికీ చెప్పి బయలుదేరబోయింది హారిక.

"అప్పుడేనా?" వచ్చి ఎంతసేపయిందని. కాసేపుమేడి వెళ్ళొచ్చు కదా" అంది సుగుణ.

"లేదక్కా వెళతాను చదువుకోవలసింది చాలా ఉంది" అంది హారిక.

"నీకెప్పుడూ చదువుగోలే. సరే వెళ్ళిరా" అంది సుగుణ అయిష్టంగా చూస్తూ.

"అవునమ్మాయ్. ఇంతకీ ఏం చదువుతున్నావ్ నువ్వు?" అనడిగింది కమల ఎంతో ఆసక్తిగా హారిక వంక చూస్తూ.

"బి.ఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నానండీ" అంది హారిక వినయంగా.

"బి.ఏనా? ఈ కాలంలో అది కూడా ఒక చదువేనా? వంట చేసుకునేందుకు, అంట్లు తోముకునేందుకు తప్ప ఎందుకు పనికి వస్తుందది?" అంది కమల ఎగతాళిగా.

ఆ మాటలు వినడంతోనే చిరాకు వచ్చేసింది హారికకు. అంతవరకూ వున్న ప్రశాంతత అంతా ఎగిరిపోగా "అదేంటత్తయ్యగారూ అలా అంటారు? వంటని అంత తేలిగ్గా తీసిపారేయకండి. అదేదో చేయరానిపనయినట్లు" అంది హారిక కూల్‌గా తన చిరాకును బయటకు వ్యక్తం చేయకుండా.

"చేతగాని వాళ్ళంతా చెప్పే మాటలే ఇవి. కాకపోతే బి.ఏ కూడా ఒక చదువేనా?" అంది కమల వెక్కిరింతగా.

"నాకిష్టమైంది కనుక నేను చదువుతున్నాను. ఐ నో వాట్ ఐ డూ. డోంట్ ఇంటర్‌ఫియర్ ఇన్ మై పర్సనల్స్. జనాలందరూ ఇంత కష్టపడి చదివి పెద్ద పెద్ద ఉద్యోగాలు చేసి డబ్బు సంపాదించేది ఎందుకు? తిండికోసమే కదా. మనందరి కడుపులూ నిండాలంటే వంట చేయాలి కదా! అలాంటి పనిని నా చదువుకు లింక్ పెట్టి అంత తక్కువ చేసి మాట్లాడతారెందుకు?" అంది హారిక మామూలుగా ఉండడానికి ప్రయత్నిస్తూ.

"బాగుంది, నిన్ను నీవు బాగానే సమర్ధించుకుంటున్నావు. ఎందులోనూ సీటు దొరక్క ఈ బి.ఏలో చేరి ఎంత బాగా కవర్ చేసుకుంటున్నావు?" అంది కమల అదే వ్యంగ్య ధోరణిలో.

అంతవరకూ ఎంతో సహనంగా మాట్లాడిన హారిక, ఆవిడ మాటలను ఆ పైన ఉపేక్షించలేకపోయింది. అయినా శాంతంగానే చూస్తూ "మీరు చాలా పొరపడుతున్నారండీ చదువంటే మీ దృష్టిలో ఇంజనీరింగూ, మెడిసినే కావచ్చు. కానీ నా దృష్టిలో అవొక్కటే కావు. చాలా ఉన్నాయి. మీరు అనుకుంటున్నట్లు నాకు తక్కువ మార్కులు వచ్చిగానీ, సీటు రాకగానీ ఇందులో చేరలేదు. ఫర్ యువర్ కైండ్ ఇన్ఫర్మేషన్ ఐ గాట్ నైంటీ త్రీ పర్సంట్ ఇన్ ఇంటర్. అయినా కావాలనే కోరి ఈ గ్రూపు తీసుకున్నాను. ఐ నో వాట్ ఐ యామ్ డూయింగ్. ఐ కాంట్ టాలరేట్ ఎనీబడీ కామెంటింగ్ మై స్టడీస్. వస్తాను" అంటూ వడివడిగా గేటు తీసుకుని వెళ్ళిపోయింది హారిక.

ఆమె జవాబు చెప్పిన తీరు కమలను అవాక్కయ్యేలా చేసింది.

తనేదో ఆ పిల్లను చిన్నబుచ్చాలని చూస్తే, అది బూమ్‌రేంగ్ అయి తనకే తగిలిందే అనుకుంది.

కమల ముఖంలో మారుతున్న రంగులు చూసి భయపడింది సుగుణ.

"అత్తయ్యగారు పిలుస్తున్నట్లున్నారండీ. లోపలికి వెళదాం పదండి" అంటూ కమల చెయ్యి పట్టుకుని జానకి దగ్గరకు తీసుకువెళ్ళింది. దాంతో కాస్త సర్దుకున్న కమల సుగుణను అనుసరించింది.

తన చదువును కమల తక్కువ చేసి మాట్లాడింది అనే బాధతో కొంచెం పరుషంగానే మాట్లాడింది హారిక. ఇంటికి వెళుతూ అనుకుంది ఎప్పుడూ లేనిది నేను ఎందుకు ఇలా ఎక్సైట్ అయ్యానా అని. నాకు నచ్చింది, వాళ్ళకు నచ్చాలనే రూలేమీలేదు కదా. నేను ఈ గ్రూపు తీసుకున్నందుకు గతంలో చాలామంది ఇలాగే కామెంట్ చేశారు. కానీఅప్పుడు ఇంత రియాక్షన్ చూపించలేదు. ఇవ్వాళ మాత్రం చాలా హార్ష్‌గామాట్లాడాను. ఈ పిల్లకు చాలా పొగరు అనుకుంటుంది ఆవిడ. అమ్మ శిక్షణలో పెరిగిన నేను ఈవేళ ఎందుకిలా బేలెన్స్ కోల్పోయాను. మావయ్య చెప్పినట్లు ప్రతిక్షణం బేలెన్స్‌గా ఉండాలి, ఇంటర్వ్యూలలో ఒకోసారి నేపథ్యం గురించి అడుగుతారు. హుందాగా వినమ్రంగా వ్యవహరించాలి. దానికి రిహార్సల్స్‌గా దైనందిన జీవితంలో నీకు అనేక రకాలైన వ్యక్తులు తారసపడతారు. వారితో కూల్‌గా బాలెన్స్ కోల్పోకుండా మాట్లాడటం ఇప్పటి నుండీ ప్రాక్టీస్ చెయ్యి. భవిష్యత్తులో అది నీకెంతో ఉపయోగపడుతుంది అన్నారు మావయ్య.

ఇంటికి వచ్చాక జరిగిందంతా తల్లికి చెప్పింది.

అంతా విని "ఎందుకే, అనవసరంగా ఆవిడతో వాదనకు దిగావు? అసలే ఆవిడకు మనమంటే గిట్టడంలేదు. అగ్నికి ఆజ్యం తోడయినట్లు ఇప్పుడు నీ మాటలు తయారయ్యాయి. అయినా ఆవిడ అన్నదాంట్లో తప్పేముంది చెప్పు? ఈ గ్రూపు తీసుకోవద్దని నేను కూడా చెప్పాను కదా" అంది ఇందిర.

"చెప్పావులే. కానీ నేను ఈ గ్రూపు ఎందుకు తీసుకున్నానో నీకు తెలుసుకదా. అయినా ఇంకా అలాగే మాట్లాడుతున్నావు అర్థం లేకుండా" అంది హారిక విసుగ్గా చూస్తూ.

"చెప్పావులే నీ చదువు గూర్చి కాదు నా ఆదుర్దా. అసలే అంతంత మాత్రంగా ఉన్న మన సంబంధాలు ఇప్పుడు నీ మాట తీరు బాగోలేదనే సాకు చూపి ఈ కాస్తదాన్ని కూడా ఆవిడ పుటుక్కున తెంపేస్తుందని నా భయం" అంది ఇందిర గాభరాగా.

అక్కడ జరిగిందానికి అసలే చికాకు పడుతున్న హారికకు తల్లి మాటలు వినడంతోనే మరింత మండుకు వచ్చింది.

"ఇదిగో అమ్మా ఇప్పుడే చెప్తున్నాను. ప్రతిదాన్నీ నువ్విలా పెళ్ళికి ముడిపెడితే ఊరుకునేది లేదు. నన్ను వాళ్ళ అబ్బాయికి చేసుకోమని ఎవరేడ్చారట ఇక్కడ? అనవసరంగా లేనిపోని ఆలోచనలతో నీ బుర్ర పాడుచేసుకుని, నా బుర్ర పాడు చేయకు. అసలు నిన్ను కాదులే అనాల్సింది. ఏదో అక్కడ పెద్ద ఉపద్రవం జరిగిపోయినట్లు, జరిగిందంతా నీకు చెప్పాను చూడు. అందుకు నా చెప్పుతో నన్ను నేనేకొట్టుకోవాలి" అంది కోపంగా హారిక.

అంత కోపంగా కూతుర్ని ఎప్పుడు చూడని ఇందిర. చేష్టలుడిగిన దానిలా అలా చూస్తూ నించుండిపోయింది. కూతురు అన్నదానిలో తప్పేమీలేదని ఆవిడకీ తెలుసు. కానీ జరిగిందాని మూలంగాకుటుంబంలో కలతలు ఎక్కడ రేగుతాయోనని ఆమె భయం.

ఇంతలో "హారిక వచ్చిందా వదినా?" అంటూ మీనాక్షి వచ్చింది ఆదుర్దాగా.

''ఇప్పుడే వచ్చింది వదినా'' అంటూ హారికవైపు తిరిగి ''ఆంటీ నీకోసం రెండుసార్లు వచ్చి వెళ్ళారు'' అంది ఇందిర.

మీనాక్షిని చూడడంతోనే మామూలుగా అయిపోతూ ''ఎందుకాంటీ నాకోసం చూస్తున్నారు? అంది హారిక పలకరింపుగా.

''ఏం లేదమ్మా విద్యా ఈ సంవత్సరం పరిక్ష రాయనంటున్నాడు. పరిక్షలు చూస్తే పట్టుమని పదిహేను రోజులు కూడా లేవు. అది వదిలేసి టి.విలో ఏదో మ్యూజికల్ కాంపిటీషన్స్ ఉన్నాయి, దానిలో పార్టిసిపేట్ చేసేందుకు స్పెషల్ కోచింగ్ తీసుకునేందుకు వెళతానంటూ ఒకటే పేచీ పెడుతున్నాడు'' అంది మీనాక్షి బాధగా.

''అదేమిటి వదినా పరిక్షలు రాయకుండా ఏం చేస్తాడట?'' అంది ఇందిర ఆశ్చర్యంగా.

''అదే వదినా నాకూ అర్ధం కావడంలేదు. కాస్త హారిక వచ్చి చెపితే వింటాడని నా ఆశ'' అంది మీనాక్షి దిగులుగా.

''ఏమిటో ఈ కాలం పిల్లలు. ఎప్పుడేం చేస్తారో వాళ్ళకే తెలియదు'' అంది ఇందిర యాధాలాపంగా.

**ఆ మాటలు వింటూనే మీనాక్షి** తెల్లమొహం వేసింది.

హారిక తల్లివైపు విసుగ్గా చూస్తూ ''ఏంటమ్మా నువ్వు. అసలే ఆంటీ ఆందోళన పడుతూ ఉంటే నువ్వు మరీ బెదరగొడుతున్నావే'' అంటూ మీనాక్షి వైపు తిరిగి ''మీరు వెళ్ళండి ఆంటీ నేను ఇప్పుడే వస్తాను'' అంది.

''సరేలేమ్మా, కాస్త తొందరగా రా'' అంటూ హడావిడిగా వెళ్ళిపోయింది మీనాక్షి.

చేతిలో పుస్తకాలు లోపలపెట్టి మీనాక్షి వెనుకే వెళ్తున్న కూతురితో అంది ఇందిర ''అన్నం తిని వెళ్ళవే'' అని.

''వచ్చాక తింటాలేమ్మా'' అంటూ తల్లి సమాధానం కోసం ఎదురు చూడకుండా ఎదురింటి వైపు సాగిపోయింది. వెళ్తూనే ''ఎక్కడున్నాడాంటీ, విద్యా'' అని అడిగింది హారిక.

''అదిగో ఆ గదిలో ఉన్నాడమ్మా'' అంది మీనాక్షి కొడుకు ఉన్న గదిని చూపిస్తూ.

హారిక గదిలోకి వెళ్ళేసరికి విద్యాసాగర్ టేబుల్ మీద తల పెట్టుకుని ఏడుస్తూ ఉన్నాడు.

''విద్యా ఏమిటిది?'' అంటూ మృదువుగా అతడి తలమీద చేయి వేసింది హారిక.

ఆమె చేతిని తన రెండు చేతులతో గట్టిగా పట్టుకుని ''నువ్వైనా చెప్పక్కా... ఇంతమంచి అవకాశం పోగొట్టుకుంటే మళ్ళీ రాదని'' అన్నాడు విద్యాసాగర్ వెక్కివెక్కి ఏడుస్తూ.

''సరే, చెప్తానులే ఏడవకు. కళ్ళు తుడుచుకో ముందు. అసలు అన్నం తిన్నావా ఈ పూట?'' అనడిగింది హారిక అనునయంగా.

''లేదమ్మా పాటల కోచింగ్‌కు వెళ్ళనిస్తే అన్నం తింటానని పేచీ పెట్టి కూర్చున్నాడు. ఏం చేసేది నేను?'' అంది మీనాక్షి కళ్ళనీళ్ళ పర్యంతం అవుతూ.

''ముందు ప్లేటులో అన్నం పెట్టుకు రండి ఆంటీ, తింటాడు'' అంది హారిక.

''నాకేం వద్దు. నన్ను కోచింగ్‌కు వెళ్ళనిస్తేనే తింటాను'' అన్నాడు విద్యాసాగర్ మొండిగా.

''దాని గురించి తర్వాత మాట్లాడదాం. చూడు విద్యా నువ్వు త్వరగా అన్నం తినేస్తే నేను మాట్లాడేసి వెళ్ళి అన్నం తింటాను. అసలే నాకు చాలా ఆకలిగా ఉంది'' అంది హారిక.

"అయ్యో నువ్వింకా అన్నం తినలేదా అమ్మా? సరే నేను వెళ్ళి ఇద్దరికీ అన్నం పెట్టుకొస్తాను" అంటూ వెళ్ళబోయింది మీనాక్షి.

"వద్దాంటీ, నేను ఇంటికి వెళ్ళి తింటాలెండి" అంది హారిక మొహమాటంగా.

"భలేదానివే ఇప్పుడు టైమెంతయిందో తెలుసా? రెండు దాటింది. ఇంకా ఎప్పుడు తిందామని ఒకవేళ అన్నం చాలదని బెంగపడుతున్నావా, ఏమిటి? నేను వండిందంతా అలాగే ఉంది. వాడు తినలేదని నేనూ తినలేదు. ముందు మీరిద్దరూ తినండి. నాకు చాలకపోతే అమ్మనడిగి తెచ్చుకుంటాను" అంటూ మీనాక్షి లోపలికి వెళ్ళిపోయింది అన్నం తెచ్చేందుకు.

హారిక భోజనం చేయలేదని వినడంతోనే విద్యాసాగర్ ఇంకేమీ మాట్లాడకుండా అన్నం తినేశాడు.

వాళ్ళిద్దరూ అన్నాలు తిన్నాక, పళ్ళాలు రెండూ తీసుకువెళ్ళి సింకులో పడేసి తాను కూడా వడ్డించుకుంది మీనాక్షి.

"ఇప్పుడు చెప్పు విద్యా ఏమిటి నీ ప్రోబ్లెమ్? అనడిగింది హారిక.

"ఏముంది? టి.విలో సింగింగ్ కాంపిటీషన్స్ ఉన్నాయని అడ్వర్‌టైజ్ చేస్తున్నారు. ఈసారి ఎలాగైనా నేను అందులో పార్టిసిపేట్ చేసి విన్ అవ్వాలని ఉంది. అలా చేయాలంటే మంచి కోచింగ్ తీసుకోవాలి. దానికోసం వెళతానంటే అమ్మ వద్దంటోంది" అన్నాడు విద్యాసాగర్ విచారంగా మొహం పెట్టి.

"మరి పరీక్షలు? ఈ సంవత్సరం ఎమ్.సెట్ కూడా ఉంది కదా" అంది హారిక ప్రశ్నార్థకంగా.

"పరీక్షలు నెక్స్ట్ ఇయర్ రాస్తానక్కా. ఈ ఛాన్స్ పోతే మళ్ళీ రాదు నాకు" అన్నాడు విద్యాసాగర్ ఉద్వేగంగా.

"బాగుంది విద్యా ఈ ఛాన్స్ పోతే మళ్ళీ రాదు, నిజమే కానీ ఒకవేళ నువ్విందులో విజయం సాధించలేకపోతే రెండిటికీ చెడిన రేవడివి కావా? అటు చదువూ పోతుంది, ఇటు నువ్వు అనుకున్నదీ పొందలేవు. ఆ తరువాత ఏం చేద్దామని?" అంది హారిక.

"ఎందుకు గెలవను? తప్పక గెలుస్తాను. అందులో విన్ అయితే గీతా మాధురీ, ఉషా, హేమచంద్ర, శ్రీకృష్ణల్లా నేను కూడా సినిమా ఛాన్సులు కొట్టవచ్చు. పేరుతో పాటు బోలెడు డబ్బు సంపాదించవచ్చు. ఆ హేమచంద్ర చూడూ, గాయకుడుగానే కాక, మ్యూజిక్ డైరెక్షన్ కూడా చేస్తున్నాడు. వాళ్ళలా నేనూ కావాలని నా ఆశ. నేనిప్పుడు చదువుకుని ఉద్యోగం చేసేదెందుకు? డబ్బు సంపాదనకే కదా! అది ఇలా సంపాదిస్తాను" అన్నాడు విద్యాసాగర్ ఊహల్లో తేలిపోతూ.

"అంతా బాగానే ఉంది. ఒకవేళ నీ ప్రయత్నం విఫలమైతే పరిస్థితి ఏమిటో ఆలోచించావా? మబ్బుల్లో నీళ్ళు చూసి, ముంత ఒలకబోసుకున్నట్లు అవుతుంది విద్యా" అంది హారిక అతడి వంక సూటిగా చూస్తూ.

"ఏంటక్కా నువ్వు కూడా అమ్మలా చాదస్తంగా మాట్లాడుతున్నావు? ఎవరైనా ఏ పనైనా తలపెట్టేటప్పుడు సక్సెస్ అవుతామనే తలపెడతారు గానీ ఫెయిల్ అవుతామని కాదుగదా? నేనూ అంతే రెండో థాట్ లేదు నాకు" అన్నాడు విద్యాసాగర్ స్థిరంగా.

అతడి మాటలు విని ముచ్చట పడినట్లుగా నవ్వుతూ, "ఆ కాన్ఫిడెన్స్ ఉంటే మంచిదే విద్యా. కానీ కీడెంచి మేలెంచమన్నారు పెద్దలు. మీ అమ్మా నాన్నగారు నిన్ను ఇంజనీర్‌ని చేయాలని, నీ తమ్ముడ్ని డాక్టర్ని చేయాలని ఎన్నో కలలు

కన్నారని నీకూ తెలుసు. మీ నాన్నగారుండగా చాలా బాగా చదివేవాడిని. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో నైంటీ టూ పర్సెంట్ మార్కులు వచ్చాయి నీకు. నీ మార్కులు చూసి మీ నాన్నగారెంతో మురిసిపోయారు.

నీకు ఎమ్‌సెట్‌లో మంచి రేంకే వస్తుందని అందరితో ఎంతో గొప్పగా చెప్పడం నేను కూడా విన్నాను.

కానీ దురదృష్టవశాత్తూ మీ నాన్నగారు పోయరు. అయినవాళ్ళు మోసం చేసి మీ ఆస్తిని దోచేశారు. ఇంత జరిగినా మీ అమ్మ మీ ఇద్దరి మీదా ఆశలు పెట్టుకుని బ్రతుకుతున్నారు. నువ్విలా పరీక్షలు రాయడం మానేసి అమ్మ ఆశలు కూలదోస్తావ్? నువ్వు చదువు మానేస్తే పై లోకాన ఉన్న మీ నాన్నగారి ఆత్మకు శాంతి ఉంటుందా? ఆలోచించు?

నీకు గొప్ప గాయకుడివి కావాలనే ఆశ ఉండడంలో తప్పులేదు. దానికోసం ప్రయత్నం చెయ్యి. ఎవరూ వద్దనరు. కానీ అదే సమయంలో అది నీ కెరీర్‌కి అవరోధంలా కాకుండా చూసుకో. ముందు నీ కెరీర్‌పై దృష్టి పెట్టి ఒక పొజిషన్‌కి చేరుకో. ఆ తరువాత నీ సింగింగ్ హాబీని ఎక్స్‌ట్రా క్వాలిఫికేషన్‌గా డెవలప్ చేసుకో. నీ చదువు నీ కన్నవాళ్ళ ఆశలు తీర్చడానికే కాదు. సంఘంలో నీకో స్థాయినీ, హోదానీ కల్పిస్తుంది. చదువుంటే ఎక్కడికి వెళ్ళినా పదిమందితో స్వేచ్ఛగా, ధాటిగా మాట్లాడగలుగుతావు.

ఇంటర్‌మీడియట్ అనేది బేసిక్ క్వాలిఫికేషన్. అది కూడా లేకుండా ఎక్కడికి వెళ్దామని, ఏం చేద్దామని?

నువ్విందాక అన్నావే హేమచంద్రా, శ్రీకిష్ణా, గీతా మాధురీ అని వాళ్ళంతా చదువు సంధ్యలు మానేసి, ఆ ఫీల్డులోకి వెళ్ళారనా నీ ఉద్దేశ్యం? చదువు కొనసాగిస్తూనే అందులో కొనసాగారు. నువ్వేమో ఈ కాంపిటీషన్‌లో విన్నయితే చాలు, అంతా సాధించినట్లే అనుకుంటున్నావు.

ఆ హేమచంద్ర జి.టి.విలో నేషనల్ లెవెల్‌లో పాడి ఎంతో గుర్తింపు పొందాడు. ఆ స్థాయికి చేరుకోవాలంటే పాటలు పాడడం ఒకటే వస్తే సరిపోదు విద్యా. ఇంగ్లీషులోనూ, హిందీలోనూ ధారాళంగా మాట్లాడగలిగే స్థాయికి ఎదగాలి. దాంతో ఎక్కడికి వెళ్ళినా నెగ్గుకు రాగలిగే సామర్థ్యం నీ స్వంతమవుతుంది. అప్పుడు విజయం నిన్ను వెదుక్కుంటూ వస్తుంది.

ఉదాహరణకి నా సంగతే తీసుకో. ఆర్ట్స్ గ్రూప్ తీసుకుని బి.ఏ చదువుతున్నానని అంతా నన్ను విచిత్రంగా చూస్తూ తేలిక చేసి మాట్లాడుతున్నారు. అయినా పట్టించుకోలేదు నేను. ఎందుకంటే నా గోల్ ఐ.ఏ.యస్ కనుక. అది సాధించేందుకు పబ్లిక్ ఎడ్మినిస్ట్రేషన్, పాలిటిక్స్ బాగా ఉపయోగపడతాయని బి.ఏలో ఆ సబ్జెక్ట్స్‌ని ఎంపిక చేసుకున్నాను. అఫ్‌కోర్స్ అవి తీసుకోకపోయినా ఐ.ఏ.యస్‌కి ప్రిపేర్ అవ్వచ్చు అనుకో అది వేరే విషయం.

ముఖ్యంగా నేను చెప్పేదేంటంటే మన లైఫ్‌కి మనం ఖచ్చితంగా ఒక గోల్‌ని ఏర్పరచుకోవాలి. దాని సాధన కోసం పట్టుదలగా కృషి చేయాలి. అప్పుడు సాధించలేనిది ఏమీ ఉండదు.

నీ ఫస్ట్ ప్రయారిటీ చదువుకిచ్చి ముందు దాని మీద కాన్‌సెన్ ట్రేట్ చెయ్యి. ఆ తరువాత నీ ఎక్స్‌ట్రా క్వాలిఫికేషన్స్ డెవలప్‌మెంట్ కోసం ఆలోచిద్దుగానీ" అంది హారిక లాలనగా.

హారిక సివిల్స్ ప్రిపేర్ అవుతుందనే విషయం వినడంతోనే, విద్యాసాగర్ ఆలోచనలో పడిపోయాడు. తన ఆలోచనను పక్కన పెట్టి "అక్కా, నువ్వు ఐ.ఏ.యస్‌కి ప్రిపేర్ అవుతున్నావా? మరెప్పుడూ చెప్పలేదే నువ్వు?" అన్నాడు ఆరాధనగా ఆమె వంక చూస్తూ.

"అవును, ఇప్పటి నుండీ అనవసరమైన పబ్లిసిటీ ఎందుకని ఎవరికీ చెప్పలేదు. ఐ.ఏ.యస్ కావాలనేది చిన్నప్పటినుండీ నా లైఫ్ యాంబిషన్. ఇప్పుడు సమయం వచ్చింది కనుక నీకు చెప్పానే కానీ, లేకపోతే ఇప్పట్లో ఎవరికీ ఈ విషయం చెప్పేదాన్ని కాదు. నా సంగతి సరే.. ఏం చేద్దామనుకుంటున్నావు నువ్వు?" అనడిగింది హారిక.

"ఆలోచించి చూస్తే నువ్వు చెప్పినట్లు చేస్తేనే మంచిదనిపిస్తోందక్కా. ఇన్నాళ్ళూ నా పిచ్చిలో పడి అమ్మని చాలా బాధపెట్టాను. నేను త్వరగా డబ్బు సంపాదించి అమ్మని సంతోషపెట్టాలి అనుకున్నాను. దానికి ఇదే సరైన మార్గం అనుకున్నాను తప్ప నీలా ఇంత లోతుగా ఆలోచించలేదు" అన్నాడు విద్యాసాగర్ పశ్చాత్తాపపడుతున్నట్లుగా.

"అయిందేదో అయింది. ఇప్పటి నుండయినా చదువు మీద కాన్సెన్‌ట్రేట్ చేసి మంచి రాంకు సంపాదించు. అలా అని పాటలను వదిలేయమని చెప్పడం లేదు నేను. ఎందుకంటే పాట నీ ఊపిరి అని నాకు తెలుసు" అంది హారిక నవ్వుతూ.

"థాంక్స్ అక్కా నా మనసుని చాలా బాగా అర్థం చేసుకున్నావు. నువ్వు చెప్పినట్లే ముందు చదువు. ఆ తరువాతే పాట" అన్నాడు విద్యాసాగర్ హాయిగా నవ్వేస్తూ.

కొడుకు మాటలు విన్న మీనాక్షి ముఖం ఆనందంతో విప్పారింది.

"థేంక్స్ హారికా" అంటూ హారికను తన హృదయానికి హత్తుకుంది మీనాక్షి. మాటలకందని భావాన్ని ఆలింగనం ద్వారా అలా వ్యక్తం చేసింది మీనాక్షి.

"ఇందులో నాదేం లేదాంటీ. విద్య చాలా తెలివైనవాడు. మంచేదో, చెడేదో తెలుసుకున్నాడంతే. నే వస్తానాంటీ.. అమ్మ నాకోసం ఎదురు చూస్తూ ఉంటుంది" అంటూ వెళ్ళిపోయింది హారిక.

ఆమె వెళ్ళిన వంకే అలా చూస్తూ నుంచున్న మీనాక్షి మెడ చుట్టూ చేతులు వేసి "సారీ అమ్మా, నిన్ను చాలా బాధపెట్టాను" అన్నాడు విద్యాసాగర్ కళ్ళు చెమరుస్తూ ఉండగా.

"బాధేం లేదు నాన్నా. ఆస్తులు పోయినా తమ్ముడూ, నువ్వే నా సర్వమూ అనుకుని బ్రతుకుతున్నాను. మీరు ప్రయోజకులవ్వాలి. మనని చూసి నవ్విన వాళ్ళ నోరు మూయించాలి. ఆడది, అదేం చేయగలదు అన్నదానికి మీరు సరైన జవాబుగా నిలవాలి. అదే నా కోరిక" అంది మీనాక్షి డగ్గుత్తికతో.

"ఊరుకోమ్మా ఇక ముందెప్పుడూ నువ్వు కంటతడి పెట్టే పరిస్థితి రానివ్వను" అన్నాడు విద్యాసాగర్ స్థిరంగా.

కమల హారికను చిన్నబుచ్చాలని ఆమె చదువు గూర్చి ఎద్దేవా చేసిన తర్వాత మేనత్తని చూడాలని ఉన్నా, ఆ ఛాయలకు వెళ్ళడం మానుకుంది హారిక.

ఇందిర కూడా కూతుర్ని అక్కడకు వెళదాం రమ్మని వత్తిడి చేయడం మానేసింది.

హారికను కించపరచాలని చూసి దెబ్బ తిన్న కమల, హరిప్రసాద్, ఇందిరలు వచ్చినప్పుడు కాస్త జంకుగా అనిపించడంతో ఏదో తప్పు చేసినదానిలా వాళ్ళని తప్పించుకు తిరగసాగింది. వాళ్ళు కూడా కమలతో అంటీ ముట్టనట్లుగా ఉండిపోయారు.

కమల పనిలో సుగుణకు సాయపడుతూనే తన తీరిక సమయాన్నంతా జానకి దగ్గరే గడపసాగింది. ఆమె ప్రవర్తన చూసి రామచంద్ర ఎంతో ఆశ్చర్యపోయాడు. పాతికేళ్ళ క్రితం అందరి పట్లా కమల ఎంత అభిమానంగా ఉండేదో అదే అభిమానాన్ని ఆయన తిరిగి ఇన్నాళ్ళకు మరదలిలో చూడగలిగాడు.

జానకి ఆనందానికయితే అవధులే లేవు. తనతో ఉల్లాసంగా కబుర్లు చెబుతూ, బుజ్జగించి అన్నం పెడుతూ అవసరమైతే కసురుకుని మందులు వేస్తున్న కమలని చూసి పూర్వపు రోజులు మళ్ళీ వచ్చాయని సంబరపడిపోయింది.

తన పెళ్ళయిన వెంటనే వెళ్ళిపోయిన కమల, ఇన్ని సంవత్సరాల తర్వాత ఇక్కడికి రావడం వలన ఆమె గూర్చి వినడం తప్ప ప్రత్యేకించి సుగుణకు ఏమీ తెలియదు. కానీ ఈనాడు ఆమె తమతో వ్యవహరిస్తున్న తీరు చూశాక మనుష్యుల మధ్య అనుకోకుండా ఏవో తేడాలు వచ్చినా అవి స్థిరంగా ఉండిపోవని పాసింగ్ క్లౌడ్స్‌లా వచ్చిపోతాయని మనసుల్లో మమతలు ఎక్కడికీ పోవని అవి స్థిరంగా నిలిచి ఉంటాయని అనుకుంది సుగుణ.

మధ్య మధ్యలో భాస్కర్, శశికిరణ్‌లు ఫోన్ చేసి జానకి క్షేమ సమాచారాలుతెలుసుకుంటున్నారు. వారితో కాసేపు మాట్లాడడంతో అందరి మనసులూ ఉల్లాసంగా ఉండేవి.

ఒక మంచి మాట, ఒక ఆత్మీయపు స్పర్శ, ఎలాంటి కష్టాన్నైనా, బాధనైనా ఒటాఓంచకు చేస్తుందంటారు. అదే నిజమైంది వారి జీవితాల్లో. సంవత్సరం రోజులుగా ఆ ఇంటి సభ్యులంతా పడిన కష్టమంతా భాస్కర్, కమల, శశికిరణ్‌ల రాక వలన చేత్తో తీసేసినట్లు అంతా మాయమైపోయింది.

జానకి ఆరోగ్యం కొంత కుదుటపడటంతో ఆపరేషన్‌కు డేట్ నిర్ణయించారు. అలా నిర్ణయించిన వెంటనే జానకి ఆరోగ్యం దిగజారిపోయింది. బిపి, షుగర్ లెవెల్స్ అనూహ్యంగా పెరిగిపోయాయి.

ఆమె ఆరోగ్య పరిస్థితిని గమనించిన డాక్టర్స్ ఆమెకిలా జరగడం ఇప్పటికిది రెండోసారి. ఇదంతా చూస్తొంటే మీ మిసెస్ సమస్య కేవలం సైకలాజికల్ అనిపిస్తున్నది. నాకు తెలిసిన సైకాలజిస్ట్ ఒకరున్నారు ఆయన దగ్గరకు తీసుకువెళ్ళి కౌన్సిలింగ్ ఇప్పించండి'' అన్నాడాయన.

''అక్కడికి తీసుకువెళ్తానంటే తను వస్తుందో రాదో సార్. మీరే వారిని ఇక్కడకు రప్పించే ఏర్పాటు చేయండి ప్లీజ్'' అన్నాడు రామచంద్ర.

''సరే అలాగే చేద్దాం. అదే మంచిదేమో కూడా'' అన్నారాయన.

''సర్, నన్ను చాలా రోజులుగా పట్టి పీడిస్తున్న సమస్య ఇది. ఈ ఆపరేషన్ వలన తనకేమీ..'' అంటూ మాట పూర్తి చేయలేక నిస్సహాయంగా డాక్టరుగారి వంక చూశాడు రామచంద్ర కన్నీళ్ళు చిప్పిల్లుతూండగా.

''నో నో రామచంద్రగారూ, మీరలా అధైర్యపడకండి. రిస్క్ అనేది ఎక్కడయినా ఉంటుంది. కానీ మనమెప్పుడూ పాజిటివ్‌గానే ఆలోచించాలి మన అదృష్టం కొద్దీ నెక్స్ వీక్ జపాన్‌కి చెందిన ప్రముఖ కార్డియాలజిస్ట్ కెంజికవాజిరీ వస్తున్నారిక్కడికి. వారి ఆధ్వర్యంలో ఐదుగురు హృద్రోగులకు చికిత్స చేయాలని నిర్ణయించాము. అందులో జానకి గారు ఒకరు.

**వీరికి** క్రానిక్ ట్రాంబోలేటివ్ ఆక్లూషన్ విధానం ద్వారా కుట్టూ, కోతా లేకుండా అంటే బైపాస్ సర్జరీ లేకుండా కాంప్లెక్స్ యాంజియో ప్లాస్టీ చేయబోతున్నాము. ఇది మన విశాఖ నగరంలో నిర్వహించే ప్రప్రథమ చికిత్స.

దీనికి ఇంట్రా వాస్క్యులర్ ఆల్ట్రా సౌండ్ మిషన్ ద్వారా తొలిగించేందుకు క్రానిక్ టోటల్ ఆక్లూషన్ పద్ధతిని పాటించబోతున్నాము. దీనివల ఎటువంటి హానీ ఉండదు రోగికి. రెండు రోజుల్లో హాయిగా ఇంటికి తీసుకుపోవచ్చు. మీరు ధైర్యంగా ఉండి ఆమెకు ధైర్యం చెప్పండి'' అన్నారు డాక్టరుగారు.

జానకికి సైకాలజిస్ట్‌తో కౌన్సిలింగ్ ఇప్పించాక ఆపరేషన్ డేట్‌ను ఫిక్స్ చేశారు.

ఆ సంగతి వెంటనే భాస్కర్‌కి ఫోన్ చేసి చెప్పాడు రామచంద్ర.

''డాడీ, మీరు వెంటనే బయలుదేరి వెళ్ళండి. నేను తర్వాత వస్తాను'' అన్నాడు శశికిరణ్.

''లేదురా, నేను వెళ్ళినా వదినకు అంత తృప్తిగా ఉండదు. సర్జరీకి ముందు తన సంతానమయిన మీ ముగ్గుర్నీ చూడాలని కోరుకుంటుంది. అందుకు ఏ మాత్రం తేడా వచ్చినా వదిన పరిస్థితి మళ్ళీ మొదటికే వస్తుంది'' అన్నాడు భాస్కర్.

''అలా అంటారా ఆ మధ్య పదిరోజులు సెలవు పెట్టాను కదా. మళ్ళీ ఇప్పుడు సెలవంటే మా బాస్ గొడవపెడ్తాడేమో? సరే, ఏదో మేనేజ్ చేస్తాలెండి'' అన్నాడు శశికిరణ్.

''అలాగే చెయ్యి. నేను ట్రావెల్ ఏజెన్సీకి ఫోన్ చేసి ఎయిర్ టికెట్లు బుక్ చేయిస్తాను'' అన్నాడు భాస్కర్.

''సరే అయితే, సర్జరీ అయ్యాక మాత్రం ఎక్కువ రోజులు ఉండనక్కడ. ఆపరేషన్ అయిన తర్వాత ఓ రెండు రోజులకు రిటెన్ టికెట్ కూడా బుక్ చేయించండి. నేను ఆఫీసుకు వెళతాను'' అని చెప్పి శశికిరణ్ వెళ్ళిపోయాడు.

ఆఫీసుకు వెళ్ళాక సిస్టమ్ ముందు కూర్చున్నాడే కానీ, పనిమీద ఏమాత్రం ఏకాగ్రత చూపించలేకపోయాడు. అతడి మనసంతా నిండి ఉన్న హారిక ఒక్క క్షణం కూడా అతడిని స్థిమితంగా ఉండనివ్వడంలేదు. ఏ పని చేస్తున్నా హారిక తలపులే అతడిని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

కైలాసగిరికి వెళ్ళి వచ్చిన దగ్గరనుండీ హారిక శశికిరణ్ మనసుకు మరింత దగ్గరగా అనిపించసాగింది. అక్కడికి వెళ్ళి వచ్చిన రోజు ఏదో పాట హమ్ చేస్తూ తల దువ్వుకుంటూంటే వెనక నుండి సుగుణ వదిన వచ్చి అన్నమాటలు గుర్తుకు వచ్చాయి అతడికి.

''అందమైన ప్రేమ రాణి చేయి తగిలితే సత్తు రేకు కూడా స్వర్ణమేలే.

అందమైన చిన్నదాని లేత బుగ్గపై చిన్న మొటిమ కూడా ముత్యమేలే.'' అంటూ పాడుతూ వచ్చింది తన వైపు కొంటెగా చూస్తు

సెర్చ్ చేస్తున్నట్లున్న ఆమె చూపులను తట్టుకోలేక ''ఏమిటి వదినా, ఏమిటి సంగతి? ఎప్పుడూ లేనిది పాటలు పాడుతున్నావు. అదీ నన్ను చూసి'' అన్నాడు బింకంగా.

''నిన్ను చూసి నేనెందుకు పాడుతాను నాయనా? రాత్రి పాడుతా తీయగాలో బాలసుబ్రమణ్యంగారు ఉన్నికృష్ణన్‌ను పరిచయం చేస్తూ చెప్పిన మాటలు గుర్తుకు వచ్చి ఏదో పాడుకుంటూ వుంటే నువ్వేంటి గుమ్మడికాయ దొంగలా ఉలిక్కిపడుతున్నావు?'' అంది సుగుణ వచ్చే నవ్వును ఆపుకుంటూ.

"నాకు తెలుసులే నీ సెటైర్లన్నీ నామీదేనని" అన్నాడు శశికిరణ్ ముఖమంతా కందిపోగా.

"అయితే నేను ఊహించింది నిజమేనన్నమాట. మీ ఇద్దరి మధ్యా సంథింగ్.. సంథింగ్" అంటూ నవ్వింది సుగుణ.

"పో వదినా, నీకంతా వేళాకోళమే. నువ్వు ఊహించినంత సీనేం లేదక్కడ" అన్నాడు.

"ఆహా, అంత తొందరగా పోతానా? దొరక్క దొరకక ఇన్నాళ్ళకి దొరికావు, చిట్టి మరిదివి. నిన్నొక ఆట ఆడించకుండా వదులుతానా? ఇంతకీ వర్కవుట్ అవుతోందా నీ ప్రయత్నం?" అంది సుగుణ.

"తల్లీ ఊరుకో. నువ్వు ఊహించినంత ఏం లేదు. కాకపోతే ఆ అమ్మాయి మనసులో ఏముందో నాకు తెలియదుకానీ తను కనపడితే చాలు, నా మనసు పురివిప్పిన నెమలిలా అయిపోతుంది. ఇదీ అని వివరించి చెప్పలేని వింత భావన కలుగుతోంది. ఇంతకు ముందు ఏ అమ్మాయిని చూసినా ఇలా అనిపించలేదు నాకు" అన్నాడు శశికిరణ్ తన్మయత్వంలో మునిగిపోతూ.

"అదే బాబూ ప్రేమంటే" అంది సుగుణ.

"వదినా నా ప్రేమ ఫలిస్తుందంటావా?" అన్నాడు సందేహంగా చూస్తూ.

"ఎందుకు ఫలించదు. నీకేం తక్కువ? చదువుంది, అందముంది, అన్నిటికీ మించి మంచి మనసుంది. హారిక చాలా మంచి అమ్మాయే కాదు, చాలా తెలివైంది కూడా. కోరి వచ్చిన అదృష్టాన్ని కాలదన్నుకోదు" అంది సుగుణ.

"అదికాదు. హారిక అంటే మమ్మీకి అంత ఇష్టం ఉన్నట్లు లేదు. మమ్మీ మనసు ఎట్టిపరిస్థితుల్లోనూ నొప్పించలేను నేను" అన్నాడు శశికిరణ్.

"శశీ, అనవసరపు ఆలోచనలతో మనసు పాడు చేసుకోకు. కొన్ని విషయాలను కాలానికే వదిలేయాలి. అయినా ఏ తల్లయినా తన బిడ్డలు సంతోషంగా, సుఖంగా ఉండాలని కోరుకుంటుంది కదా. మీ మమ్మీకి నువ్వంటే పంచప్రాణాలని విన్నాను. నీ ఇష్టానికి వ్యతిరేకంగా ఆవిడ ఏ పనీ చేయదని నా నమ్మకం" అంది సుగుణ ఓదార్పుగా.

"థేంక్స్ వదినా నీతో మాట్లాడాక నా మనసు స్థిమితంగా అనిపిస్తోంది. ఒక పక్క హారిక నా మనసును అల్లకల్లోలం చేస్తూంటే మరో పక్క మమ్మీ ఆలోచనలు నన్ను ముందుకు సాగనివ్వడంలేదు. రాత్రంతా ఇవే ఆలోచనలు. డాడీతో మాట్లాడాలంటే సంకోచం" అంటూ నవ్వాడు శశికిరణ్.

ఆనాటి సంభాషణ గుర్తుకురాగా అతడి పెదవుల మీద అప్రయత్నంగా నవ్వు విసిరింది.

పక్కసీటులో ఉన్న అతడి కొలీగ్ ప్రియాంక అది చూసి "ఏమిటి శశీ నీలో నువ్వే నవ్వేసుకుంటున్నావు. ఎనీ థింగ్ స్పెషల్?" అనడిగింది.

"ఏంలేదు ప్రియాంకా, రాత్రి చదివిన బుక్‌లో జోక్ గుర్తుకు వచ్చి నవ్వానంతే" అన్నాడు తడబాటుగా.

"నీ వాలకం చూస్తే అలా లేదులే. ఐ థింక్ యూ ఫెల్ ఇన్ లవ్. ఎందుకంటే నువ్వు విశాఖపట్నం వెళ్ళి వచ్చిన దగ్గర నుంచీ నీ తీరే మారిపోయింది. మాటిమాటికీ నీలో నువ్వే నవ్వుకుంటున్నావు. సిస్టమ్ ముందు కూర్చుని పని మానేసి చుక్కలు లెక్కపెడుతున్నట్లుగా ఎటో చూస్తున్నావు. ఇవన్నీ ప్రేమ లక్షణాలేగానీ అసలు సంగతి చెప్పు. అక్కడ నీ డ్రీమ్ గర్ల్ ఎదురైందా? ఆ సంగతి చెప్పు" అంది ప్రియాంక ఆసక్తిగా చూస్తూ.

తాను అవునని సమాధానం చెపితే ప్రియాంక అందరికీ చెప్పి డిపార్ట్‌మెంట్ అంతా హోరెత్తిస్తుందని బయపడ్డాడు. అందుకే అబ్బే, అదేం లేదు అంటూ నవ్వేసి పనున్నట్లుగా సిస్టమ్ మీదకి దృష్టి సారించాడు చేత్తో మౌస్‌ను కదుపుతూ.

ఇక ఎంత ప్రయత్నించినా అతడి నుండి ఏ సమాచారమూ రాబట్టలేనని గ్రహించిన ప్రియాంక తన పనిలో మునిగిపోయింది.

ఆపరేషన్ రేపు అనగా భాస్కర్, శశికిరణ్ విశాఖపట్టణం వచ్చారు.

జానకిని థియేటర్‌లోనికి తీసుకువెళ్ళేముందు అందరికీ అప్పగింతలు పెట్టింది. కన్నీళ్ళతో తన వంకే జాలిగా చూస్తున్న కూతుర్ని చూడడంతోనే ఆమె కళ్ళు కన్నీటి చెలమలే అయ్యాయి.

రమ్య చేతుల్ని సుగుణ చేతిలో పెడుతూ "సుగుణా, ఇక దీని భారమంతా నీదేనమ్మా" అంది జానకి వణుకుతున్న కంఠంతో.

"అంతమాట అనకండి అత్తయ్యా. మీకేం కాదు. రమ్యని నా ప్రాణంలా చూసుకుంటాను. దిగులు పడకండి మీరు" అంది సుగుణ కన్నీళ్ళతో జానకి వంక చూస్తూ.

వాళ్ళందరినీ అలా చూస్తూ ఉంటే కమలకి కూడా కన్నీళ్ళు ఆగలేదు. అయినా బలవంతాన కన్నీళ్ళు అదుముకుని లేని కోపాన్ని నటిస్తూ, "ఏమిటక్కా నీ ఉద్దేశ్యం? నీ బాధ్యతలన్నీ మా మీద వేసేసి, నిశ్చింతగా వెళ్ళిపోదామనుకుంటున్నావా? అదేం కుదరదు. నీ పిల్లల మంచి చెడులన్నీ నువ్వే స్వయంగా చూసుకోవాలి, చచ్చినట్లు బ్రతికి... మాకేం సంబంధం లేదు" అంది కఠినంగా.

ఆ మాటలు వినగానే అందరూ ఒక్క క్షణం తెల్లబోయి చూశారు ఆమె వంక బాధపడుతున్న దాన్ని ఓదార్చవలసింది పోయి, ఇలా మాట్లాడుతుందేమిటి అన్నట్లు..

అంతలోనే ఆ మాటల్లోని అంతరార్థం అర్థమయ్యాక, అందరూ కమలని మెచ్చుకుంటున్నట్లు చూశారు.

హారిక కూడా అలాగే చూసింది. ఈ మనిషికి అసలు సున్నితత్వం తెలియదా? అందరూ ఇంత బాధపడుతూంటే ఏమిటి ఇలా మాట్లాడుతుంది అనుకుంది ఒక్క క్షణం. అంతలోనే వణుకుతున్న కమల చేతులను, అదురుతున్న ఆమె పెదాలను చూశాక, జానకిలో బ్రతకాలనే పట్టుదలని పెంచాలనే ఉద్దేశ్యంతో కమల అలా మాట్లాడిందని అర్థం చేసుకుంది.

వెంటనే ఆమె పట్ల అంతవరకూ ఉన్న వ్యతిరేకత పోయి గౌరవభావం కలిగింది. ఆ పైన రామచంద్ర మాటలు హారిక అభిప్రాయాన్ని స్థిరపరచాయి.

"అవును జానకీ, కమల చెప్పింది నిజం. మా అందర్నీ ఎవరికి అప్పగించి పోదామని నీ ఉద్దేశ్యం, నువ్వు బ్రతికి తీరాల్సిందే" అన్నాడు రామచంద్ర నొక్కి చెపుతున్నట్లుగా.

భర్త మాటలు విన్నాక కొంచెం తెప్పరిల్లింది జానకి. ఆమె ముఖంలో దైన్యం స్థానంలో ఏదో నిబ్బరం వచ్చి చేరింది. అందరి వైపూ ఒకసారి చూసి మెల్లగా కళ్ళు మూసుకుంది.

అందరూ దడదడలాడే గుండెలతో ఆపరేషన్ థియేటర్ వంకే చూస్తూ కూర్చున్నారు అక్కడ.

కళ్ళతోనే ఒకరికొకరు ధైర్యం చెప్పుకున్నారు తప్ప ఎవరూ మాట్లాడే ప్రయత్నం చేయలేదు.

రమ్య భుజం చుట్టూ చేతులు వేసి దగ్గరగా పొదుపుకుని కూర్చుంది కమల. రమ్యకు మరోపక్క హారిక కూర్చుంది. ఊహ తెలిసిన దగ్గర నుండీ రమ్యా, హారికలు ఒకరికొకరు ప్రాణంలా మసలుకున్నారు. ఇప్పుడు రమ్యకు వచ్చిన ఈ కష్టం తనకే వచ్చినట్లుగా విలవిలలాడిపోతోంది హారిక.

మరోపక్క అక్కగారంటే ప్రాణం పెట్టే హరిప్రసాద్ దిగులుగా ఆపరేషన్ థియేటర్ వంకే చూడసాగాడు.

ఆ తలుపులు ఎప్పుడు తెరుచుకుంటాయా అని ధైర్యం కోసం పక్కనే ఉన్న భాస్కర్ చెయ్యిని గట్టిగా పట్టుకున్నాడు.

రామచంద్ర పరిస్థితి అయితే చెప్పనక్కరలేదు. దాదాపు నలభై సంవత్సరాల పాటు తన కష్టసుఖాల్లో పాలు పంచుకున్న జీవన సహచరి తిరిగి తనతో మాట్లాడుతుందా, లేదా అని మనసు కొట్టుమిట్టాడుతూంటే ఆత్రంగా చూడసాగాడు.

రవి, శశికిరణ్‌లు తల్లికి బ్లడ్ ఇచ్చి వచ్చి నీరసంగా కూర్చున్నారు అక్కడే భాస్కర్ వెళ్ళి ఇద్దరికీ ఫ్రూట్ జ్యూస్ తెచ్చి ఇచ్చి బలవంతాన తాగించాడు.

నాయనమ్మ ఎప్పుడొస్తుంది లోపలనుండి అని కావ్య వేస్తున్న యక్ష ప్రశ్నలన్నిటికీ సమాధానాలు చెప్తూనే మా అత్తగారు మాకు క్షేమంగా దక్కేలా చూడు తండ్రీ అంటూ మనసులోనే దేముడ్ని ప్రార్ధించుకోసాగింది సుగుణ.

అందరి ప్రార్ధనలూ ఫలించినట్లుగా తలుపు తెరుచుకుని డాక్టర్ వచ్చి "ఆపరేషన్ సక్సెస్" అని చెప్పడంతో అందరి మనసుల్లో భారం దిగిపోయింది. ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తూండగా ఒకరినొకరు హత్తుకు పోయారు.

తల్లి క్షేమంగా ఉంది అన్న వార్త వినడంతోనే "నాన్నా" అంటూ రవి రామచంద్రాన్ని పట్టుకుని బిగ్గరగా ఏడ్చేశాడు. ఇన్నిరోజులుగా ఉగ్గబెట్టుకున్న బాధ, దుఃఖం కట్టలు తెంచుకుని ప్రవహించింది.

రామచంద్ర కళ్ళు తుడుచుకుని బుజ్జగిస్తున్నట్లుగా రవి వీపు నిమురుతూ ఉండిపోయాడు.

"ఇంకా ఎందుకు రవీ, బాధపడతావు. అమ్మ క్షేమంగా ఉందని తెలిశాక" అంటూ అతడిని అన్నగారి నుండి విడదీయబోయాడు భాస్కర్.

"ఉండనీ బాచీ.. ఈ ఏడాదిగా వాడి బాధనంతా మనసులోనే దాచుకుని కుమిలిపోతున్నాడు. ఇప్పుడైనా ఆ భారం దించుకోనీ అన్నాడు రామచంద్ర.

హరిప్రసాద్ వచ్చి ఆనందంగా బావగారి భుజం మీద చేయి వేశాడు, కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా.

అతడ్ని చూడడంతోనే రవికీ, హరిప్రసాద్‌కీ తేడా ఏమీ కనిపించలేదు రామచంద్రకి. ఆప్యాయంగా అతడిని కూడా దగ్గరకు లాక్కున్నాడు "ఊరుకోరా" అంటూ.

ఇన్నిరోజులూ, ఆ ఇంట్లో అందరూ ఏడవగా చూసింది కానీ, రవి ఏడవడం ఎప్పుడూ చూడలేదు కావ్య. అది చూడడంతోనే బెంబేలెత్తిపోతూ "నాన్నా" అంటూ ఘొల్లున ఏడుస్తూ రవి రెండు కాళ్ళూ చుట్టేసింది.

కూతురు అలా ఏడుస్తూ దగ్గరకు రావడంతో తనను తాను సంబాళించుకుని "ఏం లేదురా.. ఏం లేదు" అంటూ కావ్యను ఎత్తుకుని హృదయానికి హత్తుకున్నాడు రవి.

కన్నతల్లి బ్రతికిందనే ఆనందం తన అన్నలా తాను బాహాటంగా వ్యక్తం చేయలేకపోతున్నందుకు లోలోపలే బాధపడుతూ "అన్నయ్యా" అంటూ రవి భుజం మీద తలవాల్చాడు శశికిరణ్.

తమ్ముడి బాధను అర్ధం చేసుకున్నట్టుగా అనునయంగా అతడిని తన బాహువుల్లోకి తీసుకున్నాడురవి.

సొమ్మసిల్లినట్లుగా ఇందిర ఒడిలో వాలిపోయిన రమ్యను తట్టి "ఏయ్ రమ్యా చూడవే అంతా ఎంత సంతోషంగా ఉన్నారో" అంటూ తల్లి ఒడిలో నుండి లేవదీసింది హారిక రమ్యను.

మొత్తం మీద కథ సుఖాంతం కావడంతో అందరి మనసులూ తేలికపడ్డాయి.

ఆ సాయంత్రం జానకిని చూసేందుకు పర్మిషన్ ఇచ్చారు. అందరివంకా ఎంతో ఆనందంగా చూసింది జానకి. ఆ పూట అందరూ కేంటిన్‌లోనే భోజనాలు చేశారు. రాత్రికి కూడా ఇక్కడే తినేద్దాం అన్నాడు రవి.

కమలా, సుగుణా "ఇక్కడుండి మాత్రం మేము ఏం చేయాలి? ఇంటికి వెళ్ళి కమ్మగా వంట చేసి తీసుకువస్తాం" అంటూ బయలుదేరారు ఇద్దరూ.

కావ్య మాత్రం హాస్పటల్‌లోనే ఉంటాను అని పేచీ పెట్టింది. "పోనీ ఉండనీయండి వదినా" అంటూ శశికిరణ్ కావ్యను ఎత్తుకున్నాడు.

"ఇక్కడుంటే అది మీ అందర్నీ కాల్చుకు తింటుంది. ఐస్క్రీమ్‌లు, చాక్లెట్లు కావాలని" అంది సుగుణ.

"చిన్నపిల్ల, అది కాకపోతే మనం మారాం చేస్తామా ఏమిటి? పద, వెళదాం" అంటూ సుగుణ చేయి పట్టుకుని ముందుకు నడిచింది కమల.

దారిలో సుగుణ "నిజం అత్తయ్యా కావ్య ఉండబట్టే ఈ సంవత్సరం రోజులుగా మేము ఈ మాత్రమైనా ఉండగలిగాము. ఇంత టెన్షన్‌లో దాని మాటలూ, నవ్వులే మాకు ఎంతో రిలీఫ్‌నిచ్చాయి" అంది.

"అవునమ్మా వచ్చిందగ్గరనుండీ చూస్తూనే ఉన్నాను. అది బొంగరంలా చెలాకీగా ఇల్లంతా తిరుగుతూ దాని మాటలతోనూ, నవ్వులతోనూ అందర్నీ కట్టిపడేసింది. ఎంత బాధనైనా చిటికెలో మాయం చేసేసింది. అయినా ఇవన్నీ పాసింగ్ క్లౌడ్స్ లా వచ్చిపోయాయి అనుకోవాలి మనం. ఇక మిగిలిందంతా ఆనందమే కదా" అంది కమల.

"అవునత్తయ్యా ఉదయం అత్తయ్యగారు ఏడుస్తూ అందరికీ అప్పగింతలు పెడుతూ వుంటే మీరు అంత కఠినంగా ఎలా మాట్లాడగలిగారా అని మొదట మేమంతా తెల్లబోయాము మీ మాటలు విని.. ఆ తర్వాత అర్ధమైంది మీరలా ఎందుకన్నారో" అంది సుగుణ అభినందనగా.

"లేకపోతే ఏమిటి చెప్పు మనం అలా ఊరుకున్నకొద్దీ తను మరింత ధైర్యాన్ని కోల్పోతూ అలా మాట్లాడుతూనే ఉంటుందనిపించింది. అందుకే షాక్ ట్రీట్‌మెంట్‌లా అలా అన్నాను. థాంక్ గాడ్, ఎవరూ నన్ను తప్పుగా అర్ధం చేసుకోలేదు" అంది కమల గుండెల మీద చేతులు వేసుకుని.

"లేదత్తయ్యా, అందరూ పాజిటివ్‌గానే తీసుకున్నారు. మీ మాటలు తుప్పు వదిలించినట్లుగా, అత్తయ్యగారిలో పేరుకున్న పిరికితనాన్ని, భయాన్ని చెదరగొట్టాయి. బ్రతికి తీరాలి అనే ఆలోచనను రేకెత్తించాయి" అంది సుగుణ.

"ఏమో, నేనవన్నీ ఆలోచించలేదు. అప్పటికలా తోచింది, అనేశానంతే" అంటూ నవ్వింది కమల.

ఏడుగంటల వరకూ ఉండి భార్యనూ, కూతుర్నీ తీసుకుని ఇంటికి వెళ్ళిపోయాడు హరిప్రసాద్.

ఆపరేషన్ అయిన ఇరవై నాలుగు గంటల తర్వాత జానకిని ఐ.సి.యూ నుండి రూమ్‌లోకి మార్చారు.

"ఇప్పుడెలా ఉంది చెప్పు పెద్దమ్మా. ఈ మాత్రం దానికి ఏదో అయిపోతుందని అందర్నీ కంగారు పెట్టేశావు కదా" అన్నాడు శశికిరణ్ అల్లరిగా నవ్వుతూ.

"ఒరేయ్ పోరా ముందిక్కడినుండి. డాక్టర్‌గారు పెద్దమ్మని డిస్టర్బ్ చేయవద్దని చెబుతూ ఉంటే ఇప్పుడు కూడా నీ అల్లరి మాటలు మానవన్నమాట" అంది కమల మందలిస్తున్నట్లుగా.

"వాడన్నది నిజమే కదా ఎందుకు కమలా వాడిని తిడతావు?" అంది జానకి మెల్లగా నవ్వుతూ.

"ఆహా, తమరు మాత్రం ఏం తక్కువ తిన్నారట. పెద్దమ్మగారిని థియేటర్‌కి తీసుకువెళ్ళేముందు తమరు ఎంత హడలగొట్టారో అందరికీ తెలుసు" అన్నాడు శశికిరణ్,క్ కమల భుజాల మీద చేతులువేసి.

"పాపం అమ్మనేమీ అనకురా. తను నాకోసమే అలా బెదిరిస్తూ మాట్లాడింది" అంది జానకి ప్రేమగా కమల వంక చూస్తూ.

"అమ్మో, మీ ఇద్దరితో పెట్టుకుంటే నా పని ఔటే. ఇంతకీ రమ్య ఎక్కడికి వెళ్ళినట్లు ఉదయం నుండీ కనబడలేదు" అన్నాడు శశికిరణ్.

"పెద్దమ్మ కోసం మొక్కుకుందట. ఆపరేషన్ సక్సెస్ అయితే అర్చన చేయిస్తానని. అందుకని పాత పోస్టాఫీసు దగ్గరున్న వెంకటేశ్వర స్వామి గుడికి వెళ్ళింది" అంది కమల.

"ఒక్కతే వెళ్ళిందా అంత దూరం. చెపితే నేను కూడా వెళ్ళేవాడిని కదా సాయంగా" అన్నాడు శశికిరణ్.

"వెంట ఆ హారిక కూడా వెళ్ళినట్లుంది" అంది కమల హారిక పేరు ఉచ్చరించడం ఇష్టంలేనట్లుగా ముఖం చిట్లిస్తూ.

"ఓహో" అంటూ తల పంకించి జానకి వైపు తిరిగి "పెద్దమ్మా, రేపు నేను బెంగుళూరు వెళ్దామనుకుంటున్నాను" అన్నాడు.

"అప్పుడేనా?" అంది జానకి ఆరాటంగా చూస్తూ.

"ఇప్పటికే చాలా రోజులు సెలవు పెట్టేశాను పెద్దమ్మా. ఇంకా పెడితే బాగుండదు. వీలు చూసుకుని మళ్ళీ వస్తాను" అన్నాడు శశికిరణ్ అనునయంగా.

"సరే తప్పదు కదా, వెళ్ళిరా" అంది జానకి అయిష్టంగానే.

"మమ్మీ, డాడీ నువ్వు హాస్పటల్ నుండి డిశ్చార్జి అయ్యేవరకూ ఇక్కడే ఉంటారు. మధ్య మధ్యలో ఫోన్ చేస్తూ ఉంటాను. నువ్వు అలా దిగులుగా ఉంటే కాలు కదపలేను" అన్నాడు.

"అదేం లేదులే, వెళ్ళిరా" అంది జానకి నవ్వేస్తూ.

"శశీ, అమ్మమ్మని చూడాలని ఉందన్నావు కదా ఒకసారి విజయనగరం వెళ్ళి రాకూడదు?" అంది కమల.

"ఇప్పుడా? ఇప్పుడు కుదరదులే అమ్మా ఈసారి వచ్చినప్పుడు వెల్తానులే" అన్నాడు శశికిరణ్.

"ఎప్పటికప్పుడు అలాగే అవుతుందిలేరా. ఇన్ని రోజులు సెలవు పెట్టావు. మరోరోజు సెలవు పెడితే ఏమీ అయిపోదులే" అంది కమల.

"అలా అంటావా? సరే అయితే ఈ రోజు వెళ్ళి వచ్చేస్తాను" అన్నాడు శశికిరణ్.

ఇంతలో రమ్యా, హారికా గుడి నుండి వచ్చారు. వస్తూనే రమ్య కుంకుమ తీసి తల్లి నుదుట బొట్టు పెట్టింది. జానకి ఆప్యాయంగా కూతురు చేతిని చెంపకి ఆనించుకుంది.

"ఇప్పుడెలా ఉంది అత్తా?" అంటూ పరామర్శించింది హారిక ఆత్మీయంగా.

"బాగానే ఉందమ్మా. నాకోసం మీరిద్దరూ ఉదయాన్నే శ్రమపడి అంత దూరం వెళ్ళారా?" అంది జానకి.

"శ్రమేముంది అత్తా ఇందులో?" అంటూ నవ్వేసింది హారిక.

"అమ్మా మేము గుడికి వెళ్ళి వస్తూంటే దారిలో బండి స్లిప్ అయి ఇద్దరం పడ్డాము. పాపం హారిక మోకాలు, పాదం చెక్కుకు పోయాయి" అంది రమ్య.

"అయ్యో, ఎంత పనైందమ్మా. అసలంత దూరం బండిమీద ఎందుకు వెళ్ళారు. బస్సులో వెళ్ళక" అంది జానకి ఆదుర్దాగా.

"రమ్య చెప్పినంత పెద్దగా ఏం తగల్లేదత్తా. ఊరికే గీసుకుంది. నువ్వేం హైరానా పడకు" అంది హారిక.

హారికకు దెబ్బ తగిలిందని వినగానే శశికిరణ్ ఆదుర్దాగా చూశాడు. "దెబ్బ చిన్నదైనా, టి.టి ఇంజెక్షన్ చేయించుకుంటే మంచిది. ఉండండి, ఇంజెక్షన్ తెస్తాను" అంటూ హడావిడిగా వెళ్ళిపోయాడు.

హారిక ఏదో చెపుదామని నోరు తెరిచేలోగా అతడు రూమ్‌లోనుండి వెళ్ళిపోయాడు. ఆ క్షణంలో అతడికి తల్లి ఏమైనా అనుకుంటుంది అనే ఆలోచన కూడా రాలేదు. తనకెంతో ఇష్టమైన హారికకు దెబ్బ తగిలిందనే బాధ తప్ప. అందుకే అలా వెళ్ళిపోయాడు.

ఈ పిల్లకు దెబ్బ తగిలితే వీడికెందుకు అంత కంగారు? అనుకుంది కమల విసుగ్గా చూస్తూ.

అయిదు నిమిషాల్లో ఇంజెక్షన్ తెచ్చి బలవంతాన హారికను తీసుకెళ్ళి నర్స్‌తో ఇంజెక్షన్ చేయించాడు.

**అతడు తన** పట్ల చూపించిన కన్సెర్న్‌కు హారిక ఆశ్చర్యపోయింది.

పేరుకు వాళ్ళిద్దరూ బావామరదళ్ళే అయినా, నెల రోజుల క్రితం వరకు కమ్యూనికేషన్స్ లేవు. పైగా గతంలో అతడు తల్లిచాటు బిడ్డగానే తెలుసు హారికకు. అందుకే అతడంటే ఒక విధమైన తేలికభావం కూడా. కానీ నెలరోజులుగా ఇంట్లో అందరితోనూ అతను మెలుగుతున్న తీరు చూశాక మెల్లమెల్లగా అతడంటే ఉన్న వ్యతిరేకభావం తొలిగిపోసాగింది.

ముఖ్యంగా జానకి పట్ల బాధ్యతగా అతడు వ్యవహరించిన తీరు హారికకు ఎంతో నచ్చింది. ఆ పైన అతడు తాము కైలాసగిరి వెళ్ళినప్పుడు ఏ మాత్రం పోజు కొట్టకుండా తమతో ఆత్మీయంగా మెలిగిన తీరు. ఇప్పుడు తనకి దెబ్బ తగిలితే

అతడు పడిన ఆరాటం శశికిరణ్ పట్ల హారిక మనసులో ఒక సాఫ్ట్ కార్నర్ ఏర్పడేలా చేసింది. అభిమానంగా అతనివంక కొన్ని క్షణాలు అలా చూస్తూండిపోయింది.

గేటు తీసుకుని లోపలికి వస్తున్న శశికిరణ్‌ని సావిత్రమ్మ కళ్ళు చిట్లించి చూస్తూ బయటకు వచ్చింది. వస్తోంది ఎవరా అని.

తనకి ఎదురుగా వచ్చిన సావిత్రమ్మతో "ఏంటమ్మమ్మా అలా చూస్తావు. నన్ను గుర్తుపట్టలేదా?" అంటూ చేతిలోని బేగ్ క్రింద పెట్టి ఆమెను రెండు చేతులతోనూ చుట్టేశాడు.

"శశీ, నువ్వేనట్రా? ఎన్నాళ్ళయిందిరా నిన్ను చూసి?" అంటూ మనవడిని హృదయానికి హత్తుకుంది సావిత్రమ్మ.

"శశీ, ఎన్నాళ్ళయిందిరా నిన్ను చూసి అని అంగలార్చకపోతే ఒకసారి బెంగుళూరు రావచ్చు కదా" అంటూ పండిన తమలపాకులా ఉన్న ఆమె చెంపలమీద మృదువుగా రెండు చేతులతో తట్టాడు శశికిరణ్.

"ఇంత పెద్దాడివైనా నీ అల్లరేం మారలేదురా. ఓపిక ఉన్నన్నాళ్ళూ వచ్చిపోతూనే ఉన్నాను కదా! ఇప్పుడు ఓపిక తగ్గిపోయింది. చూపు సరిగా ఆనదు. ఎలా రాను? అమ్మాయ్, దమయంతీ ఎవరొచ్చారో చూడు" అంటూ కోడల్ని కేకేసింది సావిత్రమ్మ.

"ఎవరత్తయ్యా?" అంటూ లోపల్నుండి వచ్చిన దమయంతి మేనల్లుడ్ని చూడడంతోనే, "బాగున్నావా శశీ.. ఎన్నాళ్ళకు దయకలిగింది మామీద" అంది నవ్వుతూ.

"ఇక్కడికి రావాలనీ, మీ అందర్నీ చూడాలనీ నాకూ ఉంటుందత్తా. కానీ వచ్చేందుకు వీలు కుదరలేదు అంతే. ఇప్పుడైన పెద్దమ్మగారికి బాగోలేదు కనుక ఇలా వచ్చాను" అన్నాడు శశికిరణ్.

"అవును, మొన్న అమ్మ వచ్చినప్పుడు చెప్పింది. ఆపరేషన్ అయిందా? ఎలా ఉన్నారు? ఇవాళో, రేపో మేమూ వద్దామనుకుంటున్నాము చూసేందుకు" అంది దమయంతి.

"ఆపరేషన్ అయిందత్తా. ఇప్పుడు బాగానే వుంది. మావయ్యా, పవన్ ఎలా ఉన్నారు?" అనడిగాడు శశికిరణ్ లోపలకి వచ్చి కూర్చుంటూ.

ఆ మాటలకు జవాబేమీ ఇవ్వకుండా "ఉండు మంచినీళ్ళు తెస్తాను" అంటూ లోపలికి వెళ్ళిపోయింది దమయంతి.

"అదేమిటి అమ్మమ్మా, మావయ్యగూర్చీ, పవన్ గూర్చి అడిగితే జవాబేమీ ఇవ్వకుండా అత్తయ్య అలాగ వెళ్ళిపోయింది" అన్నాడు శశికిరణ్ ఆశ్చర్యంగా.

"మీ మావయ్యకేంరా, బాగానే ఉన్నాడు. వాళ్ళ దిగులంతా ఆ పవన్‌గాడి గూర్చే. ఒక్కడే కొడుకని ఎంతో గారాబంగా పెంచారు. ఆ గారాబమే ఇవ్వాళ మా కొంప ముంచింది. చదువు, సంధ్యా అంటకుండా ఎందుకూ పనికిరాకుండా తయారయ్యాడు. నువ్వు చూడు, చక్కగా చదువుకుని ఉద్యోగం చేస్తున్నావు. వాడు నీకంటే ఏడాది పెద్దవాడైనా ఏ మాత్రం కుదురులేక ఇలా తయారయ్యాడు.

ఎంతసేపూ ఆ ఫ్రెండ్స్‌తో కలిసి చీట్ల పేక ఆడుతూ ఊరిమీద పడి బలాదూర్ తిరుగుతూ ఉంటాడు. ఇంటికి ఎప్పుడు వస్తాడో, బయటకు ఎప్పుడు పోతాడో తెలియదు. పోనీ ఒక పని చెయ్యకూడదురా వాడిని నీ వెంట తీసుకువెళ్ళి ఏదో దారి కల్పించరా?'' అందిస్తూ.

''అదేంటత్తా అలా అంటావు? నేనేం పరాయివాడినా? మీ కష్టసుఖాలు నావి కావా?'' అన్నాడు అభిమానంగా.

''అలా అని కాదులే బాబూ. మా దురదృష్టానికి ఎవరేం చేస్తారు? చేతులారా చేసుకున్నందుకు అనుభవించ తప్పదు'' అంది దమయంతి నిర్లిప్తంగా.

''అనవసరంగా బాధపడకు అత్తా, ఊరుకో'' అన్నాడు శశికిరణ్ ఓదార్పుగా.

''అత్తయ్యగారు అన్నట్లు వాడిని ఈ ఊరు నుండి. ఆ పాడు స్నేహితుల నుండి దూరంగా తీసుకుపోతే తప్ప బాగుపడడేమో బాబూ. వాడిని నీతో తీసుకుపోయి ఏదో దారి చూపించి పుణ్యం కట్టుకో'' అంది.

''ఎందుకత్తా అంత దీనంగా మాట్లాడతావు? పవన్ సంగతి నాకు వదిలేసి మీరంతా నిశ్చింతగా ఉండండి. వాడి సంగతి నేను చూసుకుంటాను'' అన్నాడు శశికిరణ్.

''నువ్వలా అంటూంటే వాడిప్పుడే బాగుపడినంత ఆనందంగా ఉంది బాబూ నాకు. మనకి తినడానికీ, ఉండడానికీ ఏ లోటూ లేదు. కూర్చుని తింటే కొండలైనా కరిగిపోతాయన్న సామెత ఉంది కదా. అందుకే మీ మావయ్య అంత ఆస్తి ఉన్నా కష్టపడి చదివి, ఉద్యోగం సంపాదించుకుని నలుగురిలో గౌరవంగా బ్రతుకుతున్నారు. మా దిగులంతా పవన్ గూర్చే. రేపు మేం పోయాక వాడి భవిష్యత్ ఏమిటని? పెళ్ళి చేస్తే బాధ్యత తెలిసి బాగుపడతాడు అంటారు అత్తయ్య. తాదూర సందులేదు మెడకో డోలా అన్నట్లు పెళ్ళిచేసి ఆ వచ్చే పిల్లని క్షోభ పెట్టడం ఎందుకు అంటారు మీ మావయ్య. ఎవరికీ ఏమీ చెప్పలేక మధ్యలో సతమతమైపోతున్నాను నేను'' అంది దమయంతి.

''మావయ్య అన్నది కరెక్టే అత్తా. పవన్సమస్యకు పెళ్ళికాదు పరిష్కారమ్మందు వాడిని జీవితంలో స్థిరపడేలా చూడాలి. ఆ తరువాతే ఏదైనా'' అన్నాడు శశికిరణ్.

''మీ మావయ్యను ఊళ్ళో వాళ్ళందరూ ఎంతో గౌరవిస్తారు. అలాంటివాడికి ఇలాంటివాడు ఎలా పుట్టాడని అంటున్నారంతా. మొన్న మీ అమ్మ వచ్చినప్పుడు వాడిని దగ్గర కూర్చోపెట్టుకుని చిలక్కి చెప్పినట్లు చెప్పింది. తను చెప్పినంతసేపూ బుద్ధిమంతుడిలా అన్నిటికీ తల ఊపాడు. మీ అమ్మ అటు వెళ్ళగానే వాడిటు చీట్ల పేకకు పోయాడు. మీ అత్త నెత్తికొట్టుకుని ఒకటే ఏడుపు'' అంది సావిత్రమ్మ జాలిగా కోడలి వైపు చూస్తూ.

''పేరుకు మనది పెద్ద జమిందారీ వంశం. ఆనాటి ఆస్తులూ, దర్జాలూ ఈనాడు లేవు. కరి మింగిన వెలగపండులా అన్నీ మటుమాయమయ్యాయి. నిత్యం తన చుట్టూ చేరే వందిమాగధులను మీ మావయ్య దూరంగా ఉంచారు కనుకే ఈ మాత్రమైనా మిగిలి ఉన్నాము. కానీ వీడు అలాంటి భజంత్రీగాళ్ళనందర్నీ పోగేసి వాళ్ళ మెరమెచ్చుల కోసం ఖర్చు చేస్తూ ఎందుకూ కొరగాకుండా ఇలా తయారయ్యాడు'' అంది దమయంతి.

''సరే అత్తా, ఇక అవన్నీ నేను చూసుకుంటాను. నాకు బాగా ఆకలేస్తోంది, తినడానికి ఏమైనా పెట్టు'' అన్నాడు శశికిరణ్ మాట మారుస్తూ.

ఆ మాట వింటూనే దిగ్గున లేచింది దమయంతి. "అయ్యో నా మతిమండా వచ్చిన వాడీని వచ్చినట్లే కూర్చోబెట్టి నా సోదంతా వెళ్ళబోశాను. ఉండు, ఇప్పుడే వస్తాను" అంటూ గబగబా లోపలికి వెళ్ళింది.

"పాపం అత్త చాలా దిగులుపడిపోయినట్లు ఉంది కద అమ్మమ్మా" అన్నాడు ఆమె వెళ్ళిన వంకే చూస్తూ.

"అవున్రా, పగలూ రాత్రీ అదే ధ్యాస అయిపోయింది మీ అత్తకి" అని సావిత్రమ్మ అంటూండగా దమయంతి కజ్జికాయలూ, కారప్పుసా ఉన్న ప్లేటు తెచ్చి అతడి ముందు పెట్టి "తిను బాబూ" అంది. అవి తింటూ సరదాగా ఏవేవో కబుర్లు చెప్పి వాళ్ళను నవ్వించాడు.

వాళ్ళు మాటల్లో ఉండగానే మాధవరావు బ్యాంకు నుండి వచ్చాడు. మేనమామను చూడడంతోనే గౌరవంగా లేచి నుంచున్నాడు శశికిరణ్.

"ఏరా, ఎప్పుడొచ్చావు. అంతా కులాసానా?" అంటూ ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చుని కళ్ళు మూసుకున్నాడు మాధవరావు.

అతడికి మంచినీళ్ళు తెచ్చి ఇస్తూ "ఏమిటండీ అలా ఉన్నారు?" అని అడిగింది దమయంతి.

"రాత్రి మన సుపుత్రుడు బార్‌లో తన ఫ్రెండ్స్‌తో తప్పతాగి తందనాలాడి నానా అల్లరీ చేశాడట. బిల్లు కట్టమని అడిగిన ఓనర్‌ని కొట్టినంత పని చేశాడట. అతడు బ్యాంకుకు వచ్చి అందరి ముందూ పిల్లల్ని కనగానే సరిగాదు, వాళ్ళని సక్రమంగా పెంచాలి. అంటూ నోటికొచ్చినట్లు మాట్లాడాడు. నలుగురిలో తలెత్తుకోలేకపోయాను ఈవేళ" అన్నాడు మాధవరావు బాధగా.

"మనకీ వేళ కొత్తేముంది? ఈ దరిద్రుడు కొంపమీదకి రోజూ ఏదో ఒకటి తెస్తూనే ఉన్నాడుగా" అంది దమయంతి.

"ఇక నావల్లకాదు దమయంతీ. రానీ వాడిని. ఇవాళ అటో ఇటో తేలిపోవాలి, అంతే" అన్నాడు మాధవరావు కోపంగా.

"సారీ మావయ్యా, మధ్యలో నేను జోక్యం చేసుకుంటున్నానని అనుకోకపోతే ఒక మాట. వాడిని ఈ ఊరునుండి, ఈ స్నేహితుల నుండీ దూరం చేస్తే బాగుంటుందనిపిస్తుంది నాకు" అన్నాడు శశికిరణ్.

"ఏమోరా, నాకేం హోప్ లేదు వాడిమీద. పూర్తిగా చెడిపోయాడు వాడు" అన్నాడు విరక్తిగా.

"అలా అనకండి మావయ్యా. నేను చిన్నవాడిని. మీకు చెప్పేటంతటి వాడిని కాను నాకు తెలిస్నంతవరకూ పవన్ చెడ్డవాడేమీ కాదు. వాడి చుట్టూ చేరిన స్నేహ బృందం వాళ్ళ అవసరాలు గడుపుకునేందుకు వాడిని ఇలా తయారు చేశారు. మనం కూడ్ చూస్తూ వదిలేస్తే వాడెందుకూ పనికి రాకుండా పోతాడు. దీనికి విరుగుడు ఒక్కటే. వీడిని ఈ పరిసరాల నుండి దూరం చేయాలి" అన్నాడు శశికిరణ్.

"ఆ పని చెయ్యి నాయనా తీసుకుపోయి వాడికి చిన్నదో పెద్దదో ఏదో ఉద్యోగం చూడు" అంది సావిత్రమ్మ.

"వీడికున్న క్వాలిఫికేషన్ ఎవడిస్తాడమ్మా ఉద్యోగం?" అన్నాడు మాధవరావు కోపంగా.

"అవును మావయ్యా, మీరన్నది కరెక్టే. వాడి క్వాలిఫికేషన్‌కి ఏ ఉద్యోగమూ రాదు. ఎలాగూ డిగ్రీ చేశాడు కనుక యం.బి.ఏ చేయిద్దాం ఆ పైన ఏదైనా కంప్యూటర్ కోర్సు కూడా చేయిస్తే మంచి అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయి" అన్నాడు శశికిరణ్.

"అలా జరిగితే మంచిదే కానీ వాడు నీతో ఈ గేంగ్‌ని వదిలి వస్తాడంటావా?" అన్నాడు మాధవరావు సందేహంగా.

"వస్తాడు మావయ్యా, వాడిని నేను ఒప్పిస్తాను" అన్నాడు శశికిరణ్.

"సరే చూడు, వాడు బాగుపడడం కంటే కావలసిందేముంది మాకు. డబ్బులు ఎంత కావాలో చెపితే ఇస్తాను" అన్నాడు మాధవరావు స్థిమితపడినట్లుగా.

రాత్రి తొమ్మిదిన్నరకి ఇంటికి వచ్చాడు పవన్ "కెవ్వు కేక" అని పాడుకుంటూ.

ఎదురుగా సోఫాలో కూర్చున్న శశికిరణ్‌కనపడడంతోనే "ఏరా నువ్వెప్పుడొచ్చావు?" అంటూ అతడి పక్కన వచ్చి కూర్చున్నాడు.

"సాయంత్రం వచ్చాలే నువ్వేంటి ఇప్పుడొచ్చావు? ఎక్కడికి వెళ్ళావేంటి?" అనడిగాడు శశికిరణ్.

"ఒరే బావా, ఈ ఎగ్స్ట్రా డైలాగులు వద్దు. ఈసరికి మనోళ్ళంతా నా గురించి సినిమా కథలా మొత్తం చెప్పేసి ఉంటారు. నేను మొత్తం చెడిపోయాను. ఇంక బాగుపడను. అమ్మా, అన్నం పెట్టు" అన్నాడు తల్లి ఉన్నవైపు చూస్తూ.

అతడికి తాను చేస్తున్నది కరెక్టు కాదని తెలుస్తూనే ఉన్నా. దాన్నుండి ఎలా బయటపడాలో ఏం చేయాలో తెలియక. ఊబిలో కూరుకుపోయినట్లుగా ఆ ఆవారాగాళ్ళతో కాలక్షేపం చేస్తూ అదేమని అడిగిన తల్లిదండ్రుల మీద అంతెత్తున ఎగురుతూ గడిపేస్తున్నాడు. అందుకే అవసరం ఉన్నా లేకపోయినా, తాను చేస్తున్న తప్పును కప్పి పుచ్చుకునేందుకు అలా కేకలేస్తూ ఉంటాడు.

"ఎందుకురా అలా అరుస్తావు? ఊరూవాడా వినేలా. పెడతాను, బట్టలు మార్చుకుని, కాళ్ళూ చేతులూ కడుక్కుని రా" అంది దమయంతి.

"మొదలెట్టావా సుత్తి. ఏం అక్కరలేదుగానీ, ముందు అన్నం పెట్టు" అన్నాడు పవన్ డైనింగ్ టేబుల్ ముందు కూర్చుంటూ.

"వాడిని కూడా రమ్మను. ఇప్పటి వరకూ నీకోసమే కాచుకుని కూర్చున్నాడు" అంది దమయంతి.

ఆ మాటలు వినడంతోనే పవన్‌లో కొంచెం చలనం వచ్చింది.

"ఏరా నాకోసం ఉండిపోయావా? రా..రా" అంటూ చేయి పట్టుకుని తీసుకుని వెళ్ళి పక్కన కూర్చోబెట్టుకున్నాడు. అతని గొంతులో ముందు లేని మార్దవం వినిపించింది శశికిరణ్‌కి.

అన్నం తింటూ సరదాగా కబుర్లు చెప్పుకున్నారు ఇద్దరు. మాటల మధ్యలో అడిగాడు శశికిరణ్, "ఏం చేస్తున్నావురా ఇప్పుడు?" అని.

"ఏం చేస్తానురా ఖాళీగానే ఉన్నాను. నా క్వాలిఫికేషన్‌కి ఎవడిస్తాడు ఉద్యోగం? మహా మహా వాళ్ళే రోడ్లు కొలుస్తూ వుంటే ఏదో అలా ఫ్రెండ్స్‌తో కాలక్షేపం చేస్తున్నాను. నాకో రెండు లక్షలు ఇవ్వండి, బిజినెస్ చేసుకుంటాను. అంటే మా నాన్న ఇవ్వడంలేదు" అన్నాడు పవన్ నిష్ఠూరంగా తల్లి వంక చూస్తూ.

"ఎలా ఇస్తారు రా ఇలా అడిగిందల్లా నీకు ఇవ్వబట్టే ఇలా తయారయింది నీ పరిస్థితి. పనీపాటా లేని ఆ జులాయి మూక ఆ డబ్బు అయిపోయేదాకా నీ చుట్టూ తిరుగుతారు. అదయ్యాక నీ ముఖమే చూడరు. అయినా నీకు బుద్ధి రాదు" అంది బాధగా దమయంతి.

"ఇంక ఆపు నీ సొద. ఎప్పుడు చూసినా అరిగిపోయిన గ్రామఫోన్ రికార్డులా ఒకటే సొద. అందుకే ఇంటికి రాబుద్ధి కాదు నాకు" అంటూ తినే కంచంలో చెయ్యి కడిగేసుకున్నాడు పవన్.

"అరే పవన్, ఏంట్రా నువ్వు చేసిన పని? ఇప్పుడు అత్తయ్య ఏమందని, తింటున్న అన్నంలో చెయ్యి కడిగావు?" అంటూ చెయ్యి పట్టి లాగి పక్కన కూర్చోబెట్టుకుని "అత్తా, మరో ప్లేటు తీసుకురా" అన్నాడు శశికిరణ్.

"రోజూ ఇదే వరస నాయనా.. తన ధోరణి తనదే తప్ప మా మాట వినిపించుకోడు" అంది కళ్ళు తుడుచుకుంటూ.

"చూడు అత్త ఎంత బాధపడుతోందో ఎందుకురా బంగారంలాంటి నీ జీవితాన్ని పాడుచేసుకుని అందర్నీ బాధపెడతావు?" అన్నాడు శశికిరణ్ జాలిగా చూస్తూ.

"ఏదో అలా అయిపోయింది. ఇప్పుడేమనుకుని ఏం లాభం?" అన్నాడు పవన్ నిర్లిప్తంగా.

"ఏదో జీవితం అంతా ముగిసిపోయినట్లు ఏమిటిరా ఆ మాటలు? బాగు పడాలనే తపన నీలో ఉంటేచాలు. అన్నీ అవే చక్కబడతాయి. నువ్వు నాతో బెంగుళూరు రాకూడదూ? అక్కడ మంచి ఆపర్చ్యూనిటీస్ ఉన్నాయి" అన్నాడు శశికిరణ్ ఊరిస్తున్నట్లుగా.

"అసలే అత్తెసరుగాడిని. అక్కడికొచ్చి ఏం చేస్తానురా? కనీసం పట్టుమని నాలుగు ఇంగ్లీషు ముక్కలు కూడా మాట్లాడలేను. నాకెవరూ ఇస్తారు ఉద్యోగం?" అన్నాడు పవన్ నిరాశగా.

"పోనీ ముందు ఏదైనా కోర్సులో చేరి నీ క్వాలిఫికేషన్ పెంచుకుంటే ఆ తర్వాత ఉద్యోగం అదే వస్తుంది" అన్నాడు శశికిరణ్.

ఇప్పుడు ఈ వయసులో నాకు చదువేంటి? అసలు నేను చదవగలనా?" అన్నాడు పవన్ అనుమానంగా.

"ఏరా, ఎంతరా నీ వయసు? ఇరవై ఆరేళ్ళుగా? ఇది కూడా ఒక వయసేనా? మా పెద్దమ్మగారు నలభై ఏళ్ళు వచ్చాక ఎం.ఏ లిటరేచర్ చేశారు తెలుసా? సంకల్ప బలం ఉంటే సాధించలేనిది ఏదీ లేదు. స్ట్రెంత్ ఈజ్ లైఫ్ వీక్‌నెస్ ఈజ్ డెత్ అంటారు పెద్దలు. కనుక ఓ ప్రయత్నం చేద్దాం. ఇంకేం మాట్లాడకుండా రేపు నావెంట బయలుదేరు" అన్నాడు శశికిరణ్.

"ఇప్పుడా, ఇంత హఠాత్తుగానా? ఓ రెండు రోజులాగి బయలుదేరుదాం" అన్నాడు పవన్.

"నథింగ్ డూయింగ్ రేపు నువ్వు నావెంట వస్తున్నావంతే" అన్నాడు శశికిరణ్ నిశ్చయంగా.

ఆ క్షణంలో అతడు మాట్లాడిన మాటల్లో ఏ మహత్తు ఉందో పవన్ కాదనలేకపోయాడు. అతడికీ అంతరాంతరాల్లో బాగుపడాలని, అందరి దగ్గరా మన్ననలు పొందాలనే కోరిక బలీయంగా ఉండడంతో మార్పు దిశగా అతడి అడుగులు పడ్డాయి.

పవన్ ఫ్రెండ్స్‌తో ఎటువంటి కనెక్షన్స్ ఉండగూడదనే ఉద్దేశ్యంతో అతడు వాడుతున్న సెల్ కూడా విజయనగరంలోనే వదిలేసేలా చేశాడు మాధవరావు.

మర్నాడు కొత్త జీవితాన్ని వెదుక్కుంటూ శశికిరణ్ వెంట నడిచాడు పవన్.

తమ కొడుకు జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని ఎంతో సంతోషించారు మాధవరావు దంపతులు.

తన కొడుకుతోపాటు మేనల్లుడు రావడం చూసి కమల ఎంతో సంతోషించింది. కొడుకు ద్వారా విషయం అంతా విన్న కమల అతడి నిర్ణయాన్ని ఎంతో అభినందించింది.

శశికిరణ్ ప్రయాణ సన్నాహాలు చేస్తూండడం చూసి ''నిజంగానే వెళ్తున్నావా అన్నయ్యా?'' అనడిగింది రమ్య జాలిగా చూస్తూ.

''వెళ్ళాలమ్మా తప్పదు. పవన్ బావని తీసుకొచ్చానుగా, అతని సంగతి చూడాలి. పరీక్షలయ్యాక హారికా, నువ్వూ కలిసి బెంగుళూరు రండి. కలిసి సరదాగా స్పెండ్ చేద్దాం'' అన్నాడు శశికిరణ్.

''నేను రావడానికి రెడీయేగానీ, హారిక వస్తుందో, రాదో అన్నయ్యా ఒక్కసారి నువ్వు మాట్లాడు తనతో'' అంది రమ్య.

''మొన్న చెప్పాను కదా మళ్ళీ చెప్పాలంటావా? సరే, ఫోన్ చేసి చెపుతానులే'' అన్నాడు.

''ఫోన్ చేస్తే బావుండదేమో అన్నయ్యా ఒకసారి నువ్వే వెళ్ళి మాట్లాడి రాకూడదూ? అత్తయ్యా, మావయ్యలకి కూడా ఒకమాట చెప్పినట్లు ఉంటుంది'' అంది రమ్య సలహా ఇస్తున్నట్లు.

చెల్లెలి మాటలు విని కొంచెం ఆలోచనలో పడ్డాడు శశికిరణ్. ''సరే, వెళ్ళి కలుస్తాను. నువ్వూ రాకూడదూ నాతో'' అన్నాడు.

''సారీ అన్నయ్యా పిన్ని హాస్పటల్‌లో అమ్మకి సాయంగా ఉంది కదా. వదిన ఒక్కతే పనిచేసుకోలేదని ఈ నాలుగురోజులూ కాలేజీకి కూడా వెళ్ళడం మానేశాను'' అంది రమ్య.

''సరేలే, నేనే వెళ్తాను'' అంటూ బయలుదేరాడు.

అతడు వెళ్ళేసరికి హారిక ఇంట్లో లేదు. లైబ్రరీకి వెళ్ళిందని ఇందిర చెప్పింది.

''సరే అత్తా, నేను రేపు బెంగుళూరు వెళ్ళిపోతున్నాను. చెప్పి వెళ్దామని వచ్చాను. రేపు శెలవుల్లో రమ్యానూ, హారికనూ బెంగుళూరు రమ్మని చెప్పాను. ఆ మాట మీతో కూడా చెప్దామని వచ్చాను'' అన్నాడు శశికిరణ్.

''దానికేం భాగ్యం. అది వస్తాననాలేగానీ, మీ మావయ్యకు గానీ, నాకు గానీ ఎటువంటి అభ్యంతరమూ లేదు. ఎందుకైనా మంచిది,దానితో కూడా ఒక మాట చెప్పు. లైబ్రరీ ఇక్కడికి దగ్గరే. వెళ్ళి మాట్లాడు'' అంది ఇందిర.

''సరే అత్తా, వెళ్ళొస్తాను. మావయ్య వచ్చాక చెప్పు'' అంటూ లేచాడు శశికిరణ్.

అతడికి కూడా హారికతో ఒంటరిగా మాట్లాడాలని ఆశగా ఉంది. అది ఇలా నెరవేరినందుకు అతడి మనసు ఆనందంతో గంతులు వేసింది.

లైబ్రరీ హాలంతా ఎంతో నిశ్శబ్దంగా ఉంది. ఎవరి మానాన వారు ప్రశాంతంగా కూర్చుని చదువుకుంటున్నారు. హారిక ఒక కార్నర్ సీటులో కూర్చుని ప్రపంచంతో ఏమీ సంబంధం లేనట్లుగా ఏకాగ్రతతో చదువుతోంది.

మెల్లగా వెళ్ళి హారిక ముందు నుంచున్నాడు శశికిఅణ్. తన ముందు ఎవరో నుంచున్నట్లు అనిపించి తలెత్తి చూసింది హారిక. ఎదురుగా శశికిరణ్ కనిపించడంతో ఆమె కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి.

''బావా! నువ్వేంటి ఇక్కడకు వచ్చావు?'' అనడిగింది.

"అత్త చెప్పింది నువ్వు ఇక్కడ ఉంటావని. అందుకే వెతుక్కుంటూ వచ్చాను" అన్నాడు శశికిరణ్ అక్కడున్న కుర్చీలో కూర్చోబోతూ.

ఇబ్బందిగా చుట్టూ చూస్తూ "ఇక్కడ మాట్లాడుకుంటే అంత బావుండదు. పద బైటికి వెళ్దాం" అంటూ పుస్తకం మూసి బేగ్‌లో పెట్టుకుని బయటకు నడిచింది హారిక.

హాల్లోంచి బైటకు వచ్చాక దూరంగా కనిపిస్తున్న మామిడి చెట్టు వంక చూపుతూ, "అక్కడ కూచుందామా?" అనడిగింది హారిక.

"సరే పద" అంటూ అటు దారితీశాడు శశికిరణ్. ఇద్దరూ వెళ్ళి మామిడి చెట్టు చుట్టూ కట్టిన గట్టుమీద ఉన్న దుమ్ము దులిపి కూర్చున్నారు.

దూరంగా వున్న కాలేజీ బిల్డింగ్ వంక చూస్తూ కూర్చున్నాడు శశికిరణ్.

"ఏంటి బావా, ఏదైనా చెప్పాలనుకుంటున్నావా నువ్వు నాతో?" అనడిగింది హారిక.

ఇక్కడికి రాక ముందు హారికతో ఎన్నో మాట్లాడాలని మనసులోనే రిహార్సల్స్ వేసుకున్నాడు. తీరా ఇప్పుడు ఇక్కడికి వచ్చాక. కోరుకుంటున్న ఒంటరితనం దొరికాక అతడి నోటి నుండి మాటే రాలేదు. గుండె గొంతుకలోకి వచ్చినట్లయింది అతని పరిస్థితి.

హారిక పలకరింపుతో ఈ లోకానికి వచ్చిన శశికిరణ్, మాట్లాడకపోతే బాగుండదన్నట్లుగా నోరు విప్పాడు.

"అదే మొన్న కైలాసగిరి వెళ్ళినప్పుడు చెప్పానుకదా. ఈ సెలవుల్లో రమ్యనూ, నిన్నూ బెంగుళూరు రమ్మని ఆ మాట గుర్తుచేసి పోదామని వచ్చాను" అన్నాడు శశికిరణ్.

"ఓ, అదా నాకు రావడానికి కుదరదని అప్పుడే చెప్పాను కదా బావా. దానికోసం ప్రయాసపడి ఇంత దూరం వచ్చావా?" అంది హారిక నొచ్చుకుంటున్నట్లు.

"**అదంటే అదొక్కటే** కాదు, నీకెలా చెప్పాలో తెలియడంలేదు నాకు. ఎందుకనో నిన్ను చూసిన మొదటి క్షణంలోనే నా మనసు లయ తప్పినట్లయింది. నువ్వు కనుమరుగయితే చాలు మనసు నిన్నే చూడాలని ఆరాటపడుతోంది. ఎప్పుడూ, ఎవరిని చూసినా కలగని దగ్గరతనం, ఆత్మీయతా నిన్ను చూస్తే కలుగుతోంది. నువ్వు నా దగ్గర ఉంటే మనసుకు ఎంతో హాయిగా ఉంటుంది. టోటల్‌గా చెప్పాలంటే నీ సమక్షంలో లైఫ్‌లాంగ్ ఉండిపోవాలనిపిస్తోంది.

నేనంటే నీకు ఎలాంటి అభిప్రాయం ఉందో నాకు తెలియదు. నాకు మాత్రం మనది జన్మజన్మల అనుబంధం అనిపిస్తోంది. నీకిష్టమైతే మనం పెళ్ళి చేసుకుందాం హారికా" అన్నాడు శశికిరణ్ ఉద్వేగంగా.

అతడు ఇలాంటి ప్రపోజల్ ఏదో ఒకరోజు తన ముందు ఉంచుతాడని హారిక అనుకుంటూనే ఉంది, అతడు తన వైపు చూసే విధానాన్ని బట్టి. కానీ జవాబు ఏమని చెప్పాలో తోచలేదు హారికకు. కాసేపు ఏమీ మాట్లాడకుండా అతడి వైపు చూస్తూ ఉండిపోయింది మౌనంగా.

ఏ భావం వ్యక్తం కాకుండా తన వంకే అలా చూస్తున్న హారికను చూసిన అతడి గుండెలు అదిరాయి. ఎందుకలా చూస్తోంది, నేనంటే ఇష్టంలేదా? అనుకున్నాడు భయంగా.

"ప్లీజ్ హారికా దయచేసి 'నో' అని చెప్పకు. ఆలోచించుకునేందుకు టైమ్ కావాలంటే ఎంత టైమ్ అయినా తీసుకో. ఆన్సర్ మాత్రం పాజిటివ్‌గానే ఉండాలి" అన్నాడు అర్థిస్తున్నట్లుగా.

"బావా, ఊరికే టెన్షన్ పడకు. నేను చెప్పేది కొంచెం ప్రశాంతంగా విను. నాకు ఈ ప్రేమా, పెళ్ళీ వంటి వాటిమీద ఏ అభిప్రాయమూ లేదు. అలాగే నువ్వంటే ఇష్టంగానీ, అయిష్టంగానీ ఏమీ లేవు. కాకపోతే నాదృష్టంతా ప్రస్తుతం నా కెరీర్‌ని మలుచుకోవడం మీదే ఉంది. అదయ్యాకే ఏదైనా కనుక ఈ విషయాన్ని వదిలెయ్యి" అంది హారిక మృదువుగా.

హారిక మాటలు వింటూనే ఆశ్చర్యపోయాడు శశికిరణ్. హారిక నుండి ఇలాంటి సమాధానం వస్తుందని ఊహించలేదు అతడు. మాటలు రానట్లుగా మౌనం వహించాడు ఒక్క క్షణం.

"పోన్లే, ఇష్టం లేకపోయినా, అయిష్టం లేదు కదా నేనంటే అది చాలు నాకు. పెళ్ళయ్యాక నీ చదువుకు నేనెటువంటి ఆటంకమూ కలిగించను. బి.ఏ అయ్యాక యం.ఏ, అదయ్యాక పి.హెచ్.డి చేద్దువుగానీ, ఏదైనా నీ ఇష్టమే. నాకేం అభ్యంతరం లేదు. నువ్వు నాతో ఉంటే చాలు" అన్నాడు ఉద్వేగంగా.

ఆ మాటలు విని శశికిరణ్ వైపు జాలిగా చూసింది హారిక.

"నువ్వు అనుకుంటున్నట్లు నేను డిగ్రీ తరువాత ఎం.ఏ, పి.హెచ్.డిలు చేయాలనుకోవడం లేదు బావా, నేను సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాను. ఐ.ఏ.య్‌స్ కావాలనేది నా జీవితాశయం. అది సాధించాలంటే ఎంత కష్టపడాలో నీకూ తెలుసు. అందుకే రాత్రీ పగలూ కష్టపడుతున్నాన ఇప్పటి నుండీ. కనుక నాకు ప్రేమా, పెళ్ళి మీద ఎలాంటి ఆలోచనలూ లేవు. దయచేసి అర్థం చేసుకో" అంది హారిక.

ఆ మాటలు విని దిగ్భ్రమ చెందినట్లుగా హారిక వంక చూశాడు శశికిరణ్.

ఇన్ని రోజులూ హారిక చదువుకోవాలీ.. చదువుకోవాలీ అని అంటూంటే. బి.ఏ చదవడానికి కూడా ఇంత కష్టపడాలా అనుకున్నాడే గానీ, హారిక లక్ష్యం ఇదని ఏ మాత్రం ఊహించలేదు. అతడి ఫ్రెండ్స్ ఒకరిద్దరు ఐ.ఏ.యస్‌కి ఎలా ప్రిపేర్ అవుతున్నారో, ఎంత కష్టపడి చదువుతున్నారో అతడికి తెలియంది కాదు.

హారిక తన ప్రేమను త్రోసిపుచ్చినా ఆమె లక్ష్యం ఏమిటో విన్నాక అభినందించకుండా ఉండలేకపోయాడు.

"అడ్వాన్స్‌గా కంగ్రాట్యులేషన్స్ హారికా. ఇందులో నీవు తప్పక విజయం సాధించాలని మనసారా కోరుకుంటున్నాను. అయితే ఒక మాట. నీ లక్ష్యం విని నా ప్రపోజల్‌ని విత్‌డ్రా చేసుకుంటున్నానని అనుకోవద్దు. ఎన్నాళ్ళయినా, ఎన్నేళ్ళయినా నీకోసం ఎదురుచూస్తూనే ఉంటాను" అన్నాడు శశికిరణ్.

"ఎందుకు బావా వృధా ప్రయాస? అంతవరకూ ఆగి జీవితాన్ని వేస్టు చేసుకోకు. మన ఆలోచనలూ, జీవనగమ్యాలూ వేరు వేరు. నీకు అమెరికా వెళ్ళాలని ఉందని, లైఫ్‌ని లగ్జూరియస్‌గా ఎంజాయ్ చేయాలని ఉందని, మీ

మమ్మీ సుగుణక్కతో చెప్తూంటే విన్నాను. నాకు విలాసవంతమైన జీవితం మీద కానీ, విదేశాల్లో నివాసం మీద కానీ ఎలాంటి ఆశలూ, కోరికలూ లేవు. మనిద్దరివీ పరస్పర విరుద్ధమైన భావాలు. మనం కలిసి సహజీవనం ఎలా చేయగలం?

నాకేమో ఇండియా వదిలిపెట్టడం ఏ మాత్రం ఇష్టంలేదు. పావర్టీ లైన్‌కి కిందనున్న వాళ్ళకు నా చేతనైన సాయం చేయాలనేది నా ఆలోచన. అందుకే ఈ మార్గం ఎంచుకున్నాను. దయచేసి ఈ విషయాన్ని ఇక్కడితో వదిలెయ్యి'' అంది హారిక.

''నేను ఫారిన్ వెళాత్ననన్నమాట యదార్థమే కానీ, పర్మనెంట్‌గా అక్కడే ఉండిపోవాలనే ఆలోచనేలేదు. మా కంపెనీ తరపున వెళ్ళి అక్కడ కొంతకాలం గడిపి రావాలనుకున్నాను. సరదాగా మా మమ్మీని ఏడిపించాలని అక్కడే ఉండిపోతానని చెప్పాను గానీ, నిజానికి అలాంటి ఆలోచనేదీ లేదు నాకు. అలా వెళ్ళడం కూడా నీకు ఇష్టంలేదంటే మానేస్తాను'' అన్నాడు శశికిరణ్ హామీ ఇస్తున్నట్లుగా.

''అయ్యో నా కోసం నీ సరదాలు మానుకొమ్మని నేనెందుకు చెప్తాను? సరే, నాకు ఆలోచించుకునేందుకు కొంచెం టైమివ్వు బట్ ఒన్ కండిషన్. ఈలోగా ఫోన్లు గ్రటా చేసి నన్ను డిస్టర్బ్ చేయకూడదు'' అంది హారిక నిక్కచ్చిగా

''అయితే నీ ఆన్సర్ పాజిటివ్‌గానే ఉంటుందని ఆశించవచ్చా నేను?'' అన్నాడు శశికిరణ్ ఆశగా.

''ఇదిగో, ఇలాంటి నాకిష్టం ఉండదు. నువ్విప్పుడు బుద్ధిగా బెంగుళూరు వెళ్ళిపో. నేను కాల్ చేసేవరకూ నా జోలికి రాకు'' అంది హారిక చూపుడు వేలెత్తి ఆడిస్తూ.

''మరి బెంగుళూరు ట్రిప్పు?'' అనడిగాడు శశికిరణ్ అమాయకంగా ముఖం పెట్టి.

''అబ్బా, నీకెలా చెప్పాలి? నా కిక్కడ ప్రతి క్షణం ఎంతో విలువైనది. డిగ్రీ ఎగ్జామ్స్ అయ్యాక నా పూర్తి కాన్సన్ట్రేషన్ అంతా సివిల్స్ మీదే ఇలాంటి జాలీ ట్రిప్పులన్నీ ఆ తరువాతే. అందాక దయచేసి నా జోలికి రాకు. ఇప్పుడు నేను నీతో మాట్లాడుతూ వున్నా, అనవసరంగా టైమంతా వేస్టు అయిపోతోందని నా మనసెంత ఆరాటపడుతోందో నీకెలా చెప్పను?'' అంది హారిక విసుగ్గా.

''ఓ.కె ఓ.కె, నిన్ను విసిగించను ఇంక పోయి చదువుకో'' అంటూ లేచాడు శశికిరణ్.

''ఇంకెక్కడి చదువు, నువ్వు వచ్చి నా మూడ్ అంతా ఖరాబు చేశావు. అసలీ నెలరోజులూ నా చదువు సరిగా సాగనే లేదు. నేనూ వస్తాను పద. రమ్య ఏం చేస్తోంది అత్తయ్య ఎలా ఉంది'' అని అడుగుతూ అతడి వెంట నడిచింది హారిక.

''రమ్య వదినకు వంటలో సాయం చేస్తోంది. పెద్దమ్మ బాగానే ఉంది. అది సరేగానీ సప్తపది అంటే ఏమిటో తెలుసా నీకు?'' అన్నాడు శశికిరణ్ హారిక వంక చిలిపిగా చూస్తూ.

ఆ మాట వింటూనే అతడి వంక చురుగ్గా చూస్తూ ''డోంట్ ఇరిటేట్ మీ బై దిస్ వే ఆఫ్ టాకింగ్. ఇలాగే నువ్వు మాట్లాడుతూ ఉంటే మన రిలేషన్‌ని బ్రేక్ చేసుకోవాల్సి వస్తుంది'' అంది హారిక.

''మై గాడ్. అంత కోపం ఎందుకు? నేనేదో సరదాగా అన్నాను. నిన్న మా అమ్మమ్మ గారింటికి వెళ్ళాను. తనేదో మాటల సందర్భంలో ఇద్దరు కలిసి ఏడడుగులు నడిస్తే వాళ్ళు స్నేహితులవుతారని, పెళ్ళిలో వధూవరులను సప్తపది

నడిపించేది అందుకేనని, భార్యాభర్తలిద్దరూ స్నేహితుల్లా కలిసి ఉండాలని అలా చేస్తారట. మనం పెళ్ళి కాకుండానే కలిసి ఇలా'' అంటున్న అతడి వంక కోపంగా చూస్తూ.

''బావా! ఇంక ఆపుతావా?'' అంది హారిక.

''సరే...సరే, ఇంకేమీ అననులే. నిన్ను మీ ఇంటి దగ్గర డ్రాప్ చేస్తాను పద'' అన్నాడు శశికిరణ్ హారికను కూల్ చేయాలని చూస్తూ.

''నీకంత శ్రమ అవసరంలేదు. నే వెళ్ళగలను, నా బండిమీద. తమరు దయచేస్తే చాలా సంతోషిస్తాను'' అంది హారిక రెండు చేతులూ జోడించి.

హారికకు నిజంగానే కోపం వచ్చిందని గ్రహించిన శశికిరణ్ క్షమాపణగా చూస్తూ ''సారీ, నాకు జోవియల్‌గా మాట్లాడడం చిన్నప్పటినుండీ అలవాటైపోయింది. అంతే తప్ప నిన్ను విసిగించాలని కాదు. నేను ప్రామిస్ చేస్తున్నాను. నీ నుండి కాల్ వచ్చేవరకూ నేను నీతో మాట్లాడను. నీ జవాబు కోసం స్వాతి వాన కోసం ఎదురుచూసే ముత్యపు చిప్పలా ఎదురు చూస్తూ ఉంటాను. ఐ విష్ యూ ఆల్ సక్సెస్'' అంటూ హారికకు షేక్‌హాండ్ ఇచ్చి తన బైక్ స్టార్ట్ చేసుకుని వెళ్ళిపోయాడు.

అతడంత హఠాత్తుగా వెళ్ళిపోతాడని ఏమాత్రం ఊహించని హారిక ఆశ్చర్యంగా అతను వెళ్ళిన వంకే చూస్తూ ఉండిపోయింది కొన్ని క్షణాలు.

భలే చిత్రమైనవాడు. అనుకుంటూ తన బండి స్టాండ్ తీసింది, స్టార్ట్ చేసేందుకు. అంతలోనే ఇంటికి వెళితే 'బావ ఏమన్నాడే? ఏం మాట్లాడుకున్నారే మీ ఇద్దరూ' అంటూ తల్లి ఆరాలు మొదలెడుతుందని భయపడి తిరిగి బండికి స్టాండ్ వేసి లైబ్రరీ హాల్ వైపు నడిచింది హారిక.

శశికిరణ్ మాటలు మనసులో మెదిలాయి. ఏమనుకుంటున్నాడు ఇతను? తను ప్రపోజ్ చేయగానే ఎగిరి గంతేసి ఒప్పేసుకుంటానని అనుకున్నాడా? అనుకుంది చిరాగ్గా. అంతలోనే ఇదేంటీ నేను ఇలా ఆలోచిస్తున్నాను. ఏదో బెట్టు చేయడం కోసమా అతడి ప్రపోజల్‌ని కాదన్నది?

అబ్బ ఈ మనిషి నన్ను నిజంగా చాలా డిస్టర్బ్ చేసేశాడు. లేకపోతే తలా తోకా లేని ఈ ఆలోచనలేమిటి నాకు? అనుకుంటూ చదువుదామని తెరిచిన పుస్తకాన్ని మూసేసి టేబిల్ మీద తల పెట్టి కళ్ళు మూసుకుంది.

శశికిరణ్ ఇంటికి రావడంతోనే, ''ఏమందన్నయ్యా హారిక? వస్తానందా బెంగుళూరు?'' అనడిగింది రమ్య ఆత్రంగా.

''తనకి వీలుపడదటమ్మా చదవాల్సింది చాలా ఉందిట'' అన్నాడు సోఫాలో కూర్చుని అలసటగా కళ్ళు మూసుకుని.

''ఏంటన్నయ్యా ఏమైంది? ఒంట్లో బాలేదా?'' అంటూ దగ్గరకు వెళ్ళింది రమ్య.

''బాగానే ఉందమ్మా, ఏం కాలేదు. అవునూ, పవన్ గాడేడీ?'' అనడిగాడు శశికిరణ్ కళ్ళు తెరవకుండానే.

''సినిమాకి వెళ్ళాడన్నయ్యా. హారిక ఏమైనా అందా అన్నయ్యా నిన్ను'' అంది రమ్య వదలకుండా.

''ఏమీ అనలేదమ్మా కాసేపు నన్నిలా ఉండనివ్వు'' అన్నాడు విసుగ్గా.

అతడి మూడ్ బాగాలేదని అర్థమైన రమ్య నిశ్శబ్దంగా సుగుణ దగ్గరకు వెళ్ళిపోయింది.

ముఖం వేలాడేసుకుని వస్తున్న ఆడపడుచుని చూసి "ఏం రమ్యా, అలా ఉన్నావు?" అనడిగింది సుగుణ లాలనగా. రమ్య బి.టెక్ చదువుతున్నా ఆ ఇంట్లో అందరూ పసిపిల్లను చూసినట్లే చూస్తారు. అందుకే సుగుణ అలా అడిగింది వాత్సల్యంగా.

"నాకేం కాలేదు వదినా. చిన్నన్నయ్యే అదోలా ఉన్నాడు. వేసవి శెలవుల్లో నన్నూ, హారికనూ బెంగుళూరు రమ్మన్నాడు. నేనేమో నాదేం లేదు హారిక వస్తానంటే నేను రెడీ. ముందు తను వస్తుందో లేదో కనుక్కుని రమ్మని పంపాను. అక్కడ హారిక ఏముందో ఏమో? అన్నయ్య డల్ అయిపోయి వచ్చాడు" అంది హారిక దిగులుగా.

"ఏమీ జరిగి ఉండదులే. నువ్వు అనవసరంగా కంగారు పడకు. నేను కనుక్కుంటాను కదా. అందాక ఈ కూర కలుపుతూ ఉండు" అంటూ కాఫీ కలిపి గ్లాసులో పోసి తీసుకువెళ్ళింది సుగుణ.

అడుగుల చప్పుడు విని తలెత్తి చూసిన శశికిరణ్ సుగుణను చూస్తూనే "రమ్య వంతైంది. ఇక నువ్వు మిగిలావా?" అన్నాడు విసుగ్గా చూస్తూ.

"నేనేం నిన్ను విసిగించనులే. నీకు తలనొప్పిగా ఉందని రమ్య చెపితే కాఫీ చేసి తెచ్చాను, తప్పా?" అంది సుగుణ అమాయకంగా ముఖం పెట్టి.

"సరే, అక్కడ పెట్టి వెళ్ళు, తీసుకుంటాను" అన్నాడు తిరిగి కళ్ళు మూసుకుంటూ.

అతడలా అన్నా కదలకుండా అక్కడే నించుండిపోయింది సుగుణ. ఆమె కదలకపోవడం గమనించి "ఏమిటి వదినా, తీసుకుంటాను అన్నాను కదా" అన్నాడు విసుగు దాచుకుంటూ.

"తీసుకో మరి. సరేగానీ శశీ, నేనొకటి అడుగుతాను నిజం చెప్పు. నువ్వు హారికకు ప్రపోజ్ చేశావు కదూ. ఏమంది తను?" అంటూ ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంది సుగుణ.

"చెప్పకపోతే వదలరా మీరిద్దరూ నన్ను. అవును ప్రపోజ్ చేశాను. తను అవునని గానీ, కాదనిగానీ ఏం చెప్పలేదు. తన గోల్ రీచ్ అయ్యేదాకా కదిలించవద్దని కనీసం ఫోన్ కూడా చేయడానికి వీలులేదని కండిషన్ పెట్టింది. ఈ ఇన్ఫర్మేషన్ చాలా, ఇంకేమైనా కావాలా?" అన్నాడు శశికిరణ్.

"అవును శశీ, తను ఎంచుకున్న గమ్యం అలాంటిది. ఈ విషయంలో నీ మనసు నొప్పిస్తే నొప్పించి ఉండవచ్చు. కానీ హారిక ఈ కాలంలో ఉండవలసిన పిల్లకాదు. ఈ రోజు మన దేశంలో అవినీతి, ఆశ్రిత పక్షపాతం ఎంతగా పెరిగిపోతున్నాయో నీకూ తెలుసు. మన ఓట్ల ద్వారా గద్దెనెక్కిన పెద్దలు తమ పదవులు నిలుపుకోవడం కోసం ఎంత నీచానికైనా దిగజారి పోతున్నారు.

ఇవన్నీ చూసీ, చదివీ, చాలా బాధపడుతూంటుంది హారిక. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి డెబ్బై ఏళ్ళు అయినా మన దేశం అన్ని రంగాల్లోనూ వెనకబడే ఉంది. మెజారిటీ పీపుల్ ఇంకా దారిద్రరేఖ దిగువనే ఉన్నారంటే ఎంత బాధాకరమైన విషయం? అలా అని మన దేశంలో వనరులకు ఏమైనా లోటా? పుష్కలంగా ఉన్నాయి. నిరంతరం ప్రవహించే జీవనదులు, సారవంతమైన నేల, కడుపులో విలువైన ఖనిజాలను దాచుకుని మనకందిస్తున్న రత్నగర్భ అయిన మన దేశంలో తిండికి లేక ఆకలి చావులు చచ్చే పరిస్థితి ఉండడం ఎంత శోచనీయం?

అదీగాక ఆరుగాలాలు శ్రమించి అందరి కడుపులూ నింపే రైతన్నలు మన రాజకీయ నాయకులు ఆడుతున్న జూదంలో పావుల్లా బలైపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్న వైనం హారిక మనసును బాగా కదిలించింది. అలా అని తాను కలెక్టరు అయినంత మాత్రాన ఇవన్నీ కూకటి వేళ్ళతో పెకలించి వేయగలననే ఓవర్ కాన్ఫిడెన్స్ ఏమీలేదు తనకు. మనిషిగా పుట్టినందుకు తనకు చేతనైనంతలో తోటివారికి ఏదైనా చేయాలనే తాపత్రయం తనని సివిల్స్‌కి ప్రిపేర్ అయ్యేలా చేసింది.

నిరంతరం దాన్ని ఒక తపస్సులా కొనసాగిస్తున్న హారిక చదువునుండి డీవియేట్ అయ్యేదానికి ఏమాత్రం ఇష్టపడటంలేదు. దానిని మనం సానుభూతితో అర్థం చేసుకుని సహకరించాలంతే. నేను కూడా మా పెళ్ళయిన కొత్తలో హారికని ఇలాగే అపార్థం చేసుకున్నాను. ఎవరితోనూ మాట్లాడకపోవడం చూసి ఈ పిల్లకు ఇంత పోజేంటీ? అని అనుకున్నాను. తనకి టెంత్ క్లాస్ రిజల్ట్స్ వచ్చాయి. హారిక జిల్లా ఫస్ట్ వచ్చింది. డి.ఈ.ఓగారి చేతులమీదుగా నగదు బహుమతినీ, ప్రశంసా పత్రాన్నీ అందుకుంది. తన ఫ్యూచర్ ప్లాన్ ఏమిటని అడిగిన డి.ఈ.ఓగారికి నేను కలెక్టరు అవుదామనుకుంటున్నానని చెప్పి సభికులందర్నీ ఆశ్చర్యచకితులను చేసింది.

చైతన్యా, నారాయణా వంటి జూనియర్ కాలేజీల వాళ్ళు హారికకు ఫ్రీ కోచింగ్ ఇస్తామని ఆఫర్ చేశారు. అవేమీ వద్దని హెచ్.ఈ.సి తీసుకుని కృష్ణా కాలేజీలో జాయిన్ అయింది. ఇంటర్‌లో కూడా టాపర్‌గానే నిలిచింది. అత్తయ్యగారు హారికకి చదువుపట్ల ఉన్న శ్రద్ధ చూసి ఎక్కడెక్కడి సమాచారం సేకరించి తనకి ఇవ్వసాగారు. అత్తయ్య సిక్ అయ్యాక పాపం హారిక చాలా డల్ అయ్యింది.

మీ అన్నయ్య తనని మన రమ్యని చూసినట్లే ఎంతో ఆదరంగా చూస్తారు. అయినా మీ అన్నయ్యతో తను ఏమంత ఫ్రీగా మాట్లాడలేదు. మొదట్లో మన ఇంట్లో రమ్య ఒక్కతితోనే హారిక క్లోజ్‌గా ఉండేది. తన కోసం వస్తూ పోతున్న క్రమంలో నాకూ బాగా అలవాటైంది. హారిక నాకు దగ్గరైన కొద్దీ తనేమిటో నాకు పూర్తిగా బోధపడింది. ఎవరికి ఏ కష్టమొచ్చినా ముందుంటుంది తను. అలా అని తన పర్సనల్ మేటర్‌లోకి చొరబడే చనువును ఒక్క రమ్యకు తప్ప ఎవరికీ ఇవ్వలేదు.

ఇదంతా నీకు ఎందుకు చెప్పానంటే తనని నువ్వు అపార్థం చేసుకోకుండా ఉండాలని. ఎందుకంటే నా ఉద్దేశంలో మీరిద్దరూ మేడ్ ఫర్ ఈచ్ అదర్‌లా ఉంటారు. అందుకే కొంచెం ఓపిక పట్టమంటున్నాను" అంది సుగుణ పరిశీలనగా అతని వంక చూస్తూ.

"లేదు వదినా తనంటే ఏమిటో నీ మాటలవలన వివరంగా తెలుసుకోగలిగాను" అంటూ సుగుణ తెచ్చిన కాఫీ గ్లాసు అందుకున్నాడు.

"అరే, కాఫీ ఇంకా తాగలేదా? చప్పగా చల్లారిపోయి ఉంటుంది. వేడి చేసి తెస్తానుండు" అంటూ లేచింది సుగుణ.

"ఫర్లేదులే వదినా తాగేస్తాను. అలా కూర్చో, తన గూర్చి ఇంకా ఏమైనా చెప్పు" అన్నాడు ఉత్సాహంగా.

"చెప్పడానికి ప్రత్యేకంగా ఏం లేదు శశీ. హారిక అందరు ఆడపిల్లల్లాంటిది కాదు. చాలా ఆత్మాభిమానం కలది. ఫ్యూచర్‌లో తన ఆత్మాభిమానానికి భంగం కలగకుండా మసలుకుంటే, మీది ఆదర్శ దాంపత్యం అవుతుంది" అంది సుగుణ.

''ష్యూర్, నీ సూచన తప్పక పాటిస్తాను. అసలు తనని చూసిన మొదటిరోజే అనుకున్నాను. ఆ కళ్ళల్లో స్పార్క్ ఉందని. ఇప్పుడు తెలిసింది, అది ఆత్మ విశ్వాసంతో కూడిన వెలుగని'' అంటూ నవ్వాడు.

అంతవరకూ ఆ సంభాషణంతా ద్వారం దగ్గరే నించుని వింటున్న రమ్య ''దొంగా నువ్వు హారికను ప్రేమిస్తున్న విషయం నా దగ్గర ఎందుకు దాచావు?'' రమ్య అతడి మీదకి దాడికి దిగింది.

''అమ్మో క్షమించరా బుజ్జీ. నీకు చెప్పకుండా ఇంకేం చెయ్యనులే'' అన్నాడు శశికిరణ్ రమ్య చేతులను గట్టిగా పట్టుకుని.

''రమ్యా, మనకు ఈ విషయం తెలిసినట్లు హారిక ముందేమీ ప్రస్తావించకు. తను చిరాకు పడడంతోపాటు శశిమీద కోపం తెచ్చుకుంటూంది'' అంది సుగుణ హెచ్చరిస్తున్నట్లుగా.

''అమ్మో ఇంత జరిగాక ఆ రాక్షసి దగ్గర ప్రస్తావించి నేను బ్రతకడమే?'' అంది రమ్య గుండెలమీద చేతులు పెట్టుకుని. రమ్య అన్న తీరు చూసి మిగతా ఇద్దరూ బిగ్గరగా నవ్వేశారు.

**''శశీ ఏం చేస్తున్నావు?''** అంటూ వచ్చాడు రామచంద్ర ఆ గదిలోకి.

''రేపేకదా ప్రయాణం.. బట్టలు సర్దుకుంటున్నాను పెదనాన్నా'' అన్నాడు శశికిరణ్.

రామచంద్ర వచ్చి అతడి పక్కన కూర్చుని భుజం మీద చెయ్యివేసి ''శశీ, అన్నయ్య నాకంతా చెప్పాడు.

ఒక విధంగా మేమంతా కలసి నిన్ను చాలా బాధపెట్టామురా. ఎనీ హౌ, చాలా థాంక్స్‌రా. నీ రాకవలనా, నీ మాటల వలనా అమ్మ చాలా కోలుకుంది. ఇవ్వాళ అమమ ఇలా బ్రతికి బట్టకట్టిందంటే అంతా నీ చలవే. అసలు అన్నయ్యా, నేను పూర్తిగా ఆశలు వదిలేసుకున్నాం అమ్మ మీద. పైకి ధైర్యంగా కనిపించామే తప్ప ఇంకేంలేదు. ఈ ఇంటి దీపాన్ని ఆరిపోకుండా కాపాడింది నువ్వే'' అన్నాడు ప్రేమగా కొడుకు తల నిమురుతూ.

''నాన్నా, అమ్మని కాపాడుకోవడం నా బాధ్యత. దానికి థాంక్స్ ఎందుకు నాన్నా అంటూ రామచంద్ర గుండెల్లో ఒదిగిపోతూ, ఎందుకు చేశారు నాన్నా ఇలా మీ నుండి నన్ను ఎందుకు దూరం చేశారు? కళ్ళెదుట కన్నతల్లిదండ్రులైన మీరిద్దరూ కనిపిస్తూనే ఉన్నా, నోరారా అమ్మా, నాన్నా అని పిలవలేకపోయాను. కనిపించని సంకెళ్ళు నన్ను బంధించి అశక్తుడ్ని చేశాయి. నాకు అన్నయ్యా, చెల్లీ ఉన్నారు. నేను ఒంటరిని కాను. అని బహిరంగంగా చెప్పుకోలేని పరిస్థితి కల్పించారు.

మొన్న అమ్మకి ఆపరేషన్ అయిననాడు మీరంతా ఒకరితో ఒకరు.. మీ సంతోషాన్నీ, బాధనీ పంచుకున్నారు. నేను ఎవరితో పంచుకోవాలో తెలియలేదు నాన్నా! నాలో నేను ఎంత ఏడ్చానో మీకు ఎలా చెబితే అర్థమవుతుంది?

డాడీ నాతో మొదటిసారి ఈ నిజం చెప్పినప్పుడు వాళ్ళు నా తల్లిదండ్రులు కాదనే విషయాన్ని విని తట్టుకోలేకపోయాను. నన్ను మీ నుండి దూరం చేయకండని డాడీని పట్టుకుని ఏడ్చేశాను. మీ మీద నాకే ఫీలింగ్ కలగడం లేదని చెప్పాను. కానీ ఇక్కడకు వచ్చాక అమ్మ ముఖంలో జాలువారే మమతానురాగాలను చూశాక నేనేం పోగొట్టుకున్నానో నాకు అర్థమైంది నాన్నా!

అమ్మని అమ్మా అని పిలవకుండా ఉండడానికి నన్ను నేను ఎంత కంట్రోలు చేసుకున్నానో తెలుసా? ఎందుకంటే ఆ పిలుపు అలవాటైతే మార్చుకోవడం కష్టమని. ఆ పైన ఈ నిజం నాకు తెలిసిపోయిందని మా మమ్మీకి తెలుస్తే ఖచ్చితంగా తన గుండె ఆగిపోతుంది. ఇలా ఇద్దరు తల్లుల ప్రేమ మధ్య ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నాను నాన్నా. ఒకరికి న్యాయం చేయబోయి మరొకరికి అన్యాయం చేస్తానేమోనని భయమేస్తోంది. ఎందుకు నాన్నా నన్నిలాంటి ధర్మసంకటంలో పడేశారు?''

చిన్నపిల్లాడిలా ఏడుస్తున్న కొడుకును ఎలా ఓదార్చాలో తెలియలేదు రామచంద్రకు.

''ఊరుకో నాన్నా, ఏడవకు.. నువ్వలా ఏడిస్తే నేను తట్టుకోలేనురా. బాచీ ఎవరు? నా ప్రాణంలో ప్రాణం. వాడికి వచ్చిన కష్టం మామూలుది కాదు. నువ్వెక్కడున్నా మా బిడ్డవు అనే భావంతో. మీ అమ్మను ఒప్పించి ఇలా ఇచ్చినందుకు నేనెప్పుడూ బాధపడలేదు. నువ్వూ బాధపడకు. ఎందుకంటే మనమంతా ఒకటే. నిన్నిచ్చినందుకు మొదట్లో మీ మమ్మీ మాతో బాగానే ఉండేది. కానీ రాను రాను ఈ నిజాన్ని నీకు చెప్పేస్తామేమోననే భయంతో దూరంగా తొలిగిపోయింది. ముఖ్యంగా హారికను నీకిచ్చి పెళ్ళి చేస్తే మేమంతా ఒకటైపోయి తాను ఒంటరి అయిపోతాననే అభద్రతా భావం కుటుంబాన్ని ఈ దశకు చేర్చింది.

అమ్మ అనారోగ్యం ఒక విధంగా మంచే చేసింది. ఈ రోజు మనందరం ఒకటయ్యేలా చేసింది. కానీ ఒక్కమాట. పెళ్ళి విషయంలో మీ మమ్మీ అభీష్టానికి వ్యతిరేకంగా ఏమీ చేయకు. ఆమెను నొప్పించకుండా ఒప్పించి నీ పని సానుకూలం చేసుకో'' అన్నాడు రామచంద్ర సలహా ఇస్తున్నట్లుగా.

''నాకు తెలుసు నాన్నా. మమ్మీని కష్టపెట్టే పని ఏదీ నేను చేయను'' అంటూ తనివితీరనట్లుగా తండ్రిని మళ్ళీ కౌగలించుకున్నాడు.

ఆప్యాయంగా కొడుకు నుదుట ముద్దు పెట్టుకున్నాడు రామచంద్ర.

పుట్టిన తర్వాత మొదటిసారి నుదుట ముద్దు పెట్టుకున్నాడు రామచంద్ర.

పుట్టిన తర్వాత మొదటిసారి కన్నతండ్రిని అలా గాఢంగా కౌగలించుకోవడం వింత అనుభూతిని కలిగించింది శశికిరణ్‌కి. దాని నుండి బయటపడేందుకు ఇష్టంలేనట్లుగా అలా ఉండిపోయాడు.

''అరే నాన్నా.. లే, ఏమిటిది చిన్నపిల్లాడిలా?'' అంటూ కొడుకుని బలవంతాన తన నుండి విడిపించాడు రామచంద్ర.

ఆ మధురానుభూతి అతడిని వదలలేదు. తండ్రి అక్కడినుండి వెళ్ళిపోయాక కూడా ఏ పనీ చేయడానికి తోచనట్లుగా అలా కూర్చుండిపోయాడు శశికిరణ్.

మరోసారి హాస్పటల్‌కి వెళ్ళి తల్లికి అనేక జాగ్రత్తలు చెప్పి భారమైన మనసుతో ఇంటికి వచ్చేశాడు.

రవి అతడి ఫీలింగ్స్‌ని అర్థం చేసుకున్నట్లుగా చేయి నొక్కాడు ఓదార్పుగా.

''అమ్మ జాగ్రత్త అన్నయ్యా'' అన్నాడు శశికిరణ్ కళ్ళనీళ్ళతో.

''అలాగే నువ్వు బాధపడకురా, నేను ఉన్నాను కదా, అన్నీ చూసుకుంటాను. నువ్విలా ఉంటే నాకేం బాగాలేదు'' అన్నాడు రవి. తమ్ముడి కంట్లో నీరు అతడి కళ్ళనూ చెమ్మగిల్లేలా చేసి

శశికిరణ్ ప్రశాంతికి బెంగుళూరు వెళ్తున్నాడని తెలిసి స్టేషన్‌కి వెళ్ళి సెండాఫ్ ఇచ్చి వద్దామా అనుకుంది హారిక. మళ్ళీ అంతలోనే అలా వెళ్ళి అతడి మనసులో లేనిపోని ఆశలు కలిపించడం ఎందుకని ఊరుకుంది. అదీగాక స్టేషన్‌కి భాస్కర్,

కమలా వస్తే తాను స్టేషన్‌కి వెళ్ళడం లేనిపోని అనుమానాలకు, చర్చలకూ తావు ఇస్తుందని మెదలకుండా ఊరుకుంది హారిక.

శశికిరణ్‌కి, పవన్‌కి సెండాఫ్ ఇచ్చేందుకు కమలా, భాస్కర్, రవీ, రమ్యలు స్టేషన్‌కి వెళ్ళారు. కొడుకు ట్రైన్ ఎక్కేవరకూ జాగ్రత్తలు చెప్తూనే ఉంది కమల.

ట్రైన్ కదిలి కనుమరుగయ్యేవరకూ కమల అలా చేతులు ఊపుతూనే ఉంది.

"చాలు పద, ట్రైన్ వెళ్ళి చాలా సేపయింది" అన్నాడు భాస్కర్ నవ్వుతూ.

"తల్లి మనసు పడే ఆరాటం మీ మగాళ్ళకు అర్థంకాదులెండి. అందుకే అలా నవ్వుతున్నారు" అంది కమల చిరుకోపంగా.

ఆపరేషన్ అయిన వారం రోజుల తర్వాత జానకిని హాస్పిటల్ నుండి డిశ్చార్చి చేశారు. జానకి ఇంటికి వచ్చాక ఇల్లంతా ఆనందోత్సాహాలతో నిండిపోయింది. రవికి ఆ రోజు ఒక పండగలా అనిపించింది.

"ఎంత కంగారు పెట్టేశానురా నిన్ను? నాకోసం నిద్రాహారాలు మాని ఎంత తల్లడిల్లిపోయావో కదా! చూడు కళ్ళు ఎంత లోతుకి పోయి ముఖమంతా ఎలా పీక్కుపోయిందో?" అంది జానకి రవిని పట్టుకుని.

"అదేం లేదమ్మా. నువ్వు మాకు దక్కావు, అంతే చాలు. సమయానికి పిన్నీ బాబాయి తమ్ముడూ వచ్చి కొండంత అండగా నిలిచి ఈ కష్టాన్ని గట్టెక్కించారు" అన్నాడు రవి కృతజ్ఞతగా వారిద్దరి వంకా చూస్తూ.

"అవునురా వాళ్ళ రాకతో మనింటికి కొత్తకళ వచ్చింది" అన్నాడు రామచంద్ర.

"అలా పొగిడి నన్ను వేరు చేయకన్నయ్యా. మనందరం ఒకరి కోసం ఒకరుగా ఎప్పుడూ ఉందాము" అన్నాడు భాస్కర్ ప్రేమగా రామచంద్ర వంక చూస్తూ.

"చాలు బాచీ, ఈ ఆనందం ఇలాగే శాశ్వతంగా ఉండిపోతే చాలనిపిస్తోంది నాకు" అంది జానకి.

"ఉండకుండా ఏమవుతుందక్కా, ఎప్పుడూ బెంగుళూరు నుండి మేము రావడమే కానీ, మీరు ఒక్కసారి బయలుదేరి రాలేదు. రవి పెళ్ళయ్యాక సుగుణను తీసుకు రమ్మని ఎన్నోసార్లు అడిగాను. అయినా బయలుదేరలేదు. ఈసారి అలా జరగనివ్వను. నీ ఆరోగ్యం కుదుటపడ్డాక మీరంతా కలిసి అక్కడికి రావలసిందే" అంది కమల శాసిస్తున్నట్లుగా.

"చూద్దాంలే అమ్మా" అంది జానకి నవ్వేస్తూ.

"అలా అంటే ఈసారి ఊరుకునేది లేదక్కా. ఇదిగో సుగుణా, ఇలారా! రవికీ, రమ్యకూ మేలో శెలవలు ఎలాగూ వుంటాయి. వేసవిలో బెంగుళూరు చాలా చల్లగా బాగుంటుంది. అందర్నీ బయలుదేరదీసి తీసుకువచ్చే బాధ్యత నీదే" అంది కమల.

భార్యకి ఆగ్రహం వచ్చినా, అనుగ్రహం వచ్చినా పట్టలేమని భాస్కర్‌కి బాగానే తెలుసు. తన మనసు మారిపోక ముందే అన్నగారితో ప్రయాణం గూర్చి అవుననిపిస్తే సరిపోతుందనుకున్నాడు.

"అవునన్నయ్యా. కమల చెప్పినట్లు మీరంతా బయలుదేరి రావలసిందే వదిన ట్రైన్‌లో జర్నీ చేయలేదు అనుకుంటే ఎయిర్ టికెట్స్ బుక్ చేద్దాం" అన్నాడు భాస్కర్.

"ఒరేయ్ నీకేమైనా మతిపోయిందేమిట్రా ఎయిర్ టికెట్స్ అంటే ఎంత ఖర్చో ఆలోచించావా?" అన్నాడు రామచంద్ర మందలింపుగా.

"అవును బాబాయ్, ఎందుకు అనవసరంగా అంత ఖర్చు? ఇంకా రెండు నెలల టైముందిగా. అప్పటికీ అమ్మ కోలుకోకపోతే అమ్మనీ, నాన్ననీ ఫ్లైట్‌లో పంపించి మేమంతా ట్రైన్‌లో వస్తాములే" అన్నాడు రవి.

"అయితే మీ ప్రయాణం కన్‌ఫర్మ్ అయినట్లే కదా" అంది కమల ఉత్సాహంగా.

"నువ్వు ఆర్డర్ పాస్ చేశాక తిరుగేముంది ఇక" అంది జానకి. అందరూ హాయిగా నవ్వేశారు జానకి మాటలు విని.

మర్నాడు భాస్కర్, కమల బయలుదేరారు బెంగుళూరు. రవి కమలకు, భాస్కర్‌కు బట్టలు తీసుకువచ్చి సుగుణతో బొట్టిపెట్టి ఇప్పించాడు.

"ఎందుకురా రవీ, ఇప్పుడీ ఫార్మాలిటీస్ అన్నీను?" అన్నాడు భాస్కర్ మందలిస్తున్నట్లుగా.

"ఏదో బాబాయ్ నా తృప్తికోసం. మా పెళ్ళయ్యాక మీరు రానేలేదు. మీరిలా ఎప్పుడూ వచ్చిపోతూండాలని నా కోరిక. ఏ బంధమైనా వస్తూ పోతూ ఉంటేనే బలపడుతుంది" అన్నాడు రవి.

"ఎవరికీ ఏ బాధా లేకుండా నేనొక మాట చెప్తాను మావయ్యా. ప్రతి సంక్రాంతికీ మీరు ఇక్కడికి రండి. అందరం కలిసి సరదాగా పండగ చేసుకుందాం. మీ అన్నదమ్ములిద్దరూ కలిసి ఆ రోజు మీ తల్లిదండ్రులను స్మరించుకుందురుగానీ. మీరన్నట్లే ప్రతి వేసవికీ మేమంతా బెంగుళూరు వస్తాం. ఎలా ఉంది నా ఆలోచన? మా బాబాబి వాళ్ళు, అమ్మా వాళ్ళింటికి ఇలానే వస్తూ ఉంటారు. ఇక్కడ కూడా అలా చేస్తే బాగుంటుందని అనిపించింది నాకు" అంది సుగుణ.

"బావుందమ్మా నీ ఆలోచన. అలాగే చేద్దాం, ఏమ్మా కమలా, సమ్మతమేనా నీకు?" అనడిగాడు రామచంద్ర.

"అలాగే బావగారూ, సుగుణ ఆలోచన చాలా బాగుంది" అంది కమల మెచ్చుకుంటున్నట్లుగా.

తేలికపడిన మనసులతో ఆ రోజంతా ఉల్లాసంగా గడిపారు అంతా.

విశాఖపట్టణం నుండి వచ్చాక రొటీన్‌లో పడిపోయారు భాస్కర్, కమలలు. ఎప్పటికప్పుడు ఫోన్ చేసి జానకి సమాచారాలు తెలుసుకోసాగారు.

శశికిరణ్ ప్రతిరోజూ ఫోన్ చేసి జానకితో ఐదు నిముషాలు మాట్లాడేవాడు. ఆ తరువాత వీలును బట్టి కుటుంబ సభ్యులతో మాట్లాడేవాడు.

పవన్ ఎం.బి.ఏలో చేరేందుకు రెండు నెలల వ్యవధి ఉంది కనుక ఈలోగా ఖాళీగా ఉంచడం ఎందుకని కంప్యూటర్ కోర్సులో జాయిన్ చేశారు. అతడికి కూడా ఈ కొత్త జీవితం ఎంతో ఉత్సాహాన్నీ, ఉత్తేజాన్నీ ఇచ్చింది. మేనల్లుడి జీవితం గాడిలో పడినందుకు కమల ఎంతో సంతోషించింది.

శశికిరణ్‌కి హారికతో మాట్లాడాలని ఎంతగా అనిపించినా ఇచ్చిన మాటకు కట్టుబడి మౌనంగా ఉండిపోయాడు.

మనసులో హారిక మెదలినప్పుడల్లా వేయి వసంతాలు విరిసినట్లుగా అనిపించేది అతడికి.

తనతో మాట్లాడకుండా అయితే కట్టడి చేయగలిగింది గానీ, తన చుట్టూనే తిరుగుతున్న నా ఆలోచనలను హారిక అరికట్టగలదా? అనుకున్నాడు శశికిరణ్.

రంగు రంగుల సీతాకోక చిలకలా అతడి ఊహలు స్వేచ్ఛగా రెక్కలు విప్పుకుని విహరించసాగాయి. భావి జీవితాన్ని తలచుకుని బంగారు కలలు కంటూ గడిపేయసాగాడు.

పవన్ వచ్చి దాదాపు సంవత్సరం రోజులు గడిచిపోయింది. ఈ సంవత్సర కాలం అతడిలో చాలా మార్పును తీసుకువచ్చింది. జీవితం పట్ల అవగాహన పెరగడం వలన తన కెరీర్‌ను ఉన్నతంగా మలచుకోవాలనే తపన మొదలైంది అతడికి.

వచ్చిన కొత్తలో విజయనగరం వెళ్ళి రావాలని ఉబలాటపడిన పవన్, ఇప్పుడా మాట ఎత్తడమే మానేశాడు. చదువుతోపాటు కొత్త కొత్త కోర్సులు నేర్చుకుంటూ తన స్కిల్స్‌ని డెవలప్ చేసుకోసాగాడు.

కొడుకులో వచ్చిన మార్పు గూర్చి కమల ద్వారా విన్న మాధవరావూ, దమయంతిల ఆనందానికి హద్దే లేకపోయింది. వాళ్ళే అతడిని చూసేందుకు బెంగుళూరు వచ్చారు. గతంలో ఎవరితోనైనా ఎంతో రఫ్‌గా ఉండే అతడి బిహేవియర్ పూర్తిగా మారిపోయి ఉండడం చూసి మురిసిపోయారు.

నాలుగు రోజులు కొడుకుతో సంతోషంగా గడిపి తిరిగి వెళుతూ ఆ మాటే కమలతో అన్నారు.

''కమలా నిజంగా నీ ఋణం, నీ కొడుకు ఋణం తీర్చుకోలేమమ్మా. వాడు ఎందుకూ పనికిరాడు అని ఆశలు వదిలేసుకున్నాము మేము. అలాంటివాడిని ఇక్కడికి తీసుకువచ్చి సానపెట్టిన వజ్రంలా తీర్చిదిద్దాడు నీ కొడుకు. మట్టిముద్దలంటి వాడిని మంచి ముత్యంలా మార్చేశాడు. అసలు శశి ఏం చేసినా ఎంతో ఫర్‌ఫెక్ట్‌గా ఉంటుంది అని నువ్వు చెపితే నమ్మలేకపోయేవాడిని నేను. కానీ వాడు నిజంగా చాలా గ్రేట్ అమ్మా! చిన్నవాడు పొగిడితే ఆయుక్షీణం అని ఆలోచిస్తున్నాను. నా ఆయుష్షు కూడా పోసుకుని వాడు చల్లగా నిండు నూరేళ్ళు ఉండాలమ్మా'' అన్నాడు మాధవరావు చెమరించిన కళ్ళతో.

''ఇందులో శశి చేసింది ఏం లేదన్నయా. వాస్తవానికి పవన్ చాలా తెలివైనవాడు. ఏదైనా ఇట్టే పట్టేస్తాడు. ఇన్నాళ్ళూ సహవాస దోషం వలన అలా అయ్యాడు, అంతే ఇక్కడికి వచ్చాక అంతా సెట్ అయిపోయింది'' అంది కమల.

''అలా అనకు కమలా! ఇదంతా నీ కొడుకు చలవే. ఆనాడు శశి వాడి గూర్చి దిగులుపడవద్దనీ, అంతా తాను చూసుకుంటాననీ మాకు ధైర్యాన్ని నూరిపోశాడు. అది ఆచరనలో ఇలా ఇంత గొప్పగా మా ముందు ఆవిష్కరిస్తాడని మేము ఊహించనైనా లేదు'' అంది దమయంతి ఆడపడుచు చేతులు పట్టుకుని.

''ఒకరి కోసం ఒకరు ఆ మాత్రం చేసుకోకపోతే, ఇంక బంధాలకు విలువ ఏముంటుంది వదినా?'' అంది కమల.

వాళ్ళకి వీడ్కోలు ఇచ్చి ఇంటికి వచ్చేసింది కమల. సాయంత్రం కొడుకు ఆఫీసు నుండి రాగానే, సంబరపడుతూ జరిగిందంతా అతడితో చెప్పింది.

''ఒరేయ్, మావయ్య నిన్ను పొగిడిందంతా చెప్పాలంటే నావల్ల కాదురా. అసలు నిన్ను చూస్తూంటే నాకెంత గర్వంగా ఉందో తెలుసా? ఒకోసారి అందరి దృష్టి నీకు తగిలేస్తుందేమోనని భయం కూడా వేస్తోందిరా'' అంటూ కొడుకు నుదిటి మీద ముద్దు పెట్టుకుంది కమల.

తల్లి చెప్పినదంతా విని నవ్వేశాడు శశికిరణ్. ''పిచ్చి మమ్మీ వాళ్ళ సంగతేమోగానీ, నేనేం చేసినా ఎప్పుడూ నీకు గొప్పగానే ఉంటుంది కదా'' అన్నాడు.

కుటుంబ సభ్యులందరితో ఎంత ఆత్మీయంగా ఉనప్పటికీ హారిక విషయంలో కమల ఆలోచనలో ఏ మాత్రం మార్పు రాలేదు.

గతంలో ఆమె దృష్టిలో హారిక చదువు సంధ్యలు లేని ఓ బైతులా మాత్రమే కనబడింది. ఇప్పుడు బి.ఏ చదువుతున్న హారిక అంటే ఇంకా చిన్న చూపు ఏర్పడింది. ఆ పైన తనతో పరుషంగా మాట్లాడిన తీరు చూసి హారిక పొగరుబోతు అనే ముద్ర పడిపోయింది కమల మనసులో.

అందుకే కొడుకును ఒప్పించి అనూషతో పెళ్ళి జరిపించాలని అనుకుంది.

కొడుకు కూడా హారిక కంటే బాగా చదువుకుని, ఉద్యోగం చేస్తున్న అనూషనే ఎక్కువ ఇష్టపడతాడని ఈ విషయంలో తాను పెద్దగా శ్రమ పడవలసిన అవసరం లేదనుకుంది కమల.

అందరికీ రోజులు శరవేగంగా గడిచిపోతున్నట్లే ఉన్నా, శశికిరణ్‌కి మాత్రం అతి భారంగా గడుస్తున్నాయి. దినమొక యుగంగా హారిక చదువు పూర్తయి తను అనుకున్నది సాధించాక, ఆమె తన దగ్గరకు చేరుకునే శుభ సమయం కోసం వేయికళ్ళతో ఎదురుచూడసాగాడు.

జానకి ఆపరేషన్ అయ్యాక గతంలో అందరూ అనుకున్నట్లే వేసవిలో రామచంద్రా వాళ్ళు బెంగుళూరు వస్తే సంక్రాంతి పండుగకు కమలను తీసుకుని భాస్కర్ విశాఖపట్నం వెళ్ళాడు.

**అక్కడికి వెళితే** హారికను చూడకుండా ఉండడం సాధ్యం కాదని, అలా వెళితే ఆమెకు తానిచ్చిన మాటను నిలబెట్టుకున్నట్లు అవదని అనుకున్నాడు శశికిరణ్. అందుకే ఆఫీసులో బిజీ వర్క్ ఉందని చెప్పి విశాఖపట్నం వెళ్ళడం మానుకున్నాడు.

వేసవిలో చిన్నకొడుకుతో ఆనందంగా గడపడం, ఆ పైన కమల చూపించే ఆత్మీయతలవలన చిన్నకొడుకు సంక్రాంతి పండగకు తమ దగ్గరకు రాలేదనే ఆలోచనే రాలేదు జానకి మనసులోకి.

పవన్‌ని పట్టుబట్టి బెంగుళూరు తీసుకు వచ్చినందుకు అందరూ కోరుకున్న విధంగానే అతడు ఆ సంవత్సరం ఎం.బి.ఏ పాసయి ఉద్యోగాల వేటలో పడ్డాడు.

శశికిరణ్‌కి పెళ్ళి చేయాలనే ఆలోచన కలిగింది కమలకీ, భాస్కర్‌కీ.

కొడుకు తన మాట ఎప్పుడూ కాదనడని కమలకి ఎంతో నమ్మకం. అయితే శశికిరణ్ హారికను ఇష్టపడుతున్న విషయం విశాఖపట్టణం వెళ్ళిన కొత్తలోనే గ్రహించాడు భాస్కర్.

పెళ్ళి విషయం మొదటినుండి కొడుకు ఇష్టానికే వదిలెయ్యాలని అనుకున్నాడు. ఇప్పుడు హారికను కొడుకు ఇష్టపడటం గ్రహించాక తన చిన్ననాటి స్నేహితుడితో బాంధవ్యం కలవబోతున్నందుకు సంతోషంగానే ఉంది అతడికి. కానీ ఈ విషయం తెలిశాక, భార్య ఎలా స్పందిస్తుందో అనే భయం లేకపోలేదు అతడికి.

కానీ అక్కడ విశాఖపట్నంలో కుటుంబ సభ్యులతో కమల ఆత్మీయంగా మెలిగిన తీరు చూశాక ఏమూలో చిన్న ఆశ కలిగింది భాస్కర్‌కి, కమల కాదనదని. అందుకే ఆ రోజు ఒక ప్రయత్నం చేసి చూద్దామనుకున్నాడు.

భార్య మంచి మూడ్‌లో వుండగా విషయం కదిపాడు.

అది విన్న వెంటనే "ఎన్నిసార్లు చెప్పాలండీ మీకు? ఈ విషయంలో నా నిర్ణయం మారదని. అయినా శశి హారికను చేసుకుంటాడని ఎలా అనుకుంటున్నారండీ మీరు? మనవాడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. తనేమో బోడి బి.ఏ. ఇద్దరికీ ఎలా లింకు కుదురుతుందండీ ఆలోచనకైనా ఓ అర్థం ఉండాలి" అంది కమల కోపంగా.

"అది కాదు కమలా, మనం గతంలో వదినకు మాటిచ్చాం.. అది వృథా కావలసిందేనా? మనమిలా మాట తప్పిన వాళ్ళలా మిగిలిపోవడం నాకేం బాగుండదు. నా సంగతి సరే, ఈ మాట వింటే వదిన ఎంత బాధపడుతుంది?" అన్నాడు భాస్కర్.

"మీ వదిన బాధపడుతుందని చేద్దామంటారా? అయితే ఆ అమ్మాయిని శశికి చేస్తే నేనింకా బాధపడతాను. నేను బాధపడినా ఫర్వాలేదా?" అంది కమల తీవ్రంగా చూస్తూ.

"ఎందుకు కమలా వాడి పెళ్ళి విషయంలో మనమిలా వాగ్వివాదాలతో మనసు పాడు చేసుకోవడం? వదిన బాధపడుతుందని అన్నానేగానీ, తననే చేయాలని నేనేం పట్టుబట్టడంలేదు. ఈ విషయంలో తుది నిర్ణయం శశికే వదిలేద్దాం. వాడికి ఎలా ఇష్టమైతే అలా చేద్దాం" అన్నాడు భాస్కర్ రాజీగా.

"అలా అన్నారు బావుంది. వాడికిష్టం లేకుండా నేను మాత్రం ఎలా చేస్తానంటాను?" అంది కమల. మనసులో మాత్రం తన కొడుకు తన అభిప్రాయానికే ఓటు వేస్తాడని బలంగా అనుకుంది.

వాళ్ళలా మాటల్లో ఉండగానే శశికిరణ్ రానే వచ్చాడు ఇంటికి.

"ఏంటి హాట్ హాట్‌గా చర్చించుకుంటున్నారు?" అన్నాడు వస్తూనే.

"ఏం లేదురా నీ పెళ్ళి గూర్చే మాట్లాడుకుంటున్నాము. మీ డాడీ తన చిన్ననాటి స్నేహితుడు ఆ హరిప్రసాద్ కూతురు హారికను చేద్దామంటారు. నేనేమో మా ఫ్రెండ్ కూతురు అనూష అయితే నీకు బాగా సూట్ అవుతుంది అంటున్నాను. నీ అభిప్రాయం చెప్పు" అంది కమల.

"ఈ యిద్దరూ తప్ప ఇంకేం ఛాయిస్ లేదన్నమాట నాకు. నా ఫ్రెండ్స్ అందరూ డజన్ల కొద్దీ అమ్మాయిలను చూసి ఎవరో ఒకర్ని సెలక్ట్ చేసుకుంటూంటే నాకీ ఇద్దరితోనే సరిపెట్టేస్తారా?" అన్నాడు అల్లరిగా నవ్వుతూ.

"వేళాకోళం చాలుగానీ, సీరియస్‌గా చెప్పరా ఎవర్ని చేసుకుంటావో?" అంది కమల ఆదుర్దాగా.

"సరే అయితే, అనూష నాకు వద్దు మమ్మీ. లాస్ట్ మంత్ నువ్వు వైరల్ ఫీవర్‌తో బాధపడుతూ హాస్పటల్‌లో ఎడ్మిట్ అయ్యావు, గుర్తుందా! రాత్రిపూట లేడీస్‌ని తప్ప జెంట్స్‌ని ఉండనివ్వరు అక్కడ. ఆ రెండు రోజులూ నీకు సాయంగా నీ ఫ్రెండ్‌ని గానీ, అనూషని గానీ ఉండమని నేనూ, డాడీ ఎంత రిక్వెస్ట్ చేశాం. నువ్వంటే కొంచెం కూడా కన్‌సెర్న్ లేకుండా, ఇంట్లో బంధువులు ఉన్నారు, రాలేమని చెప్పేశారు. చివరికి డాడీ కొలీగ్ వాళ్ళమ్మగారిని అంత వయసు పైబడినావిడనే ఉంచాల్సి వచ్చింది. అదేనా స్నేహమంటే? ఉత్తప్పుడు నాకు అది కావాలి, ఇది కావాలి అంటూ నీతో చేయించుకుని అనూష లొట్టలేసుకుంటూ తినేది. అవసరానికి మాత్రం ఆదుకోలేని ఆ స్నేహం ఎందుకు మమ్మీ? అలాంటి అమ్మాయి రేపు ముసలితనంలో నీకేదైనా అయితే బాధ్యతగా చూస్తుందా?" అన్నాడు శశికిరణ్ కోపంగా.

"బాగుందిరా, నాకు ముసలితనంలో సేవ చేసేందుకా నీకు పెళ్ళిచేసేది? అనూషకూ, నీకూ ఈడూజోడుగా ఉంటుంది. మీ ఇద్దరికీ కంపేటబిలిటీ బాగుంటుందని నా ఉద్దేశ్యం" అంది కమల నచ్చచెప్తున్నట్లుగా.

"ఏంటీ మమ్మీ కంపేటబిలిటీ. యం.బి.ఏ చేసి నెలకి నలభైవేలూ, ఏభైవేలూ సంపాదించడమేనా? డాడీ చెప్పినట్టు ఆ హారిక అయితే మనకి అన్నివిధాలా సరిపోతుంది" అన్నాడు శశికిరణ్ తాపీగా.

ఆ మాట వింటూనే పక్కలో బాంబు పడినట్లుగా అదిరిపడింది కమల.

తాను ఇన్నాళ్ళూ ఏదైతే జరగకూడదనుకుందో అదే జరగబోతోందా? తోటికోడలి ఆపరేషన్‌కి వెళ్ళినప్పుడు వాళ్ళంతా కలిసి తన కొడుక్కి బ్రైన్ వాష్ చేసేశారా ఏంటి? అనుకుంది భయంగా కళ్ళు పెద్దవి చేసి చూస్తూ.

"ఏమిటిరా నువ్వు అంటున్నది? ఎక్కడా దొరకనట్లు ఆ హారికను చేసుకుంటావా? ఎందులో సరిపోతుందిరా నీకు తను?" అంది కమల కోపాన్ని తొక్కిపట్టి.

"ఎందులో సరిపోదో ముందు నువ్వు చెప్పు మమ్మీ. తర్వాత నేను చెప్తాను" అన్నాడు కూల్‌గా.

"అనూష యం.బి.ఏ చదివింది. నాగరికతగా ఈ సిటీ కల్చర్‌కి తగినట్లుగా ఉంటుంది. అందరితో సోషల్‌గా మూవ్ అవుతుంది. ఈ క్వాలిటీస్ ఏవైనా హారికకు ఉన్నాయా చెప్పు. నువ్వు హారికను చేసుకుంటే 'మీ కోడలు ఏం చదివింది అంటే' నేనేం చెప్పాలి. 'బి.ఏ' అని చెపితే నవ్వరా? ఈ రోజుల్లో అంట్లు తోముకునే అప్పలమ్మలు కూడా ప్రైవేటుగా చదివి బి.ఏ పట్టా తీసుకుంటున్నారు. అది కూడా ఓ చదువేనంటావా?" అంది కమల ఈసడింపుగా.

"బి.ఏ అని చెప్పుకునేందుకు నామోషీ అయితే ఐ.ఏ.యస్ అని చెప్పు మమ్మీ" అన్నాడు తాపీగా.

"లేని గొప్పలు చెప్పుకునేంత ఖర్మ మనకేం పట్టిందిరా?" అంది కమల చిరాగ్గా.

"లేని గొప్ప కాదమ్మా తను నిజంగానే ఐ.ఏ.యస్‌కి ప్రిపేర్ అవుతోంది" అన్నాడు శశికిరణ్.

అతడి మాటలు విని అవాక్కయినట్లు చూసింది కమల, నిజమా అన్నట్లు.

భాస్కర్ కూడా సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాడు, ఆ మాట వింటూనే "నిజమా శశీ, అన్ని రోజులు అక్కడ వున్నాము. ఎవరూ నాతో చెప్పనే లేదు. చివరికి హరి కూడా" అన్నాడు.

"అనుకోకుండా ఇక్కడికి వచ్చేముందే నాకు తెలిసింది డాడీ ఈ విషయం. అనవసరపు పబ్లిసిటీ అంటే తనకు ఇష్టం ఉండదు. అందుకే ఎవరికీ చెప్పలేదు. తాను సివిల్స్‌కి ప్రిపేర్ అవుతుందనే విషయం తెలియకముందే హారిక అంటే ఏదో తెలియని ఇష్టం కలిగింది నాకు. ఇతరుల పట్ల ఎంతో కన్‌సర్న్‌గా ఉంటుంది. ఎవరిని కదిలించినా చాలా మంచిపిల్ల, చాలా తెలివైన అమ్మాయి అన్నమాట తప్ప మరోమాట వినలేదు నేను. అందుకే 'నన్ను పెళ్ళి చేసుకుంటావా అని అడిగాను' వీలు కాదంది" అన్నాడు.

అది వింటూనే "అలా అందా? ఎంత పొగరు లేకపోతే నిన్ను కాదంటుంది. నేను మొదటినుంచీ అనుకుంటూనే ఉన్నాను, తనకి చాలా పొగరని. ఎందుకురా అలాంటి అమ్మాయి మనకు?" అంది కమల ఎలాగైనా కొడుకు మనసు మళ్ళించాలని.

"చాలా పొరపడ్డావు మమ్మీ, తను నన్ను కాదనీ అనలేదు, అవుననీ అనలేదు. తాను అనుకున్నది సాధించేవరకూ పెళ్ళిమాట తలపెట్టను అంది. అంతవరకూ తన కోసం వేచి ఉండి టైం వేస్టు చేసుకునేకంటే వేరే అమ్మాయిని చేసుకోమని

సలహా ఇచ్చింది. ఇప్పుడు చెప్పు మమ్మీ తనకు పొగరంటావా? మీ ఫ్రెండ్ కూతురుతో సరితూగదంటావా?" అని అడిగాడు శశికిరణ్.

అతడలా సూటిగా అడిగేసరికి జవాబు చెప్పేందుకు కమల తడబడింది. కొడుకు చెప్పినదాంట్లో అబద్ధమేమీ లేదనిపించింది ఆమెకు. శశిని తనకి దూరం చేస్తారేమోననే భయంతోనే హారికను ఇన్నాళ్ళూ దూరంగా ఉంచాలనుకుంది. కానీ ఎంత వద్దనుకున్నా, హారిక ప్రవర్తన కమలని కూడా ఆకట్టుకుంటూనే ఉంది. కానీ అది అంగీకరించేందుకు కమల మనసు ఒప్పలేదు ఇంతవరకూ.

ఆరోజు తన తోటికోడలు ఆపరేషన్ నాడు థియేటర్‌కి తీసుకువెళ్ళే ముందు జానకి దిగులుగా మాట్లాడుతూ ధైర్యాన్ని కోల్పోతూంటే తాను కసిరినట్లుగా మాట్లాడి బ్రతకాలనే పట్టుదలను కలిగేలా చేయడం, హారికకు చాలా నచ్చినట్లు ఉంది. ఆ రోజు సాయంత్రం హారిక వచ్చి తనను అప్రిషియేట్ చేస్తూ "మీరు ఉదయం చాలా సమయస్ఫూర్తితో మాట్లాడారు ఆంటీ అది ఇంత మంచి రిజల్ట్ ఇస్తుందని ఊహించలేదు నేను. మేమెవరమూ చేయలేని పని మీరు చేశారు. కంగ్రాట్యులేషన్స్" అంటూ చేయి కలిపింది.

గతంలో ఆమె చదువు గూర్చి తాను హేళన చేసిన విషయం పరిగణనలోకి తీసుకోకుండా అలా మాట్లాడటం ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. నిజంగా కొడుకు అన్నట్లు చాలా గ్రేస్‌ఫుల్ పర్సనాలిటీ హారికది అనుకుంది కమల. అయినా హారికను కోడలిగా అంగీకరించేందుకు ధైర్యం చాలలేదు ఆమెకు.

ఇంకా ఆలోచనలో మునిగి ఉన్న తల్లి వంక చూస్తూ "ఏమిటి మమ్మీ ఆలోచిస్తున్నావు? హారిక అంటే నాకు ఇష్టం అని చెప్పిన మాట వాస్తవమే అయినా, నీకు ఇష్టంలేకుండా నేను తనని ఎలా చేసుకుంటాను? నీ కిష్టంలేని పని ఏదీ చేయనని నీకు తెలుసుకదా!" అన్నాడు శశికిరణ్.

కొడుకు మాటలు కమలను పూర్తిగా కదిలించివేశాయి. నేనంటే ఎంత ప్రేమ వీడికి. ఇలాంటి చిట్టీ తండ్రిని ఎవరు నా నుండి దూరం చేస్తారు? అసలలా చేసేవారు ఎవరున్నారని? లేనిపోని అపోహలతో నేనే అందరినీ దూరంగా ఉంచాను. ఇకపై ఇలాంటి తప్పు చేయను అనుకుంది స్థిరంగా.

"శశీ, వద్దురా అలా మాట్లాడకు నీ సుఖం కంటే, సంతోషం కంటే నాకేం కావాలి నాన్నా. హారికనే చేసుకుందువుగానిలేరా" అంది కమల ప్రేమగా కొడుకు వంక చూస్తూ.

భార్య సమాధానం విని నమ్మలేనట్లు చూశాడు భాస్కర్ కొద్ది క్షణాలు. ఆ తరువాత మెచ్చుకుంటున్నట్లుగా భార్యవంక చూస్తూ "నాకు తెలుసు కమలా నీ మనసు వెన్న అని. వాడి సంతోషం కంటే నీకు ఏమీ అక్కరలేదనీ" అన్నాడు.

"ఈ విషయం అక్కకి చెపితే చాలా సంతోషిస్తుందండీ. చెప్పనా ఫోన్ చేసి?" అంది కమల ఉత్సాహంగా.

"నీకేది వచ్చినా పట్టలేము కమలా. చేద్దువుగానిలే ముందీ సంతోష సమయాన్ని సెలబ్రేట్ చేసుకుందాం పదండి, ఎక్కడికైనా" అన్నాడు భాస్కర్ హుషారుగా.

"ఏం వద్దు డాడీ, మమ్మీ బొబ్బట్లు బాగా చేస్తుంది. రాత్రికి అన్నం మానేసి అవే చేసేయ్ మమ్మీ" అన్నాడు శశికిరణ్ ఉత్సాహంగా.

"బొబ్బట్లయితే నాకంటే మీ పెద్దమ్మ బాగా చేస్తుందిరా. ఈసారి అక్కడికి వెళ్ళినప్పుడు మీ పెద్దమ్మతో చేయించుకు తిను. అయినా ఇదేం అన్యాయంరా? నీకు అంత మంచి గిఫ్టునిస్తే నన్నిలా శ్రమపెట్టి అవీ, ఇవీ చేయించుకుని తింటావా?" అంది కమల ఆటపట్టిస్తున్నట్లుగా.

"ఏం కొడుకు కోసం ఆ మాత్రం చేయలేవేంటి? సరే, ఏం చేస్తాం పదండి బయటకే పోదాం" అన్నాడు శశికిరణ్ నీరసపడినట్లుగా ముఖం పెట్టి

"ఒరేయ్ బాబూ, అంత సీన్ చెయ్యకు గానీ చప్పున తయారయి రండి, ఎటైనా వెళ్దాం" అన్నాడు భాస్కర్ హుషారుగా.

అతడికి తన ప్రియ మిత్రుడితో వియ్యమందబోతున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. సముద్రకెరటాల్లా ఆనందం ఎగిసి పడుతోంది అతడి మనసులో. తన ఆనందాన్ని వెంటనే హరిప్రసాద్‌తో పంచుకోవాలని మనసు ఆరాటపడుతున్నా భార్యా కొడుకూ కలిసి తనని అల్లరి పెట్టేస్తారని భయపడ్డాడు.

ముగ్గురూ కలిసి రెస్టారెంటుకి వెళ్ళి స్వీట్స్ తిని సెలబ్రేట్ చేసుకున్నారు.

"మనం ఏదైనా జ్యూవెలరీ షాపుకి వెళ్ళి అమ్మాయికి ఏదైనా గిఫ్ట్ కొందామండీ" అంది కమల.

"ఇప్పటి నుండీ అవన్నీ ఎందుకు మమ్మీ. తను ఓ.కె అన్నాక చూద్దాంలే" అన్నాడు శశికిరణ్.

"తను తప్పక ఓ.కె అంటుందిరా. నా బంగారు తండ్రివి నువ్వు. ఎవరు కాదంటారు నిన్ను, చెప్పు? నిన్ను పెళ్ళాడాలంటే పెట్టి పుట్టాలి ఎవరైనా" అంది కమల ధీమాగా.

"కాకి పిల్ల కాకికి ముద్దని. నేను నీ కంటికి ఎప్పుడూ గొప్పగానే కనిపిస్తాను, కానీ ఆ అమ్మాయికి నచ్చవద్దా నేను?" అన్నాడు శశికిరణ్.

"అబ్బ, ఎంత చెత్త పోలిక తెచ్చావురా. అయినా హారిక చదువుకోసమే కదా, ప్రస్తుతానికి నిన్ను కాదన్నది? అంతే తప్ప నువ్వంటే ఇష్టంలేదు అనలేదు కదా. నాకు తెలిసినంతవరకూ నిన్ను కాదనదు హారిక" అంది కమల నమ్మకంగా చూస్తూ.

"మమ్మీ, హారిక గురించి ఇంత అవగాహన ఉన్నదానివి, ఎందుకు మమ్మీ తనని అంత వ్యతిరేకించావు?" అనడిగాడు శశికిరణ్.

"శశీ అవన్నీ అడిగి నన్ను ఇబ్బంది పెట్టకురా. లేక్ ఆఫ్ కాన్ఫిడెన్స్ అన్నీ తెలుసని మహా గర్వం నాకు. కానీ మనషుల మంచితనాన్ని అర్థం చేసుకోవడంలో పూర్తిగా విఫలమయ్యాను నేను. ప్రేమను పెంచుకున్నకొద్దీ పెరుగుతుందన్న చిన్న సత్యాన్ని విస్మరించాను. చిన్నవాడివి, నీకున్న అవగాహన నాకు లేకపోయింది. దానివల్ల ఇన్నాళ్ళూ చాలా మిస్సయ్యాను" అంది కమల నిజాయితీగా తన తప్పును తాను ఒప్పుకుంటూ.

"సారీ మమ్మీ, అనవసరంగా నిన్ను నొప్పించాను. కానీ కొన్ని కొన్ని అలా జరిగిపోతూ ఉంటాయి. నీ మనసెలాంటిదో నాకు తెలుసు. ఇంకెప్పుడూ నిన్ను ఇబ్బంది పెట్టే ప్రశ్నలు వేయనులే. అది సరే, ఇంతకీ ఏం బహుమతి కొనబోతున్నావు కోడలికి?" అన్నాడు శశికిరణ్ మాట మారుస్తూ.

"మంచి డైమండ్ రింగ్ ఏదైనా కొందాం" అంది కమల.

"ఉంగరాలు ఎంగేజ్‌మెంట్‌కి కొంటే బాగుంటుందేమో" అన్నాడు భాస్కర్.

"సరే, అయితే ఇయర్ రింగ్స్ కొందాం" అంది కమల.

**తాను ఐ.ఏ.యస్ కి** సెలెక్ట్ అయినట్లుగా తెలుసుకున్న హారిక ఆనందం అంబరాన్ని అంటింది.

"అమ్మా, ఐ గాట్ ఇట్" అంటూ చేతిలోని కవరు ఎత్తి గాల్లో ఆడిస్తూ ఇందిరను పట్టుకుని గిర్రున తిప్పేసింది.

"నిజంగానా బంగారూ?" అంటూ కూతుర్ని ముద్దులతో ముంచెత్తింది ఇందిర. ఆ తరువాత "మీ నాన్నగారికి ఫోన్ చేసి చెప్పవే ఆయన ఈ వార్తకోసం వేయికళ్ళతో ఎదురు చూస్తున్నారు" అంది ఇందిర ఉద్వేగంగా.

వెంటనే హారిక హరిప్రసాద్‌కి ఫోన్ చేసి చెప్పింది. ఆ వార్త వింటూనే హరిప్రసాద్ "నాకు తెలుసమ్మా నువ్వు సాధిస్తావని. ఐ యామ్ ప్రౌడ్ ఆఫ్ యూ. వెంటనే అన్నయ్యకు మెయిల్ పెట్టు. అమ్మా, నువ్వూ అత్తయ్య వాళ్ళింటికి వచ్చెయ్యండి. నేనిక్కడ మా స్టాఫ్ అందరికీ ఈ కబురు చెప్పి నోరు తీపి చేసి అక్కడికి వచ్చేస్తాను" అన్నాడు. అతడి మనసు ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది.

తండ్రి చెప్పినట్లే అన్నగారికి మెయిల్ పెట్టి తల్లిని తీసుకుని మేనత్తగారింటికి బయలుదేరింది హారిక.

వెళ్తూనే రామచంద్ర పాదాలకు భక్తిగా నమస్కరిస్తూ "మావయ్యా, మీరిచ్చిన ప్రోత్సాహం వలన ఈ రోజు నేను అనుకున్నది సాధించాను. అంతా మీ చలవా, ఆశీర్వాద బలం" అంటూ తనకి కొరియర్‌లో వచ్చిన కవర్‌ను రామచంద్ర చేతిలో పెట్టింది హారిక.

రామచంద్ర వాత్సల్యంగా హారికను లేవనెత్తి "నాకు తెలుసమ్మా, నువ్వు తప్పక ఐ.ఏ.యస్‌కి సెలక్ట్ అవుతావని. పూవు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లు టెంత్ పాసయ్యాక, నేను కన్‌ఫర్మ్ చేసుకున్నాను. నువ్వు అనుకున్నది సాధిస్తావని" అన్నాడు.

"నీ కృషీ, నీ పట్టుదలా, నిన్నీ స్థాయికి తెచ్చాయిరా" అంటూ జానకి హారికను హృదయానికి హత్తుకుంది.

"నా కృషితోపాటు, అడుగడుగునా నువ్వూ, సుగుణక్కా నాకు అందించిన ప్రోత్సాహం, గైడెన్స్ నాకీ విజయాన్ని తెచ్చిపెట్టాయత్తా" అంది హారిక ఆనందంతో కళ్ళు చెమర్చుతూండగా.

మనసులో ఆనంద కెరటాలు ఉత్తుంగ తరంగాల్లా ఎగసిపడుతూండగా "మన కుటుంబంలో మొట్టమొదటి ఐ.ఏ.యస్‌వి నువ్వేనే. ఇంతవరకూ ఎవరూ ఐ.యే.యస్‌కి సెలెక్ట్ అవలేదు హారికా. నా ఫ్రెండ్ ఐ.ఏ.యస్‌కి సెలక్ట్ అవడం నాకు ఎంత సంతోషంగా ఉందో మాటల్లో చెప్పలేనే హారికా" అంటూ రమ్య హారికని గాఢాలింగనం చేసుకుంది.

"అవును హారికా, నాకు కూడా చెప్పలేనంత ఆనందంగా ఉంది" అంది సుగుణ ఆత్మీయంగా హారిక తల మీద చేయి వేసి.

ఇంతలో హరిప్రసాద్ స్వీట్స్ పట్టుకుని వచ్చాడక్కడికి. అతడి రాకతో ఆ ఇల్లు ఆనందాల హరివిల్లులా మారిపోయింది.

హారిక కాలేజీకి వెళ్ళిన రవికి మెసేజ్ పెట్టింది. అతడు వెంటనే 'హార్టీ కంగ్రాట్యులేషన్స్' అంటూ తన అభినందనని తెలియజేశాడు.

అంతా సర్దుమణిగాక సుగుణ దగ్గరకు వెళ్ళింది హారికా. "అక్కా, నువ్వేమీ అనుకోనంటే నిన్నొకటి అడుగుతాను" అంది సందేహంగా చూస్తూ.

"ఏంటమ్మా అది?" అంది సుగుణ చేస్తున్న పని ఆపి హారిక వంక ఆసక్తిగా చూస్తూ.

"ఏం లేదు, శశిబావ సెల్ నెంబర్ నీ దగ్గర ఉంటే ఇస్తావని" అంది హారిక మొహమాటంగా చూస్తూ.

వాళ్ళిద్దరి మధ్యా నడిచిందంతా సుగుణకు తెలుసు కనుక కాసేపు హారికను ఆటపట్టించాలనిపించింది ఆమెకు.

"అతడి నెంబరెందుకమ్మా నీకు అయినా రమ్యను అడగకపోయావా, ఇచ్చేది" అంది సుగుణ ఏమీ తెలియనట్లు.

"అదో కోతి. గోరంతదాన్ని కొండంత చేసి అల్లరి పెట్టేస్తుంది నన్ను" అంది బిడియంగా.

"ఏమీ లేకపోతే ఎందుకింత ఆరాటం? ఈ వార్త ఎలాగో మావయ్యగారు చెప్తారు కదా వాళ్ళకి ప్రత్యేకంగా శశికెందుకమ్మా చెప్పడం నువ్వు?" అంది సుగుణ అమాయకంగా ముఖం పెట్టి.

"ఊరికేలేమ్మా. ఎందుకిన్ని యక్షప్రశ్నలు వేస్తావు? నీ దగ్గరుంటే ఇవ్వు, లేకపోతే లేదు" అంది హారిక చిరుకోపంగా.

ఇక ఏడిపించడం అనవసరం అనుకున్న సుగుణ అతడి నెంబరు చెప్పి "ఎందుకో నాకు తెలుసులే" అంది అల్లరిగా నవ్వుతూ.

"తెలిస్తే మనసులో దాచుకోవచ్చుకదా. ఎవరైనా చెల్లెల్ని ఇలా అల్లరిపెడతరా?" అంది హారిక ముఖమంతా కందిపోతూండగా.

ఇంటిముందు టాక్సీ ఆగడంతో ఎవరు వచ్చారో చూసేందుకు బయటకు వచ్చింది సుగుణ.

కమలా, భాస్కర్, శశికిరణ్‌లు టాక్సీ దిగుతూ కనబడడంతో ఆశ్చర్యపోయింది. "రండి..రండి" అంటూ సంభ్రమంగా వారి చేతుల్లోని సామాను అందుకుని లోపలికి దారి తీసింది.

కోడలి వెనుక వస్తున్న మరిదినీ, తోటికోడల్నీ, చిన్నకొడుకునీ చూసి జానకి కూడా ఆశ్చర్యపోయింది. కుశల ప్రశ్నలు అయ్యాక పిచ్చాపాటీలో పడ్డారంతా. కమల జానకితో ఈ సంతోషవార్త ఎప్పుడెప్పుడు చెప్పేస్తానా అని ఆత్రంగా ఎదురు చూస్తోంది. హారిక నుండి గ్రీన్ సిగ్నల్ వచ్చేదాకా ఎవరికీ ఏమీ చెప్పవద్దని కట్టడి చేయడంతో ఆగిపోయింది, తన సంతోషానికి బ్రేకులు పడ్డట్లుగా.

జానకి వాళ్ళతో మాట్లాడుతూనే మరిదిగారి కుటుంబం అకాల ఆగమనానికి కారణం ఊహించే ప్రయత్నం చేసిందికానీ సాధ్యం కాలేదు.

శశికిరణ్ మెల్లగా వంటింట్లో పని చేసుకుంటున్న సుగుణ దగ్గరకు వెళ్ళాడు, "ఏమిటి వదినా సంగతులు?" అంటూ.

"ఏముంటాయి శశీ, అంతా మామూలే" అంది సుగుణ.

"నేను ఎవరి గూర్చి అడుగుతున్నానో నీకు తెలుసు. అయినా చెప్పడం లేదు నువ్వు" అన్నాడు కినుకగా.

"అంత కోపమెందుకు బాబూ నీకు? వెళ్ళి రెండేళ్ళపైన అయింది, ఎన్నోసార్లు మాతో మాట్లాడావు. ఒక్కసారైనా తన పేరు ఎత్తావా? ఇప్పుడు కావలసి వచ్చిందా తన అజ?" అంది సుగుణ సాధింపుగా.

"నేనేం చేయను? తనే నాకు ఆంక్షలు విధించింది కదా ఏ విధంగానూ తనని డిస్టర్బ్ చేయవద్దని" అన్నాడు శశికిరణ్ నిష్టూరంగా.

"సరే, నువ్వు సంతోష పడే విషయం ఒకటి చెప్పనా?" అంటూ అతడి ముఖం వంక ఆనందంగా చూస్తూ "హారిక ఐ.ఏ.యస్‌కి సెలక్ట్ అయింది" అంది సుగుణ.

"నిజంగానా, మరి ఈ సంగతి నాతో చెప్పలేదు, చూశావా? తను గోల్ రీచ్ అవ్వాలనేకదా. నన్ను దూరంగా ఉంచింది? అనుకున్నది సాధించాక కూడా నా గురించి ఆలోచించలేదు" అన్నాడు గాయపడినట్లుగా చూస్తూ.

"నేను చెప్తాననే అన్నాను. హారికే వద్దంది. తనే నీకు స్వయంగా చెప్తుందట" అంది సుగుణ.

"ఎప్పుడు, ఊరందరికీ తెలిశాక ఆఖర్న నాకు చెప్తుందటా?" అన్నాడు అలిగినట్లుగా చూస్తూ.

"ముందు నీకు చెప్పడమే న్యాయం. కానీ నీ నెంబరు తన దగ్గర లేదుగా. మీరు వచ్చేముందే ఇక్కడకు వచ్చి నీ నెంబరు అడిగి తీసుకుంది. ఇప్పుడో, ఇంకాసేపట్లోనో నీకు ఫోన్ వస్తుంది చూడు" అంది సుగుణ.

ఆమె మాట పూర్తికాకుండానే శశికిరణ్ సెల్ రింగయింది.

రింగ్ అవుతున్న ఫోన్ వంక్ అపురూపంగా చూస్తూ టాక్ బటన్ నొక్కాడు.

"హలో బావా ఎక్కడున్నావు? నీకోసం ఎంతసేపట్నిండీ ట్రై చేస్తున్నానో తెలుసా? ఇప్పటికి లైన్ కలిసింది" అంది హారిక. ఆమె గొంతులో దాచినా దాగని ఆనందం.

"ఏమిటి సంగతి? తలవని తలంపుగా నాకు ఫోన్ చేశావు. రాత్రి ఏమైనా కలలోకి వచ్చి అల్లరి పెట్టానా నేను. కలలోకి కూడా రావద్దని హెచ్చరించడానికి ఫోన్ చేశావా?" అన్నాడు శశికిరణ్ అల్లరిగా నవ్వుతూ.

హారిక గొంతులో చిందులేసే ఆనందం అతడికి చెప్పకనే చెప్తోంది ఆమె మనసేంటో. అందుకే అలా అడిగాడు ఏం తెలియనట్లుగా.

"నువ్వేం కలలోకి రాలేదు గానీ, నా కల నిజమైంది బావా. ఐ గాట్ ఇట్" అంది హారిక ఎక్సైటింగ్‌గా.

"అయితే ఏంటట? కలెక్టరు గారికి చాలారోజుల క్రితం పెట్టుకున్న అర్జీ సంగతి ఏమైందో తెలియాలి కదా నాకు?" అన్నాడు అల్లరిగా.

"అది తెలియాలంటే బుద్ధూ, నువ్వు ఇక్కడికి రావాలి" అంది హారిక ఆర్డరు జారీ చేస్తున్నట్లుగా.

"సరే, ఏం చేస్తాను రాక ఛస్తానా?" అంటూ ఫోన్ కట్ చేసి సుగుణ వంక బొటనవేలు ఎత్తి "ఎట్ లాస్ట్ ఐ గాట్" అంటూ హుషారుగా హాల్లోకి వచ్చాడు.

వెలిగిపోతున్న కొడుకు ముఖం వంక ఆశ్చర్యంగా చూస్తూ, ఏమిటన్నట్లుగా కళ్ళతోనే ప్రశ్నించింది కమల.

"నువ్వు ప్రొసీడ్ అయిపో మమ్మీ" అంటూ సిగ్గుపడుతున్నట్లుగా వీధిలోకి నడిచాడు శశికిరణ్.

రామచంద్రా, జానకీ ప్రశ్నార్థకంగా కమలవంక చూశారు.

విషయం అర్థమైన భాస్కర్ ముసిముసిగా నవ్వాడు.

అలా నవ్వుతున్న భాస్కర్ వంకా, కమల వంకా అర్థం కానట్లుగా చూశారు భార్యాభర్తలిద్దరూ.

"అక్కా, పాతికేళ్ళనాడు శశిని నాకిస్తున్నప్పుడు మీకు నేనొక వాగ్దానం చేశాను కదా అది ఈ రోజు నెరవేర్చుకునేందుకు వచ్చానక్కా. హరి అన్నయ్యతో మాట్లాడి ముహూర్తాలు పెట్టించెయ్యండి.

అంతేకాదు, ఇన్నాళ్ళూ శశి నా ఒక్కదానికే స్వంతం అన్నట్లుగా ప్రవర్తించి మీ ఇద్దరి మనసులనూ చాలా గాయపరిచాను. బావగారూ, నన్ను క్షమించండి ఈరోజు నుండీ వాడూ మన నలుగురికీ బిడ్డే వాడే కాదు రవీ, రమ్యా ముగ్గురూ మన బిడ్డలేనక్కా" అంటూ జానకి పాదాలమీద వాలిపోయింది కమల.

జానకి కమలను లేవనెత్తి కళ్ళు తుడిచి హృదయానికి హత్తుకుంది.

ఆ దృశ్యాన్ని చూసిన అందరి మనసులూ ఆనంద తరంగితమయ్యాయి. ఈవేళ ఎంత మంచి సుదినం? ఒకదాని తర్వాత ఒకటి అన్నీ శుభాలే అనుకుంది జానకి.

శశికిరణ్‌తో మాట్లాడాక ఎంతో తేలికపడినట్లయింది హారిక మనసు. తన ఫోన్‌కాల్ అందుకున్న వెంటనే అతడు ఆగమేఘాల మీద బెంగుళూరు నుండి ఇక్కడకు వచ్చేస్తాడు అనుకుంది.

వచ్చాక ఏం చెప్పాలి, ఎలా చెప్పాలి? అని మనసులోనే రిహార్సల్స్ వేసుకోసాగింది.

పాపం, ఇన్నాళ్ళూ అతన్ని ఎంత కష్టపెట్టాను? నా మాటకు కట్టుబడి నన్ను కలిసే ప్రయత్నమే మానుకున్నాడు. కనీసం ఫోన్ కోసం కూడా ట్రై చేయలేదు. ఎంత నిబద్ధత అతడికి? నేను 'యస్' అని చెబితే అతడి ముఖంలో కదలాడే భావాలు ఎలా ఉంటాయో చూడాలి.

వెళ్తూ వెళ్తూ ఏమన్నాడు. నా జవాబు కోసం స్వాతివాన కోసం ఎదురు చూసే ముత్యపు చిప్పలా ఎదురు చూస్తానని కదా అన్నాడు. బావ ఇంతకాలం నన్ను చూడకుండా, నాతో మాట్లాడకుండా ఎలా ఉన్నాడో తెలియదుకానీ, అతడి కోసం ఈ ఒక్కరోజు ఎదురు చూడాలంటే ఇంత కష్టంగా అనిపిస్తోంది ఏమిటి నాకు? అనుకుంది హారిక.

మధురమైన ఊహలు మనసును గిలిగింతలు పెడుతూంటే శశికిరణ్ తనతో మాట్లాడిన ప్రతిమాటా మననం చేసుకుంటూ మురిసిపోసాగింది హారిక. అంతటి ప్రేమమూర్తి తన స్వంతం కాబోతున్నాడనే మాట హారికను ఎంతో ఉత్తేజితురాల్ని చేస్తోంది.

ఆమె ఆలోచనలను చెదరగొడుతూ వీధి తలుపులను తెరుచుకుని లోపలికి అడుగుపెడుతున్న శశికిరణ్‌ని విస్ఫారిత నేత్రాలతో ఆశ్చర్యంగా చూసింది.

తన ఊహల్లోని చెలికాడు తన మనసంతా నిండిన ప్రియబాంధవుడు కళ్ళెదుటే కనిపిస్తున్నా కలో నిజమో తెలియని అయోమయంలో పడిపోయింది హారిక.

మెల్లగా అడుగులు వేస్తూ ఆమె దగ్గరకు వచ్చి "ఏమిటలా చూస్తున్నావు. నేను శశికిరణ్‌ని" అన్నాడు.

అప్పటికి స్పృహలోకి వచ్చిన హారిక "తెలుసు, కానీ ఇదెలా సాధ్యం. నువ్వెలా వచ్చావిక్కడికి?" అంది అయోమయంగా చూస్తూ.

"అదే గమ్మత్తు. నువ్వు రమ్మని ఆర్డర్ వేశావుగా, ఎగురుకుంటూ వచ్చాను" అన్నాడు.

"ఇప్పటికిప్పుడు ఫ్లైట్‌లోనా?" అంది హారిక.

"ఏయ్ ముద్దూ, నువ్వు నాకీ తియని కబురు చెప్తావని నా సిక్త్ సెన్స్ చెప్పిందోయ్. అందుకే గంటముందు విశాఖలో దిగాను. ఇప్పుడు నీ ముందు వాలాను. ఏదీ చెప్పు మరీ" అంటూ హారిక చేయి పట్టుకున్నాడు శశికిరణ్.

"ఏం చెప్పాలి?" అంది అతడి నుంచి చేయి విడిపించుకుంది సిగ్గుపడుతున్నట్లుగా చూస్తూ.

"అమ్మో, అమ్మాయిగారికి సిగ్గుపడడం కూడా వచ్చే" అన్నాడు హారిక ముఖాన్ని చేతుల్లో ఇముడ్చుకుని.

"ఎందుకలా అనుకున్నావు? నేనూ మనిషినే. నాకూ స్పందనలుంటాయి" అంది హారిక.

"అందుకేనా ఇన్నాళ్ళూ ఇంత ఏడిపించావూ?" అన్నాడు శశికిరణ్.

"నేనేం ఏడిపించలా. విరహంలో తీయదనం తెలిసేలా చేశానంతే" అంది హారిక గడుసుగా.

"నీతో మాటల్లో గెలవడం చాలా కష్టం. అందుకే ఈ అందాల బొమ్మకి బంధాలు వేసేందుకు మా మమ్మీ, డాడీ పెద్దమ్మగారితోనూ, పెదనాన్నగారితోనూ మంతనాలాడుతున్నారు" అన్నాడు శశికిరణ్.

ఆ మాటలు వింటూనే విస్మయంగా అతడి వంక చూసింది హారిక.

"నిజంగానా బావా. మన పెళ్ళి విషయం పెద్ద గొడవ సృష్టిస్తుందనుకున్నాను ఇన్నాళ్ళూ. కానీ కమలత్త ఈ పెళ్ళికి ఒప్పుకున్నారు అంటే నిజంగా వండర్. బావా, నిజంగా నీ దగ్గర ఏదో మేజిక్ ఉంది. దాంతో ఎలాంటి వారినైనా చిటికిలో మార్చేస్తావు. అసాధ్యం అనుకున్నది సుసాధ్యం చేస్తావు. యూ ఆర్ గ్రేట్. నేను ఐ.ఏ.యస్‌కి సెలక్టు అయినదాని కంటే నీవు తెచ్చిన ఈ వార్త ఎంతో ఆనందాన్ని ఇచ్చింది బావా. నిజానికి నేను సాధించింది కాదు విక్టరీ. నువ్వు సాధించింది గ్రేట్ విక్టరీ.

మేమందరమూ ఆశలు వదిలేసుకున్న జానకి అత్తను నీ చల్లని మాటలతో సేద తీర్చి మాకు దక్కేలా చేశావు. శశికిరణ్ అని పేరు పెట్టుకున్నందుకు ఆ పేరును సార్థకం చేసుకుంటూ అందరి మనసుల్లోనూ మబ్బుల్లా ముసిరిన కలతలను తొలగించి చలల్ని వెన్నెల విరిసేలా చేశావు. నిన్ను జీవిత భాగస్వామిగా పొందడం నిజంగా నా అదృష్టం బావా" అంది హారిక.

"అయినా నిన్ను నా వైపు తిప్పుకునేందుకు చాలా టైమ్ పట్టింది కదా" అన్నాడు శశికిరణ్ కినుకగా.

"నేనెప్పుడూ నీవైపే. స్వాతివాన కోసం ఎదురు చూసే ముత్యపు చిప్పను అంటూ ఎప్పుడో నన్ను నీ వైపు తిప్పేసుకున్నావు కదా" అంటూ అతడి చేతుల్లో ఒదిగిపోయింది హారిక.